

సంపుటం. ౧౭ విక్రమ, భాద్రపదమాసము (సెప్టెంబరు 1940) సంఖ్య. ౯

బ్రహ్మ ప్రళయములు

శ్రీ విశ్వనాథసత్యనారాయణ

ఆవులకు వేల్పులకు శుభ మఖిలప్రజకు
స్వస్తియను నాదుమాతృదేశము భరింప
రాని బానిసతనములో మ్రగ్గిపోవ
నాకుఁ జీమైనఁ గుట్టదు.

బ్రదుకుభాండమ్ము భళ్లునఁ బగిలినట్లు
బ్రదుకు సారాంశమగుఁ గులవధువు మరణ
మొంద నప్పటి కష్టమేదో? క్రమేణ
దాని కది మానుపట్టెను.

మనసునకు మాటకును జేతకును ముడియిడి
యుచ్చభావాఢ్యము తొలంగకుండఁ బోవు
జీవితమ్ము ననేకథా శిథిలమైన
అసలు నా కది పట్టదు.

ఓరి నాకన్నను దరిద్రులార! నన్ను
వచ్చి యాచించెద రటంచు నిచ్చినట్టి
కొంచెమును నుభయులకుఁ దక్కువగఁ జూచి
గుండియ కలుక్కుమనఁ బోదు.

ఈ యధికబాధలకును సుంతేని కలఁగ
బోని నేనేదియో కానిపోని యొక్క
చిన్ని యిబ్బంది కాని వచ్చినఁ జలింతు
నకట! కట్ట! బ్రహ్మప్రళయంబువోలె.

సంపాదకీయ వ్యాఖ్యలు

మా "భారతి" సర్వతోముఖముగా విజృంభించి ఆంధ్రమాసపత్రికలకు ఆదర్శప్రాయముగా ఉండవలెనని మా ఆశయము. అది ఫలించుటకు రచయితలతోడ్పాటు కావలెను. ఇదివరకు రచయితలుగా ప్రసిద్ధిపొందిన పెద్దలేకాక ప్రసిద్ధిపొందుటకు యోగ్యతగల పిన్నలుసైతము తమ రచనలు మా భారతిలో ప్రకటించే నిమిత్తం పంపవలసినదని ప్రార్థన. అనేకులు తమ రచనలను పంపుచున్నారు. కాని అందులో నూటికి తొంభై ప్రకటితములు కాదగినవి కావని చెప్పవలసియున్నది.

కథలు—ఏకాంకనాటకములు

కథానికలు, ఏకాంకనాటకములు రచించగలవారు ఇద్దరు, ముగ్గురు తప్ప ఎక్కువగా మా భారతికి ఇంకా కనబడలేదు. ఈనెల 'వినోదిని' సంపాదకులు చెప్పినట్లే మేమున్నూ ఈ విషయమై మా సంతాపమును ప్రకటించవలసి ఉన్నది. నూటికి తొంభైతొమ్మిది కథలలో ప్రణయమో, విరహమో, అపవిత్రప్రేమావేశమో—ఏదో విసుగుపుట్టించే స్త్రీప్రసక్తియే కాని ఇతరవిషయములకు ప్రాధాన్యముగల కథ లేవీ కనబడడం లేదు. లేనిబావకంటె గ్రుడ్డిబావ అయినా మేలన్నట్లు మాకు పంపించినవన్నీ పైని చెప్పినట్లే ఉన్నా ఉన్నవాటిలో కాస్త మేలయినవి, ఎంచి ప్రకటిస్తున్నాము.

చిన్నకథానిక రచించడం అంటే మాటలుకాదు. అది అందరికీ సులభంగా పట్టుపడేదికాదు. సహజంగా కొంత నేర్పువుండాలి, అభ్యాసంకావాలి; ప్రసిద్ధరచయితలు రచించిన కథలు ఎక్కువగా చదివి కథానికలక్షణాలు గ్రహించాలి. అప్పటికిగాని ఎవరికైనా సరే ప్రకటనార్హమైన కథానిక రచించడానికి యోగ్యత కలుగదు.

కథావస్తువులో స్వతంత్రకల్పన లేకపోతే ఆకథ రచయితది కానేకాదు. కథ చదువవలెనన్న అభిలాష కథాప్రారంభమందే కనబడాలి. చదువుట కారంభించిన కథ పూర్తియయ్యేవరకూ ఏకాగ్రదృష్టితో చదివి ఆనందించడానికి తగినట్లుగా కథ ముందుకు నడవాలి. అందుకు కథలోని సన్నివేశములు మేడమెట్లవలెమీదికి పోయి ఇకనేమి జరుగునోకదా అనే ఆందోళనపుట్టించి చివరకు చదువరుల ఊహకు మీరి విస్మయం కలిగించాలి. కథావస్తువుకు పోషకములుగాని సన్నివేశములు ఉండనేరాదు. కథలోవచ్చే సన్నివేశములు, సంభాషణములు, ప్రదేశవర్ణనములు, అందలి వస్తుప్రసక్తి మొదలయినవి అన్నీ ఏదో ఒక ప్రయోజనమును సాధించేవిగా వుండవలెను; కథనైనా పోషించవలెను; కథలో పాత్రపోషణమునకైనా పనికిరావలెను; లేదా వ్యంగ్యముగా చెప్పదలచుకొన్న విషయములకైనా ఉపచరించవలెను. అంతేకాని కాలక్షేపానికీ కాగితాలు నింపడానికీ అయితే కథపాడవుతుంది. కథానికలో ప్రతివర్ణనకు, ప్రతి సంభాషణకు, ప్రతి వాక్యమునకు, పేర్కొన్న ప్రతివస్తువుకు ఏదో ఒకప్రయోజన ముండవలెను. ఏవిధంగా శాస్త్రసూత్రం రచించే లాక్షణికుడు ఒకమాత్ర అయినా అధికం కానివ్వడో, ప్రసిద్ధిగల కవి ఒకమాట అయినా తన పద్యంలో పొల్లుపోనివ్వడో అలాగే చతురత గల రచయిత తన కథానికలో ఒక్క విషయమైనా ఒకవాక్యమయినా వృథా కానివ్వడు. కథ పెద్దదిగా చేయడంకంటె చిన్నదిగా కూర్చడంలో నేర్పు ఎక్కువ కావలెనన్న విషయం నవీన రచయితలు గ్రహించాలి.

పద్యాలు

వందలకొలదిగా కవులు కనబడుతున్నారు. ప్రతిదినము ముగ్గురో నలుగురో తమ ఖండకావ్యము

లను, పద్యములను పంపుతూనే ఉంటారు. ఓహో ఆంధ్రదేశంలో ఇప్పుడు ఎంతమంది కవులున్నారు? ఊరూరనూ కవులే! అనిపిస్తుంది. ఇది మెచ్చుకోదగిన విషయమే; బాలకవులను అభినందించకపోము; కవిత్వకౌశలము అలవరచుకోవలసినదే అని హెచ్చరించకపోము; కాని బాలకవులు తమ ప్రారంభదశలో అభ్యాసంకోసం రచిస్తూఉన్న పద్యాలు సైతము భారతిలో ప్రకటించుటకుగాను పంపడం సాహస మంటాము. విద్యార్థులు తమ రచనలను (నిర్దుష్ట మైనవీ, ప్రౌఢ మయినవీ అయినా కాకపోయినా) తమ విద్యాలయ పత్రికలలో (అవి వారిని ప్రోత్సహించుట కుద్దేశించినవి గనుక) ప్రకటించుకోవచ్చును. గాని, భారతివంటి మాసపత్రికలో అవి ప్రకటితములు కావలెనని కోరుట సమంజసము కాదు.

బాలానందము, అనే భాగము పిల్లల ఆనందము కోసమై ఏర్పడినది. పెద్దలు భారతి చదువుకూ ఉన్నప్పుడు వారి పిల్లలు సైతము వేడుకగా భారతి పుటలు విప్పి చూడడం సహజం. అప్పుడు పిల్లలకు సైతము ఆనందము కలిగించే రచనలు-ఒక పద్యం, ఒక కథ వుంటే మంచిదని ఎంచి ప్రకటిస్తున్నాము. ఇంతవరకు పిల్లలకోసం, పిల్లలభావంలో, పిల్లలకు సులభంగా బోధపడే రచనలు ఎక్కువగా రావడం లేదు. పెద్దపెద్దసమాసాలతో పండితుల మెప్పుకోసం సామాన్యులకు సులభంగా బోధపడని శైలిలో ప్రబంధములు రచించే దర్బారుకవులు బాలానందానికి తగిన పాటలూ పద్యాలూ రచించ లేరేమో! యువకులు చాలామంది "ఇందులో ఏముంది?" అనిన్నీ ఇందు ప్రణయానికీ ఆవేదనకూ అవకాశం లేదనిన్నీ పిల్లలకోసము రచించరు.

పిల్లలకోసం కావలసిన పద్యాలలోను పాటలలోను గమనిక, లయ చక్కగా ఉండవలెను. యతి, ప్రాస, శబ్దాలంకారములు పెద్దల కవిత్వములో ఐచ్ఛికంగా వున్నా మంచిదేకాని పిల్లలకోసం రచించిన వాటిలోమాత్రం ఎంత ఎక్కువగా ఉంటే అంత మంచిది. పిల్లలకు వాటివల్ల ఆనందం కలుగుతుంది.

వ్యాసాలు

మా భారతికి అన్నికళలకూ అన్నిశాస్త్రములకూ సంబంధించిన వ్యాసాలు కావలెను. అయితే, అవి ఇంగ్లీషురాని తెలుగువారికి సులువుగా బోధపడేటట్లు రచితములు కావలెను. కొందరు యింగ్లీపదములు యింగ్లీషు వాక్యములు ఇష్టము వచ్చినట్లు చేర్చి తెలుగు వ్యాసములుగా పంపుతున్నారు. అందులో కొన్ని ఇంగ్లీషు బాగా వచ్చినవారికే కాని తక్కినవారికి బోధపడవు. అట్టివారు చదువుకోడానికే ఉద్దిష్టములంటే, అనవచ్చును; గాని, అవి ఇంగ్లీషుభాషలో రచితములయి ఇతరత్ర ప్రకటితములయిన విషయములే అయితే అవి ఇంగ్లీషు వచ్చినవారికి చదువుకోవలెనన్న బుద్ధి పుట్టదు. ఇంగ్లీషువ్యాసములే వారికి ఎక్కువ సులువుగా బోధపడతవి; కనుక, వారు ఈవ్యాసములు చదువరు. ఎవరికి ఈ వ్యాసములు కావలెనో వారికి బోధపడక, బోధపడేవారికి అక్కరలేక ఉన్నట్టి వ్యాసములు భారతివంటి తెలుగుపత్రికలో ఎందుకు ప్రకటించడం?

ఇంతవరకు తెలుగు సారస్వతములో లేని పాశ్చాత్య విజ్ఞాన విషయములనుగూర్చి రచించే వ్యాసములు సాధ్యమయినంతవరకు పారిభాషిక కష్టము తొలగించి రచించవలెనని రచయితలకు మా హెచ్చరిక. ఆంధ్ర సాహిత్య విషయము — కవులచరిత్రకు, ప్రబంధ విమర్శలకు, వ్యాకరణమునకు, ఛందస్సునకు, కావ్యాలంకారములకు సంబంధించినవిషయము లెన్నో ఇంకా విమర్శించవలసినవి ఉన్నవి. అన్నిటికంటె ఎక్కువగా ఆంధ్రోద్యమమునకు సంబంధించిన వ్యాసములు, ఆంధ్రులకు ఉద్బోధము, ఆవేశము, ఆత్మప్రత్యయము, రాష్ట్ర సంపాదనము కలిగించే పాటలూ, పద్యాలూ, వ్యాసాలూ కావలెను. అయితే ఇవి దిన పత్రికకు, వారపత్రికకుగాని భారతివంటి మాస పత్రిక కెందు కంటారేమో ఏపత్రిక కేది ఉచితమనేవిషయం రచననుబట్టి ఉంటుంది. సారస్వతంలో శాశ్వతంగా కాకపోయినా కొద్దికాలమయినా స్థానము పొందే యోగ్యతగల రచనలను భారతి స్వీకరిస్తుంది. ప్రచారం, ప్రబోధం ప్రధానమైనరచనలో కళావిశిష్టత కొంతవరకు లోపిస్తుంది; నిజమే, కాని ఇటువంటి

రచనలు సైతము ప్రస్తుతపరిస్థితులలో కావాలి. సంపూర్ణమైన సారస్వతము దర్పణమువంటిది. అందులో ఎప్పటి కప్పుడు తమకాలపు సంఘజీవితము ప్రతిబింబిత మయే టట్లు రచయితలు తమరచనలను సాగిస్తూఉండాలి.

ఈ సంచికలో ప్రకటితము లయిన వ్యాసముల విషయము:—

"ఉపమా కాళిదాసస్య" అనే వ్యాసము కాళిదాసుని ఉపమాలంకారము ఎంత విశిష్టమైనదో సోదాహరణంగా నిరూపించడం వ్యాసకర్తగారి ఉద్దేశముగాని, అది నెరవేరలేదు. ఒక్కరఘువంశ ములో ఏవో నాలుగుదాహరణములుమాత్రమే ఎత్తి చూపించినంతమాత్రాన ప్రయోజనం లేదు. కాళిదాస విరచితము లయిన తక్కిన కావ్యములనుండిన్ని, నాటకములనుండిన్ని ఇంతకంటెను ఎక్కువ విశిష్టత గల ఉపమాలంకారములను ఎత్తుకొని ఎన్నెన్ని రీతు లుగా ఉన్నవో వర్గీకరణముచేసినయెడల వ్యాసగౌరవ మెక్కువయి ఉండునని మనవి.

"గసడదవాదేశ" వ్యాసంలో వ్యాసకర్త ఎత్తుకొన్నవిషయం సమగ్రంగా చర్చించలేదు. ఈ ఆదేశము వైకల్పికమూ కాదు; బహుళమూ కాదు. ప్రాచీనాంధ్రములో (కావ్యమేకానీ, శాసనమేకానీ) ఈ ఆదేశము రావలసినచోట్ల నిత్యంగా రావడమున్నూ రాగూడనిచోట్ల నిత్యంగా రాకపోవడమున్నూ కనబడు తున్నది. ఈ సిద్ధాంతము ప్రాసస్థలములందు స్పష్టము కాగల ప్రయోగము లిచ్చి నిలబెట్టుకోగలమన్న ధైర్యంతో వ్రాస్తున్నాము. అవ్యయములవిషయములో కొన్నిటిపైని ఈ ఆదేశం రావడం కొన్నిటిపైని రాక పోవడమున్నది గాని ఏయే అవ్యయములపైని వస్తుందో అక్కడ నిత్యంగా వస్తుంది, ఏయే అవ్యయములపైని రాదో అక్కడ నిత్యంగా రాదు. ఈ సిద్ధాంతమును ఖండించగలప్రయోగములు ప్రాచీనాంధ్రకావ్యము లలో ఎవరైనా చూపించగలరా? అని మనవి.

"న విక్ృతిశబ్దాత్పరత స్సంస్కృతికానాం భవన్తి గసడదవాః"— ఈసూత్రమునకు లక్ష్యంకాదగిన ప్రయోగం నన్నయభారతభాగంలో ప్రాసస్థలమందు మాకు కనబడలేదు. గనుక అతని భాషలో ఈ ఆ దేశము యిటువంటిచోట్ల వస్తుందనిగాని రాదనిగాని ఏమీ చెప్పలేము. గాని తక్కిన మొదలయిన ప్రాచీ నాంధ్రకవుల కావ్యములలో ఈసూత్రమునకు విరుద్ధ ముగా ప్రాసస్థలమందు ప్రయోగములు కనబడినవి. పూర్వమందూ పరమందూ సంస్కృత శబ్దములున్న ప్పుడు ఈఆదేశం వస్తుందా? రాదా? అనడానికి ఆంధ్ర శబ్దచింతామణిలో మాత్ర మేమీ కనబడదు. దీనిని గురించి పారవంది రామశాస్త్రిగారు రచించిన వ్యాఖ్య అయోమయంగా వుంది. సంస్కృతవ్యాకరణంలో పరుషసరళభేదము లేకపోతే లేకపోయెనుగాక. ఇది తెలుగుభాషకు వ్యాకరణం. 'శ్రీ + పాలింప' యిం దులో పాలింప సంస్కృతశబ్దము. పకారమునకు 'వ' కారము ఆదేశంగా వస్తుందా రాదా? అని ప్రశ్న.

"గద్య కవిత్వ మగునా?" అనే వ్యాసం లో కేవలం పద్యరూపమున ఉన్నదే కాక భావ స్ఫూర్తి కలిగిస్తూ అలంకారాది సహితమై ఉత్తమ శైలిలో ఉన్న గద్యముసైతమూ కవిత్వమనదగునదనీన్నీ సారస్వతములో మొదట పద్యకవిత్వమే పుట్టి కొ న్నాళ్లు సాగినా ఇటీవల గద్యరచన సైతము పుట్టి అభివృద్ధి పొందుతున్నదనీన్నీ వ్యాసకర్తలు తెలియ జేసినారు. ఒక్కవిషయము మేము చేర్చవలసి యు న్నది. గద్యరచన చిన్నయసూరికాలమునుండిమాత్రమే వచ్చిన దనుకొనుట సరికాదు. చిన్నయసూరికి పూ ర్వము నూరూరు రెండువందల సంవత్సరములనుండి ఆంధ్రసారస్వతములో చేరదగిన వచనరచనలు సాగు తూవచ్చినవి. వీటిప్రాతప్రతులు ఎక్కువగా తంజా వూరి అముద్రితగ్రంథాలయములో ఉన్నవి.

"నవలారచన" అనేవ్యాసం పైవ్యాసమునకు అనుబంధమా అన్నట్లుంది. నవలారచన నవీనమనిన్ని, అది సంఘదుస్థితి దురాచారములను విమర్శించేతీరున పరిణమించుననిన్ని, అవి పూర్వము లేనందున నవలా రచనకు అప్పుడు అవసరము లేకపోయిన దనిన్ని, ఇప్పుడున్నందున నవలారచన పుట్టినదనిన్ని తమ అభి ప్రాయం తెలియజేసి వ్యాసకర్తగారు నవలారచన

ఇప్పుడు ఎట్లు సాగుతూవచ్చినదో, ఎట్లు సాగవలెనో, ఎట్టివవలలు కావలెనో తెలియజేసినారు.

జీవితకళ - ప్రతివాదము:— ఇది జూలై సంచికలో ప్రకటితమైన 'జీవితకళ' అనే వ్యాసములోని వాదమునకు ప్రతివాదము. శంకరునిమీద, శంకరుని బ్రహ్మజిజ్ఞాసవిషయకవాదం మీద ఆరోపించిన నిందలను ప్రతిఘటిస్తూ శంకరుని మతము సరిగా బోధపరచుకోడానికి సంస్కృతభాషాజ్ఞానము, బహుశాస్త్రపరిశోధన, అనుభవము వుండాలి; అహంభావము చంపుకోవాలి అన్నారు సత్యాన్వేషి.

"**గ్రామపునర్నిర్మాణము**" అనే వ్యాసము ఈ ఉద్యమమందు అభిమానమున్నవారందరూ చదువదగినది. దీనికి సంబంధించిన విషయము లన్నీ సంగ్రహించి సూచించినారు వ్యాసకర్త.

' **సృష్టి పూర్వోత్తరాలు**" అనేవ్యాసంలో కంటికి కనబడని పురుగు మొదలుకొని బ్రహ్మాండం వరకున్నూ గల జీవవికాసాన్ని నిరూపించడానికి వ్యాసకర్తగారు ప్రయత్నించారు. వ్యాసం కథవలె రచిత మగుటవల్ల చదువరులకు సులభంగా బోధపడుతుంది. పౌరాణిక మత్స్య కూర్మ వరాహాద్యవతార క్రమణిక ఈవ్యాసం చదువుతూ ఉన్నవారికి స్ఫురణకు వస్తూ ఉంటుంది.

"**కాశీఖండము—కొన్ని పాఠభేదములు**" అనే వ్యాసములో పాపయ్యశాస్త్రిగారు అయిదారు పాఠభేదములుమాత్రమే దిఙ్మాత్ర సూచనగా ఎత్తి చూపించినారు. ఇటువంటివి ఈ ప్రబంధములోనే కాదు, తక్కిన ప్రబంధము లన్నింటను వందలకొలదిగా ఉన్నవి.

ఈ గ్రంథములు అచ్చులో పాడయినవి. వ్రాతప్రతులలోని పాఠములను పరిశీలించి వీటిని మరల సంస్కరించి ప్రకటించవలసినభారము ఆంధ్ర సారస్వతాభిమానము గలవా రందరిపైని గలదు.

" **కర్మజ్ఞాన సముచ్చయ** విమర్శలేశము " అనే వ్యాసంలో ద్వైతాద్వైతవిశిష్టాద్వైతమతముల ననుసరించి శ్రుతులకు వ్యాఖ్యలు బయలుదేరినవి; ఇందులో ఒకరి మతసిద్ధాంతమును అనుసరించి ఇంకొకరి మతమును విమర్శించుటవల్ల అనవసరవాదము, తిరస్కారభావము ఎక్కువగునే కాని ప్రయోజన ముండదని వ్యాసకర్త తెలియజేసినారు.

చిన్నపిల్లల చిత్తప్రవృత్తులు -

శిశు శిక్షణము— ఈ విషయమును గురించి కొన్ని వ్యాసములు ప్రకటితము లవుతవి. ఇది రెండవది. మొదటిది క్రిందటి సంచికలో ప్రకటితమైనది. వీటిలో చిన్నపిల్లలను పెంచి పోషించవలసినవారున్నూ వారికి శిక్షణము చేయవలసినవారున్నూ తెలుసుకోవలసినవిషయములు చాలా కలవు.

"**గతజలసేతు బంధనపర్వము**"— ఇది విద్వత్కవులును శతావధానులును అయిన శ్రీనివాస సోదరులు రచిస్తున్న "మహాభారాటా" గ్రంథములోని మచ్చుతునక. ఆంగ్లోచ్చారణ వికారరూపమును వీరు బుద్ధిపూర్వకంగా స్వీకరించుటలోగల విశేషమేమో !

"**మహాత్మాగాంధీ**"ని—కూర్చి రచించిన పద్యాలలో గాంధిగారి మాహాత్మ్యమును, గాంధిగారి సాంఘికరాజకీయాధ్యాత్మిక సేవావిశేషములను శ్రీ రామస్వామిగారు కమనీయముగా వర్ణించినారు 'విమ్నజాత్యుద్ధరణ వ్రతనియమయోగి'; "దీనవారల రక్షించు విశ్వప్రేమ—"ఇందులో 'ప్ర', 'ప్రే'లకు పూర్వమున్న అక్షరము గురువుకాకుండా తేల్చిపలుకవలసి వస్తుంది. ఇటువంటి కూర్పు లాక్షణికులెవరో అంగీకరించినదే అయినా పద్యం నడక కొంత చెడుతుంది.

"**పుష్పాంజలి**"—బుద్ధభగవాను గారాబు పుత్రికైన శ్రీ కరుణాకుమారికి ఒప్పునట్లుగా శ్రీ పాపయ్య శాస్త్రిగారు రచించినారు.

"**మలయమారుతము**" — చదువుటకు పాడుటకు ఇంపుగాఉంది; భావ గౌరవము అందుకు తగినట్లుగా ఉంటే ఎక్కువ ఆనందించి యుందుము.

"**విమర్శకుని కలము**"లో — కవిగారి భావం చాలా గభీరంగాఉన్నది. దీనిని గురించి ఏమి వ్రాసినా "విమర్శకునిచేతి కలము"తోహాస్యగాని వచన్నవంటిదే అవుతుందేమో!

"చిన్ననాటిచేష్టలు—సీతాఫలము"— చిన్నవారికి సులభంగా బోధపడేభాషలో మృదుమధుర శైలిలో శ్రీ ప్రభాకరశాస్త్రిగారు రచించినపద్యాలు.

"నాయుహాహ"లో గల భావము బమ్మెర పోతరాజుగారి భాగవతమందలి "కలఁడు కలండనెడు వాడు కలఁడో లేఁడో" అను పద్యములోని భావమును జ్ఞప్తికి తెస్తుంది.

"స్మృతిమాల"లో ప్రేయసీ "ప్రణయభిక్షునోరి పరితపించేటి ఉద్భ్రాంతపక్షికని" ఆవేదన ఆచార్యులవారు చమత్కారంగా వర్ణించారు.

"ఆంధ్రతేజము"లో చారిత్రిక విషయ మాధారంగా తీసుకొని శ్రీ సన్యాసిరాజుగారు "గాన మొనరింపఁగలరు సత్కవులు; కాక తీయ గణపతిదేవ! నీ దివ్యచరిత!" అని తిక్కన కవీంద్రునిచే పలికించిన మాట తమపట్ల నిలుపుకోఁగల రీతిని ఆంధ్ర తేజమును ప్రకాశింపజేసినారు.

"ఒకక్షణం"లో నాలుగుచోట్లా నాలుగు విధాల పోయి కనబడగానే శ్రీ రంగం నారాయణ బాబుగారికి "చల్లని గీతికే కత్తింది!"

"ప్రణయస్వైరిణి" — లో చంద్రగుప్త మౌర్యుని వివాహమాడిన హెలీన ఎట్లు తన ఊహా ప్రవంతిలో స్వైరాభిలాష నాకాశాపాయం విహారముల నోలలాడుటకు అనువైన సుముహూర్త మేర్పరచు కొన్నదో శ్రీ సత్యమూర్తి కవులు ప్రాచీన భాషా లక్షణ బంధములకు దాసులుగాక స్వేచ్ఛగా తమ కవితాధార సాగించారు.

"గచ్చపొద"—చిన్నప్పుడు దాగుడుమూత లాడు కొన్నప్పుడు గచ్చపొదలో దూరినవేళలందు బాధించినా పైకిరాగానే యథాప్రకారముండేది. ఇప్పుడు సంసారమనే గచ్చపొదలోపడి బయటపడే మార్గం తెలుసుకోలేకుండా ఉన్నానని కవి వ్యసన పడుతున్నాడు.

"నీతిపద్యమాల"—ఇది పిన్నలకు హితోప దేశంగా శ్రీ సూర్యనారాయణతీర్థులవారు సులభశైలిని రచించిన శతకపద్యాలలోనివి.

"గీత"లో రుక్మిణమ్మగారు యావదాంధ్ర ప్రశస్తి మరల రేకెత్తుదాకా జగతి విప్లవము రేగేటట్లు కర్మప్రకర్ష పాడుకొంటా మంటున్నారు.

"మతాబా"—నాటికలో ఆధునిక యువతీ యువకులు, వృద్ధదంపతులు వారిలో వారు సాధారణ ముగా చేసుకొనే ప్రసంగరీతులు హాస్యరస ప్రధానంగా అనుకరిస్తూ శ్రీమతి సీతమ్మగారు సంభాషణ రచించారు. అయితే ఇందులో ఒకసన్నివేశమే కాని కథా కల్పన ఏమీ లేదు.

"కొత్తపద్ధతులు" — ఈ కథానికలో యువతీయువకులు ఒక నూతనవిధానము ననుసరించి, అనగా ప్రేమ లోనగు విషయములను గురించి పర స్పరము వాదప్రతివాదములు గావించుకొని తుదకు పరస్పరానక్తులగుట వర్ణితము. పైకి పెద్దవేషాలువేస్తూ స్వార్థపరత్వము లోలోపల ఎంతఉన్నా పైకి వెల్లడి గాకుండా ఉండేలాగు శోగారావు పాత్రను కథలో చక్కగా పోషించినారు కుటుంబరావుగారు.

"బాల్యస్నేహం"—అనేకథ చదివినప్పుడు కుచేలుని కథ జ్ఞప్తికివస్తుంది. రెండింటికి తేడా ఏమి టంటే, కుచేలుడు అదృష్టవంతుడు కృష్ణునితో బాల్య స్నేహం గనుక కృతకృత్యుడైనాడు. ఈకథలోని వెంక డికి తన బాల్యమిత్రుడు ఎంతవెదికినా కనబడలేదు; అలసి వీధిప్రక్కను పండుకోగా నిద్రలో కలగని ఆశయం నెరవేర్చుకొన్నాడు గాని మరి ఈలోకంలో కనుతెరవలేదు. అనాథప్రేతగా నమోదయినాడు.

"నిజం"—ఈ చిన్నకథలో పరస్పరసంబం ధము లేక వేర్వేరు ప్రదేశములందు దుర్భరజీవితములను గడపలేక ఆత్మహత్యకోసం ఒకయువతీ ఒక యువకుడూ ఒకే కొలనిలోపడుట ఎట్లు సంభవించినదో, ఇద్దరి మృతకళేబరములను చూచి లోకమెట్లు వారికి లేని సంబంధం ఆరోపిస్తుందో చదువరులకు జాలి పుట్టేటట్లు కథాకల్పన సాగించారు సత్యనారాయణ గారు.

గతజలసేతుబంధన పర్వము

శ్రీ శ్రీనివాససోదరులు శతావధానులు

గతజలసేతుబంధనముగా వలపోసెడి భారతీయులన్
జతపడియుంటనే కుతలనామము భూమికి సార్థకమ్ముగా
నతికిన దేమొకో ! జడము లాత్మలు, చేతనముల్ జడమ్ము లీ
గతి తలక్రిందుసృష్టి విధిగానికి 'బర్తర' ఫేల కూడదో ?

తిలకింప న్నవఖండమండలవినేతృత్వంపుపాలింపు నిం
పులు, వ్యూహమ్ములమీఁద వ్యూహనివహమ్ముల్ క్రమ్మి చిమ్మించు మిం
చుల, మజ్జీవితభారతీయచరిత స్రోతస్వినీ వీచికా
కలగీతీపులకీకృతమ్ము లడవుల్ కాంచెన్ మహాభాగ్యమున్.

పదియూర్వన్నెల వన్నెకానిపన పైపైఁ బోవ మందస్మితం
బదలింపన్, నవమోహనాంగముల యొయ్యారంబు దోల్కాడు న
ర్వదియున్నాల్గుకలల్ విలాసవసతి న్వప్రాణసౌధంబునన్
బదిలింపంగల యంగనామణుల సంతానంబె మా యందఱున్ ?

శోకరసమ్ము తమ్ముఁగొని సూనృతధార్మికమర్మబీజముల్
చేకొని కాళికాకరుణ చిందులలోఁ గమనీయకావ్య నా
ట్యాకృతి సస్యసంతతు లహర్నిశముం గని పెంచినట్టి మా
భూకలవాణికిన్ గళము బొంగురు వోయెను పుత్రకృత్యమై.

ధ్వనిసిద్ధాంతరహస్యరత్నము కణాదస్వామిగంభీరవా
గ్వనధిన్ మున్నెపుడో బయల్పడియె, ద్వైవాయవ్యసంయోగసం
జనితం బీజలమంట బుగ్గిపడిన ఘోషాలీనమై పోయె, నె
న్నని వాకొందును జ్ఞానభానుఁ డుదితుం డైనాఁడు మా యాశనే !

మా రాజు చిందినమహనీయరక్తబిందులలోన స్వర్గముల్ మొలిచెనంట !
మాకవికల మూరు మారందధారయే అభ్రగంగారూప మందెనంట !
మాపాపకనులలో మలసినశౌర్యాగ్ని మృడుని మూఁడవకంట వెడలెనంట !
మా బేరిబాజ్జలో మసలు నూహాలు జగత్సర్వస్వమానికాజాలమంట !

అసలు మా నేల అవనీగళావలంబి
రత్న రంజిత సౌవర్ణ లలితపదక
మనుకొనెద; కాకయున్న నీ హాసు కలదె
అన్యదేశాలఁ దలక్రిందు లైనఁగాని?

మా ఋషీశ్వర తపోమాంగల్యదీపిక లెల్లయుల్లముల దీపించునాఁడు
మా చైత్రయాత్రాస మారంభ భేరిక లెల్ల దిక్కరుల జంకించునాఁడు
మా మహాపురుషనిర్మల మూర్తిచిత్రమ్ము లెల్లఖండాల నిల్పించునాఁడు
మా వాక్సతీముగ్ధ మధురపదన్యాస మెల్లర నై మఱపించునాఁడు

అష్టదిక్పాలకులను మాయందునుండి
యెన్నుకొన్నారు కాఁబోలు! ఈ యభాగ్య
జీవి యీనాటిజన్మలో నే విశిష్టుఁ
డో కదా! – మాట వెకలి రాకున్న దింక!

మసిలెపై బూజుపట్టిన మన యథర్వ
ముని మహాజిహ్వకను కనుఁగొనుఁడు, కొంత
చెదలుపట్టిన మిగిలిన పదము లైనఁ
గదిసి పరులకు పండవే కదనమణులు?

తుఱకలు మిమ్ము లోఁగొనరె దూకుడుమాతల నేల యందురా?
నఱకులవేఁట చేసివి నష్టమనస్కుల కొంద ఱుండిరా
కఱకొఱలేని చేతమునఁ గాంచిరి భారతమాత మాతగా
వఱలిరి సౌమనస్యమునఁ బల్వురు తత్ప్రభు లాంగ్లశేఖరుల్!

భారతమాతనే తమ యపార కలారమణీయ భూషణ
శ్రీరుచిరాంగిఁ జేసిరి, విశృంఖల భారతభారతీసుధా
సార సుఖాత్ములై మనిరి! సన్నుత దానవిధాన చాతురీ
స్మారిత కర్ణులై రల ప్రజారతి నున్నదె మీకు వీసమున్?

ఇది నేను నూతనముగా రచించుచున్న "మహాభరాటా" యను గ్రంథమునందలిది. మహాభరాటా శబ్దము "మహాభారత" శబ్దమున కాంగ్లోచ్చారణ వికారరూపము. ఇందును పదునెన్మిది పర్వములు గలవు స్వరాజ్యసమరము గ్రంథవిషయము. — రచయితలు.

ఉపమా కాళిదాసస్య

శ్రీ కొత్త సత్యనారాయణచౌదరి

కవిసమయప్రసిద్ధిని గమనించి హృద్యముగ అభివర్ణించిన అలంకారమే కావ్యశోభాకరమయి అలంకార మనిపించుకొనును. హృద్యతమాట ఎత్తనిచో 'బిడ్డతో పాటు తండ్రి వచ్చెను' అన్నదికూడ 'సహోక్తి' కావలసివచ్చును. అలంకారములు కావ్యశరీర భూషణము లనుట శాస్త్రీయసంప్రదాయము. వక్తవ్యాంశము సులభముగా శ్రోతల మదిలో చొచ్చుటకే అలంకారములను కవులు సమకూర్తురు. అందు విశిష్య పరమప్రయోజనము ఒనఁగూర్చునది ఉపమాలంకారము.

'చంద్రునిఁబోలు మొగము'— అన్నచోట సాదృశ్యవర్ణనమే ఉపమ. అదే ఉక్తిభంగీభేదముచే వివిధాలంకారస్వరూపము నొందుచుండును. ఇది గుఱుతించియే వ్యాఖ్యాతలు:—

'ఉపమైకా శైలూషీ సంప్రాప్తా
చిత్రభూమికా భేదాన్
రంజయతి కావ్యరంగే
నృత్యంతీ తద్విదాం చేతః'

అని ముచ్చటింతురు. 'విశ్వము బ్రహ్మజ్ఞానమువల్ల విచిత్ర మయినట్లే ఉపమాజ్ఞానమువల్ల ఈ ఉపమ విచిత్రమైనది.' అని మఱి కొందఱి భావము.

అలంకారముల కెల్ల అలంకారప్రాయమగు ఈ ఉపమాలంకార మందలి ఇట్టి విశిష్టత్వమును భావించియే ఆదికావ్యమగు రామాయణములో వాల్మీకిమహర్షి దీనినే మిక్కిలిగ మన్నించినాఁడు. కవితలో ఆయనను అనుకరించుటయే పరమార్థముగ పెట్టుకొన్న కాళిదాసమహాకవి తాను రచించిన కావ్యము లన్నిటను 'ఉపమ'కే యోగ్యస్థాన మొసంగెను. 'ఉపమ కాళిదాసుని సొమ్ము' — అను ప్రథకు ప్రధాన హేతువు అదియే. కాఁబట్టి, కాళిదాసీయములగు గద్యపద్యములను బరిశీలించితిమేని నాలుగింట మూఁడువంతులు 'ఉపమ'యే ఎదురుపడుచుండును.

ఈ యర్థము సర్వాత్మనా ప్రకటించుటకే కాఁబోలు, అతఁడు రఘువంశమున తొలిపద్యములో తొట్టతొలుత 'వాగర్థావివ సంపృక్తౌ'—అని ఉపమా శిరస్కముగ అభివర్ణించి, అనల్పమగు సాహిత్యశిల్పమును వెలయించినాఁడు.

'నిత్యః శబ్దార్థ సంబంధః' — అని మీమాంసకులు. చంద్రచంద్రికలను బోలిన ఉమామహేశ్వరులలో పృథగ్భావము కానము. అది ప్రసిద్ధము. అన్యోన్యము అతి నిబిడమగు సంబంధము కల వాగర్థములను కావ్యారంభములో చూపి, ఉపమారీతిలో ఉమామహేశులను స్ఫురింపఁజేసిన ఈ మహాకవిచాతుర్యము అనుపమానము. వాగర్థములపోలికచే ఈ దంపతుల అన్యోన్య నిరతి

శయ ప్రేమశాలిత్వము — మహామహిమ త్వము లోనగునవి ధ్వనించును.

"ప్రాంశులభ్యే ఫలే లోభా దుద్బాహు రివ వామనః"

అందని పండ్లకు అఱ్ఱు చాఁచినట్లు— అని తెలుగునానుడి. పొట్టివాఁడు పండ్ల కోసమై చేతు లెత్తినట్లు, ఆశకు పోయి అప హాస్యము ఒందెదను—అని పోలిక.

"భీమకాన్తైః నృపగుణైః............
యాదోరత్నై రివార్ణవః."

అర్ణవములో ఉండునవి భయంకరములగు జలజంతువులు ; మనోహరములగు రత్న ములు. దిలీపునిలో— తేజఃప్రతాపాదికము లగు భీమగుణములు; కులశీలదాక్షిణ్యాదిక ములగు సద్గుణములును గలవఁట. అద్దాన సముద్రుఁడు — అధృష్యుఁడే; నరపతి అధృష్యుఁడే. అయితే రత్నములనుబట్టి, సద్గుణములనుబట్టి ఉభయత్ర అభిగమ్య త్వము కద్దు.

"అంగుళీ వోరగక్షతా"

పాము కఱచిన వ్రేలిని పఱపఱ కోసి పాఱవైచినటులు, ఆత్మీయుఁ డెవ్వఁడేని దుష్టుఁడే అయ్యెనా, అప్పుడే అతనిని విడచి వైచుట దిలీపుని నైజమఁట. దుష్టుఁడు బంధు కోటిలోనివాఁ డయ్యు శత్రువుగా అతఁ డెంచు నని భావము.

"క్షణమాత్రం ఋషి స్తస్థౌ సుప్తమీన ఇవహ్రదః."

దిలీపుని విన్నపము ఆలకించిన వసి ష్ఠుఁడు క్షణకాల మట్టె స్తిమితలోచనుఁ డాయెనఁట. ఎట్లు? కడుపులోపల కదల మెదలని చేపజెల్లలు కల మడుగువోలె!

"జుగోప గోరూపధరా మి వోర్వీమ్"

గోరూపమెత్తిన భూదేవినిఁబోలె నందినీధేను వును దిలీపుఁడు కాపాడెనఁట. తేని భూపరి పాలనాసక్తి స్ఫురించుచున్నది. ఉర్వి, చతు స్సముద్రముద్రిత; నందిని చతుఃస్తనవిశో భిత. చతుఃసాగరములను కామధేనువు, దుగ్ధముచే తిరస్కరింపఁజాలిన దని అర్థ విశేషము.

ఇవి కాళిదాసీయమగు కవితావైచి త్రిలో లవలేశమగు ఘట్టములు. ఇట్టివి శాకుంతలాదులలో అనంతములు కలవు. సాహిత్యరసజ్ఞశేఖరుల కయ్యవి అమృతపు ఘుటికలు. యథావసరముగ అట్టివానిని మఱొకసారి సేకరింతుఁ నని మనవి.

మహాత్మాగాంధి

శ్రీ సాదలి రామస్వామి

౧

రాట్నస్వనంబు, స్వరాజ్యగానం బని,
    సతము రాట్నముఁ ద్రిప్పు చతురుఁడీవు!
ఖద్దరుధారణ - ఘనకౌశలం బని,
    ఖాదీప్రచారప్రకాశుఁ డీవు!
మధుపాననాశంబు - మహిభాగ్యదం బని,
    మధుపిశాచినిఁ ద్రోలు మహితుఁ డీవు!
హరిజనోద్ధరణమే - హరిసేవ యని, సదా
    యస్పృశ్యతనుఁ బాపు నధిపుఁ డీవు!
    నీవు బోధించు సద్బోధ నీవె సల్పి,
    దేశదారిద్ర్య దాస్యవిదీర్ణములకు
    త్రికరణంబుల, శాంతి సంధిల్లి పోరు
    మార్గదర్శకుఁ డీవెగా మాకు గాంధి!!

గురుకార్యదీక్ష, సద్గుణు భగీరథుసాటి!
    నిష్కామకర్మ శ్రీనిలయుసాటి!
నీతిధర్మంబుల - సీతారమణుసాటి!
    అతిశయభక్తి ప్రహ్లాదుసాటి!
రాజకీయంబున - రహి ధర్మజునిసాటి
    సత్యసంధత హరిశ్చంద్రుసాటి!
శాంత్యహింసానిష్ఠ - శాక్యమునికి సాటి!
    యిడుమ సహించుటం - దేసుసాటి!
    సాత్వికంబున శంకరాచార్యుసాటి!
    మహితబోధల "గురుమహమ్మదునిసాటి!
    సాటి నీ కేరు గాంధి యిజ్జగతియందు,
    నందుకొను మహాత్మా! భక్తివందనంబు!!

౨

శాంతి సత్యాగ్రహసాధన, బూర్ణస్వ
    రాజ్యము నాశించు రాజయోగి!
రాజ్యాంగపద్ధతుల్, రహిన్యాయచట్టసం
    గతు లెల్లరకుఁ దెల్పు కర్మయోగి!
కులరూపభేదముల్ తొలగింప, జాతినై
    క్యత పెంపగునను సంస్కారయోగి!
దేశసేవార్థము - దేహమే యర్పించు
    స్వార్థరాహిత్యప్రశాంతయోగి!
    సర్వసంగపరిత్యాగి, సౌమ్యయోగి!
    నిమ్నజాత్యుద్ధరణవ్రతనియమయోగి!
    ఆత్మశక్తిధురీణ, మహాత్మయోగి!
    యోగులకుయోగి, గాంధి మహోప
                                        యోగి!!

౩

స్వాతంత్ర్యరాజ్య సంస్థాపనంబున, సౌఖ్య
    మానందములఁ గూర్చు నధిపుఁ డీవె!
"వార్ధ" విద్యాపరివర్తనంబున, నిరు
    ద్యోగసమస్య పోఁ ద్రోలు దీవె!
భారతమాత, యాపత్పయోధి తరించి
    ధన్యతఁ గనుకర్ణధారుఁ డీవె!
స్థిర చరాస్తుల, దేశసేవార్థ మర్పించు
    ధర్మాచరణ, మహోదారుఁ డీవె!

నిరతమాతృ సేవాభాగ్య, నీతినిపుణ,
ప్రబల గౌరవాసక్త సంపన్నుఁ డీవె!
సరసమానసవర్తి, ప్రశాంతుఁ డీవె!
నీయశ మాహాత్మ్యముల సాటి నీవెగాంధి!!

౪

దక్షిణాఫ్రికను, సోదరభారతీయుల
నుద్ధరించునుదారబుద్ధి ఘనత!
హిందూ మునసల్మానులం దైక్యతనునిల్పు
మత రాజకీయ సమత్వసిద్ధి
ఉపవాసత్యాగ్రహోత్యుజ్జ్వల దీక్ష, "యి
ర్వను" యొడంబడిక ప్రవీణతయును!
దేశదేశంబుల దివ్యమహాత్ముఁ డీ
తండను కీర్తియాధ్యాత్మశక్తి!
బీదవారల రక్షించు విశ్వప్రేమ!
పరహితార్థసత్కార్యనిర్వహణదీక్ష!
నీ నిరాడంబరమునకు నీవె సాక్షి!
సాత్త్వికతనేల గాంధిసాష్టాంగ మిదిగొ!!

గసడదవాదేశము - తన్మతభేదములు

శ్రీ ఖండవిల్లి సూర్యనారాయణ

మన యాంధ్రభాషలో నీ గసడదవాదేశము ప్రసిద్ధమై బహుళముగా గానబడుచున్నది. [1]లఘ్వలఘు రేఫముల స్థానమును నిర్ణయించుట యెట్లు దుష్కరమో యా యాదేశమువచ్చు తావులను నిర్ణయించుటయు నట్టి క్లిష్టమైన సమస్యయై యున్నది. మరియు నీ యాదేశ మర్వాచీనమైనది కాక 'ద్రావిడ భాషలలోఁ బదమధ్య పరుషములు దేల బలుకవలయు' ననెడి ద్రావిడభాషా సంప్రదాయముచేతను, బూర్వపు శాసనములలో యగపడుచుండుటచేతను ప్రాచీనము నుండియు ద్రావిడభాషాసామాన్య మనియు దెలియుచున్నది.

అర్వాచీనపు విమర్శకులకు 'ఆప్త వాక్యం ప్రమాణ' మ్మనునది తప్ప (ఇదియు సందేహమే) మరియే సమాధానము లేక పోవుటచే సిద్ధాంతములకంటెఁ బూర్వపక్షములే మెండు. పండితు లనేకులు 'ఆంధ్రశబ్ద చింతామణి' నన్నయరచితముగా నొప్పుకొనిరి. 'అస్తి చేన్నాస్తికో హతః' అనునట్లు మనపూర్వపు పండితుల యాశయములం దభిమాన ముంచి, ఆంధ్రశబ్దచింతామణి నన్నయార్యనిరచన మనుటలోను (నన్నయభట్టీయము) నిదియే యాంధ్రభాషలో నాది వ్యాకరణ మనియు నొప్పుకొనుటచే వచ్చెడి వినిపాత మేమియు గలుగదు.[2]

పై యాదేశమును గూర్చి నన్నయభట్టీయములో "గసడదవాస్స్యుః ప్రథమామాత్రా త్త్వాత్మాస్మదో ర్వినైవతే (సంధి)."

శ్రీ పారనంది రామశాస్త్రిగారి వ్యాఖ్యః "ఆత్మాఽస్మదో ర్వినైవ=ఆత్మాఽస్మదర్థకాభ్యాం నేను తాను శబ్దాభ్యాం వినైవ అన్యత్ర ప్రథమామాత్రాత్ = ప్రథమైవ ప్రథమామాత్రం, కేవల ప్రథమేత్యర్థః. సాతు అనాదేశప్రథమైవ. ద్వితీయాదిష్వపి క్వచిత్ప్రథమా దృశ్యతే-సా మాభూదితి మాత్రపదం. అత్ర కేచిన్మాత్రపదం కార్థాఽర్థక ముక్త్వా ప్రథమాయాః కళాత్వోక్త్యా—షాంచిదవ్యయానామపి కళాత్వేన తేభ్యోఽపి పరం గసడదవాదేశప్రాప్తయే తత్సంగ్రహాయ మాత్రపదమితి వదంతి. తన్నసంగచ్ఛతే. విభక్తిశూన్యానామవ్యయానాంసంగ్రహాయ విభక్త్యుల్లేఖనమనుపపన్నం. కించయది తథైవస్యాత్ప్రథమా

---

1. లఘు ర్భవే ద్గురుః క్వచి ద్గురుశ్చ లఘు స్తథా ఉచ్చారణస్యకల్పత్వా న్నిదానం తత్ర సద్వచః
—అథర్వణ కారికావళి.

ఉ. పుష్పరసముదొఱఁగి, పరమాత్ము పదములదొఱఁగి.

2. మహతస్సోర్డ జనితో భవేత్పుంసి. సోఽసు. ఔ. జస్. ఇత్యేతేషు సంస్కృతప్రత్యయేష్వాది ప్రత్యయస్య 'సు' ఇత్యేత స్యానుకరణం మూలకారేణ కృతం. ఇతః పూర్వమస్యాం వ్యాకరణస్యాభావా త్తత్సంప్రదాయ మాశ్రిత మితి తత్త్వాత్ర వ్యాఖ్యానే స్థితం.

పదమేవాలం, తేనైవ తేషాం సంగ్రహసంభవాత్. మాత్రపదం వ్యర్థం.........కలానాం మధ్యే ద్రుతప్రకృతికయోః 'నేను' 'తాను' శబ్దయోః వ్యుదాసోఽసంగతస్స్యాత్."

పై విధముగా ద్వితీయ, సప్తమి విషయ సప్తమి —నారాయణభట్టు తోడయి నిర్వహింపగన్—తస్మిన్సహాయే సతి మొదలగునట్టియు (జలములాడనోపరు—సప్తమికి ప్రథమమొదలగు విభక్తుల కాదేశములుగా వచ్చినది కాక కేవల ప్రథమా విభక్తి ప్రత్యయాంతపదముకంటెఁ బరమగు పరుషములకు సరళాదేశము సంభవించును. ఆదేశప్రథమమీఁద సరళాదేశము నివారించుటకై మాత్రపదప్రయోగము. 'నేను' 'తాను' శబ్దములమీఁది పరుషములకు సరళములు రావు. పైశబ్దములు కేవలప్రథమలగుటచే వీనిపై పరుషముల కీ సూత్రముచే సరళాదేశము కలుగుచుండగా నిషేధింపబడినది. నారాయణభట్టు దోడయి... యనిన విషయ సప్తమ్యర్థము స్ఫురింపదుగాన యిట్లు చెప్పియుండవచ్చును. మరియు నవ్యయముల మీఁదను సరళాదేశము వచ్చునను మతభేదము (వాదము) లప్పటికే బయిలుదేరి యున్నవని తెలియుచున్నది. దీనికి బలకరముగా నజంతపరిచ్ఛేదములో 'తస్యాః ప్రథమాచ జడపదానాం స్యాత్త'ను సూత్రవ్యాఖ్యయందు జడవాచక ద్వితీయకు ప్రథమయగు. తస్యాః అనుదానికి ద్వితీయ కనియే కాని యాదేశద్వితీయ కని కాదు. ఇప్పటివారంతటను ప్రథమయే యను భ్రమచే 'పెక్కు సూచితి' 'ఎట వోయెదు' మున్నగు స్థలములలో సరళాదేశము చెప్పి పాఠములను దిద్ది యున్నారు.........హరివంశము మున్నగు నితరస్థలముల 'ఎటు వోవచ్చును' అని కనఁబడుచున్నది. దానిం జూచి నవీన సంస్కర్తలు ప్రయోగములను దారు మారు చేయుచున్నా రనియు, నట్టి ప్రయోగమును గనుపట్టుచున్న దనియును జెప్పియుండుటచే నీకాలములో నవ్యయములమీఁదను సరళాదేశము కొంతవరకును ప్రచారములోనికి వచ్చి ప్రయోగశరణాంధ్ర వ్యాకరణమ్మను, న్యాయముపై జింతామణికి నవరణలు నేర్పుచున్న ట్లున్నవీ ప్రయోగములు.

వెనుకటి సూత్రానంతరము "న వికృతిశబ్దాత్పరతః సాంస్కృతికానాం భవంతి గసడదవాః.

వ్యా. వికృతిశబ్దాత్ = వికృతి భాషీయ శబ్దాత్, పరతః, సాంస్కృతికానాం = సంస్కృతే భవాః సాంస్కృతికాః తచ్ఛబ్దసంబంధినాం పరుషాణాం గసడదవా న భవన్తి, అత్ర పూర్వార్ధే మాత్రపదేన ప్రాప్తయోః 'తాను' 'నేను' శబ్దయోః వ్యుదాసేన పూర్వనిమిత్తం వికృతిశబ్ద ఏవేతి సూచయిత్వా తస్మిన్పూర్వనిమిత్తే వికృతీయశబ్దే సత్యపి పరనిమిత్తమపి వికృతిశబ్ద ఏవేతి సాంస్కృతికాన్ వ్యుదస్య త్యత్రసూత్రే. ఏతేన సాంస్కృతికాత్పరతః సాంస్కృతికానాంతు భవంతీతి వ్యాఖ్యానం పరాస్తం. సంస్కృతే పరుష సంజ్ఞాయా ఏవాభావాత్. అత ఏవాత్ర పరుషాణా మిత్యనుక్త్వా సాంస్కృతికానామిత్యుక్తం మూలే." మొదటి సూత్రములోని వికృతిశబ్దములగు 'తాను' 'నేను' అనువానిని వినాయించుటచేఁ బూర్వనిమిత్తము వికృతీయ (శబ్ద)మే యని స్పష్టమట. పరమందు సంస్కృతశబ్ద ముండవచ్చునా యను శంక నీ సూత్రముచే 'వలద'ని చెప్పుచు

న్నాడు. పోనీ సంస్కృత శబ్దముకంటె సంస్కృత మంగీకరింతురా ? అన్నచో 'శాంతిః' అనలే దుర్ఘటమట. మరి యెట్లు ? పూర్వము వికృతిశబ్దమే నుండవలయునట. ఇక విమలవిచారుడు సుకుమారవిద్యాధరుడు మున్నగు ససంస్కృతుల ప్రామాదికములట. రాముడు కరుణాభిరాముఁడు మున్నగునవియు నసాధువులే యనవలయును గదా పై వివరణమును బట్టి—

'గసడదవాస్యుః పదాద్యం ద్వే',

తెనుగుపదముల ద్వంద్వసమాసమందుఁ బూర్వపదముకంటెఁ బరమందున్న పరుషములకుఁ గూడ నీయాదేశ మగు. వెనుక సూచించినరీతి నీ సమాసములో ద్రావిడ భాషాసంప్రదాయముగ (పదమధ్య పరుషములఁ దేలబలుకుట) పడుచున్నది. దీనికుదాహరణములు ముండ్లుగండ్లు, తల్లిదండ్రులు, కాళ్లుసేతులు మున్నగునవి. సంస్కృతములోఁ బరుషసంజ్ఞ లేకపోవుటచే 'మాతాపితరు' లనున దసాధు వగుచున్నది.

ఇక యధర్వణాచార్యుల కారికావళి యున్నది. ఈయనకు ద్వితీయాచార్య డనెడి ప్రసిద్ధికలుగుటచేతను, ఆనన్నపార్యుని భారత శేషమును ఇతడు బూరింపనెంచుటచేతను నీమహాశయుడు నన్నయానంతరకాలీను డని తెలియుచున్నది. ఈ యాచార్యుని 'వికృతి వివేక'మను కారికావళిపై చింతామణికి శేష గ్రంథమని తత్పాఠకులకు శ్రీ వ.సీతారామ స్వామిశాస్త్రిగారు విశదీకరించినారు. తనకాలమునకు బయలుదేరిన యీ యాదేశ బాహుళ్యమును జూపి (మతభేదములను జెర్కొని) తరువాత తమ మతమును జెప్పిరి.

శృంగారభూషణుని మతము :

పరుషా వా స్వరూపేణ ప్రథమాంతోపరి స్థితాః
కాకాసంబోధనే చాపి హ్యవ్యయే కర్మధారయే,
అచేతనార్థకే శబ్దే................

ప్రథమాంతము లను క్త్వార్థాదులయందు నుండు పరుషములు (పకారములు) వాస్వరూపము నొందుచున్నవి. వాస్వరూపమును బొందునవి పకారములేకదా! రాముడు వలికె అని యుదాహరణములు. మరియు

కే చిదాద్యస్యవాన స్యాన్నచ ప్రాసేయతౌతు వా
కే చిద్వయోర్వికల్పత్వం యతా సర్వత్రకేచన.

మున్నగు మతభేదములను జెప్పి తన మతమును జెప్పుచున్నా రథర్వణాచార్యులు.

వికృతాః పరుషాశ్చస్యు స్యుస్త ఆద్యపదాదిగాః,
నవో గసడదా స్తేఽపి పరుషాః ప్రథమాహితాత్.

వికృతిపదాది కచటతపలు వికల్పముగా గసడదవలగును. సంస్కృతశబ్దాది కచటతపలు ప్రథమావిభక్తికంటె బరమందును, సమాసమందును గసడదవలు గావు. ఉదాహరణము: రాముడు వలికె-పలికె...... సంస్కృతమున రానందుకు రామనామము పాపహరము. అతడు కంజదళాక్షుఁడు. మొ. వెనుకటి చింతామణి కిది శేషగ్రంథ మని దీనిచే స్పష్టమేగదా. దీనిచే "పూర్వనిమిత్తం వికృతి శబ్ద ఏవేతి ...... అనునది యంత రించినదిగదా. ద్వంద్వములో వెనుకటివలెనే యున్నదిగాని విశేషము లేదు.

విన్నకోట పెద్దనార్యుడు,

రుచిరముగ బిలుచుచోటను
ప్రచురంబుగ ప్రథమపొంత బడియుండెడు న
క్కచటతపంబుల పట్లను
ప్రచురించుం గసడదవలు................

దీని కుదాహరణముగా

> విశ్వవిభుడు గడిబిరుండు ప్రభురుండు
> ప్రక్కద్రిక్కలేని చొక్కలాడు
> దత్వవిదుడు క్షరవిదారణశీలుండు......

ప్రథమా స్వరూపుడగు మన విశ్వవిభుడు ప్రతి పరుషమునొద్దకు వచ్చుచుండును.

అథర్వణుని 'ఆద్యపదాదిగాః సహాగ సదడా,...' అనుదాని కిది సవరణ యనిపించు చున్నది. విశ్వవిభుడు ప్రభురుండు మొ.

పదునేడవ శతాబ్దిమధ్య నున్న యప్ప కవియు, పరమాత్మ ప్రథమా విభక్తుల మీదను దత్సమాంధ్రశబ్దముల మీద గల సంస్కృతపదాది గత పరుషంబు లెల్లడ నిజరూపము చెడక నిలుచు; అని చింతామణికి వ్యాఖ్యాన మొనరించు చుండుటచే దదనుసారి యయ్యెను.

పదునెనిమిదవ శతాబ్దపు టుత్తరభాగములోనివా డనబడుచున్న కూచిమంచి తిమ్మకవి తన సర్వలక్షణ సారసంగ్రహములోఁ గారికావళిలోనివానిని జేర్కొని (అన్యమతములను) అవ్యయాదుల మీది యాదేశవికల్పమునకు మహాకవిప్రయోగములను జూపుచూ (కాకు సంబోధనముల కుఁదప్ప శబ్దశాసనుని 'నవికృతి శబ్దా...... త్తను సూత్రమునకు విరుద్ధముగా 'ఎవ్వండు వఠించె, ఇట్లు దపంబు' మొదలగు తిక్కనాదుల ప్రయోగములను జూపెను. మరియు

> క. విదితముగఁ దాను నేనను
> పదములు ప్రథమలయి వాంతపదము లగుటదాఁ
> జదివెను నేఁ జదివితి వని
> వదలక యిరుదెరగుల బలుకవచ్చు...

అని మహాకవిప్రయోగములను జూపెను. చూడుడు; (మంజువాణిలో ౫౦—౫౮ పేజీవరకు.)

పదునెనిమిదవ శతాబ్దపు టంత్యభాగములో నున్న చిన్నయసూరిగారు వెనుకటి గందరగోళమును నియమించలేక యీ యాదేశమునకు బాహుళకతే శరణ్య మని కొంతయే నియమించిరిద్దానిని. 'తెలుగులమీది......' యను సూత్రమునకు విరుద్ధప్రయోగమును బహుజనపల్లివారు జూపి (వీరల్లోపించిన, వేవణములు, అప్పచెల్లెంద్రు, రాకపోకలు) వెనుకటి వ్యాకరణముల కపర్యాప్తత్వమును జూపి మన భాషలో నింకా ననేక యుద్గ్రంథములు బైలుదేరవలసి యుండుటను స్పష్టీకరించిరి.

> భాషేషు మహితా తత్రదేశ్యా న్తత్రస్వభావయుక్
> తచ్చిత్రతాతు ద్రష్టవ్యా పూజ్యపాద సుభాషితైః.

చూడుడు. నన్నయకాలములో నసిద్ధములని యొప్పుకొనినవి తదనంతరకవులచే సిద్ధరూపములుగా సంస్కరింపబడి ప్రయోగయోగ్యములై యున్నవికదా. ఒక కవికాలములో నుండిన వాడుకపదములు వానియనంతరము వ్యవహారమునుండి తప్పిపోవచ్చును, క్రొత్తరూపములను బొందవచ్చును. కనుక తమ తమకాలములోనున్న శిష్టవ్యావహారికపదములే వారి గ్రంథములలో నెక్కుచుండును. మరి కొంతకాలమునాటి కవి క్రొత్తరూపము లొందిన వానిని నియమించుటకు దిరిగి గ్రంథములు దారులు రచింపవలెను. ఇట్టి యవస్థయే ప్రస్తుతము పీని ముఖ్యవిషయము గనుక యిట్టి యాదేశాదులను నాధునిక కవిప్రయోగానుకూలముగా సంస్కరించి యనేక యుద్గ్రంథముల రచనచే మనయాంధ్రవాఙ్మయాభివృద్ధికి నాంధ్రపండిత విమర్శకులు తోడ్పడుదరుగాక యని విన్నవించుచూ సెలవు గైకొనుచున్నాను.

పుష్పాంజలి

శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి

ఆమె భువనైకసుందరి; ఆమెకంటె
చక్కనిది లేదు ఈప్రపంచమున నెందు;
ఆమె విశ్వవిమోహిని; ఆమెవంటి
అందమైనది లేదు బ్రహ్మాండమందు.

* * *

ఆమె కడకంటిచూపులో అనవరతము
కాపురము సేయు దివిజగంగాభవాని;
ఆమె చిరునవ్వుతళుకులో అహరహమ్ము
నవ్వుకొన్నవి వంద నందనవనాలు.

* * *

ఆమె మానసకమలాకరాంతరమున
జలజమై తేలు సచరాచరజగత్తు;
ఆమె నిట్టూర్పులో పరమాణు లట్లు
కరగి నీరౌను మేరు మందరము లెన్నొ.

* * *

బాలభానుడు పసిడి హస్తాలతోడ
పసుపు పారాణి నిడు నామె పాదములకు;
ఆ దయామయి విశ్వవిహారమందు
ప్రతిపదమ్మున కోటిస్వర్గాలు మొలుచు.

* * *

ఆర్ద్రత అహింస అనసూయ ఆమెయింటి
యాడబిడ్డలు - నిత్యకల్యాణి ఆమె;
ఆ మహారాజ్ఞి మృదులపాదాంతికమున
అవనతశిరస్కు డగును బ్రహ్మాంతనాడు.

* * *

ఆమె గాఢపరిష్వంగమే మదీయ
జీవితమునకు మోక్షలక్ష్మీప్రసాద;
మామె యనుభూతియే శుష్కమైననాడు
బ్రతుకు నౌదార్యమలయమారుతపువీచి.

* * *

అస్మదీయ జీవితపరమార్థ మెల్ల
ఆమె స్నేహాంచలమునందె ఆశ్రితమ్ము;
ఆమెహృదయము హృదయాననందుకోక
సార్థకత లేదు నా నరజన్మమునకు.

* * *

ఆమెకొరకె మదీయ మహాతపస్య;
ఆమెకొరకె - ఆమెకొరకె - ఆమెకొరకె-
బుద్ధభగవానుగారాబుపుత్రి - ఆమె
నామధేయము "శ్రీకరుణాకుమారి"

*

గద్య కవిత్వ మగునా?

శ్రీ బూరుగుల సూర్యనారాయణమూర్తి

నన్నయ నాటనుండి చాలా కొలఁది కాలము క్రిందటిదనుక పెక్కుఱకు కవిత్వ మనగా పద్యమే యను నభిప్రాయముంటూ వచ్చినది. మొట్టమొదట మనము కవిత్వ మనగా నేమియో తెలిసికొనినగాని యీ సందేహశల్య మూడదు. ప్రతిభావ్యుత్పత్తులు గలవాఁడే గదా కవి యందురు ప్రాజ్ఞులు. ప్రతిభవలన క్రొత్తక్రొత్తభావాలు స్ఫురించును. చాలాచాలావిషయాలు తెలియుట, సమయానికి తగిన యల్లికకలుగుట వ్యుత్పత్తి యొక్కపని. గాయకునికి తియ్యని కంఠధ్వని యెట్లో కవికి ప్రతిభ యటువంటిది. అందువలననే

"వనితయుఁ గవితయుఁ దానై
చను దెంచుట గలుగుచేని సరసంబగు ధా
త్రిని ; బల్మిఁగొలు గావిం
చిన విరసంబగు పటంచు చెప్పిరి విబుధుల్"

అని యప్పకవి యనినాడు. దీపము లేని గదిలో పడియుండే వస్తువులవలె నుండును ప్రతిభలేని కవుల చదువులు. ఎన్నిరూపములు దాల్చినను మధురములైన భావకల్పనలతో ప్రకాశించెడి వ్రాతయంతయుఁ గవిత్వమని యేలయనరాదు? అందువలననే Sainte Beuve సహజముగా కవిత్వము చెప్పు ప్రతియొకనికిని, విషయ మిదివర కెవ్వరును వ్యక్తీకరించనిదిగాను, ఇఁక వ్యక్తీకరించలేనిదిగాను, ఉండవలయునను నుద్దేశ ముండవలయును.

(The end and objeet of every original writer is to express what no body has yet expressed, to render what no body else is able to renderl)

కవి యనిపించుకొన దలఁచినవాఁడు మఱియొకని కెవ్వనికిని సాధ్యముగానటువంటి, పంచదార పొడివంటి నూత్నభావములను లోకమున కివ్వగలఁడనే విశ్వాసమునకు పాత్రుఁడై యుండవలయును. అట్లని యతని యితివృత్త ముత్పాద్యమే యయి యుండ నక్కఱలేదు. ఆ స్వతంత్రభావములకొఱకు మనమందఱము నఱ్ఱులుసాచి యెదురుచూడ వలయునన్న మాట. గాయకుఁడు స్వరభేదముచేతను, చిత్రకారుఁడు వివిధవర్ణముల చేతను, వివిధభావముల నెట్లు ప్రకటింతురో యట్లే కవియు తన నుడికారపు సొంపుచేత, మనోహరభావపరంపరల వెలిబుచ్చి మనల నాకర్షించుచున్నాడు.

ఛందోబద్ధ మైనంతమాత్రమున కవిత్వ మగునా?

" ఛందోలంకారాదుల
యందలి పాణ్డిల్ల తుదిని వ్యర్థముగానే
సుందర మగు వాక్యంబుల
పొందెఱిగి రచించుబుద్ధి పుట్టకయున్నన్"

అని యప్పకవి వక్కాణించియే యున్నాడు గదా! గద్య మనగా నిర్దుష్టమైన మాటల పొందికయనియు (Words in good order) పద్య మనగా నుత్తమపదములయొక్క యుత్తమసంఘటన మనియు (Best words

in best order) కోల్‌రిడ్జి పండితుడు నిర్వచించి యున్నాడు.

కాని యుత్తమ పదముల యొక్క యుత్తమసంఘటనము గద్యమేల కాగూడదు? ఉత్తమపద్యకవులు తమ కావ్యములయందు చూపు నున్నతభావములు, రచనావిశేషములు, నుత్తమగద్యకవులు చూపించునప్పుడు వీరినిమాత్రము కవు లని యేలయన రాదు? గద్యము ఛందోబద్ధముగా నుండకుంటయే వైలక్షణ్యము. పద్యము లయబద్ధముగా నుండును. గద్యయందది మఱియొక రూపముగా కాన్పించును. లయబద్ధముగా నుండుటలో పద్యాని కున్న నియమములు గద్యకు లేవు. ప్రాథమికస్థితిలో వ్యవహారమున నుండుమాటలే గ్రంథస్థము లైనతరువాత గద్య యనిపించుకొనినవి. ఆమాటలే కొన్నినియమములచేత కట్టువడి సంగీతములో నైక్యమై పద్యరూపమును దాల్చినవి. ప్రజలు కొంత నాగరికత సంపాదించికొనినతరువాత వ్యవహారములో నుండెడి భావను గ్రంథస్థముగా భద్రపఱుచుకో దగిన దని తెలిసికొని యుందురు. గద్యకంటె పద్యమే సులభముగా జ్ఞాపక ముంచుకొన ననువుపడి యుండును. మనము తెలిసికొనవలసినభావాలు, పద్యము లయబద్ధముగా, ఒకవిధమైన యందముగా నుండుటవల్ల హృదయస్థము చేయుటకు వీలు దొరకుచున్నది. సామాన్యముగా చాలా చాలా భావాలను కంఠస్థములుచేసికొనుటకు పద్యమే కావలయును. పద్యము పుట్టగనే గ్రంథస్థముచేయవలయునని మానవుని హృదయమునఁ దోచినది. గద్యము పుట్టిన తరువాత చాలాకాలమువరకు గ్రంథస్థము కాకుండుట తటస్థించినది. నన్నయనుండి పద్యముతోబాటు గద్యమును వాడబడుచుండినను ౧౮-వ శతాబ్దివరకును గద్యకు ప్రత్యేకవ్యక్తిత్వము లేదు.

లయతోగూడిన గానములో నానందమును బొందుట మనలో చిన్నప్పటినుండియు సహజముగా గనిపించుచున్నది. చిన్నపిల్లలాడుకొనుచు వచ్చీరానిమాటలలో యమకముగా పాడుచున్నప్పుడు వాళ్లు పొందునానందము మనము చూచుచునే యున్నాము. ఉయ్యాలమంచము నూపుటలోను, జోలపాటలలోను మిక్కిలి యానందమభివ్యక్త మగుచున్నది. ఇట్టి యానందము గద్యలో పొందజాల మనుట నిశ్చయము. పద్యమునందు నియమముగా స్వతస్సిద్ధముగా బయలుదేఱిన యమకము గద్యలోనికి కూడా కొంతకాలమునకు ప్రాకినది. పద్యమునకు తప్పని నియమములను గద్య తప్పించుకొనినను బాధ లేదు. పద్యమువలె గద్యము పుట్టగనే కళాత్వసిద్ధిని బడయలేదు. క్రమముగా గద్య తనకున్న యవకాశముల నన్నింటిని గుర్తించినది. తాను చెప్పఁదలఁచిన ప్రతివిషయమును నెట్లు చెప్పిన బాగుండునో తెలిసికొనినది. నియమరహితముగా నుండుట బాగుండలే దని కొన్ని నియమములను తగిలించుకొనినది. అనగా కొలఁది దూరమున నున్న పద్యముయొక్క నియమముల నన్నింటిని ననుసరించిన దన్నమాట. సారస్వతశబ్దముచేత మన మిప్పుడుగ్రహించు గ్రంథములలో గద్యకే యెక్కుడు స్థానమున్నట్లు కన్పించుచున్నది. ౧౯-వ శతాబ్దములో నీ గద్య గడిదేరి విపులమై యనేకస్రోతల నాక్రమించినది. క్రమముగా నవలలు, నాటకములు, కావ్యములు, విమర్శనలు, వ్యాస

ములు, చరిత్రలు మొదలగు నవిచాలా పుట్టినవి.

గద్యమునకు హద్దులు పెక్కు లేక పోవుటవలన నొకవిధముగా సౌకర్యమనియు, మఱియొకవిధముగా నష్టమనియుఁ జెప్పవలసి యుండును. పద్యము చేయగల యొక పెద్ద కార్యమును గద్య చేయలేదు. అదేమనగా:— హద్దు లేకపోవుటయే. సంగీతములో (కీర్తనలలో) రాగములు, తాళములు, సంగతులు, మొదలైనవి క్రమమైనపద్ధతిలో నెట్లానందము నిచ్చుచున్నవో పద్యముకూడా అట్లే ఛందోబద్ధమై క్రమమైన పద్ధతిలో నానందము నియ్యగలిగియుండును. ఆ గుణములు లేక పోవుటవలన గద్య యటువంటి యానందము నియ్యలేకపోవుచున్నది.

పదములు క్రొత్తవి కాకుండా ఒకటే యయినప్పటికిని, కూర్పు (ఇతివృత్తము) వేఱు కానప్పటికిని ఛందోబద్ధత్వ మొప్ప దేర్పడుచున్నదో యప్పుడే యొకవిధమైన క్రొత్త జీవకళ ప్రవేశించుచున్నది. అది గానమునుండి పుట్టినదైనను దానిని కేవలము గానశాస్త్ర మనుటకు వీలులేదు. దానిచేనైనా వైచిత్ర్య మనండి, లేకున్న గారడీ యనండి. పుష్ప మెట్లు తన సౌరభమును వెదజల్లుచున్నదో, వీణ తన దివ్యనాదము నెట్లు వ్యాపింపజేయుచున్నదో, యుత్తమమైన పద్యకవిత్వ మట్లు తన ప్రాంతము నంతయు తరంగితము చేయుచున్నదని (Fine verses are those that exhale like sounds or perfumes) జ్యూబర్టు పలికియున్నాడు. ఇప్పుడు కవిత్వ మనగా నేమనుకొనియెదరు? ఏది మనల నైహికగోష్ఠినుండి యానంద ప్రపంచమునకు తీసికొనిపోయి యచట దిగఁబెట్టుచున్నదో యదియే. వీణ కొకవిధముగా తెక్కు లున్న వనుకొనవచ్చును. అట్లే కవిత్వమునకుఁగూడా. గద్యకూడా ఆనందదాయకమైనదే కాని పద్యానికుండేటంతయవకాశము గనుపించదు. ఆనందము నిచ్చుచుగూడా ఏదో క్రింది కణచిపెట్టుచున్నట్లు గోచరించును. ఎందువల్ల నంటారు? వైపుల్యమున్నా తెక్కులు లేనందున ననుకోవలయును.

గద్య తన ప్రతిభను పద్యమువలె కల్పనాచాతుర్యముతో వెల్లడిచేయుటకు నవలలను, గద్యనాటకములను (Prose dramas) బయల్దేరతీసినది. విపుల పరిజ్ఞానమును వ్యాసములో విశదీకరించినది. అయితే భావకవిత్వ (Lyrical poetry) మెక్కడ కాన్పించును? వేంకటపార్వతీశ్వరకవుల కృతులవంటి కృతులలో కన్పించునేమో! శాస్త్రములలోను (గణితము, రసాయనము మొ.) చరిత్రలలోను వాడఁబడి గద్యము గద్యకవిత్వకళ కాస్తే తోడ్పడదని చెప్పవలయును. ఎందువల్ల ననగా:— వాటిలో భాషకన్న విషయమే ప్రధానముగా నుండునుగాన.

సన్న్యాసులు శరీరము నెంత ప్రధానముగా చూతురో వేదాంతశాస్త్రము భాష నంత ప్రధానముగా చూచును. వీటిలో కన్న చరిత్రలలో గద్యకు ప్రాధాన్యము నిచ్చినను నవలలోకన్న తక్కువ యనుకొనవలయును. శాస్త్రకవులకు వలెనే చరిత్రకారులకును విషయమే ప్రధానముగా నుండును. అయినను నవలారచయితతో పోటీచేసి చరిత్రకారుఁడు నవలలలో నుండు సొబగు తీసికొని వచ్చి చరిత్రల లోని కెక్కించు

చున్నాడు. అన్నిటి కన్న విమర్శనా వాఙ్మయమున మంచి మంచి గ్రంథములు వెలువడుట చూచుచునేయున్నాము. నవలలోను, గద్యనాటకములలోను గద్య (Prose) చాలా స్వతంత్రముగా నడచుననుట వాస్తవము. మన మెట్లాలోచించిన దానినట్లు వరుసగా మాటలలో పెట్టుటకు గద్య బాగా ఉపయోగించును. పద్యముకన్న గద్యయొక్క యుత్తమత్వ మిందులో నెక్కువగా కనుపించుచున్నది. పద్యము వ్రాయునప్పుడు వాక్యక్రమమును ఛందోబద్ధముగా మార్చుకొనవలసి యుండును. అనుకున్న భావముల ననుకున్నట్లుగా ఎంచిచూపించవలయునని నీపద్యలక్షణములు తొలగించలేని యడ్డంకులుగా నున్నవని 'పో' (Poe) యను పాశ్చాత్యకవి నుడివినాడు. గద్య పంచేంద్రియములతో చేరి చేసినది చేసినట్లును, ఉన్నదున్నట్లును ఏమాత్రము మార్పు లేకుండా ఫోటోతీసినట్లుగా ప్రకటించును. అయినప్పటికిని కవులు సర్వ సాధారణముగా పద్యమునే యెక్కువ వాడినారు. ఆలాగని బాణుని కాదంబరి కవిత్వము గాదనెదరా? కవిత్వాన్ని నిర్ణయించేది భావనా బలము గాని పద్యాలు గావుగదా?

"కళా కాంతితోఁ జికిలి యొనర్చి యున్నత భావసుమములతో నైసేసిన గ్రంథ కలాపమే వాఙ్మయ మన నగును. అదిచరిత్ర కానీ, శాస్త్రము కానీ, పద్యముకానీ, గద్యము కానీ కళాభిజ్ఞన కొక్కటే."

మలయ మారుతము

శ్రీ పిలకా గణపతి శాస్త్రి

మంద మందమలయానిలకుమార!
కుందమోహనామోదమనోహర!
చల్లని నీ అలకలు సోకినవో!
జల్లని తనుపులకలు ప్రాకెనో హో!
మెల్లన నామృదు శరీరమల్లిక,
పిల్ల తెమ్మెరలతో డిమ్మ వీడ సిక;
నాహృదంతరాంతరమే కరగెన్;
ఓహో! నీ పరిమళమై తిరిగెన్!
మందమంద మలయానిలకుమార!
మందారమరందారుణాధరా!
నా హృదయాంతరగళనాళికలే,
ఆహతవీణాచలతంత్రికలై,
నీవేణుల పరువిడు కలకలమే,
ఏవో పాటల పూలవర్షమై,
నీ పరువిడుదారుల కురియించెన్
నీపదయుగళివకుళముల జల్లుల్!
మంద మంద మలయానిలకుమార!
కందళిత హృదయ సుఖాంకురా!
నీచందనశీతలతాజలధిన్
తోచి మెరసె నానందమణిఖనుల్;
నీమద మంద పరీమళగతులన్
నామది నీలినిదురతెర లలమెన్;
లీల మహోత్సవ మేదో! వెలుగులన్
మేళతాళముల మెరసి చనెన్!
మందమంద మలయానిలకుమార!
సుందరసాగర శీకరహారా!
మంథర నిద్రామురళిగానకర!
కంధరాచల స్వప్నబర్హాధర!

నవలారచన

శ్రీ ముళ్లపూడి వెంకట కృష్ణానందరావు

ఆధునిక వాఙ్మయప్రపంచములో నవలా రచనయొక్క శ్రేష్ఠత ఎంతవరకున్నదో అందఱెరిగినదే! అయితే ప్రాచీనాంధ్రవాఙ్మయములో గాని, సంస్కృత వాఙ్మయమున గాని యిది లేదా? ఉన్నచో వాటి రచన యేలాటిది? అదెంతవరకు నేటికాలమున కుపయోగిస్తుంది? అను ప్రశ్నలు వేసికొని వాటి సమాధానము తెలిసికొంటే కొంతవరకు నవలాచరిత్ర, వానిరచనాశైలి తెలుస్తుంది

ప్రాచీనవాఙ్మయమున నీ నవలారచనకు—నేటి కాలమున — ఆధునిక వాఙ్మయమున నున్నంత శ్రద్ధగాని- వ్యాపకముగాని లేదు. కాని సంస్కృతములో కాదంబరి, దశకుమారచరిత్ర మొదలగు గద్యగ్రంథముల నాఖ్యాయికల (నవలల) క్రింద జేర్పవచ్చును. తెలుగున ప్రాచీన గ్రంథములలో కూడ నవల లున్నట్లగుపడదు. ఉన్నగూడ నుండవచ్చునేమో? కాని మొత్తముమీద ప్రాచీనవాఙ్మయమున నవలారచన కంత ప్రాముఖ్యము లేదు. ప్రాచీనవాఙ్మయమునందు అలంకార, శృంగారగ్రంథములకు తద్రచనలకు- ప్రాముఖ్యము మెండుగ నుండెడిది. అవి కవులు తమ హృదయానందముకొఱకు — ఆత్మానందముకొఱకు — తమ మనోభావము ప్రస్ఫుటీకరిస్తూ— వ్రాసుకొనేవారు. వాటియందు ప్రజాహృదయముగాని అభిప్రాయముగాని ప్రస్ఫుటింపవలసిన ప్రస్ఫుటింప జేయవలసిన — యవసరము లేకపోయినది. అందువలన కవులు — గ్రంథరచయితలు తమ ఆత్మానందముకొఱకు— తమకు ఆశ్రయదాతలగు రాజుల ఆనందముకొఱకు — శృంగారరసాన్ని గుప్పివేయుచూ— కల్పనారచనల నెన్నిటినో రచించారు. పైగా నాడు వారి కంతగా ప్రజాహృదయమునుగాని — సంఘపరిస్థితులనుగాని — తదభిప్రాయములనుగాని — ప్రస్ఫుటింపజేయవలసిన అవసరము లేకపోయినది. కారణము నాడు దేశమున— ప్రజలయందు— వ్యాపించిన శాంతి, సంతృప్తులే. నాడు నేటివలె ప్రజలను—అజ్ఞానాంధకారమునుండి మేల్కొలుపవలసిన అవసరముగాని, వారికష్టములను ఎత్తిచూపవలసిన అవసరముగాని— రాజును పదభ్రష్టుని జేయుటకు— ప్రభుత్వమును కూలద్రోయుటకు ప్రజలలో ప్రబోధము జేయవలసిన అవసరముగాని లేకపోయినది. నాడుకూడ దేశమస్వాతంత్ర్య మనుభవించినను-యుద్ధములు జరిగియున్నను, వానికి ప్రజలలో ప్రసక్తి యుండెడిది గాదు. యుద్ధము వచ్చినను— అదెన్ని వత్సరములు జరిగినను- నేటివలె ప్రజలవ్యవహారములందు— ఆస్తిపాస్తులందు ప్రసక్తి గలిగించుకొనక కేవలము రాజసైన్యములకుమాత్రమే సంబంధ ముండెడిది. కనుక నాటి కవులకు- గ్రంథరచయితలకు, రాజులను సంతోషపెట్టు బాధ్యతదప్ప మఱొకటి యుండెడిది గాదు. అందువలన వారి

లేఖినినుండి శృంగారప్రబంధము లెన్నో బయలు దేరినవి. వా రా శృంగారవర్ణనలలో యెంత పైకి పోయినారో చూడండి :—

ప్రణయవిశదాం దృష్టిం వక్త్రే దదాతిన శంకితా
ఘటయతి ఘనం కంఠాశ్లేషే, రసాన్నపయోధరౌ
వదతి బహుశో గచ్ఛామీతి ప్రయత్న ధృతాప్యహో
రమయతితరాం సంకేతస్థా తథాపిహి కామినీ॥

—శ్రీహర్షుని రత్నావళి, తృతీయాంకము.

ఇంకా చాలా వున్నా యిటువంటివి. మేఘసందేశమఃసలి శ్లోకసంపద యిలాటిదే కదూ?

దీనిని - ఈ విషమశృంగారాన్ని - నేటి వాఙ్మయకారులు ఏవగించుకొందురు. కాని నేటికికూడ ప్రాచీన వాఙ్మయాభిలాషులు శృంగారమును పొగుడుతారు. దాని వలన ఆత్మానందము పొందుతారు. వారికి నేటి వాఙ్మయచిత్రణగాని, నవలారచనగాని (నవలలుగాని) యిష్టముకాదు. వారి దృష్టిలో ఆధునిక వాఙ్మయకారులు బేలలు. వారు (ప్రాచీన సంప్రదాయులు), వాఙ్మయాన్ని (కవనాన్నిగాని గద్యరచననుగాని, మొత్తముమీద నేదైనా సరియే, రచనయనునది) సంఘముతో ముడిపెట్టక-దాని నుండి వేరుచేయ నిచ్చగించుచున్నట్లు తోస్తుంది.

కాని కాలము మారిపోతూంది. దానితోపాటు మానవుల హృదయములు కూడ మారిపోయినవి. దానితోపాటు వాఙ్మయము — దాని రచన - దాని యందభిరుచీ- దాని వ్యాపకమూ- అన్నీ కూడ మార్పు చెందుతున్నవి. కాలమునకు వాఙ్మయమునకు, రాజకీయములకు వాఙ్మయమునకు, ప్రజాసామాన్యానికీ వాఙ్మయానికి, సంఘపరిస్థితులకు వాఙ్మయమునకు సంబంధము లేదనుట పొరపాటు. నాడూ నేడూకూడ వాఙ్మయము ప్రజాహృదయము ననుసరించియే నడిచింది, వృద్ధి పొందింది. దాని రచనకూడ ప్రజాహృదయమునకను కూలముగనే జరిగింది. నాటి కాలమునకు సరిపోయిన వాఙ్మయరచన పూర్తి అయింది. కనుక మనము యికనుంచి క్రొత్తపంథా త్రొక్కవలసివుంది. ప్రాతమార్గమును వదలాలి, అయితే అది పనికిరాని దని అంటున్నానని మాత్ర మూహింపజనదు. నాడా ప్రజ తమ కవులచేత- వారి కానందకరమైన వాఙ్మయాన్ని కోరి రచియింపజేసికొనినారు. కాని నేటిప్రజ కా శక్తి లేదు. కనుక కవులే- గ్రంథరచయితలే ప్రజల కనుకూలించునట్లు- వారి యభిరుచులను గుర్తెరిగి గ్రంథములను రచించాలి. నేటి కవి రచన యాతని హృదయానందముకొరకు గాదు. ప్రజలయజ్ఞానమును బోగొట్టి, వారి శక్తుల నినుమడింపజేయుటకు, వారి కష్టముల నెత్తి చూపుటకు, వారి హృదయములలో నొక నూతనశక్తిని ఉజ్జ్వలింపజేయుటకు, ప్రజాహృదయాన్ని విప్పిచెప్పటానికీ ఉపయోగించాలి. నేడు కవి గ్రంథాన్ని, ఒక కథావస్తుసంచయాన్ని రచించటాని కాలోచించ నవసరము లేదు. దానికొరకు కష్టపడ నవసరము లేదు. దానికొరకు మెదడును ఆలోచన సముద్రములో ముంచుకొనవక్కర లేదు. అతను వ్రాయగలిగితే, అతనిలో శక్తియుంటే నిత్యమూ అతని నేత్రమార్గమున నెన్నియో విషయా లాతనికి గోచర మవుతవి. ఎన్ని? ఆర్థికసమస్య, విద్య, దరిద్రత, నిరుద్యోగసమస్య, కార్మిక

కర్షకసమస్య, స్వదేశీపరిశ్రమలు—ఎన్నో వున్నాయి.

ఇవన్నీ వ్రాయటానికీ, వీటిని ప్రజలలో వెదచల్లుటకూ, నేడు కథలూ, నవలలూ ఉపయోగించునంతగా మరోటి ఉపయోగించదు.

ఇక్కడ మనము కథాసాహిత్య మార్గం వదలి- నవలారచన నెత్తుకుందాం. ఇవే కథలతరువాత నేటి సాంఘికజీవనాన్ని వ్యక్తపఱచి బాగుపఱచటానికి సరిపోయిన నవీన వాఙ్మయాన్ని అందిస్తాయి. అయితే నవలా రచ నెలా వుండాలి? నేడు వాటి కెంత గౌరవం ఉంది? అవి ఎలా సాంఘికజీవనాని కుపయోగిస్తున్నవి? నేటి వాఙ్మయచరిత్ర లో వీటి అవసరమెంతవరకు? అనే ప్రశ్నలు వేసికొంటే కొంత సమాధానం దొరుకు తుంది. ఈప్రశ్నల నాలోచించి, సమాధాన మాలోచించుకొని రచనకు పూనితే నవల కింకా విలువ హెచ్చుతుంది. అట్టి రచన, అట్టికథావస్తువు, జీవనపథమున కను కూలిస్తుంది.

ముందు ఆంధ్రదేశమున నీ నవలల కెంతగౌరవ ముంది? ఆంధ్రు లెంతవరకు దీనిని గౌరవించుతున్నారు? అని ప్రశ్నించు కొందాం.

నేడు ఏమాత్రము జ్ఞానము కలవా డైనా సరే త్వరగా నవలారచనకు పూను కొనుచున్నాడు. కుప్పతిప్పలుగ నవలలు బయలుదేరుతున్నాయి. కాని అవి ఆంధ్రు లకు ఉపయోగపడడంలేదు. నవ లొక విలాసవస్తువు అయిపోయింది. దాని విలువ తగ్గిపోయినది. ఇలా కావటానికి రెండు కారణా లున్నవి. ఒకటి: పాఠకులు తక్కు వగుట. ౧౦౦ కి ౧౦ మంది అక్షరాస్యు లైన మనదేశములో లేరు; ౧౦౦-కి ఇద్ద రైనా నవలలవంటిపుస్తకములు చదువువారు లేరు. తక్కినవారుకూడ ఒక పావలా ఖర్చుపెట్టి పుస్తకం కొనక యెవరో కొంటే దాని నెరువు తెచ్చుకొంటారు. పైగా పాఠ కులకు నవలాప్రయోజనములు తెలియవు. రెండవది రచన. ఎవరిష్టం వచ్చినట్లు వారు రాసేయటము. నియమములేదు. ఆ వ్రాయువారికికూడ నవలను తా నెందుకు వ్రాయుచున్నాడో తెలియదు. ఇప్పటివర కాలోచిస్తే అస్వాభావిక మైన...వర్ణనలతో, శృంగారరస పూరితము లయిన నవలలే యెక్కువ. నేటి ప్రజల జీవనాని కనుకూ లించే- వారి జీవనాన్ని సరిదిద్దే- సాంఘిక నవలలు చాల తక్కువ. ఆ బయలుదేరిన వైనా శృంగారరసపూరితములు. మితిమీరిన శృంగార మది. దానికి హద్దు లేదు. ఇంత వరకు తయారైన నవలలలో రైతు, కూలి జనమునకు సరిపడి వారిసమస్యలను, వారి హృదయములను • వ్యక్తపఱచు నవల ఒక్కటికూడ యింతవరకు వెలువడలేదంటే ఆశ్చర్యము లేదు. వారిచుట్టూ నిత్యమూ, నిరంతరమూ, ప్రత్యక్షముగ ఘోర భీకర స్వరూపముతో నగుపడు సమస్యలపై వారి (నవలారచయితల) దృష్టి ఇంకా కేంద్రీకరింప బడలేదు. వీరి రచనలకు తగినట్లుగానే పాఠకగణముకూడ-అత్తవారింటికి వెళ్లుచూ, విలాసార్థము- "పుస్తకం హస్తభూషణం" అన్నారు గదా యని- ఏ రెండణాలకో ఒక నవలను కొనుటయే కాని, దానిం జదివి, దానిప్రయోజనాన్ని వారు పొందుటలేదు.

దీనివలన కర్త పరిశ్రమ నిష్ఫల మౌతూంది. ఇది కవి గ్రహించినాడా ? అనునది సమస్య. అతడు గ్రహించే యుండును. అయితే యింకా యెందుకు తన లేఖనిని సవరించు కోడు? మానవహృదయాన్ని అర్థము జేసి కొనకుండా, విలాసార్థము, ఆత్మతృప్తికొరకు, భేషజముకొరకు, తాను గ్రంథకర్త నని జెప్పు కొనేకొరకు, గ్రంథకర్త తననవలారచనను సాగిస్తున్నాడు. అతడు తన లేఖనిద్వారా సంఘమున పరివర్తనము చేయలేకపోయి నాడు. పైగా తనకు తన గోత్రీకులకు అగౌరవము నాపాదింపజేసికొంటున్నాడు. "ఓస్- వెధవనవలేగా" అనే పరిస్థితికి తన లేఖనిని అన్వయింపజేసికోవలసివస్తోంది. కాని ప్రజలకు నవలా ప్రయోజనాన్ని వ్యక్తపరచ లేకపోయినాడు. దీని కతని రచనయే కారణము. నవలారచనేనా అని ప్రజలో నిరసనభావము బయలుదేరినది. కాని నవలారచన యెంత క్లిష్టమైనదో తెలిసికో లేకపోయింది ప్రజ. నిజముగా బెంగాలీ, హిందీసోదరుల కున్నంత నవలలయందలి ప్రేమ తెలుగు పాఠకులకు లేదు. ఆ ప్రాంతములలో నవల కున్నంత గౌరవము మరి దేనికి లేదు. బెంగాలీల జీవితాన్ని బంకించంద్ర చటర్జీ తన నవలారచనద్వారా సరి జేశాడు. ప్రేమచందు తన కథల ద్వారా, నవలలద్వారా హిందీ సోదరుల సాంఘికజీవనాన్ని పరివర్తనము గావించాడు. మన తెలుగు సోదరులలో నంతటి రచయితలు లేరా? లేకేం. కావలసినంతమంది. కాని మనవా రౌత్తరాహులవలె తమ రచనను సాంఘిక సమస్యలపై ప్రసరింప జేయుట లేదు. దీనివలననే సాంఘిక పరివర్తన సాధనమైన నవలలంటే గౌరవముపోయినది.

అయితే నవలారచన ఎలా వుండాలి? అంటే ఏం చెపుతాము? గ్రంథరచయితలు తమ దృష్టిలో ప్రజాసామాన్యాన్ని, వారి భావాన్ని, నేటి సాంఘిక పరిస్థితులను, ఉంచుకోవాలి. శృంగార రసానికి, అలంకారములకు, కల్పనలకు స్వస్తిచెప్పాలి. స్వాభావికమైన, వాస్తవికమైన విషయాలెన్నో, సమస్యలెన్నో - మన దృష్టికి గోచరించే టప్పుడు కల్పన జేయు టెందుకు?- దాని కొరకు ప్రయాసపడు టెందులకు? నవలా రచయితల యీ కల్పనయే ప్రజా సామాన్యానికి నవలంటే విరక్తి గలిగిస్తోంది. నవలాకారునకు మానవహృదయము నేటి ప్రజాసామాన్యపు అవసరాలు, సంఘపరిస్థితులు తెలిసియుండాలి. అతడు ప్రజాసామాన్యములో కలిసిపోవాలి. తను సర్వవ్యాపి గావాలి.

"నవల వ్రాయుట తేలికపని గాదు. నాటకములు వ్రాయు టెంత కష్టమో నవల వ్రాయుటకూడ నంత కష్టమే. లోకచరిత్రను అంతరికదృష్టిద్వారా మిక్కిలి శ్రద్ధగా జూడగలశక్తి లేనివానికి, మానవునియొక్క భావముల ఉత్థానపతనములయం దనుభవము లేనివానికి, ఉన్నతకల్పనా శక్తిలేని వానికి, సర్వాంతర్యామివలె భిన్న భిన్నములైన ప్రకృతులను దెలిసికొని, వానిని సుందరమైన రచనద్వారా చిత్రించి స్పష్టము జేయజాలనివానికి, నవల వ్రాయుట ప్రయాస దప్ప మరేమియు కాదు. నవల వ్రాయగోరువానికి అతనికి లోకమున కొకవిధమైన శిక్షణ నివ్వగల ప్రజాసామా

న్యమును రంజింపజేయుగల గుణ ముండవలెను.........ఆవిధముగ శిక్షణ నివ్వక ఊరక శ్రీరంగసీతుల నేకరువుపెట్టినంత మాత్రమున లాభము లేదు. అలానే (నవలారచన యున్నట్లయితే) మనుస్మృతిలోను నవలలోను భేదమేమి?"

—రూపనారాయణపాండేయ.

కనుక పై లక్షణములు లేనివానికి నవలారచన కర్హత లేదు. ఇంతటిశక్తిని కలిగియుంటేనే కాని అతడు నవలను రచించ లేడు. ఒకవేళ రచించినా నేటి బేడ అర్థణా నవలవలెనే యుంటుంది. (క్షమింతురుగాక!) నవలారచనఒక కళ. అది నేటి సాహిత్యానికి జీవగఱ్ఱవంటిది. శతాబ్దాలనాటి ప్రాచీన వాఙ్మయానికి నేటి వాఙ్మయానికి చాల తేడా యుంది. దేశస్థితి మారింది. నేటిప్రజల అభిరుచులు మారాయి, దానితోబాటు సాహిత్యరచన కూడ మారింది. పూర్వపు విధమున గ్రంథరచన సాగిస్తే అవి నేటి సంఘముయొక్క ఆదరణను పొందజాలవు.

పూర్వపు రచనలు కవికి మాత్రమే ఆనందాన్ని కలిగిస్తాయి. నేటి ప్రజాసామాన్యానికి పనికిరావు. నేటి సంఘాని కవి శుష్కవాదాలు. కడుపు మాడుచున్న దరిద్రులకు అలంకారములతోను, శృంగారరసములతోను, చంపూ గ్రంథములతోను పనియేమి? అవియతని ఆకలిని దీర్చజాలవు. అతని సమస్యలను విడదీసే-పరిష్కరించే కళ (నవలారచన) గావాలి. ఆనిరక్షరకుక్షుని హృదయాన్ని విప్పి చెప్పేదిగా ఆ రచన యుండాలి. అటుల లేనినాడు మన కవు లెన్ని గ్రంథములను రచించినా- ఎన్ని నవలలను రచించినా లాభము లేదు. రచనలో ఆదర్శము, శిక్ష, స్వాభావికత ఉండాలి, సౌష్ఠవం ఉండాలి.

"స్వాభావిక చరిత్ర చిత్రణములో— ఆదర్శ చరిత్రకంటె భిన్నమైన మానవ హృదయముయొక్క స్వాభావిక దుర్బలతను- చూపికూడ దాని నాదర్శముయొక్క సరిహద్దునుండి దాటిపోకుండునట్లు జేయుట సాధారణకవికిగాని-నవలాకారునికిగానిసాధ్యమైన పని గాదు. ఇలా వ్రాయటానికి నవలారచయితకు సూక్ష్మదృష్టి, చక్కని అనుభవమూ, (ప్రజాసామాన్య ములో) —ప్రజల ఆత్మలలో సంచరింపగల ప్రతిభా, చక్కనికల్పనా శక్తి కలిగిఉండవలసిన ఆవశ్యకత యుంది."

—రూపనారాయణపాండేయ.

కేవలము ప్రజాసామాన్యములో కలసి- వారి హృదయస్థభావాలను తెలిసికొనినంత మాత్రమున లాభము లేదు. అతనుకూడ అట్టి భావాలే కలిగి ఉండాలి. అలా వున్నపుడే అతను సంఘముయొక్క వాస్తవికమైన- స్వాభావిక చరిత్రను చిత్రించగలుగుతాడు. పైగా కథకుడగు నవలాకారుడు తన రచనలో నాజ్ఞను ప్రస్ఫుటముజేయరాదు. అ దతనిపనిగాదు. అతని పని లోకమున కాదర్శరూపక మైన శిక్ష నిచ్చుటయే. ఆదర్శరూపకమైన శిక్ష నిచ్చుటలోనే సత్కవిశక్తి బయలుపడుతుంది. ఆ శక్తి గలవాని రచనయే ప్రజా సామాన్యములో వ్యాపించి తన ప్రభావమును గనుపఱుస్తుంది.

"శాస్త్రకారునివలె అజ్ఞాపించువాని శిశును ప్రజ లాదరింపరు. అది చిరకాలము చిరంజీవియై యుండదు."

—రూపనారాయణపాణ్డేయ.

కనుక నవలారచయితలు తమ మనస్సులు మార్చుకోవాలి. తాము ప్రజాసామాన్యములో కలిసి- యీనాడు నిరక్షరకుక్షులైయున్న -అజ్ఞానములో నున్న -తనను తాను తెలిసికోలేని స్థితిలో నున్న- ప్రజాసామాన్యాన్ని- పై కెత్తాలి. అతని భావాలను లోకానికి విప్పి చెప్పాలి.

నవలారచనయందు మార్పు రావాలి. మనము (ఆంధ్రులము) ఆధునిక వాఙ్మయ రచనలో మనతోడి ప్రాంతీయసోదరులకంటె ఎన్నో రెట్లు వెనుకబడియున్నాము. ఏం? మనలో అంతటి రచయితలు లేకనా? కాదు. మరెందుకు? కారణమలసత్వమే.

పూర్వపు గ్రంథాలు, ఆవాఙ్మయము, వ్రాసిన కవిని మినహాయిస్తే మరే కొద్ది విద్యాధికులకో, పండితులకో ఆనందాన్ని కలిగిస్తాయి. ప్రజాసామాన్యానికి జ్ఞానము కలిగించాలంటే, వారిలో మార్పు గలుగ జేయాలంటే, వారి జీవితనౌకను మంచి మార్గమున నడుపవలయునంటే, వారి కర్థమయ్యేటట్టు వారి కానందాన్ని కలిగించే వారి హృదయాలను విప్పిచెప్పగల్గిన రచనగావాలి. అట్టివానికి నవలలు, కథలు రెండే తగినవి.

విమర్శకుని కలము

శ్రీ ఉమర్ ఆలీషాకవి

పాచకుని చీపు రిది శుభ్రవస్త్రములకు
వెల్లవేయ వచ్చెను నిలు వెల్ల నదిగో
గాలిచే ప్రచలితమై వికాసవికచ
మైన నెమిలిపింఛముతో సమానమనుచు
పోల్చు హాస్యగాని వచస్సుపోలె నీ వి
మర్శకుని చేతికలము క్రుమ్మరెడు గంటె.

ఈ యుషస్సు సంధ్యారాగ మిరుల నెనసి
వెలుగు చీకట్లు పురుడించు వేగుచుక్క
చుక్కగా నొప్ప నిడుకొన్న సోయగంబు
నవ్వులో పెట్టి మొగతాళి నివ్వటిలఁగ
ఈయజాండంబు మేల్ముసుగో యనంగ
దాల్చి పలికెడునీ ప్రేమపాశములకు
కుంచెతో రాగరసము నేకొంచమైన
పూయగలవారు గలరె యే ప్రొద్దుకైన - పా.

ఇదిగో మైరేయభాండంబు ఇది ప్రశాంత
మైన మధుశాల ఇందు వేదాంతు లుండు
కొలువుకూటంబు జవరాండ్రకురులు రాలు
కుసుమసౌరభ మదె నొప్పకుంకుమంబు
పదములను గ్రాలు పారాణి పట్టవగ్గ
ములు వెలార్చెడు జవ్వనముల విలాస
లాలనంబు తొల్కాడు మేఘాలమెఱపు
తీగరతనాలకమ్ముల తేటలందు
గుల్కు ప్రణయిని పెట్టిన కోపరసము
నీరసము సేయ నగునె నెవ్వారికైన - పాచ.

ఈయమోఘ జీవితనిక్షరీయవస్త్ర
పత్తి నట్టేట పారిభావ్యాంతరముల
పొంగి పోరు పొలాల వాపోయునట్లు
జేరి కేదారముల నెట్టజీర లొలయు
తిరిగి వెన్నాడి యీ వేడితిన్నెలందు
పారుచున్నది తన పూర్వవాసనా ప్ర
సక్తి వదలక యీ సముత్సాహమందు
ఏదో ప్రళయంబు రూపించు నేదో గొప్ప
నాశనం బున్న దిది రహస్యాశయంబు
లెన్ని నేర్చినఁ దెలియ దేమన్న గాని - పాచ.

కాశీఖండము - కొన్నిపాఠభేదములు

శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి

ఆంధ్రసాహిత్యపరిషత్తు చేయుచున్న భాషాసేవ యభిజ్ఞాంధ్రలోకమున కీవఱకే పరిచిత మైయున్నయది. పరిషత్కార్యస్థానమునఁ గల గ్రంథరాజములలో నమూల్యములగు తాళపత్రగ్రంథము లనేకములు గలవు. ముద్రితాముద్రితమాతృకలు భాషకెంతేని సహాకార మొనగూర్చునని విమర్శకులకుఁ దెలిసినదే.

అముద్రిత గ్రంథముల వెలువఱుచుటయే గాక ముద్రితగ్రంథములందలి పాఠముల యుక్తాయుక్తతలను వ్రాఁతప్రతుల సహాకారమునఁ బరిశీలించి ప్రకటించుట పరిషదాశయములలో నొకటి. అద్దానికిఁ బూనుకొని 'కావ్యాలంకారచూడామణి' యందలి పాఠభేదములను పరిషత్పత్రికలోఁ బ్రకటించుచున్నాఁడను.*

పిమ్మటఁ గాశీఖండమునందలి పాఠభేదముల నటనటఁ బ్రసంగవశమునఁ గొన్ని చూడఁగా ముద్రితప్రతులందలి పాఠముల కంటె నివియే మనోహరముగా నున్నవి. వానిలోఁ గొన్నిటి నిటఁ బొందుపఱుచుచున్నాఁడను.

౧౯౧౬-వ సం॥న వావిళ్ల వారు ముద్రించిన కాశీఖండపుఁ బ్రతి విజ్ఞప్తిలో "౧౯౧౪-వ సంవత్సరాంతమున శ్రీనాథకవికృత కాశీఖండమును ముద్రింపఁ దలఁచి యచ్చుప్రతితో సంప్రతించుకొనుచు ఓరియంటల్ లైబ్రరీలో నున్న వ్రాఁతప్రతి ప్రకారము వ్రాఁతప్రతి వ్రాయించితిమి. తరువాత నాంధ్రసాహిత్య పరిషత్తులో వ్రాఁతప్రతు లున్నవని తెలిసి యోరియంటల్ లైబ్రరీప్రతితో సంప్రతించుకొనుచు నామూలప్రతులలో నుండు పాఠాంతరముల నన్నిటిని సమకూర్చినారము" అని ప్రకాశకులు వ్రాసియున్నారు. కాని ప్రతులందలి పాఠము లన్నిటిని సమగ్రముగా సంగ్రహింపలేదని తోఁచుచున్నది. ఈ ముద్రితప్రతులకును నించుమించు ప్రతిపద్యమునఁ బాఠభేదములు గన్పట్టుటయే దీనికిఁ గారణము. తత్స్వరూపము ముందు తెలిపెదను.

వెనుక ఆంధ్ర వారపత్రికలో మే ౧౫-వ తేదిని "శ్రీనాథుని కాశీఖండము- ముద్రిత ప్రతిలోని అపపాఠములు- సంస్కరణావశ్యకత" అను శీర్షికముతో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులవా రొక వ్యాసముఁ బ్రచురించిరి. అందు "పై సంస్కరణములలో 'సృష్టికండెఱ' అనునది నేను జేసిన సవరణ. తక్కినయవి వ్రాఁతప్రతులఁ జూచి చేసినవి.

---

* చూడుడు. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక. ప్రమాథి - మార్గశిర - ఫాల్గునములు, విక్రమ - చైత్ర-వైశాఖములు.

'సృష్టికద్దెలు' యను సంస్కరణము మూఁడు నాళ్లు పరితపించినమీఁద గోచరించినది. "విధాతేవ విశ్వప్రబోధం" అన్నది దీనికి మూలము. కద్దెలు యనఁగా నేత్రోన్మీలన (క)ము. కంటిని మూసిపెట్టు తెర గాదు. "'తెర' 'తెలు' భిన్నార్థకములు. ఉత్తర హరివంశమున నీపదము శకట రేఫముతో నున్నది" ఇత్యాదిగాఁ దెలిపియున్నారు.

శ్రీ ప్రభాకర శాస్త్రిలవారు సూచించిన పాఠములు కొన్ని పరిషత్తునందలి వ్రాఁతప్రతులందుఁ గలవు. పాఠభేదములం దెలుపునపుడు వ్రాఁతప్రతులను క, గ, చ, ట, త, అను సంజ్ఞలతో వ్యవహరించెదను. ఈప్రతులు పరిషత్పుస్తక భాండాగారమున నీ క్రింది సంఖ్యలు గలవి. 'క' ౧౧౮. 'గ' ౧౨౭౯. 'చ' ౨౩౦౨. 'ట' ౨౮౮౪. 'త' ౪౩౭౭. 'ప' యను ప్రతి చిన్నయ సూరిగారు నిఘంటు నిర్మాణమునకై వ్రాసికొనిన పదసూచికతోఁ గూడిన కాగితపుఁ బ్రతి.

౧

చిలుసానఁ బట్టించి చికిలి సేయించిన
... ...
నక్షత్రకుముదకాననము గిల్లెడు బోటి
ప్రాచి నెత్తిన హస్తపల్లవాగ్ర
... ...
సృష్టి కట్టెలు తొలిసంజచెలిమికాఁడు.

వావిళ్ల వారి ప్రతి. అ-౧. ప. ౧౨౧.

పై రేఖాంకిత స్థలములందు 'పోంటి' 'కందెలు' — అని యుండవలె నని శ్రీప్రభాకరశాస్త్రిగారు వ్రాకుచ్చియున్నారు. 'త' ప్రతిలో 'కందెలు' అను పదమున కుదాహరణముగా నిచ్చుచు "సృష్టి కందెలు తొలిసంజ చెలిమికాఁడు" అని వ్రాసికొనియున్నారు. ఈపాఠమే సూర్యరాయాంధ్ర నిఘంటువునందు 'కద్దెలు' అను పదమున కుదాహరణముగా నీయబడినది.

౨

ఒక్కఁడు మాకులంబున నము
ద్ధతిఁ జూపిన జాతరోషుఁడై
యెక్కలు త్రెంచి వేలుపుల
కోఁడటు పాపము చేసెఁ గాక యా
యెక్కలు నేఁడు గల్గిన నై
తింగి జనంబునఁ బాఱుతెంచి బి
ట్టెక్కనె కూటకోటి తటు
లెల్లను నుగ్గుగాఁ గ మేరువున్.

—అ ౧. ప. ౧౧౩.

ఇది ముద్రితప్రతిలోని పాఠము. 'నెతిఁ న్గగనంబునఁ బాఱుతెంచి' అనునది 'క' 'గ' 'చ' 'ట' 'త' ప్రతు లన్నిటియందలి పాఠము ఆ ఱెక్కలు నేఁడు గల్గినచోఁ దెలిసికొని వేగమునఁ బఱుగెత్తి మేరువు నెక్కనా? అనునది ముద్రిత పాఠమున కర్థము గదా! ఱెక్కలు గల్గిన నెఱుఁగుటకు, పఱుగెత్తి మేరువు నెక్కుటకు సంబంధ మేమియో తెలియరాదు. ఆ ఱెక్కలే యున్నచో పూనికతో నాకాశమునఁ బఱుగిడి, కూటకోటితటులెల్లను నుగ్గులుగా మేరువు నెక్కనా? యనునది వ్రాఁతప్రతులందలి పాఠమున కర్థము. ఱెక్కలతో నాకాశమునఁ బఱుగిడి, మేరువు నుగ్గుగఁ జేయుటకు వింధ్యము యత్నించిన దన్నచో దాని యౌద్ధత్య మెక్కుడుగ నభివ్యక్త మగును. కావున నీ పాఠమే యుక్తమని తోఁచును. పరిషత్తునందలి ప్రతులన్నిటిని బరిశోధించినచో, నయిదు ప్రతులందు నొకేతీరుగఁ గన్పట్టిన సరియైన

పాఠ మేల సేకరించినారు. కారో తెలియకున్నది.

3

అన్ని ప్రతులలో లేకున్నను బద్యములఁ గొన్నిటి నటనటఁ జేర్చియేయున్నారు. కాని, 'చ' 'త' ప్రతుల రెండిట నున్న షష్ఠ్యంతములందలి యీ పద్యమును (౭౭-వ పద్యము తరువాతిదానిని) వదలినారు.

ప్రాస క్షురికా ఖడ్గశ
రాసన పరిఘాది బహువిధాయుధ హేలా
భ్యాసోద్ధృత భుజ విజయ
శ్రీ సముదీర్ణునకు దానశీత కర్ణునకున్.

కవితారీతిని బట్టి యీ పద్య మతనిదే కానోపును

౪

వ. అనుచు నల్లనల్లన వచ్చు కుంభసంభవు దాదవ్వులం గాంచి, కాంచన శిరశ్శృంగ శృంగాటకంబులం గమలభవాండ కటాహంబు లుద్ఘాటించు తన మేనిపొడవు నేల సపాటంబుగా వంచి వింధ్యాచలంబున్నమ్రాసుభావు నెదుర్కొనియె. అప్పు డర్కుని రథంబు చక్కఁ జాయ నడచె. పవనస్కందంబుల నిర్బంధంబు లుడిగె. ఇందుండు చిందిలిపడసాఁగె.

—అ. ౨. వ. ౧౫౯.

'క' 'చ' 'ట' 'త' 'ప' ప్రతులలో "తన మేటి పొడవు సపాటంబు గావించి" అనియే కలదు. ఇటఁ బరిష్కర్తలు 'మేటి పొడవు' ను మేని పొడవునుగాఁ జేసి, దాని పొనగుపాటు కొఱకు 'సపాటంబు గావించి' అనుదానిని 'సపాటంబుగా వంచి' అని పరిష్కరించినారో? లేక, తొలుత 'సపాటంబుగా వంచి' అని సిద్ధింపఁ జేసికొని, ఆ వంచుట కనువుగా 'మేటి'ని 'మేని'నిగాఁ జేసికొనినారో తెలియకున్నది. ప్రతు లన్నిటిని గుర్తించినచో నిట్టి ప్రమాద ముండఁజాల దని నా మనవి.

ఇంతకు శబ్దరత్నాకరమున బ. సీతారామాచార్యులవా రిట్టి పాఠమునే 'సపాటము' అను పదమున కుదాహరణము నిచ్చు పట్టున గ్రహించుటఁ జేసి యద్దానినే వీర లును సేకరించి యుండిరేమో యనిపించుచున్నది. కాని చిన్నయసూరిగారు కాశీఖండ పదసూచికయందు "సపాటము = నేల మట్టము. కమలభవాండకటాహం బుద్ఘాటించు తన మేటి పొడవు సపాటంబు గావించి" అని వ్రాసికొని యున్నారు. కావున నిట బహుగ్రంథపరిదృష్టమగు నీ పాఠమే యుక్తమని విజ్ఞులకుఁ దోఁపక మానదు.

చిందలిపడు = సంభ్రమించు- అని శ. ర. లోని యర్థము. అగస్త్యుఁడు వింధ్యాద్రి యౌద్ధత్యము నడంపఁగా నర్కుని రథము చక్కఁ జాయ నడవసాఁగెను. చంద్రుఁ డేల సంభ్రమింప సాఁగవలెను? కాన నీపాఠ మేమియు సమంజసముగా లేదు. చూడుఁడు. వ్రాఁతప్రతులు 'క' 'గ' 'చ' 'ట' 'త' చిందిలి వడకసాఁగె. వింధ్యావరోధము పోఁగా చంద్రుఁడు సంభ్రమింపక (తొట్రిలక) సాఁగెనని దీని యర్థము. కావున నీపాఠమే సర్వవిధముల రమ్యము.

౫

వింధ్యాచలేంద్రపృథ్వీ భృత్కుల శ్రేష్ఠ
దక్షిణాపథము తీర్థంబు లాడ
పోవుచున్నార మీ పువ్వుఁబోడియు నేను
పెద్దకాలము నాఁటి పెరువ గాన

... ...

ఇట 'పెరువ' అనుచోట 'క' 'గ' 'ట' 'ప' ప్రతులలో 'పెరుబ' అను పాఠమే గలదు. 'త' ప్రతిలో 'వెఱపుగాన' అని కలదు. 'పెరువ' అను పాఠ మెచ్చటను గానరాదు. సీతారామాచార్యులవారు మాత్రము "పెరువు—విశే-౧. ఏండ్లు చెల్లినది, ఏండ్లు చెల్లినవాఁడు; "పెద్దకాలమునాఁటి పెరువ" అని శ. ర. లోఁ దెలిపియున్నారు. చిన్నయసూరిగారు తాము వ్రాసికొనిన నిఘంటువునకు సంబంధించిన కాశీఖండపద సూచికలో "పెరుబ - వృద్ధు" అను నర్థముఁ దెలుపుచు, "పెద్దకాలమునాఁటి పెరుబగాన" అని యుదాహరించియున్నారు. సీతారామాచార్యులవారు 'పెరువు' అనుపదమున కర్థములు, ప్రయోగములు చూపుచు, హరివంశమునందును, రాజశేఖర విలాసమునందును 'పెరువు' అనుపదముతోఁగూడిన పద్యములు నుదాహరించుచు నడుమ నీ 'పెరువ' యను దాని నేల యుదాహరించిరో తెలియకున్నయది. దీనినిఁజూచియే కాఁబోలు వావిళ్లవారి ప్రతిలో 'పెరువగాన' యను పాఠ మేర్పడినది. పరిషత్తునందలి వ్రాఁత ప్రతుల యాఱింటను 'పెరువ' యను నది యెచ్చటను గానరాదు. పాఠకు లిందలి యుక్తాయుక్తతలఁ బరిశీలింతురుగాక.

పైపాఠభేదముల నిట దిఙ్మాత్రముగ నుదాహరించినాఁడను. తాటియాకు ప్రతుల నామూలచూడముగఁ దడవినచో నిట్టి సరసములయిన పాఠములు ప్రత్యేకపద్యము నందును గన్పట్టుచునే యున్నవి. పరిష్కర్తలు శ్రమకోర్చి, యిట్టి వ్రాఁత ప్రతులను బాగుగఁ బరిశీలించి గ్రంథముల ముద్రింపించినచో భాషకు నూతన వికాస మేర్పడుననుట నిస్సంశయము. వ్రాఁతప్రతులందలి పాఠముల సారళ్యమును దెలుపుటకే యిట్లు వ్రాయఁ గడఁగితినిగాని, పరిష్కర్తల లోపముల వెదకుట కిట్లు వ్రాయుటగాదని నామనవి.

చిన్ననాటి చేష్టలు-సీతాఫలము

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

దమ్మిడీ కొకటి సీతాఫలముపండు,
తమ్ము లన్నల మేము తలకొక్కపండు
అమ్మ నమ్మతి గొంటి మారగించితిమి.
"అమ్మ !! నా కడఁగదే ఆతీపివాపి !!

దమ్మిడీ చాలునే అమ్ముతున్నారే
మాయమ్మ కొనిపెట్టె మఱియొక్కపండు
అమ్మగా అమ్మగా అయిపోవునేమొ
అమ్మగా ! అమ్మగా !! ఆలసింపకువే ! "

"సీతాఫలము చాల శీతళిస్తుంది
జలుబు చేస్తుందిరా జ్వరము వస్తుంది
కొనను పొమ్మ[illegible] అమ్మ కూకలేసింది
కొనలేదు మఱినాడు కొద తీరలేదు.

చేత దమ్మిడిలేదు చేయునది లేదు
ఆతీపిపైవాపి అడచుకోలేను
ఆపండ్లగింజలే ఆటలాడుటకు
రెండుజేబులలోను నిండించుకొంటి.

గింజలే, గింజలే, గుంజు లేనేలేదు,
ఎందు కీగింజ లని యేవ తోచుచుగొంత,
అంతలో నాఫలము నతిమధురిమము తోచు
పారవైచుట యెట్టు లారగించుట యెట్టు
పప్పు తీపేమొ యని పగులగొట్టితిఁ గాని
అది బాదమ్రోటు ఆలుబకరా కాదు
కసుకుమనికొఱికితిని,తుసుకుమనియుమిసితిని,
యాక్కులాలా! నోరువోక్కురోక్రైచెడను.

విసరికొట్టితి గింజ లన్ని
కసరుకొంటిని వాటిమీఁదను
ఒక్కగింజే చేత మిగిలిన
దూహ గొల్పినదీ.

నాటి సీతాఫలపు చవు లవి
యూటలూరెను నోటిలోపల
ఏవగింపును గోప ముడిగె ని
కేమొ తల పొదవెఁ.

చూచితిని యోచించిచూచితిని మరిమరీ
సీతాఫలపుగింజ చేతఁబట్టుకొనీ
ఒక్కత్రుటిలో గింజ వ్రక్కలైయందులో
మొక్కవెల్వడినట్లు బుద్ధి పొడమినది.

మొక్కయది పెద్దదై పెక్కుపూవులుపూచి
పిందెలై కాయలై ప్రిదిలి పండ్లైనట్లు
అవి నేను తినగలిగినన్ని తిన్నట్లు మా
యమ్మకును 'ఇంద'మని యాసగొల్పినయట్లు.

అప్పుడే ఆగింజ చేకొని
యాస లెల్ల ఫలించినట్లై
పాటిదొడ్లో పాతిపెట్టితి
భద్రమగుచోటఁ.

ముఖము గడిగిన, కాళ్లు గడిగిన
పుక్కిలించిన, మంచినీళ్లవి
పాదులోనే, నాకు పాదది
ప్రాణపదమాయెఁ.

నిక్కముగనే మొక్క మొలచెను
నేను నొక జనకుండ నయితిని
బిడ్డవలె నాచిన్న మొక్కను
పెంచదొడగితిని.

పాదుచేయుట యెరువువేయుట
పదనుగొల్పుట నీళ్లుపోయుట
పెరుగసాగిన మొక్కజూచుచు
మురిసిపోవుటయుఁ.

గడచినవి రెండేడ్లుగాబోలు, నేపాతి
మొలపించినది మొక్క పూతపూచినది, నా
కిల్లంత గంతులే, గల్లంతులే, బలే
అల్లకల్లోలమే అది పండ్లుపండెనని.

పూవు లెన్నో రాలిపోయినవి, నా కెన్నో
గడబిడల్ మనసులో, పొడమదాపిందెయని,
ఎట్టకేలకు నొక్క పిట్టపిం దగపడెను
తియ్య నీరు నే బోసి దినదినముపోషింప.

మేకెరువు తియనీరు మేపితిని చెట్టునకు
ప్రాకుతీగల ద్రెంచి పాఱవైచితి, మన్ను
త్రుళ్లగించితి, చెట్టువ్రేళ్లు తెగకుండగా
ఆపిందె క్రమముగా నేపునంబెరిగినది.

ఆనాడు నేదిన్న యాదమ్మిడీపండు
నురువుకంటెను పెద్దపెరిగినది యాకాయ
పచ్చికాయో పండో ప్రతిదినము పరికింతు
పండినదిగో తిందునని దండోర వేయుదును.

మాయమ్మ చూచె,నది "నాయనా నీచేతి
చలువ నీతాఫలము ఫలియించినదిగాని
కోయకుమి యిప్పడది కాయ కనుగాయుసుమి
పక్వ మగునందాక బాగుగా పెరుగనీ

పెరిగి గింజలగల్లు విరిసి లో పిక్కటిలి
పండబాటిపతతిని బ్రద్దలగు నప్పు డది
యొకనాడు మెత్తబడుటకు దాచియుంచియా
మర్నాడు తింటేను మహారుచిగ వుంటుంది.

చెప్పకుండా కాయ చెట్టునుంచి కోసేవు
కాయయును నీయాస కడకు వ్యర్థములవును,
ఆరముగ్గినపండు అతిరుచ్యముగ నుండు
నన్నదమ్ములు మీరె యారగింతెరు గాని".

అమ్మమాటలు నమ్మి యాగితిని గొన్నాళ్లు
కాయకాయే పగులు కానరాకే పోయె
నే నాగలేనైతి నెరపితిని సాహసము
కత్తితో నొకగంటు గావించితిని దాన.

అమ్మతో జెప్పితిని అది పగులు వాసెనని
నామాట తథ్యమని నమ్మినది మాయమ్మ
పగిలితే కోసుకో, పండనేమో యనెను
కోసుకొనివచ్చితిని కొయ్యవంటిది కాయ.

కసరుగాయె, కత్తిగంటు, పగులలేదు
ఇదియేమిరా తండ్రి యిట్లుచేసితి వనెను,
పనికిమాలిన కాయ పారవేసెద ననెను
నాకాయ తెమ్మంటి చీకొట్టి తఱిమినది.

నాకెరుకపడకుండ నాకాయ దాచినది
దాని దెలియగ గోరి తంటాలు పడ్డాను
వెదకితిని వెదకితిని తుదికి గనుగొంటి నది
తవుటిలోపల గ్రుక్కి తట్టలో దాచినది.

జొపడిన దమ్మ నీ దాపరిక మన్నాను
"ఎంతయావర నీకు ఎట్లు కనుగొన్నావు ?
ఉక్క కది మెత్తబడునో యేమొ రెన్నాళ్లు
తెరచిచూడకురోరి తెలివిమాలినవాడ !"

అనియె మాయమ్మ నాయాత్ర మెఱుఁగదుగదా
దమ్మిడీ కానాడు తాను గొనియియదాయె,
నాచెట్టుకాయనే నన్ను తిననియదాయె
తల్లిదండ్రులు పెద్దతంటాలు పిల్లలకు.

మర్నాఁడు చూచితిని మరి మెత్తబడలేదు
మఱియొక్కపూటాగి తెరచి చూచితి నంతె
మరికొంతసేపాగి తెరచిచూచితి నంతె
ఎంతయాగిన నంతె యేమిసేయఁగవచ్చు.

అందులో నొకచెక్క తిందునని కోసితిని
వట్టివగ, రందు రవ్వంతైన రుచిలేదు
పారవైచితిని గోపారుణాక్షుండనై
ఆరజూచిన దమ్మ నారోతచేత యది.

"పండునేమో కాయ పాడుచేసితివిరా,
ఇంత తొందరయైన నెట్లురా నీబ్రదుకు
ఎబ్బెబ్బె నీవెంత [illegible]బ్రాసివైతివిర
ఏడ్వవలసినదె నీ వింకేమి చేసెదవు."

అని యసహ్యించుకొనె నను గసరుకొనిరోసె
అవమాన మయ్యె నా కావురని యేడ్చితిని
నాసొమ్ము నే పాడుచేసుకొన్నా నన్న
గర్వమొక్కటి నాకు దుర్వారమై పొడమె.

అవమాన మొకప్రక్క నాగర్వ మొకప్రక్క
పంతు చెడె నన్న దుర్భర దుఃఖమొకప్రక్క
ముప్పేటలై నన్ను ముప్పుత్రిప్పుల బెట్టె
రోతరోతైపోయె నాతీరు నాకపుడు.

ఆనాఁడు మానాన్న యఖిలంబు విన్నాఁడు
"అనుచితము చేసితివి, పనికిమాలినవాఁడ!"
అనునంతలో నేను గనలుచును బలికితిని,
నాచెట్టు నాకాయ నాయిష్టమే కదా.

నష్టపడితిని పండు నాకె నష్టము దీన
నెవరి కేమీ యంచు నవకతవకలు పలుక;
"నానోయి యవివేకి! యాచెట్టు నీచెట్టె
నాస్థలములో నాటినాఁడ వది మెఱుఁగుమా.

నీవు నాబిడ్డడవు గావునన్ నావాఁడ
వే, యింతకును నెవ్వఁడేని యెదియేని యిది
నాది యని చెప్పఁగోగా దగుట కద్దాని
జక్కరక్షింపదగు సామర్థ్య ముండవలె.

అది లేనివాఁ డెవఁడు నిది నాది యనఁదగఁడు"
అని యిట్లు మానాన్న మనసునొవ్వనియట్లు
మందలించెను నన్ను మందమందమ్ముగా
సిగ్గునం జిదికితిని సీతాఫలమువలన.

చదువుచే తప్పిదము సవరించుకొందు నని
పాఠములు రాత్రి దీపముముందు తెఱచితిని
తెనుగుపద్యములలో మొనగాఁడ నగుటచే
వేమన్నపద్య మది వేమారు చదివితిని.

"తామసించి చేయఁదగ దెట్టికార్యంబు
వేగిరింప నదియు విషమ మగును
పచ్చికాయ దెచ్చి పడవేయ ఫలమౌనె
విశ్వదాభిరామ వినుర వేమ."

"ఏమిరా చదివెదవు వేమన్నపద్యమా
వ్యర్థమే నీచదు వనర్థమే చేసితివి
తెలివిగలవాఁడవైతే యిట్లు చేతువా"
యనుచు మానాన్న పద్యార్థంబు వివరించె.

ఈపద్యమున నాకు లోప మొక్కటి తోఁచె
నాన్న! అది యడుగఁదగునా? అంటి నడుగు;
మనె
వేగిరించిన నదియు విష మగు ననుదాని,
కా"పచ్చికాయ - ఫలమౌనె"యనుకథ చెల్లె.

తామసంబునం చేయదగదు కార్యం బనుట
కేదికథ ? పద్యమున లేదేమి? లోప మిది;
నాబుద్ధి దిద్దుటకె కాబోలు నీనాడు
పాఠమున వచ్చినది పద్య మిది యంటి.

"నీతాఫలము నీవు చెరిచినా వనునేవ
తొలగ నీకీ ప్రశ్న తోచినది కాబట్టి
పండితుడవై నీవు ప్రథితిగాంచెద వేమొ
చదువుమా నాతండ్రిన కావ్యములుచక్క-

గు ర్తించు సత్కృతుల గుణదోషముల నిట్టు
లాత్రపడెదవొ యేమొ ఆచదువులోగూడ
నీతాఫలపుకథను చిరము స్మరియింపుమా
బుద్ధిగలవాడవై వృద్ధి పొందుము తండ్రి!

కవి వాదు వేని యీకథ కబ్బ మొనరింపు
మల్లె వేమన్న పద్యమున గల లోపమును
తామసంబున జేయుదగ దెట్టి కార్యమను
దానికథ నొకదాని బూని రచియింపుమా !"

ఆనాటి మానాన్న యాశీర్వచన మెట్లు
ఫలియించెనో నేను పలుకజాలను గాని,
ఆనాడు నేనాటినట్టినీతాఫలము,
ఫలియించుచున్న దిప్పటి కెన్నొఫలములను.

—

ధన్య జీవి

"భమిడిపాటి"

"పొటాసియం సైనేడ్ !"

— ధడేలు మని కొట్టుకుంది లైబ్రరీ కిటికీతలుపు.

"అవును ! ఏం! పిడుగు పడ్డట్టయిందా? ఆపేరు చెప్తే మీరు ప్రళయాన్ని చూస్తారు మీదృష్టిలో. గుడ్డివారు! మీ కేంతెలుసును. మానవజీవితంలోని మాధుర్యాన్ని చవి చూపే అమృత మని ! ప్రళయప్రభంజనుని వేగాన్ని ఆపేసి శాంతిస్థాపనచేసే వజ్రాయుధ మని ! ఏమహానీయుడు కనిపెట్టాడో గాని చిరస్మరణీయుడు ! దైవసమానుడు !"

—పట్టువీడిన కిటికీ తలుపు 'కటకట' శబ్దం చెవుల్లో అల్లరి చేస్తూనేవుంది.

నిశ్శబ్దత ఆవరించింది.

చీకటితో నే ఆరంభమైంది చినుకూ.

* * * *

ఆరాత్రి

ప్రళయం ! మహాప్రళయం !

ఆకాశమార్గాన్న, క్రింద మహాసముద్రంలో.

భూగోళ మంతటికీ నల్లటిపూత !

'జిగేల్' మనే తెల్లగీతలు కడుపుచీల్చుకుంటూ.

'గడగడ' మనే పిడుగుల చప్పుడు.

'హోర్' అనే చావుప్రమోత,

ఎన్నెన్నో జీవు లల్లాడిపోతున్నాయి.

మహాబ్ధిగర్భంలోనుండి కలవరం.

"ఊఁ!" అనే గుర్రుశబ్దాలుతప్ప యితర చేష్ట లేదు ఆ జీవుల్లో.

ఆకాశం బ్రద్దలైపోతూంది. ఆపెద్ద కెరటాన్ని అందుకునే ప్రయత్నంలోవుంది.

అంతరిక్షాన్ని తాకింది. పెద్దచప్పుడు చేస్తూ కూలిపోయింది. బలవిహీనమై ఒడ్డుకు చేరుకుంది.

'గడగడగడధాం !' అనే అశనిపాతం.

లోకాన్నంతా 'జిగేల్' మనిపించేసి తృటికాలం తమాన్ని పారద్రోలే విద్యుల్లత.

మళ్లా నిశ్శబ్దం ! అంధకారం ! పెద్ద తుపాను అనంతరం ప్రశాంతప్రకృతిలా.

ఆకాశం కళ్లు మూసేసుకుంది. అంత వరకూ ఏడ్చికన్నీరు లేక - హృదయానికి శాంతినిచ్చింది. శాంతంగా మూసేసిన అకళ్లు మరి తెరవలేదు.

ప్రకృతిలో అది కలిగించిన ఆరాటం ! జలప్రవాహాలు, ప్రమాదాలు, యుద్ధభూమి, శ్మశానభూముల సఖ్యం.

ఏకైక మారణభూమి - కాదు - సముద్రం.

ఇం కెంతసేపటి కా ఆరాటం అణుగు తుందో !

మ రణిగేదేమిటి ?

ఎంత నైర్మల్యాన్ని ప్రసాదించినా, గాయంతగిలినచోట మచ్చపోతుందా? మచ్చ లోంచి గాయం కనబడదూ?

* * * *

అబ్బా! అన్నంతపనీ చేశాడు! ఎంత గుండెనిబ్బరం! ఎంతటి త్యాగం! సామాన్య బాలుడంటేలోకం! మానవాతీతమైన మహా త్కార్యం చేశాడు. ప్రకృతిలో సర్వజీవాలు చలించిపోయాయి. అద్భుతానందాన్ని అను భవించాయి - తమకు తెలియకుండానే!

"అదీ త్యాగమంటే!" అంటుంది అంత రాత్మ గాని 'ఏంత్యాగం! ద్రోహం కాదూ?'

'కాదు! విశ్వమానవ కల్యాణ మపే క్షించి చేసినపని ద్రోహం కాదు. లోకం దృష్టిలో ద్రోహాలు! అవేకారణాలు తెలుసా ఆనందానికి! అడిగిచూడు! అగుపడ్డ ఆనంద జీవి అల్లా 'ద్రోహి' అవునో కాదో! ద్రోహం ఎలాంటిదో?'

లోకం గ్రహించగలదా శాంతిని? భరించగలదా పోనీ!

తనంతట అదే వస్తూన్నప్పుడూ తప్పే అంటుంది! ఏంలోకం!

ఆహృదయం ఎంత మండుతూంటుందో గదా!

ప్రేమపూరిత హృదయాలు, జీవితా నంద సంధాయకములు, అయిన హృదయ పాలకులను, ఆజన్మాంతం సేవనీయాలను, మొదలంట నాశనంచేయ తలపెట్టేవా రున్నారా?

ఉన్నారు!

విశ్వమానవ కల్యాణ మపేక్షించి, ప్రపంచశాంతి నాశించి, జీవితానందం గ్రహించి, యిలాటి తుపానులకు లోనయ్యే వారు ఎందరో!

లెక్కపెట్టగలదా లోకం!

లెక్కపెట్తూనే వుంటుందిగాని అవసరం గ్రహించదు.

తుపాను అంత బాధకల్గిస్తుందనే అసహ్య పడుతుందిగాని తదనంతరం వచ్చే ప్రశాంత వాతావరణానికి కారణం అదే.నని తెలుసు కోదేం?

అంతానికి కారణాన్ని అభినందించ లేదు. అంతా 'అదృష్టం' అంటుంది. అలా గేదైనా కారణ ముందంటే నిందిస్తుంది. 'ఎంతఘోరం!' అని అంధలోకం!

కనుకనే అగుపడేదానికన్న, వినబడేదే ఎక్కువ లోకానికి.

ఆ అభాగ్యజీవులు, దేశక్షేమానికని చేసే మహాత్యాగాలే ఈనాటికీ యింకా లోకానికి కలిమి, బలిమి, చెలిమి, కలిగి నడ యాడ చేస్తున్నాయి. లేకుంటే ఎప్పుడో క్రుంగిపోయేదే.

ఈ గుడ్డిలోకం!

—

కొత్తపద్ధతులు

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

జోగారావంటేనే నాకు మొదటినుంచీ మంట. వాడేది చేసినా నాకు తప్పుగానే తోస్తుంది. ఇంకోడి నోటివెంటవస్తే ఆమోదించేముక్కలే వాడనటం మొదలు పెడితే నాకు చిరాకేస్తుంది.

తనొక పెద్దసంస్కారపరాయణుడనీ అధునాతనత్వం తనుగా మూర్తీభవించిందనీ జోగారావు అనుకోవటమే కాదు, అంటాడు కూడానూ. వితంతు వివాహాలకు నడుము కట్టుకోడనీ, శాఖాంతర వర్ణాంతర వివాహాలు చేయించడనీ, తనబంధువర్గంలో ఉన్న ఆడపిల్లలకంటె ఊళ్లో ఉండే వెధవపిల్లలను అధికంగా చూడడనీ లేనను!... కాని ఒక్కటి ఘట్టిగా చెప్పగలను: ఆడవాళ్లకు సంబంధించని సంఘ సంస్కారంలోకి జోగారావు వాడిజన్మలో వెళ్లి ఎరగడు. మీ ఖద్దరూ, మీ హరిజనసమస్యా [illegible] ఇటువంటి దిక్కుమాలిన సమస్యలజోలికి వాడు చస్తేపోడు. రజస్వలావివాహాలంటే, వితంతు వివాహాలంటే, ఆడవాళ్ల విద్యాసంస్కార స్వాతంత్ర్యాదికాలంటే వాడికి నల్లేరుమీది బండినడక. ఎవడిహక్కు భుక్తాలలోనూ లేని స్త్రీత్వం వాణ్ణి చెడ్డ ఆకర్షించేది. పెళ్లికాకపూర్వమే రజస్వలలయినపిల్లలూ, వితంతువులూ వాడికి ఆరాధ్యవస్తువులు.

దానికి కారణంకూడా నే నెరుగుదును. వాడి భార్య కట్టెనూ కంపనూ కాలనికోరిది, మగరాయుడు, ఎందుకట్టె. ఎన్నడూ ఏ అవినీతికరమైన పనికీ పాల్పడని జోగారావు దిక్కులేక, ప్రకృతి ప్రేరేపణను జయించే సంస్కారంలేక, ఆ భార్యనే అమితప్రేమతో ఆరాధించుతూ వచ్చాడు. ఆక్షుద్ర ఉపాసన నెత్తి అడిచింది. జోగారావుసంస్కారప్రియత్వమంతా దానిఫలితం.

వాడిమూలంగా నాకు చాలకాలం హైమవతి మీదకూడా అర్థంలేని దురభిప్రాయం ఉండేది. ఆ పిల్ల వాణ్ణి "బాబాయి," అని పిలుస్తుంటే నాకు తిక్కెత్తుకొచ్చేది. వాడాపిల్లకేమీ కాడు. హైమవతి చిన్నతనంలో నాలుగైదుసంవత్సరాలపాటు ఆపిల్ల తల్లిదండ్రులు జోగారావుగారింట్లో అద్దెకున్నారు. ఆరోజుల్లో వీ డాపిల్లను ఒక్కసారయినా దగ్గిరికి తీశాడనికాని ఒక్క బిస్కటుముక్క ఆపిల్లకు కొని పెట్టినపాపాన పోయివాడనికాని అనుకోను. ఆపిల్ల పెళ్లికి వాడు పోలేదని నాకు స్పష్టంగా తెలుసును. కాని హైమవతిభర్త పోయినపదోరోజుకల్లా వీడు హాజరు! వాళ్లెవరూ ఆమెజుట్టు తీసేప్రయత్నంలో లేకపోయినప్పటికీ వాడుమాత్రం ఆదురాచారంగురించి చాలాసేపు గంభీరోపన్యాసం ఇచ్చి ఆమెభావి యావత్తూ ఆరోజు సూర్యాస్తమానం అయేలోపల వివరంగా నిర్ణయించేశాడు.

అయితే హైమవతి చదువుకుమాత్రం జోగారావు చాలావిధాల సహాయపడినమాటమాత్రం నిజం. ఆమె ఒక్కొక్కతరగతే పాసవుతున్నకొద్దీ జోగారావు తనజన్మ సార్థకమవుతున్నట్టు భావించాడు. ఆఖరుకు హైమవతి వాడి కొక ఆశయం అయిపోయింది. దానిముందు విశాలమైన సంఘ సంస్కారాభిలాషకూడా తుడిచిపెట్టుకుపోయింది.

ఎట్లాగైతేనేం హైమవతి బి. ఏ. డిగ్రీ తెచ్చుకున్నది. అంతటితో జోగారావు నిర్ణయించిన క్రమం కాస్తా అడ్డంతిరిగింది. హైమవతి పెళ్లి తన చేతిమీదుగా చేసి నిభాయించలేనని ఆమెతండ్రి ఖండితంగా చెప్పేశాడు!

జోగారావు అంత సులభంగా ఓడిపోదలచలేదు. "ఆ కార్యభారం యావత్తూ నామీద వెయ్యండి, అన్నగారూ!" అన్నాడు జోగారావు. "మీరేమైనా చేసుకోండి. నా పూచీమాత్రం ఏమీ లేకుండా ఉంటే

సరి" అన్నాడు హైమతండ్రి. ఆరోజులనాయతు హైమ జోగారావు కుటుంబంలో చేరిపోయింది.

ఆమెకు జోగారావు తెచ్చిన సంబంధంకూడా వాకాశ్చర్యం కలిగించింది. సూర్యనారాయణ మేధావీ, స్ఫురద్రూపీ, చిన్న జమీందారూనూ! అతను బి. ఏ ఆనర్సు పాసయి హైమకోసం కనిపెట్టుకున్న వాడల్లే పెళ్లీ పెటాకులూ లేకుండా ఊరికే కూర్చున్నాడు. జోగారావు ఈ సూర్యనారాయణను ఎప్పుడు ఎక్కడ ఏ గాలంవేసి పట్టాడో వాకైతే తెలియదుకాని ఆ కుర్రవాడితో ఒకటిరెండుసార్లు మాట్లాడిన తరవాత హైమ వంటి విద్యాధికురాలికి అంతకంటె మంచిభర్త దొరకడనుకున్నాను. నిజంగా ఆ పెళ్లే జరిగితే జోగారావును గురించి నా అభిప్రాయం యావత్తూ ఒక్క క్షణంలో మార్చుకోవటానికికూడా సంసిద్ధు ణ్ణయినానంటే నమ్మండి.

అయితే జోగారావు దిగ్విజయానికి తలవని తలంపుగా మరొక అంతరాయం వచ్చింది — హైమ తనకు పునర్వివాహం అవసరం లేదన్నది.

"మా అమ్మమ్మ అంటూండేది—వెధవముండ పెళ్లి వెధవపెళ్లేనని. అది నిజంకూడాను!" అన్నది హైమ కరుకుగా.

"ఏం? ఏం? ఏం?" అన్నాడు జోగారావు నోట మాట రాక.

"ఈ వెధవపెళ్లిళ్లు సామాన్యంగా సరిగా పరిణమించవు. ఏదో వంక రానేవస్తుంది!" అని హైమ సమాధానం చెప్పింది.

"నాన్సెన్స్! మామూలు పెళ్లిళ్లుకూడా అంతే, ఆమాటకు వస్తే!" అన్నాడు జోగారావు, బహుశా తనపెళ్లి స్మరిస్తూ.

"ఆపెళ్లిళ్లు ఎట్లా తగలబడినా ఫరవా లేదు. అవి సంఘదేవతకు బలులు! పితృదేవతలు తరించటానికి చేసేవి. ఆపెళ్లిళ్లు చెయ్యకపోతే ఆడపిల్లలు అంటరానివాళ్లవుతారు! చేజేతులా అటువంటిపెళ్లే మళ్లీ, ఎరిగిఎరిగి, ఎవరి ప్రోద్బలమూ లేకుండా, పైగా సలుసరిఇష్టాన్నీ తిరస్కరిస్తూ చేసుకోవటం బుద్ధి తక్కువ కాదూ?" అన్నది హైమవతి ఒకేసుక్కలో.

"అదేంమాట? ఇతర విధవావివాహాలు ఎట్లా అయితే నీకెందుకు? నీకు అన్నివిధాలా నచ్చినమొగుడు దొరికితేనేచేసుకో, లేకపోతే మానెయ్యి!" అన్నాడు జోగారావు.

"అదే నేనూ అంటున్నా!" అన్నది హైమ.

అమర్నాడు సాయంకాలానికల్లా గారడివాడు మంత్రించి బుట్టలోనించి తీసినట్టు జోగారావు ఎక్కణ్ణుంచో సూర్యనారాయణను ప్రొడ్యూస్ చేశాడు!

ఆ మొదటిరోజు సంభాషణలో జోగారావు విశేషం కల్పించుకోలేదు, వెయ్యికళ్లతో సూర్యనారాయణనూ హైమవతినీ కనిపెడుతూ వచ్చాడు. కాని వాళ్ల సంభాషణ ఆమూలాగ్రం వినేసరికి జోగారావు గుండె నీరయిపోయింది.

"నాకు స్వతస్సిద్ధంగా మగవాళ్లంటే పరమ అసహ్యం!" అన్నది హైమ ఏ సందర్భంలోనో.

సూర్యనారాయణ ఎ ‌ మృదువుగా మంద హాసంచేస్తూ, "నాకు ఆడవా టే కూడా, అంతే" అన్నాడు.

ఈ విషయంమీదే ఆ ఇద్దరూ జోగారావు సహాయం దాదాపు ఏమీ అవసరం లేకుండా, పునరుక్తిదోషం రానివ్వకుండా, రెండుగంటలు మాట్లాడుకున్న తరవాత సూర్యనారాయణ లేచి, "పొద్దుపోతున్నది, వస్తాను!" అంటే, "నేను పోతున్నాను. పొద్దు మళ్లీ రేపు వస్తే వస్తుంది. నేనుమాత్రం రాను!" అన్నట్టు ధ్వనించింది జోగారావుకు.

కాని అంతవరకు జోగారావు పొరపాటు పడ్డాడు. ఏమంటే, సూర్యనారాయణ మర్నాడు మళ్లీ వచ్చాడు. అయితేఏం? నిన్నటిచర్చ ఎక్కడ ఆగిందో అక్కడ మళ్లీ ప్రారంభమయింది. అది చర్చమాదిరిగా కూడా లేదు జోగారావు చెవులకు, కొట్లకుక్కల అంతఃకలహంలాగు కనిపించింది. ఆడవాళ్లకు విరుద్ధంగా సూర్యనారాయణా, మగవాళ్లకు విరుద్ధంగా హైమవతీ వకాలతు పుచ్చుకున్న మొత్తం మీద

ద్దరూ కలిసి మానవ మనస్తత్వాన్ని కడిగి తూర్పారబట్టారు. "అవతలమనిషి ఆడదే! కాస్త సౌజన్యం చూపింతా"మని సూర్యం కాని, అతన్ని ఆకర్షింతామనీ, మెప్పింతామనీ, స్త్రీ సహజమైన మార్దవం ప్రకటింతామనీ హైమ కాని ప్రయత్న లేశం కూడా చెయ్యటం లేదు.

"ఒకవేళ వీళ్లిద్దరూ పెళ్లాడితేమాత్రం ఆకాపరం ఎట్లా ఏడుస్తుంది!" అని ఆశ్చర్యపడ్డాడు జోగారావు.

వాళ్లిద్దరూ మాట్లాడుకునే విధానమే కాక విషయాలుకూడా జోగారావుకు నచ్చలేదు. మానవ మనస్తత్వంగురించి మాట్లాడటం అయిపోయినతరవాత వాళ్లు మాట్లాడిన విషయం ప్రేమ! అది కూడా ఎంత విలక్షణంగా!

జోగారావు అభిప్రాయంలో పెళ్లాడబోయ్యే వాళ్లు మూడో ప్రాణి ఎదుట ప్రేమప్రస్తావన తేగూడదు. తెచ్చినవాళ్లు దాన్ని గురించి ముచ్చటగా ముచ్చటించవలసిందేగాని ముక్కలుముక్కలు చెయ్యటం ఏమి రసికత్వమో జోగారావు కర్థం కాలేదు.

"ప్రేమ" అనేమాట సూర్యనారాయణ నోట వచ్చిరాకపూర్వమే హైమ "నాకు ప్రేమలో నమ్మకం లేదు. తలమీద ఒక్క వెంట్రుక కూడా లేకుండా జీవించటం ఎంత సులభమో ప్రేమ లేకుండా జీవించటం అంత సులభం!" అన్నది.

హైమవతి ఆ వాక్యం పూర్తి చేసేలోపుగా జోగారావు మూడు చావులు చచ్చి వట్టయినాడు!

"నాకు ప్రేమలో చాలా విశ్వాసం ఉంది!" అన్నాడు సూర్యనారాయణ గంభీరంగా — "నీ అజ్ఞానానికి నేను చాలా విచారిస్తున్నాను!" అని స్ఫురించే గొంతుతో, "ప్రపంచంలో డబ్బుతరవాత ప్రేమకంటె ఉత్కృష్టపదార్థం లేదని నానమ్మకం!"

హైమ ఆశ్చర్యం నటిస్తూ, "ఒకే మనిషి ఒకే క్షణంలో డబ్బులోనూ ప్రేమలోనూ అంతివిశ్వాసం కనబరచటం మనసంప్రదాయం కాదేమో! అమెరికా వాళ్లు—" అని ప్రారంభించింది.

"ధర్మార్థకామమోక్షాలు! అర్థమూ కామమూ! క్రమంకూడా నేను చెప్పినట్టే ఉంది. అందుచేత నాది పూర్తిగా అమెరికాసంప్రదాయం కాదు. అసలే సంప్రదాయమూ అవసరంలేదు, కాస్త ఆలోచిస్తే మనకే తెలుస్తుంది. డబ్బులేకుండా జీవించటం అసంభవం, ప్రేమలేకుండా జీవించటం అసమగ్రం" అన్నాడు సూర్యం.

"ఎందువల్లా?" అన్నది హైమ.

"ప్రేమించేవరకూ మనలో ఏశక్తు లున్నదీ మనకే తెలియదు. మనలో ఉన్న మంచితనంకూడా అప్పుడు కాని పైకి రాదు. కనీసం అనుభవం అదీ. మాఅమ్మ చచ్చిపోయినతరవాత నేను చాలా చెడ్డవాణ్ణి అయిపోయినాను. త్యాగంచేసేశక్తి, నిజంచెప్పే ధైర్యం, ధర్మనిర్ణయంచేసే తెలివీ నాలో ఉన్నై. కాని వాటిని ఎవరిమీద ప్రయోగించను? అసలు వాటిని పైకి తెచ్చేవా రెవరు? అందరితోనూ సత్యహరిశ్చంద్రుడల్లే ఉండటం నా చేతకాదు!"

"ప్రేమ మీకు అంతఆవశ్యకమని తోస్తే ఎవరినో ఒకరిని ప్రేమించలేకపోయినారా? తీరిపోనుగా!" అన్నది హైమ దాదాపు ఎగతాళిగా.

ఒకచెంప జోగారావు విదంతా వింటూ ఉడికిపోతున్నాడు. ఇంత అన్యాయం వాడిఎదట ఎన్నడూ జరగలేదు. తనతో ఎవతెఅయినా అట్లాఅంటే ఆమనిషిని జోగారావు కులటకింద గణించిఉండును. హైమను గురించి సూర్యం ఏమనుకుంటున్నాడో? పైకి మాత్రం అడిగినదానికల్లా ఎంతో ఓర్పుగా ఏదో సమాధానం చెబుతూనే ఉన్నాడు! వీళ్ల సంభాషణ వింటున్న జోగారావుకు కాస్సేపు ఒకరిమీదా, మరికాస్సేపు మరొకరిమీదా కోపం వచ్చేది. సూర్యం పట్టి మూఢుడు — లేకపోతే ఈడు వచ్చిన ఆడపిల్లతో మాట్లాడవలసింది అట్లాగా? ఆఖరుకు వంకాయలనుగురించి కూడా బట్టబయలుగా చర్చించినచోట శృంగారం పుట్టదే! అటువంటప్పుడు ప్రేమనుగురించీ మనస్తత్వంగురించీ బట్టబయలుగా మాట్లాడుకున్న తరవాత ఇంక శృంగారమేమిటి? హైమ అతన్ని అట్లామాట్లాడ నివ్వట మేమిటి? ... మరొక ధోరణిలో సంభాషించటం మొదలే పెట్టాలి

గాని ఆ ఇద్దరూ ఒకరినొకరు ఎంతగానైనా ప్రేమించుకోవచ్చు! ఒకరికోసం ఒకరు హృదయాలు దగ్ధం చేసుకుని ద్రవించుకో వచ్చునే! జోగారావు అసలు దిగులు అట్లా జరగటం లేదని!

హైమవతి అడిగినదానికి సూర్యం సమాధానం చెప్పాడు, "మనం ప్రేమించటమంటూ ఎప్పుడూ ఉండదు. ఆ భ్రమవల్లనే ఇన్ని అర్థంలేని ప్రణయకథలు పుట్టినై. ఒకడు ఒకతెను ప్రేమించటమూ, ఆమె అతణ్ణి తిరిగి ప్రేమించలేకపోవటమూ, అతగాడు గుండె లవిసి చావటమూనూ! ఒక ప్రణయకథ! నిజం ఏమిటంటే, ఒక మనిషి కామించగలడుగాని ప్రేమించలేడు. ప్రేమించటానికి ఇద్దరి ప్రయత్నమూ అవసరం. అందుచేత జీవితంలో జరిగే దేమంటే మనం ఎవరినీ ప్రేమించం; ఎవరో మన ప్రేమ సంపాదిస్తారు. అది నా కింకా జరగలేదు. నా ప్రేమ ఎవతెకూడా సంపాదించలేదు. అందుకనే నేను పెళ్ళాడలేదు. పెళ్ళాడి ప్రేమించట మనేదాన్లో నాకు ఏమాత్రమూ విశ్వాసం లేదు. పెళ్ళాడి కొంతకాలం కాపరం చేసిన తరవాత ఏ ఇద్దరికైనా కొంత పరస్పరాభిమానం కలిగి తీరుతుంది. కాని ఆ అభిమానం ప్రేమకు ప్రత్యామ్నాయంకింద నేను భావించలేను. భావించేవాళ్లుండవచ్చుగాక!"

జోగారావుచెవులకు ఇదంతా కపటంగానూ కృత్రిమంగానూ కనిపించింది; ప్రేమకోసం త్యాగం చెయ్యలేనివాడి కబుర్లు ఇట్లాగే ఉంట వనిపించింది.

"పోనీ మీ రెవరి ప్రేమ అయినా సంపాదించారా?" అన్నది హైమవతి కొంటెగా.

"లేదు. నా ప్రేమ సంపాదించటానికి సంసిద్ధురాలు కానిదాని ప్రేమ నే నెందుకు సంపాదించాలీ?" అన్నాడు సూర్యం.

"మీకు నీతిలో విశ్వాసం ఉందా?" అన్నది హైమవతి.

జోగారావుచేతులు రెండూ కణతలకు చేర్చుకుని కూర్చున్నాడు. వాళ్లసంభాషణధోరణి మార్చటానికి వాడుచేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమయినై.

"నాకు నీతిలో చాలా విశ్వాసం ఉంది. పది కోట్లమందియొక్క విశ్వాసాలను కాదనటం నా కేమిటో ద్రోహంగా తోస్తుంది. అయితే జీవితంలో నీతికి మనవాళ్లు అనవసరమైన ప్రాముఖ్యత ఇస్తున్నారని నేను చెప్పగలను! ("నీతలకాయ!" అనుకున్నాడు జోగారావు!) ఏమంటే నీతి అంత ముఖ్యమైనదే అయితే రోజూ దాదాపు ప్రతిమనిషీ ఈ నీతిని అతిక్రమించుతూ వెళ్లగలగటం ఎట్లా సాధ్యమవుతుందీ? అందుకని నేనేం చేస్తానంటే, ప్రబలమైన కారణంలేందీ నీతిని విసర్జించను. నాకది యోగ్యమైన పనిగా తోచింది" అన్నాడు సూర్యనారాయణ.

ఈ విధంగా ఒకవారం గడిచింది. జోగారావు తన మనస్సు తనే తెలుసుకోలేకపోయినాడు. వాళ్లను చూస్తే కోపమూ, తనప్రయత్నం విఫలమైపోతున్నదే అనేదిగులూ, ఇప్పటికైనా వాళ్లను సక్రమమార్గంలో పెట్టేఅవకాశం ఉండేమోఅనే ఆశా వాణ్ణి ఒక్కసారి గాబాధించ సాగినై. ఆఖరుకు ఆశ గెలిచింది. సూర్యనారాయణ ఇంటికి పొయ్యేటప్పుడు జోగారావు అతన్ని కొంతదూరం సాగనంపి దారిలో, "చూడు, సూర్యనారాయణా! నీతో ఒక్కటి చెప్పదా మనుకుంటున్నాను. నీకు హైమను చూస్తే ఏ అభిప్రాయం కలిగిందో నాకైతే తెలియదు. అది నిజంగా చాలా తెలివిగలదీ, బుద్ధిమంతురాలూనూ! ఎందుకో అది నీతో సరిగా మాట్లాడటంలేదు. దాని అసలుప్రవృత్తి దాస్తున్నది"- అని ప్రారంభించాడు.

సూర్యం కొంచెం ఆశ్చర్యం కనబరుస్తూ, "ఆవిడ తెలివిగలదికాదనికాని,బుద్ధిమంతురాలు కాదని కాని నా కెన్నడూ అనిపించలేదు. నే నాసంగతి మొదటినుంచీ స్పష్టంగా గ్రహించాను. మీ రనటంవల్ల నా కేదో అనుమానం కలుగుతున్నది!" అన్నాడు.

జోగారావు ఒకక్షణంపాటు నిర్ఘాంతపోయి నాడు, కాని తెప్పరిల్లుకుని, "మీ కిద్దరికీ వివాహం జరిగితే నామట్టుకు నేను చాలా సంతోషిస్తాను," అన్నాడు.

"నే నావిణ్ణి పెళ్లిచేసుకునేపక్షంలో నా సంతోషంకోసంకాని ఆవిడ సంతోషంకోసంగాని చేసు

కుంటానుకాని మాడోవాళ్లకోసం చేసుకోను!" అన్నాడు సూర్యం కటువుగా.

"నీవే అతన్ని పాడుచేశావు!" అన్నాడు జోగారావు హైమతో, ఇంటికి వస్తూనే.

"ఏం జరిగింది?" అన్నది హైమవతి.

"నీ వతన్ని ఏమాత్రమూ ఆకర్షించలేకపోయినావు. ఆతన్ని కదిలించి చూశాను!" అన్నాడు జోగారావు నిస్పృహతో.

"హైమ నవ్వి, అతను ప్రతిరోజూ ఇక్కడికి రావటం నీకోసమనుకున్నావా, బాబాయి?" అన్నది.

జోగారావు నిర్ఘాంతపోయినాడు.

మర్నాడు సూర్యనారాయణ వచ్చినప్పుడు యథాప్రకారమే చర్చ నిన్నవిడిచివేచోట అందుకున్నారు. అయితే ఇవాళ మాట్లాడటంచాల్లీ హైమ పుచ్చుకున్నది.

"నాకు నీతిలో విశ్వాసం లేదు!" అన్నది హైమవతి. "కాని నీతిగా ఉండక అవదానికి సాగదు. అయినప్పటికీ నేను ప్రేమకోసం అవినీతిగా ప్రవర్తించగలుగుతానని ధైర్యం ఉంది. నేను ఏమనిషికోసమైతే నీతిని విసర్జించగలనో ఆమనిషిని ప్రేమించానను కుంటాను. లేదా ఏమనిషి నన్ను నీతిగా ఉంచగలిగితే ఆమనిషిని ప్రేమించానను కుంటాను!"

"నీ మోహం!" అనుకున్నాడు జోగారావు. "ఒక్కమాటకూడా సందర్భమూ అర్థమూ లేదు... 'ప్రేమ'అని నోటివెంట అనేస్తే ఇక అందులో శ్రుంగార మేముంది? అదీ మాహూలుమాటే!" పైకిమాత్రం జోగారావు ఒక ముక్కుముక్కి ఊరుకున్నాడు.

సూర్యనారాయణ సిగరెట్టు నోట్లోపెట్టుకుని నిప్పుపెట్టెకోసం జేబులో తడువుకో సాగాడు. హైమవతి లేచివెళ్లి నిప్పుపెట్టెతెచ్చి తనే పుల్లవెలిగించి సిగరెట్టుకు అందించింది.

సూర్యనారాయణ వెళ్లిపోయిన తరవాత జోగారావు హైమతో గట్టిగా మాట్లాడాడు. "నీ వతన్ని పెళ్లి చేసుకోవటానికి ఒప్పుకోకపోయినప్పటికీ అతనితో 'నాకు నీతిలో నమ్మకంలేదూ, నేను ప్రేమకోసం నీతినీ వదిలిపెట్టేస్తానూ!' అనటం ఏమీ బాగాలేదు, హైమా! అది—అది ఆడ అందం కాదు. తరవాత, అతనికి సిగరెట్లు వెలిగించిపెట్టటంకూడా మర్యాద కాదు. మీ పెళ్లి స్థిరమైతే అటువంటివి ఏంచేసినా తప్పులేదు!"

హైమ ఆశ్చర్యంతో, "నే నాయన్ని పెళ్లి చేసుకోవటానికి ఈ క్షణాన సిద్ధంగా ఉన్నాను. ఏమిటి నీవనేది?" అన్నది.

"అయితే నిన్ను పెళ్లి చేసుకోవటానికి ఆయన సిద్ధంగాలేడు. సరేనా?...అయినా నీవతన్ని ఎప్పటి నుంచి ఆమోదించావో తెలుసుకోవచ్చునా?"

"మొదటినుంచీ మే మిద్దరమూ ఒకరి నొకరు ఆకర్షించుకోవటానికి ప్రయత్నం చేస్తున్న సంగతి నీవు గమనించటం లేదా?"

"ఆకర్షించటమా? పోట్లాటా?"

"పోట్లా టేమిటి? మే మిద్దరం ఒకళ్లతత్వం ఒకరు అర్థం చేసుకుంటున్నాం. అదే సరయినపద్ధతి. అట్లా కాకుండా ఆయన నాతో "నిన్ను ప్రేమించాను నన్ను పెళ్లాడతావా?' అంటే ఆయనగురించి నా కేం తెలుస్తుందీ?"

జోగారావు మొహం చిట్లించి ఊరుకున్నాడు. మర్నాడు సూర్యం వచ్చేసమయానికి హైమ ఏదో పనిమీద ఉన్న అవకాశం చూసుకుని జోగారావు అతనితో, "మా హైమ నిన్నే విధంగానైనా ఆకర్షించిందాఅని అడుగుదా మనుకుంటున్నాను!" అన్నాడు.

"ఆకర్షించిం దనే చెప్పాలి!" అన్నాడు సూర్యం. "మొదటిసంగతి, ఆవిడ నాతో అబద్ధం ఆడ దని తేల్చుకున్నాను. ఆతరవాత ఆవిడ ప్రేమ నేను సంపాదించగలిగితే ఆతరవాత నన్ను మోసం చెయ్యదని నాకు రూఢి అయిపోయింది. పెళ్లిచేసుకోబోయే ఆడదాన్నిగురించి మొగవాడికి కావలసింది ఈ రెండు విషయాలే. ... ..."

"జోహర్ ఆడదాన్నిగురించి మొగవాడి కామాత్రం ధరవసా ఉండదగినదే. భార్యవిషయంలో అమాయ పడవలసిరావటంకంటె పాపిష్టిసంగతి మరోకటి ఉండబోదు!"

"నిన్ను చూసి హైమ వరించినట్టు కనిపిస్తుంది. దానికి కారణం ఏమిటై ఉండవచ్చును?" అన్నాడు జోగారావు.

సూర్యం కొంచెం ఆలోచించి, "నా డబ్బు ఉండవచ్చును. నాలో ఇతరలక్షణాలు కొన్ని లేకపోలేదు. కాని అవేవీ డబ్బుతో సమానం కావు. ఒకవిధంగా నేను ప్రేమ సంపాదించటానికి అర్హత పొందానని చెప్పవచ్చును. డబ్బు లేనివాడికి మరొకరి ప్రేమ సంపాదించే అర్హతలేదు. వెనక మా బంధుకోటిలో ఒక పెద్ద మనిషి వృత్తిలో ప్రవేశించ బోతున్న ఒక భోగం మనిషితో పరిచయం చేసుకుని ఆమె ప్రేమ సంపాదించాడు. కాని దరిద్రుడు కావటంవల్ల ఆ మనిషికి తిండి అయినా పెట్టలేకపోయినాడు. తరవాత ఆ మనిషి తనవృత్తి సాగించింది, కాని అందులో ఎక్కిరాలేక పోయింది. అటువంటిపని చెయ్యటం ద్రోహమంటాను."

జోగారావు నిర్విణ్ణుడై, "నీడబ్బుకోసం నిన్నెవతెఅయినా ఆపేక్షగాచూస్తే నీకంగీకారమేనా?" అని అడిగాడు.

"నా మొహం చూసి ప్రేమిస్తే అంగీకారం కాదా? నా తెలివితేటలు చూసి ప్రేమిస్తే అవమానించనా? అట్లాగే నాడబ్బూనూ! నా మొహానికీ, తెలివితేటలకూ నా వ్యక్తిత్వంతో ఎంతసంబంధం ఉందో నాడబ్బుకూ అంతసంబంధం ఉంది. అది లేకపోతే నే నింకోవిధంగా మాట్లాడతాను, చూపులకే ఇంకో విధంగా కనిపిస్తాను" అని సూర్యం సమాధానం చెప్పాడు.

"నిన్ను కదలించటం నాదే బుద్ధితక్కువ!" అనుకున్నాడు జోగారావు. అసలు వాడి మనస్సు విరిగిపోయింది. హైమవతీ సూర్యనారాయణా, ఇద్దరూ చేరి తనను మూర్ఖుణ్ణి చెయ్యటానికి ప్రయత్నిస్తున్నారనే అనుమానం వాడికి కలుగసాగింది. ఆ ఇద్దరికీ ఉన్న సంబంధం ఏమిటో ఆ రహస్యంమాత్రం జోగారావు కర్థం కాలేదు. అది ప్రణయం కాదనిమట్టుకు రూఢి చేసుకున్నాడు. అదే ప్రణయమైతే తనకో వాళ్లకో మతి లేదనుకోవాలి!

సూర్యనారాయణకు అప్పు లేమాత్రమైనా ఉండి ఉండాలి. ఆస్తి ఉన్నవాడికే అప్పులు. ఈ ఒత్తిడి జాస్తి కావటంవల్ల ఆ వ్యవహారాలు పరిష్కరించుకొని రావటానికి సూర్యనారాయణ వాళ్ల ఊరు వెళ్లాడు.

అతను వెళ్లిన క్షణంనుంచీ హైమవతి పూర్తిగా మారిపోయింది. గుబులుగా, పరధ్యానంగా ఉండ సాగింది. పలకరిస్తే సరిగాసమాధానంచెప్పకపొయ్యేది. జోగారావు కిదంతా అర్థం కాలేదు. మొదట హైమవతి తనను ఈ విధంగా మోసపుచ్చుచున్న దనుకున్నాడు. కాని రోజులు గడిచినకొద్దీ హైమ యథార్థంగానే బాధపడుతున్నట్టు రూఢి అయింది. ఒకసారి ఆమె కళ్లల్లో తడికూడా చూశాడు జోగారావు.

కారణం అడిగితే హైమ చెప్పేసింది.

"తనకెంత అప్పున్నదీ సూర్యం తెలుసుకోలేదు. అతని కేమీ మిగలదట" అతనికి వాళ్లవాళ్లు రాసిన ఉత్తరం చూశాను. నాగతి ఏంకావలసిఉంది?"

"నీగతి కేం?"

"సూర్యం నన్ను పెళ్లిచేసుకోకపోతే!... ఆయనను మనింటి కెందుకు రానిచ్చావు, బావాయి? ఇంకో మనిషి నన్ను అట్లా ఆకర్షించే అవకాశం నా జన్మలో ఏముంది?"

"నీకంత మమకారం ఉంటే, డబ్బు లేకపోతే పోయింది, అతన్ని పెళ్లాడరాదూ? అతనన్నట్టు నీవ తని డబ్బుచూసే మోహించావా ఏమిటి?" అన్నాడు జోగారావు.

"నీవర్థం చేసుకోవు. ఆడబ్బు వెనక లేకపోతే సూర్యం అందరివంటి మొగుడే అవుతాడు. నన్నాకర్షించింది అందరివంటి మొగవాడుకాదు!"

"నా తలకాయల్లే ఉంది!" అన్నాడు జోగారావు.

కొద్దిరోజులకుసూర్యం దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. అనుకున్నంతా అయింది; అతని ఆస్తి యావత్తూ పోయింది.

"కాని నా అదృష్టం ఇంకా నన్ను విడవలేదు" అని రాశాడు సూర్యం. "నాకొక సంబంధం వచ్చింది. ఆ పిల్లవెంట ఇరవైఅయిదువేల రూపాయల ఆస్తి వస్తున్నది. నిన్ను ప్రేమించే అధికారం నేను సొంతంగా పోగొట్టుకోలేదు!"

"నాకా చివరముక్క అర్థం కాలేదు," అన్నాడు జోగారావు అనుమానంతో.

ఇంత కాలానికి వికసించిన మొహంతో హైమ "నాకర్థ మయింది!" అన్నది.



ముఖలావణ్యము

ఏ స్త్రీ చర్మమైతే ఆరోగ్యముగాను, శుభ్రముగాను, పువ్వుదళ మృదుత్వము పోలియున్నదో, ఆమెను, ఒకరహస్యమైన మనోహరత్వము ఆవరించి యుండును. ఏసొమ్ములుగాని, పట్టువస్త్రములుగాని శ్రేష్టమైన ఒళ్లుగగుర్పాటు నొనర్చు మృదువైన చర్మముతో సమానము కానేరదు. గాలి, ఎండలచే దెబ్బతిన్న చర్మము ఆకర్షముగ నుండనేరదు, ఎందుకన చెర్మముయొక్క రంధ్రములు బొత్తిగా శుభ్రపరచకపోవుటచేత.

చర్మము వాడకుండ, లేతగానుంచుకొనుటకు ప్రతి ఒక స్త్రీ జాగ్రత్తపడ నవసరము. **పాండ్సు క్రీమ్** సీసాను కొనుడు. మీవేళ్ల చివరలతో క్రీమును, మీచర్మముమీద రాయుడు. మృదువైనసుడ్డతో నులుపుడు. మరియు కొద్దిగా వేరేక్రీమును లేలికగాపూసి, రాత్రంతయు ఈ నాణ్యమైనపొరను ఉంచుడు. ఈ మోస్తరగా ఒక 15 రోజులు రాత్రులయందు వాడుడు. అప్పుడు మీ చర్మము మృదువుగా లేతగా ఉన్నట్లు మీకు తెలియగలదు.

పగలు, గాలి, దుమ్ములనుండి రక్షించుటలో శ్రేష్టమైనది
పాండ్సు వ్యానిషింగ్ క్రీమ్.



పాండ్సు క్రీములు అన్నిగొప్ప ప్టోర్సులలో దొరుకును. లేక **పాండ్సు**, పి. ఒ. బాక్సు 144, బొంబాయికి వ్రాయుడు

పాండ్స్ క్రీమ్

నా యూహ

శ్రీ కాత రాధాకృష్ణమూర్తి

నీవు కలవనో లేవనో నిజ మెఱుంగ
నేర కేమేమొ పలుకుచున్నారు జనులు
భూరి భూత భూయిష్ఠ విశాభూవలయము
నెవ్వఁడో మహాత్ముఁడు సృజియింపవలదె ?

ఏ నెరింగితి నిద్ది యేడేడులపుడె
కాని, వేదవేదాంగ విజ్ఞానచతురు
లైనవారును "పరమాత్ముఁ డన నెవండు ?
చాలు నిది వట్టిభ్రమ" యన్న చదువు నేర్పె
దరు; మదీయహృత్సరసిజాంతరమె కాదు
జంగమ స్థావరాత్మక జగతి నెల్ల
నిండి భాసిల్లు నీమహనీయమూర్తి
తెలిసియు, సహించుటెల్లు నాస్తికు లొనర్చు
ఘోరనిస్సార వాగ్ధోరణీరవంబు.

ఉంటి వనువారు, లేవనుచుండువారు
కూడ నీ సృష్టియే; సత్య మెంచిచూడ
శిష్టులను దుష్టులను నొకే దృష్టినేలు
నీదు కృపకు నాస్తికు లనీతిపరులె ?
తమకుఁ దోచిన ధర్మపథమ్ము నమ్మి
కార్యసాధన మొనరించునార్యవరుల
కేటిమతి ? యేటిజాతి ? స్వామీ ! సమస్త
ధర్మరూపుఁడ వీ వను మర్మ మెరిగి
నీతిదప్పని గతియె సనాతనమ్ము
నీవు కలవని చెప్పెద నేను, కాని,
సద్గుణమ్ములు గాని, సౌజన్యకలన
గాని లేని నాహృదయానఁ గలఁగిపొంగు
దుఃఖభారమ్ముతో, దరి తోఁపరాని
వివిధసంతాప ఘూర్ణదర్ణవమునందు
యాత్ర సేయుచు మిగుల నాయాసపడుచు
నీకృపాధ్రువజ్యోతి కాన్పించు ననుచు
నూర్పులూర్చుచు, ఓపికయున్నయపుడు
బయటికే యేడ్తు ! ప్రభూ ! వినఁబడునె నీకు ?

శ్రీమదానంద గజపతీంద్రులు -
వింత చరిత్రలు

శ్రీ వాసా సూర్యనారాయణశాస్త్రి

విశాఖపట్టణ మండలమున పూసపాటి సుక్షత్రియులు విజయనగరము రాజధానిగా నాంధ్రభూభాగము నేలుచుండిరి. వాల్మీకి రామాయణమందున్నూ, కాళిదాసు రఘువంశమునందున్నూ; వర్ణించిన సూర్యవంశపు రాజుల గుణసంపద వీరి నవిచ్ఛిన్నముగా వరించియేయున్నది. అందు విజయరామగజపతిమహారాజావారు ఉత్తమరాజనీతిధురంధరులై తమరాజధానిలో సర్వవిద్యా సర్వకళాబీజములను నాటి దివంగతులైరి. వారి సుపుత్రులు ఆనంద గజపతీంద్రులు. ఆంధ్రవిద్యార్థులు విద్యాభిక్షకై పరదేశముల కేగ నవసరము లేకుండజేసి యాంధ్రమాతను విద్యాపీఠమాతగా నొనరించిన దేశాభిమాని. మహాపండితులవిద్యావివాదములలో తాము స్వయముగా మధ్యస్థులయి తీర్మానముల నిచ్చిన విద్వచ్ఛిరోమణి. వా రాదరింపని కళయే లేదు; పోషింపని విద్యయే లేదు. వా రాదరించిన విద్వద్వతంసులు నేటికిన్ని దివంగత విశ్రాంతకీర్తులయి ఆంధ్రదేశకీర్తికి వన్నెపెట్టుచున్నారు. ఆనందగజపతీంద్రుల హృదయము నవనీతము. పలుకు సుధాధార. చిఱునవ్వు వెన్నెలపోక. వారిచరిత్రలు సాలభంజికలు చెప్పు విక్రమార్కునికథలను, భోజమహారాజుచరిత్రలను స్మరింపచేయును. ఇట్టి రాజేంద్రు డస్తమించి సుమారు నలువదిసంవత్సరములకాలము పైగా గడచినది. వారి నెఱింగినవారు నేడును కొందరుగలరు. వారి ముఖమువలన వినిన కొన్ని కథాంశముల నిందు పొందుపరచుచున్నాను.

ప్రథమకథ

ఒకదినమున విశాఖపట్టణ మండలాధికారి యగు కలక్టరుగారు పులివేటచేయ తన వేడుకను వెలువరించెను. ఆనందగజపతీంద్రులు కొలదిదినములలో తమరాజధానిలో నున్న వెదురువాడ అడవిలో రొప్పడు వేటకు తగిన యేర్పాటు లన్నిటిని చేయించిరి. ఆ యరణ్యమధ్యమునే యొక మనోహరమైన తావున డేరాలు వేయించి యందులో దొరగారికి తగిన విందు ఏర్పాట్లుకూడా చేయించిరి. వా రిరువురున్నూ ఏనుగులమీద నెక్కి యడవిలో నేగుచుండ నొక కళింగోర రొప్పడుపడి వారి కెదురుగా వచ్చుచుండెను. దొరగారు గుఱిచూచి తుపాకికాల్చిరి. కాని అది బాజోడు అయినది. ఆ పులి పట్టరాని వడితో పొగను అనుసరించి దొరగారిమీదికి లంఘించుచుండ నానందగజపతీంద్రులు రెప్పపాటులోన తుపాకికాల్చి యాజంతువును ఒక దెబ్బతో నేలం గూలనేసిరి. దొరవారికి ప్రమాదము తప్పినది. వేటకాం డ్రందరు

మహారాజావారి హస్తలాఘవమునకు లక్ష్యశుద్ధికి మిక్కిలి సంతసించి సంతోషధ్వనులను చేలరేగించిరి. దొరగారు మాత్రము సంతసించుటకు బదులుగా కోపమును దెచ్చుకొని యేనుగుడిగ్గి కోపముతో తనసొంత గుఱ్ఱము నెక్కి విశాఖపట్నమునకు పయనము సాగించిరి. రాజేంద్రుడున్నూ, విందుపదార్థములన్నిటిని సచట వినియోగించి భోజనము చేయకయే యేనుగు నెక్కి తమ రాజధానికి పయనమయిరి. అచటికి ౧౨ మైళ్లదూరములో విజయనగర మున్నది. మట్టమధ్యాహ్నము వేళ - ఈ వార్త సమీప గ్రామములో వెంటనే వ్యాపించినది. రాజధానికేగుమార్గమధ్య నొక గ్రామము గలదు. అందు ఆనంద గజపతీంద్రుల పితృపాదులగు శ్రీవిజయరామ గజపతి మహారాజావారిసన్నిధియందు సన్మానులు నుద్యోగులు పార్శ్వవర్తులున్నూ, అయిమెలంగి ప్రస్తుత ముపకార వేతనములతో నాయుశ్శేషమును సుఖముగా గడుపు క్షత్రియ వృద్ధులు పలువురు నివసించి యున్నారు. వారు సుప్రసిద్ధ రాజవంశసంభూతులు, రాజమర్యాదల నెఱింగినవారు, రాజనీతివిద్యయం దారితేరినవారు, వృద్ధులు. రాజభక్తిధురంధరులు. అట్టివా రందరు తెల్లని దుస్తులు ధరించి తెల్లని వలువలతో నడుము బిగించి, తెల్లనివిభూతిరేఖలతోను, సిందూర తిలకంబులతోను మోములు తళతళ మెరయుచుండ ఫలపుష్పోపహారపూర్ణంబులగు పాత్రలను కేల నమర్చి యా రాజచంద్రునిమార్గమున కడ్డుగా ముదిమిచే వినయముచే కొలదిగా వంగిననడుములతో పంక్తితీర్చి నిలువబడియుండిరి. గజపతీంద్రులు దూరముననే చూచి వాహనముదిగి సమీపించి వారిచ్చిన యుపహారములను గైకొని కుశలప్రశ్నలను యథోచితముగా జేసిరి. పిదప నాకురువృద్ధులు సవినయముగా చేతులు జోడించి మహారాజకుమారచంద్రా! సంస్థానము మా పూర్వుల కొసంగిన వసతులతోను, ఏలినవా రొసంగుచున్న యుపకారవేతనములతోనున్నూ, సుఖముగా నాయుశ్శేషమును గడుపుచున్న వారము. మా యీ నస్థ ధాతువులు సంస్థానము పోషణచే పుట్టిపెరిగినవి. ఇందు పరపోషణచే పెరిగినది యొకరక్తాణువైనా లేదు. ఇది యంతా మహారాజావారి స్వకుటుంబము. మధ్యం దినాతపములో మహారాజావారు రాజధాని కేగుటకు కష్టపడుచున్నాము. నాడు శ్రీరామచంద్రులు దండకావనములో శబరిపైజూపిన కరుణను, శ్రీకృష్ణభగవానులు విదురునిపై చూపిన ప్రీతిని మాపై జూపుటకు తరుణ మని సాహసించి ప్రార్థించుచున్నాము అని వృద్ధరాజులు చేతులు జోడించి సవినయముగా వేడిరి. ఆ వృద్ధుల మధ్యను నొకబ్రాహ్మణప్రవరుడు పుష్పవనవాటికలో తులసిమొక్కవలె చేతులు జోడించి సవినయముగా నిలిచి యుండెను. రాజేంద్రుడు ఆ బ్రాహ్మణునకు నమస్కరించి వాని వృత్తాంతమును ప్రశ్నింపగా తమకు నిత్యము పురాణకాలక్షేపమును చేయించు పండితులని వృద్ధులు నివేదించిరి. శాస్త్రిగారూ! మీకేల మా కాతిథ్యము నొసంగు శ్రమ! అని రాజేంద్రుడు చిఱునగవుతో ననిరి. ఆ పండితుడు ఆయాశయమును గ్రహించి మహాప్రభో! శ్రమగాదు మహాప్రసాదము మహాభాగ్యము అని విన్నవించెను. మావిందుకుగా నూతనశ్రమకు మీరు లోను కాకూడదు! ఇప్పటికి సిద్ధమైన

పదార్థముతోనే మాకు విందొసంగుడు, బ్రాహ్మణప్రసాదము సర్వదా గ్రాహ్యమని చెప్పినంతనే శాస్త్రిగారు సంతోషము, సంభ్రమము, భయము ముప్పిరి గొన నింటికేగి యిల్లాలును బిలచి ఓసీ! ఇపుడే ఆనంద గజపతీంద్రులు మన యింటికి భోజనమునకు దయచేయ ననుగ్రహించినారు. వెంటనే సర్వము సిద్ధపఱచుము అని గడబిడతో, గద్గదస్వరముతో, గాభరాతో చెప్పెను. ఆయిల్లాలు చిఱునవ్వుతో తోడ్కొనిరండు, అరగంటలో నంతా సిద్ధంచేస్తాను- అనిచెప్పి పొయ్యిలో నారుచున్న యగ్గిని రవలబెట్టి నూతనపదార్థములను కొన్నిటిని తయారుచేసినది. తన నేర్పు మిగులునట్లు రెండు నంజుడులనుగూడ తయారుచేసి యికతోడ్కొని రండని భర్తకు నివేదించినది. శాస్త్రిగారు లఘువుగా దేవతార్చన పూర్తిచేసి యాహ్వానింపనేగిరి. ఇంతలో రాజవృద్ధులు పాలు, పెరుగు, నెయ్యి, మీగడ మున్నగు పదార్థములతో శాస్త్రిగారి గృహమును నింపివేసిరి. రాజేంద్రులు రచ్చసావిడిపై కొలదికాలము విశ్రమించి యచటనే స్నానమాచరించి పట్టుపీతాంబరములను ధరించి శాస్త్రిగారు ముందు నడువ రాజవృద్ధులు వెంటరా కాలినడకతో శాస్త్రిగారి తాటాకుల భోజనశాలను బ్రవేశించిరి. ఆయిల్లాలు స్వాగతముసీయ పీఠమునగూర్చుండి యచటకేతెంచిన కొలదిమంది వృద్ధులతో నిష్టగోష్ఠి చేయుచు సావకాశముగా విందారగించిరి. తొల్లి కుచేలుడు శ్రీకృష్ణభగవానునియింటికేగెనని విందుము. నేడు శ్రీకృష్ణభగవానుడే కుచేలునింటికి విచ్చేసెను. అని యాయిల్లాలు పలుకగా రాజేంద్రుఁడు మీవంటకముకంటె మీ పలుకులు మరీ రుచ్యముగా నున్నవని నుడివిరి. రాణివాసము లేకుండ నాయిల్లాలు స్వయముగా విందుపెట్టినందులకు మహారాజావారికిన్ని, అట్టి మహారాజచంద్రుడు తన గుడిసెలోనికి విచ్చేసి సామాన్య గృహస్థువలె నాదరమున తమ యాతిథ్యమును గైకొన్నందులకు నాయిల్లాలుకున్నూ, కలిగిన సంతోష సరస్వతీ ప్రవాహము లోలోన పొంగి పొరలినది. పిదప మహారాజా తాంబూలచందనాదులు గైకొని వారి యనుమతిని వడసి రచ్చసావిడి కేగుచు త్రోవకు సమీపముగా నున్న వృద్ధరాజుల గృహముల ముంగిళ్ల నిలచుచు, వారి యోగక్షేమముల నారయుచు బసకువిచ్చేసి కొలదికాలము విశ్రాంతి గైకొనిరి. పిదప తమ్ము చూడ తండోపతండములుగా నేతెంచిన ప్రజాసమూహమును చిఱునగవుతోను; శిరఃకంపముతోను, పలుకులతోను, యథార్హముగా సంభావించిరి. ప్రజలసంతోషవారాశి పొంగి పొరలినది. అందరు వందులే, అందరు మాగధులే, అందరు కవిచంద్రులే అయి రాజేంద్రుని వినయ సౌశీల్యాదులను వేనోళ్ల పొగడ జొచ్చిరి. ఇంతలో సాయంకాలము నాలుగుగంటలవేళ కావచ్చినది. రాజధాని నుండి జోడుగుఱ్ఱాలబగ్గీ వచ్చి రచ్చసావిడి కెదురుగా నిలచినది. రాజేంద్రుడు సవినయముగా సందరి యనుమతిని గైకొని బగ్గీ నెక్కుచు శాస్త్రిగారిని తమతోనే రాజధానికి రండని కోరిరి. శాస్త్రిగారు జంకుగొంకులతో మహారాజావారి ప్రక్కను బగ్గీ నధిరోహించిరి. ఆక్షణముననే శాస్త్రిగారికి రాజయోగప్రారంభ మయినది. ఈ వార్తయంతయు బగ్గీకంటె ముందుగానే రాజ

ధానిలోనికి పరుగులిడినది. పౌరులు రథ్యలపై పంక్తులుతీరి నిలిచియుండిరి. వారు ఆనంద బాష్పములతో నిచ్చు నర్ఘ్యపాద్యములను ఆనందగజపతీంద్రులు గైకొనుచు నగరి ప్రవేశించిరి. శాస్త్రిగారికి రెండుదినములు భరద్వాజువిందుల నగరిలో నారగింపజేసి వెలగల సువర్ణాభరణమును తమ యిల్లాలికి నావందనములతో నర్పింపుడు అని యొసంగిరి. మంచి చీరెచాపునుకూడా ఆబ్రాహ్మణ దంపతుల కొసంగిరి మీ పుత్రులను మా యాంగ్లకళాశాలలో నిష్ట మున్నంతవరకు నుచితభోజనాదివసతులను గైకొనుచు చదివింపవచ్చును. తమకు మాసమునకు ముప్పది రూప్యములు సంస్థానమునుండి యావజ్జీవము ముట్టుచుండును. వృద్ధరాజులకు నత్కాలక్షేపము చేయుచు నాగ్రామమునందే సుఖముగా నివసింపుడని నుడివి వాహనముతో శాస్త్రిగారిని స్వగ్రామమునకు వీడ్కొల్పిరి. రాజులలో నీసు, రాణివాసము, మెండు. వాటిని పరిహరించుటకే వారందరికి నాశ్రితులగు బ్రాహ్మణుని యింట కోరి యాతిథ్యమున కేగిరి. ఎంతటి దూరదృష్టి !

ద్వితీయకథ

ఒకనాడు సాయంకాలము ఆనందగజపతీంద్రులు జోడుగుర్రాలబగ్గీపై నగరము బయటికి గాలిపికారు వేంచేసిరి. మేఘాడంబరము లేకయే యాకాశమునుండి జలజల వానచినుకులు రాలమొదలిడెను. ఏకచ్ఛత్రాధిపతికి నా సమయమున సన్నిధిని ఛత్రము లేకుండెను. అంతలో నొకబ్రాహ్మణుడు గుబ్బగొడుగును ధరించి విజయనగరమున కేగుచు రోడ్డుప్రక్కన నిలువబడి గజపతీంద్రులను సందర్శించుచు తనవలె నగపాలు ముసలిది యగు తన గొడుగును మహారాజా వారి కందింపసాహసించెను. చిలునగవుతో నాగొడుగు నందుకొని యా బ్రాహ్మణుని కూడా తమ బగ్గీమీదకు రండని బలాత్కరించి తమ చెంతను గూర్చుండబెట్టుకొని యిరువురకు వర్షబాధ లేకుండ గజపతీంద్రులే గొడుగుపట్టిరి. ఆదృశ్యమును పౌరులు కడువింతగా జూచిరి. నగరి ప్రవేశించిన పిదప గజపతీంద్రులు బ్రాహ్మణుని గారవించి మీకేమి కావలయునని ప్రశ్నింపగా తన కుద్యోగము కావలయునని వేడుకొనెను. వెంటనే దివాంజీగారికి నీబ్రాహ్మణున కనువగు నుద్యోగము నీయవలయునని ఫర్మానా వ్రాసియంపిరి. దివాన్‌గారు పరిశీలించి ఫారెస్టులో నొక యుద్యోగమును వెంటనే యిచ్చిరి. బ్రాహ్మణునకు వ్రాతకోతలు పూజ్యము. లెక్కలు సున్న. కూతమాత్రము ఘనము. నడికాలపు సిరికి మురిసిపోతూ గార్డులపై నధికారమును చలాయించుచుండెను. ఈ యయ్యనత్తువును దెలిసికొని గార్డులు మోసము చేయ మొదలుపెట్టిరి. సర్వాధికారి లెక్కలను తనిఖీచేయునప్పటికి సొమ్ములో కొంతమోసము గానవచ్చెను. గార్డులు తాము చేసిన ధనాపహరణము నంతా బ్రాహ్మణుని తలపై రుద్దివేసిరి. మహారాజా వారు ఆ సమయమున కాశీకి విచ్చేసియుండిరి. అధికారి యీ బ్రాహ్మణునిపై కేసుపెట్టగా నాలుగు మాసములు శిక్ష అయినది. చేయునది లేక బ్రాహ్మణుడు శిక్ష ననుభవించుచుండెను. ఇరువదిదినములు సుమారు గడచినవి. ఇంతలో మహారాజా వారు రాజధానికి విజయంచేసిరి. వెంటనే వ్యవహారములను పరిశీలించుటలో బ్రాహ్మణశిక్షావిషయము

కంటబడెను. మహారాజు మిక్కిలి కటకటబడి ఆ బ్రాహ్మణునకు విడుదల యయినగాని తాము అన్నపానములను తీసికొనమని పట్టుపట్టిరి. బ్రాహ్మణుడు అపీలు చేయ లేదు.

పద్ధతికి నత్యంత విరుద్ధముగా నచటి యుద్యోగులు శిక్షను రద్దుచేయుటకు వెనుకాడిరి. మహారాజావారే తమ యనన్యసాధారణశక్తిని వినియోగించి శిక్షను వెంటనే గంటలమీదరద్దుచేయించి, విడుదలచేయించి, బ్రాహ్మణుని కోటకు రావించి క్షురకర్మ ప్రాయశ్చిత్తాదులను చేయించి బ్రాహ్మణుడు భుజించినపిదప తాము అన్నపానీయములను గైకొనిరి. ఉద్యోగవాంఛ ఇంకా తీరలేదని తలంచి తమ చెంతనే ధనముతో సంబంధము గాని మిక్కిలి పూచీగాని లేని యొకయుద్యోగము నిచ్చి వాని కుటుంబమును యావజ్జీవము పోషించిరి తమకు క్షణకాలము ఛత్రదానముచేసిన బ్రాహ్మణుని పట్ల నెంతటి దయాదాక్షిణ్యములను, సహృదయతను, జూపిరో సంభావింపుడు. తమ కానాడు గొడుగు నిచ్చుటచేతనే కదా బ్రాహ్మణునకు కారాగారవాసము సంభవించినది యని రాజేంద్రుని విచారము. ఇంతటి సహృదయత మెందేని కలదా?

తృతీయకథ

ఆ సంవత్సరము గంగాపుష్కరము. ఆనందగజపతీంద్రులు తన యుద్యోగులలో పెద్ద యుద్యోగుల నందరిని రాజధానికి రావించి మన మందరము గంగాపుష్కరస్నానమునకై కాశీ కేగవలయు నని మా సంకల్పము- అని సెలవిచ్చిరి. అందరు పరమసంతోషముతో ప్రయాణసన్నద్ధు లయిరి. ఆనాటికి దేశమున రెయిల్ మార్గములు లేవు. భీమునిపట్నము రేవులో ఓడనెక్కి ప్రయాణమును సాగించిరి. మహారాజావారితో ప్రయాణము సేయు ఉద్యోగులకు నిత్యము భరద్వాజ విందులే. అదియొక భూలోకస్వర్గమే. కొలదిదినములలో కాశీని చేరిరి. అందు మహారాజావారికి మంచి చక్కని కోట గలదు. కాశీ సమీపమున కొంత దేశముకూడా కలదు. కాన మహారాజావారికి కాశి స్వదేశమే. గురుడు మేషరాశిని ప్రవేశించెను. పుష్కరకాల మాసన్నమైనది. గజపతీంద్రులు పరివారముతో కేదారఘట్టమున స్నానమునకై విచ్చేసిరి. యథావిధిగా స్నాన సంకల్పాదులు, తర్పణములు, దానధర్మాదులు, జరిగినవి. అందరు మహాసంతోషముతో గంగలో మునుకలు వేయుచుండిరి. వారి యుత్సాహము శాంతించినపిదప నానందగజపతీంద్రులు మొలబంటినీటిలో నిలచి ఉద్యోగుల నందరిని సంబోధించి యిట్లు ఉపన్యసింప సాగిరి. మన హిందువులకు కాశికంటె పరమ పవిత్రమైన క్షేత్రము మరొకటి లేదు. అన్నపూర్ణావిశాలాక్షితోగూడి విశ్వనాథుడు భక్తులకు మోక్షము నొసంగుచున్నాడు. ఇది యానందవనము. మహాశ్మశానము. ఇచట మరణించువారికి యమదర్శనము పునర్జన్మయునూ లేవు. ఇందు విశేషించి గంగమహిమ స్మరించినంతమాత్రముననే గంగ పదితరములవారిని తరింపజేయును. శివుడు శిరంబున ధరించెనని శైవులు, విష్ణుపాదోద్భవి యని వైష్ణవులునూ గంగను సేవింతురు. ఈపుష్కరకాలమున భూలోకములోని సర్వనదులు, సర్వతీర్థములు, సర్వదేవతలునూ

గంగలో సన్నిధానమును చేసియుందురు. ఇట్టి క్షేత్రమున నిట్టి పావనసమయమున గంగామధ్యమున మీ రందరు నేను కోరిన సత్యమును జెప్పవలయు నని గజపతీంద్రులు పల్కిరి. ఉద్యోగు లందరు కొంతవరకు తడ వడిపడి మహాప్రభో! సెలవిండని యొక్క పెట్టన బలికిరి. గజపతీంద్రులు ఉద్యోగు లందరిని బరికించి మీరు మా సంస్థానోద్యోగములలో ప్రవేశించి యెవ్వ రెవ్వరు మాకన్నుమూసి యెంతెంత ధనమును సంపాదించిరో సుమారుగా నా మొత్తములను జెప్పుడని కోరిరి. అందరు ఒకరిముఖము నొకరుచూచుకొనిరి. వెలవెలబారిరి. గాథరాపడి చివరకు మహారాజావారి సహృదయత నెరింగినవారు గావున ధీరచిత్తు లయి ౧౦,౨౦,౩౦,౪౦, వేలు! లక్ష అని యిట్లు తా మపహరించిన రాజద్రవ్య పరిమితిని సుమారుగా జ్ఞప్తికి తెచ్చుకొని నివేదించిరి. అది యంతా విన్న తరువాత రాజేంద్రుడు గంగాజలమును దోసిటితో బైకెత్తి బిగ్గరగా "తత్సత్ బ్రహ్మార్పణమస్తు" - అని ధారపోసి ఉద్యోగులారా! రాజ ద్రవ్యాపహరణ దోషము మీకు లేకుండుగాక! మీరు మీ కుటుంబములతో సుఖముగా జీవింపుడు. ప్రజలను వేధించి ద్రవ్యమును గైకొన మని యీ తావుననే దృఢసంకల్పమును జేయుడు, లెండు, రండు అని చెప్పి తీరముజేరి పరివారముతోగూడ దనకోటలో ప్రవేశించెను. ఈ వృత్తాంతము తమ రాజధానిలో వ్యాపించినతోడనే లంచగొండితనము, రాజద్రోహము పూర్తిగా క్షీణించెను. గంగాస్నానమున కేగక పిలచియుండిన యుద్యోగులుకూడ మహారాజావారు తమరాజధానికి విచ్చేసి గంగాసంతర్పణ చేయుసమయమున తా మపహరించిన ద్రవ్యపరిమాణమును నివేదించిరి. దాని నంతనుగూడ నా రాజేంద్రుడు గంగాజలముతో నీశ్వరార్పణచేసెను. రాజద్రవ్యాపహారణము ఇహపరములయందు సర్వవినాశము నొనరించుమహాపాప మని యెంచి తన పరివారము అట్టి హానికి లోను కాకూడదని తలంచిన యీరాజేంద్రుని హృదయము ఎంత ధర్మపరిపక్వమైనదో, యెంత దూరదృష్టిగలదో ధర్మరహస్యవేదులు పరికింతురుగాక——

ఇట్టి యాంధ్రరాష్ట్రాభివర్ధనుని, కల్యాణ గుణాభిరాముని, సహృదయవతంసుని ఆంధ్రమాత తిరిగి ప్రసాదించుగాక.

స్మృతిమాల

డాక్టరు చక్రవర్తి రామానుజాచార్యులు

మేలిముసుగులోని
వాలుగన్నులతో
దరహాసచంద్రికల్
దనరారుమోముతో
　　ఎప్పుడైన కన్నులకు గనుపించునా ?
　　ప్రేమకై కన్నీరు గురిపించునా ?

తళుకుబెళుకులతో
జిలుగుపుట్టములతో
జిలిబిలిచిఱునవ్వు -
లొప్పారు నడకతో
　　ఎప్పుడైన కట్టెదుట గన్పట్టునా ?
　　గన్పట్టి ప్రేమతో మాటాడునా ?

విరహవారిధిలోన
ప్రణయనావికదోలి
హృదయతాపము బాపి
మదికి హాయిని గూర్ప
　　ఎప్పుడైన నాతోటి విహరించునా ?
　　విహరించి అమృతమ్ముగురియించునా?

పండువెన్నెల్లో
జాబిల్లివెలుగులో
చిన్నెవన్నెలతో
చిలుకపల్కులతో
　　ఎప్పుడైనా నాయెదను గూర్చుండునా?
　　గూర్చుండి ప్రేమతో ముద్దిచ్చునా ?

పిల్లగాడ్పులవోలె
మే నెల్ల పులకించె
హృదయతంత్రుల కొసల
ఆనాటి నీపాట -
　　ఎప్పుడైన మార్మ్రోగి ధ్వనియించునా?
　　తీయగా వీనులకు వినుపించునా ?

మరులచూపులతీరు
వలపుపలుకులతీపు
మొలకనవ్వులసౌరు
హంసనడకలహాసు
　　మరల యీజన్మలో లభియించునా ?
　　ఎప్పుడైన కన్నులకు గనుపించునా ?

వియోగవేదనల
బడలేక యల్లాడు
శీర్ణజీవితుని యీ
హృదయాంతరాళమున
　　ఎప్పుడైన ప్రేమజ్యోతిప్రకాశించునా?
　　చెలరేగి ఎదనెల్ల దహియించునా ?

కాఱుచీకట్లు నీ -
ప్రణయభిక్షను గోరి
పరితపించేటి యీ
యుద్భ్రాంతపథికుని
　　ఎప్పుడైన కౌగిట జిక్కించుతువా ?
　　జిక్కించి ముద్దులా సొక్కింతువా ?

———

మ తా బా

శ్రీమతి అబ్బదొడ్డి సీతమ్మ

ఈనాటికయందలి పాత్రలు

గోపాలం	—	ఒక గృహస్థు
వరసమ్మ	—	గోపాలం భార్య
మాధవరావు	—	గోపాలం కొడుకు
శ్రీదేవి	—	మాధవరావు భార్య
జమునా	—	శ్రీదేవి చెల్లెలు
మీనాక్షి, హేమలతా, శాంత	—	శ్రీదేవి జమునా స్నేహితురాండ్రు
సంజీవరావు	—	శ్రీదేవి తండ్రి
రమణమ్మ	—	సంజీవరావు భార్య
భాగ్ శాస్త్రి, సింహం, అప్పాజీ	—	క్లబ్బు మెంబర్లు మాధవరావు స్నేహితులు

౧-వ రంగం

(ట్రిప్లికేన్‌లో గోపాలరావు యిల్లు—ఏడు ఘంటలసమయం.)

వర — (కాఫీగ్లాసు మాధవరావు కందిస్తూ) కాఫీ.

మా — (పరధ్యానంగా ఈజీ చెయర్‌లో చేరబడి యుంటాడు.)

వర — నిన్నే.

మా — ఆఁ

వర — కాఫీ తీసుకో.

మా — నా కక్కర్లేదు.

వర — ఏమి?

మా — ఏమో.

వర — (కొంచెం ఉద్వేగంతో) నీ పెళ్లాన్ని నీవే పంపేశావా. తీసుకరా వెళ్లి. ఊళ్లోమాటేగా. దీని కింత ఆలోచ నెందుకు!

మా — (కొంచెం చిరాకుతో) నా కాసంగతి చెప్పొద్దు. (లేచి బట్టలు వేసుకుంటూ ఉంటాడు.)

వర — పోనీలే. కాఫీ తాగు నాయనా! చల్లారిపోతోంది. అసలు విషయ మేమిటో చెప్పరాదూ. అంత హఠాత్తుగా పంపేటమేమి. మనసులో మాట చెబితేనేగాని యెట్లా తెలుస్తుంది?

మా — చెప్పక్కర్లేదు.

వర — అంటే నేను వినక్కర్లేదనా?

మా — విని బాధ పడక్కర్లే దని. (బైటకు నడుస్తాడు.)

వర — (వెనకాలే వెళ్తూ) కాఫీ అయినా తాగి వెళ్లమ్మా.

మా — (వీధిగేటు దాటేస్తాడు).

వర — (కాఫీగ్లాసుతోనే, మగనిగదిలోకి పోతూ) ఏమండోయ్!

గో — ఊం! ఏంవి టావాడానిడి సావిట్లో ?

నర — (తొందరగా) ఏంవిటా ? బాగాసేపుంది. ఎంతసేపూ మీరూ,

గో — నువ్వూ.

నర — (చిరాగ్గా) చాలు వినండి.

గో — సరే చెపు.

నర — మీ భగవద్గీతా, మీ పారాయణా, మీ పూస లూ గాని, ఇల్లెల్లావుందో, పెళ్లాం ఎల్లావుందో, పిల్లలెల్లా వున్నారో అన్నచింతేలేదే. రిటై రయినవాళ్లందరికీ యిదో కపిచ్చ. ఏంటంటే మహా—

గో — భక్తుల్లాగ కళ్లు మూసుకొని—

నర — ఉద్యోగం చేసినప్పుడు చేసినపాపాలను లెక్క పెట్టుకుంటున్నట్టు వేళ్లు లెక్కపెట్టడం.

గో — అప్పటి అధికారాన్ని పురస్కరించుకొని ఇప్పుడు నన్ను డిస్టర్బ్ చేస్తున్నందుకు ఫైన్ వేయడం.

నర — ఓ వెయ్యండి. ఎంతైనా భయం లేదు.

గో — అచ్చే ఎంతో లేదు. ఓ కప్పు కాఫీ. (నవ్వు తాడు)

నర — (కొంత గంభీరంగా) ప్రొద్దున్నే నాటకం ఆడుతున్నారా ! (కాఫీ అందిస్తుంది)

గో — లేదు. ప్రేయసీ! సరససంభాషణ గావిం చుచున్నాడను.

నర — (గంభీరమైన గొంతుతో) చాలు. తొంద ముదిరి ఊసరవిల్లి అయిందట. సరదాగా మాట్లాడు తున్నా ననుకుంటున్నారు కాబోలు. మీకు ౫౬ ఏళ్లూ, నాకు ౪౮ ఏళ్లూ తెలుసా.

గో — కాఫీతాగుతూ. ఓహో అల్లాగా! మహారాజు లకు పరాకు హెచ్చరిస్తూ వుండాలట.

నర — అల్లా మీకూ మీవయసు జ్ఞాపకం తెస్తూ ఉండాలి. ఈ మాటల కేంవిగాని మన 'మాధు' సంగతి విన్నారా.

గో — శ్లీపరయాడు—పిల్ల లేరనా ?

నర — (విసుగుతో) మహాప్రభూ.

గో — సారీ!

నర — చెప్పింది వినకుండా.

గో — కానీ—

నర — 'మాధూ' కాఫీ అయినా తాకకుండా వీధి లోకి వెళ్లాడు.

గో — ఎక్కడికి ?

నర — ఏంవో.

గో — ఏంవో అనా చెప్పడానికి కొచ్చావ్? మీ ఆడాళ్లకి—

నర — బుద్ధు లుండ వని మామీదకు ప్రతిదానికి కొట్టొచ్చినట్టు తయారవుతారు, అసలుసంగ తంతా వినకుండా.

గో — ఊం. కానీ మతీ. మీ తెలివితే—

నర — అనవసరంగా విమర్శ వొద్దు. పూర్తిగా వినండి.

గో — సరే.

నర — మాధు పెళ్లాన్ని మైలాపూరు పంపేశాడు.

గో — ఇది హిస్టరీ.

నర — అందుకే జాగ్రత్త చెప్తే మీరు వెళ్లి (?) దేవిని తీసుకొస్తారని.

గో — చాలు చాలు! (కొంచెం గంభీరంగా) వాడు పంపేయటం వేంవిటీ? నేను పిలుచుక రావటం వేంవిటీ? పంపినవాడే తీసుకొస్తాడు, లేకపోతే వెళ్లినవాళ్లే తిరిగొస్తారు. వాడూ నీకూ ఏంవిటో మధ్యా!

నర — (చిన్నపుచ్చుకొంటూ) సరే లెండి, మీకూ నాకూ దేందుకంటే, యిది లోకంతో సంబం ధించింది. సంసారబాధ్యత లేన్నాడు సన్యసిస్తే సరి.

గో — (కొంచెం గంభీరంగా) నీ కర్థం కాలేదను కుంటాను. వాడు బి. యల్. ఆవిడ బి. ఏ. A. B. C. D. లు రాని నీతోనే మాట్లాడలేక. కాక వాళ్లొకర్నొకరు అర్థం చేసుకొని పెళ్లి చేసుకున్నారటగా. నీవే చెప్పావా, మతీ! వాడు ఎంచేత కోపంగా పంపేశాడో, ఆవిడెల్లా వెళ్లిందో పిలవని పేరంటానికి నన్ను వెళ్ల

మంటావ్. మీ ఆడాళ్ల కలవాటే కాబట్టి నీ విందులో ప్రవేశించు. ఆ అక్షతలు వాళ్లగా నీ తలమీద వేసుకో.

వర — (కళ్లనీళ్లతో) సరే లెండి. మీతో చెప్పడం నాదే పొరపాటు.

గో — మొదలూ! ఏమన్నా అంటే బావురు మనడం. ఈ ఆడాళ్ల కిదొక మహా అస్త్రం ఆ బ్రహ్మ ముండాకొడుకిచ్చిపెట్టున్నాడు చదువులమ్మ మాయల్లోపడి. (వరసమ్మ వేపు తిరిగి) మ ఏదో చెప్పూ.

వర — (కొంచెం ఉత్సాహంగా) చెప్పినట్టుచేస్తారా?

గో — తప్పుతుందా మరి.

వర — (సంతోషంగా) 'మామూ' రేదో పిల్లాడింకా. కోపం వచ్చి కోడలిని అమ్మగారింటికి పంపేశాడు. నిన్న దీనికి సర్దాగానే వెళ్లారు. మళ్లక్కడేం వొచ్చిందో. అక్కడనుండిఅల్లాగే పంపేశాడు కాబోలు. మీరు సాయంకాలం—

గో — (ఆలోచిస్తూ) ఇది ప్రణయకలహం ఏమో!

వర — నిజమైన కలహమే అయితే?

గో — ఊ. నేను సాయంకాలం—

వర — అబ్బాయి మౌంటురోడ్డులో వాళ్లక్లబ్బులో ఉంటాడు. కలుసుకొని నెమ్మదిగా బోధపరిచి మైలాపూరు తీసుకెళ్లి—

గో — రాజీ చేయమంటావ్.

వర — ఊ—

గో — బాగుంది. వాడు వినకపోతే.

వర — మీరు క్లబ్బుకు వెళ్లకపోతే. తోవలో ట్రామ్ ఆగిపోతే. క్లబ్బులో లైట్లారిపోతే. ఈ ఊహలన్నీ ఎందుకంటా.

గో — పొరపాటే.

వర — సాయంకాలం వెళ్తారుకదూ.

గో — (ఆలోచిస్తూ) ఊ. ఊ. కాని యిదిగో.

వర — ఆ.

గో — నాకేమిటి లాభం?

వర — మనవడు.

గో. వ — అహ్హహ్హ (నవ్వుతారు)

౨-వ రంగం

(స్త్రీల కళాశాల హాస్టలు. మధ్యాహ్నం ౧-30 నిమిషాలు (లంచ్ టైమ్) జమునాబాయి, మీనాక్షి ఫలాహారం చేస్తూ ఉంటారు.)

మీ — ఏమే అంత మొగం తీసిపోయి (డిప్రెస్డ్‌గా) వున్నావ్.

జ — ఏమీ లేదు.

మీ — చెపుదూ.

జ — అబ్బే. ఏమీ లేదు. అక్క రమ్మని రింగ్ చేసింది.

మీ — ఏమీ?

జ — (చిరునవ్వుతో) అక్కడ జనరల్ డిప్రెషన్ కాబోలు.

మీ — నీ కేమైనా అప్రమనేమో చూసుకో. (నవ్వుతారు.)

(ప్రవేశం. హేమలతా, శాంత)

హే — హల్లో! హల్లో!

శా — ఏమమ్మా పిలవకుండానే వచ్చేశారు.

జ — ఏమిటో ఆలోచిస్తూ అల్లా వచ్చేశాను. క్షమించాలి.

హే — దానికేమిగాని విశేషా లేమిటి.

మీ — గుడ్ న్యూస్.

శా. హే. — ఏమిటి! ఏమిటి!

మీ — జమునకు మేరేజట.

శా. హే. — (ఒకర్నొకరు చూసుకొని) నిజమే?

జ — ఊరికే తిని కూర్చోలేక, మేరేజీ, కేరేజీ.

శా — ఔను. మేరేజయితే-కేరేజీ ఎక్కువౌతావులే.

హే — అప్పుడు వాళ్లక్కలాగ, కాలేజీ మానేస్తుంది.

మీ — అబ్బే అప్పుడు మొగుడుమాట జవదాటలేక వాళ్లడ మానేస్తుందే.

అంద — అహ్హహ్హ (నవ్వుతారు).

హే — అయితే మంచి జీవనభాగి దొరికినట్టే.

శా — (హాస్యంగా నవ్వుతూ) ఏమమ్మా ఏమి?
"పతి ప్రాణసదృశబంధువు —

మీ — పతి దైవం లేదుగదయా పతి సతులకు—"

శా — అన్నట్టు యీ యేడాది తెలుఁగు సెలక్షన్సు లో చదవలా.

హే — కాబట్టి, వాల్జడ వేసుకోకు, జంపర్ జాకెట్టు తొడుక్కోకు, కాళ్లకు చెప్పులు వేసుకోకు.

మీ — సినిమాలకు వెళ్లకోకు.

హే — అంటే మఱీ అడగక్కరలేదు. ఇల్లాంటివి, 'బానిసత్వం' అనిపించుకుంటుందిగాని, ఆనందమైన, మేరే జనిపించుకోదు.

మీ — కోరి తద్దినం తెచ్చుకున్నట్టే.

శా — (నవ్వుతూ) హిందూ మేరే జనిపించుకుంటుందిగా.

జము — కనకే ఎంతమందో, ఆలుమగలు, ఎడమొగం పెడమొగం అవుతున్నారు.

హే — జమునా! నీవుమాత్రం యివన్నీ బాగా ఆలోచించుకొని మఱీ చేసుకోఁవే.

జము — (విసుగుతో) అబ్బ నామాట కాదే - అక్క మాట.

అందఱు — ఏఁవి-ఏఁవయింది.

జము — ఏఁవయిందేవిఁటి. ఘట్టుగా ఏడుస్తోంది.

అందఱు — (కొంచెం గాభరాగా) అంటే.

జము — ఆవిఁడకి, సినిమా లిష్టం, మంచి సొసైటీ లిష్టం, ఇప్పటి ఫేషన్లిష్టం. మీకు తెలియదూ.

అందరు — ఆ. ఆ.

జము — మఱి ఆయనగారిక్కి ఇవేఁవీ యిష్టం లేవట.

మీ — పోనీ తాను మానుకుంటాడు.

జము — అబ్బే అల్లా అయితే గొడవేలేదు. అక్కను కూడా, వద్దంటాట్ట.

హే — ఆవిడ కాస్తా, స్వాతంత్ర్యం వెల్లడి చేస్తే.

జము — అందుకే మనస్పర్థలూ, రొసరొసలున్నూ, (తలవంచుకొని) అక్కను మాయింటికి నిన్న పంపేశాట్ట!

హే — నాన్సెన్స్! చదువుకున్న వాడూ-ఎడ్వకేటూ-లోకజ్ఞానం అనుభవం వున్నవాడు అల్లాచేస్తాడా?

మీ — ఆశ్చర్యంగానే వుంది. అందుకా నవ్వోకలాగున్నావ్? ఇంతసేపూ.

శా — అందుకే ఒకర్నొకరు అర్థంచేసుకొని మఱీ పెళ్లాడమంటారు అనుభవజ్ఞులు.

జ — (కొంచెం విచారంగా) ఇద్దఱికీ చాలా అన్యోన్యఁవే. మఱెందు కొచ్చిందో యీ చిత్రక్షోభ.

హే — చిత్రక్షోభ లేదు- చిత్రకూటం లేదు. మనం, వార్డన్ దగ్గఱ అనుమతిపుచ్చుకొని సాయంకాలం అందఱం శ్రీదేవిని చూద్దాం. ఆవిడ్ని అడిగి విషయం ఏఁవిటో కనుక్కుందాం.

మీ — చెప్పనంటే.

శా — సిగ్గుపడితే.

హే — లాలిద్దాం. సంగతేఁవిటో లాగుదాం గా. ఇప్పుడు జమున చెప్పిన కారణఁవే అయితే మాధవరావుగార్ని నిలబెట్టి కేసంతా నేవాదించేస్తా.

మీ — జమునని జడ్జీ చేద్దాం. బావగార్ని విచారణ చేస్తుంది. (హేమవంక తిరిగి) నీవు వాదనలనూ దిట్టంగా చెప్పవే. నేనూ శాంతా సాక్షులం. వీరిద్దఱు ఒకర్నొకరు ప్రేమించుకొని, ఒకర్నొకరు గ్రహించుకొని పెళ్లిచేసుకున్నారని చెప్తాం.

హే — బాగుంది. అప్పుడు జమున తీర్పు చెప్తుంది.

శా — ఏఁవనో తెలుసా.

హే — అబ్బే నాకు తెలుసుగా. న్యాయంగా వున్న శ్రీదేవి ఆశయాలను మాధవరావుగారు గౌరవించాలనీ, విద్యాధికులైన మగలు భార్యల ఉన్నతాదర్శాలను ప్రోత్సహించాలనీ, ఇప్పుడింత హంగామా చేసినందుకు మాధవరావుగారు కథలుచెప్పడంలో నేర్పుగలవారు గనుక శ్రీదేవి సంతోషంతో నవ్వునట్లు ఒకకథ చెప్పవలెననీ తీర్పు చెప్పాలి.

అందఱు — షేమ్, షేమ్.

మీ — చిన్న సవరణ—

హే — తీర్పులకు మఱి సవరణ లుండవ్.

మీ — పోని చిన్న సలహా.

హే — ఏమిటది?

మీ — ప్రొద్దున్న లేస్తూనే కాఫీలయ్యాక, రేపు సెలవు కాబట్టి, మార్నింగు షోకి సినిమాకు శ్రీదేవిని మాధవరావుగారు అవశ్యం తీసుకెళ్లాలని.

శా — బాగానే వుంది కాని, ఇంత కష్టపడి తీర్పు చెప్పినందుకు జనుమనుకూడా తీసుకెళ్తే బాగుంటుందని నావుద్దేశం.

జను — అల్లాకాదు. కవున్సిల్ కు ఫీజ్ కింద, సాక్షులకు చేటాలకింద సినిమాకు తీసుకెళ్లాలని చివర్నొకమాట చేరుస్తానులే. (అందరు నవ్వుతారు)

శా — (రిస్టువాచీ చూచి) అబ్బో రెండుంబావయింది. క్లోసు.

హే — ఓస్. తెలుసుక్లోసేగా.

౩-వ రంగం

(క్లబ్బు. సాయంకాలం ౫ ఘంటల సమయం ఖాన్ శాస్త్రి, సింహం, అప్పాజీ లెక్సికన్ గేమ్ ఆడుకుంటూవుంటారు. ప్రవేశం మాధవరావు).

అ — ఏమిరా. యీవాళ ఆలస్యం?

మా — (పక్కకుర్చీలో కూర్చుంటూ) ప్రొద్దున్నే త్రామం వెళ్లాను. ఇంతవరకు అక్కడే ప్రాతస్నేహితులతో కాలక్షేపం చేశాను.

ఖా — ఏం, విశేషం?

మా — ఊరికే.

సిం — వింతలూ విశేషాలు ఏమైనా మేగజీనుల్లో చూడు — వాడ్నడిగితే? ఇప్పుడు నీవంతు— ఏదో మాట చెయ్యి.

ఖా — (విసుగుతో) చేతిలో 'W' వుందిరా, ఎల్లా ఏడవటం?

సిం — సరే నాసంగతేమి చెప్తావ్! 'Q' వుంది.

మా — (చిరాకుతో) ఆవెధవ 'Q'కు, వెంట 'U' వుండకపోతే చచ్చినట్టే.

ఖా — వెనకాల సెక్రెటరీలేని ఇంగ్లీషురాని జమీందారులాగు. (అందరు నవ్వుతారు.)

అ — ఇంగ్లీషు లిటరేచరంతా తిరగేశా, 'Q' వెంట 'U' వుండి తీరాల్సిందే.

ఖా — మాదు! ఈగేమయ్యాక నువ్వుకూడా చెయ్యి చేసుకో.

మా — (విసుగుతో) అబ్బా నాకొద్దులెద్దూ.

ఖా — ఏమి?

మా — ఆడాలని లేదు.

అ — బోయ్! ఓ కూల్ డ్రింకులు (కేకేస్తాడు)

మా — మీరాడుతూ వుండండి నే, చూస్తూ వుంటా.

సిం — ఈ వాళ కాస్త మతిపోయినవాడిలాగు వున్నావేంరా.

అ — మనిషి కాస్త వడిలిపోయ్యాడుకూడా.

సిం — ఎవరివైనా తీక్ష్ణదృక్కులకు గురిఅయ్యావా?

అందరు — అహ్హహ్హ (నవ్వుతారు.)

ఖా — వాడికి పైచూపుల ఖర్మేమి. బ్యూటిఫుల్ వైఫ్.

సిం — బాగా చదువుకుంది.

అం — బుద్ధిమంతురాలు.

మా — (వెకిలిగా) చాలా స్వతంత్రురాలుకూడా

ఖా — అంతే.

మా — మాట వినదన్న మాట.

అందరు — (నవ్వుతారు)

అం — అదా సంగతి. వినకపోతే వినేటట్టు చెయ్య రాదూ?

మా — ఎల్లా చేయడం.

అం — చెప్పిచూడడం.

మా — అన్నీ అయ్యాయి. వినిపించుకోలేదు...

ఖా — ఏదీ ఒక్క — ఉదాహరణం...

మా — నాఅనుజ్ఞ లేకుండా మొన్న 'సినాచి'కి వెళ్లింది.

సిం — ఒరే! మీరాట ఆడతారా – ముక్కలు కలిపేయనా?

ఖా — ఉండరా. వెధవ లెక్సికన్. రోజూవున్నదే.

అ — (మాధవరావుతో) అయితే, వెళ్తే తప్పేమిటి?

మా — నా కిష్టంలేదు.

అ — కారణం?

మా — నాకు తెలియదు.

అ — పిచ్చి పట్టింది నీ ఎడ్వకేటుగిరి. నీకు తెలియనిదానికి అడ్డంకి చెయ్యడానికి. నీకేంవి పోక్కుంది?

మా — అగ్నిసాక్షిగా పెళ్లాడిన భార్య కాబట్టి.

భా — సింగినాదం వేఁపీకాదూ. ఒరే అబ్బాయ్ నీలాంటి చదువుకున్న వాళ్లుకూడా పెళ్లాం నిన్న చిత్తోకి వెళ్లిందని అలగటంలో అర్థంలేదు. ఇంకేఁవైనా, ఆవిడలో పొరపాట్లు చూశావా?

మా — కావలసినన్ని

అ — ఏఁవు వినవలసినవైతే చెప్పు.

మా — సాయంకాలం నాకేదైనా పనుండిఆలస్యంగా వస్తే తానొక్కతే బీచికి,మా పొరుగింటిలక్ష్మితో వెళ్లటం.

భా — ఆ! కొంపెతనం! చాలుచాలు.

అ — ఆ! (వెకిలిగా నవ్వుతూ) బీచినుండి తిరిగి రావటం, కాళ్లజోడు విప్పుకోవటం, కట్టిన చీర మార్చుకోవటం, రిస్టువాచి తీసుకోవటం (అందరు నవ్వుతారు)

అబ్బాయి! నువ్వేంటో చాలా చదువుకున్నా వనుకున్నానుగాని, యింతలేసి వున్నత భావాల్తో వున్నావని అనుకోలేదు.

మా — (చిన్న బుచ్చుకొని)నీ వరకువస్తే నీకప్పుడు బోధపడుతుంది.

అ — నాకిలాంటివి బోధపడవు నాయనా.

భా — ఒరే మాధూ. నువ్వు మా అందరి కన్నా చిన్నవాడివి. నీకింకా కావలసినంత లోకానుభవం లేదు. పరీక్షలు పేసవడం వేరు, జ్ఞానం సంపాదించుకోవడం వేరు. చదువుకున్న భార్య అంటే సరిగా అర్థం చేసుకో. మనకెల్లాయిష్టాలు అనిష్టాలుంటాయో వాళ్లకీ అంతే అనుకో. మానవ ప్రకృతి అంతా ఒకటే అని ముందు తెలుసుకో. ఒకరు స్త్రీ; ఇంకొకరు పురుషుడు. అవయవాల్లో భేదమే తప్ప, ఆశయాల్లో ఒకటే కాబట్టి దురభిప్రాయములతో వుండక భార్యఅంటే మన సగభాగం అన్నమాట మరిచిపోక, నడుచుకో. నీకు తెలియదనికాదు చేని, రగా చెప్తా. అనుభవం తగినంతలేదని చెప్పాను.

మా — (మెల్లగా) నిజఁవే అనుకుంటాను.

భా — నిజమేఁవిటి! మూడుపాళ్ల నిజం.

గో — (ప్రవేశిస్తూ) మధ్యలో వచ్చినందుకు క్షమించండి.

అందరు — (లేచి) దయచెయ్యండి గోపాలంగారు కూర్చోండి.

గో — (నిలువబడి) నాకు చాలా అవసరమైన పనుండొచ్చాను మా మాధుతో. సావకాశంగా తరవాత కలుసుకుందాం.

అందరు — చిత్తం, చిత్తం.

మా — ఏఁవిటి నాన్న! రమ్మంటారా నన్ను.

గో — ఆ.

[గో. మా:-(వెళ్తూ) వెళ్లివస్తాం-

(అని ఇద్దరూ మైలాపూర్ దారి నడుస్తుంటారు)

మా — ఎక్కడికి?

గో — మైలాపూరు.

మా — ట్రామ్‌లో వెళ్దాం.

గో — అక్కర్లేదు సాయంకాలం షికారుకింద నడుద్దాం.

మా — సరే. (రెండడుగులు వేస్తారు)

గో — మరేఁవిటి నాయనా, శ్రీదేవి నిప్పుడు తీసుకొస్తావా?

మా — ఎప్పుడు కావలిస్తే అప్పుడే. ఇప్పుడు వెళ్తున్నాముగా.

గో — (ఆశ్చర్యంగా లోలోపల నవ్వుకొని) సరే పదా అయితే త్వరగా.

౪-వ రంగం

(మైలాపూర్‌లో సంజీవరావు యిల్లు, సాయంకాలం ౬ ఘంటల సమయం).

రవ — (సంజీవరావుజోళ్ల కేసులు విప్పుతూ) ప్రొద్దున్నుంచీ సుక్కుడు కాఫీఅయినా నోటిలో పోసుకుంది కాదు. అల్లా పడుకొనేవుంది.

సంజీ — వాళ్లెవరైనా వచ్చారా?

రవ — ఊఁహూ.

సంజీ — వాళ్లకు కబురుపంపుదాం అనుకుంటున్నాను. చాలా పెద్దమనుషులు—వీడింకా పిల్లాడు.

రమ — పిల్లాడైతేమాత్రం-కాస్త యుక్తాయుక్తాలు తెలియొద్దూ?

సంజీ — ఊ-సరేలే. (లేస్తూ) ఇల్లాంటి విషయాల్లో జాగ్రత్తగా ఆలోచించాలి. ఇప్పుడు ముణిగిపోయిందేవుంది? అమ్మాయిని చూద్దాం పద.

(ఇద్దరు శ్రీదేవి గదిలోకి వెళ్లుతారు. శ్రీదేవి పడుకొని ఉంటుంది)

సంజీ — ఏఁవమ్మా లేచి కాఫీ తాగు.

శ్రీదే — ....

రమ — లే అమ్మా లే. మొఖం కడుక్కో. ౮ ఘంటలు దాటింది. మీమామఁవగారికి కబురుపంపుదాఁవులే.

సంజీ — ఇంతమాత్రానికే యిల్లా అయితే, జీవితంలో యిల్లాంటిఘట్టాలు యెన్నో వస్తూంటాయి. ఇంతకూ యేం జరిగిందే!

శ్రీదే — ....

రమ — ఏఁవిజరిగిం దేవిఁటి. ఊరికే నిన్న దిగబెట్టేశాడు, పాఁతజోడు గొడారివాడిదగ్గిర దిగబెట్టేసినట్టు.

సంజీ — (శ్రీదేవితో)నీతో విశ్వా యేఁవన్నాడమ్మా.

రమ — అసంగతి, నే నెన్నిసార్లడిగినా చెప్పదు.

సంజీ — (పక్కనున్న కుర్చీలో కూర్చుంటూ) చెప్పమ్మా ఫరవా లేదు-కారణ మేఁవిటి?

శ్రీదే — ....

రమ — చెప్పుతల్లీ నాన్నగా రడుగుతున్నారుకదూ.

శ్రీదే — ....

సంజీ — సాయంకాలం బీచికి మామూలుగా వెళ్లారూ.

శ్రీదే — ఊ!

సంజీ — తరవాత.

శ్రీదే — (కళ్ల నీళ్లు పెట్టుకుంటుంది)

రమ — (మంచంమీఁద కూర్చొని శ్రీదేవి కళ్లుతుడుస్తూ) తప్పమ్మా! కలకలలాడే యింట్లో సాయంకాలంపూట యేడవకు తల్లీ! నీకొచ్చినలోఁటేఁవిటీ.

శ్రీదే — నా కంతా లోఁటేయిఁక. (ఏడ్పును)

రమ — ఊరుకో ఊరుకో. నీవేఁవీతప్పు చేయలేదులే.

శ్రీదే — నేను చేసినప్రతిపనీ ఆయనకి తప్పక్రింద కనపడుతూఉంటేనే.

రమ — బాగా చదువుకున్నా డనుకున్నాంగాని, నీటికి, మాటికీ యీతప్పు లెంచడం ఏఁవిటి?

శ్రీదే — బీచి కెళ్లకూడదట. సినిమా కెళ్లకూడదట. ఆడాళ్లమీటింగుల కెళ్లకూడట (ఏడ్పును).

సంజీ — సరేసరే. ఊరుకోఅమ్మా. వాడివల్ల తప్పేమీ లేదు. వాడింకా చిన్నవాడు. కానీ మీరు నూతనదంపతులు-నీకంపెనీ యెల్లప్పుడూ అభిలషిస్తావుంటాడు. ఇది ప్రతికొత్తపెళ్లి కొడుక్కూ మామ్మూలే కొంతకాలంవరకు. మరేమీ ఫరవా లేదు. మీమాఁవగారికి కబు రంపుతాను లే. నీవు లేచి, మొఖంకడుక్కొని కాఫీతాగు.

(శ్రీదేవీ రమణమ్మస్నానాలగదిలోకి వెళ్లారు. సంజీవరావు సావిట్లో ఈజీచైరులో కూచొని ఏదో ఆలోచిస్తూ వుంటాడు. ఇంతలో గోపాలం, మాధవరావులు ప్రవేశిస్తారు.)

గో — ఏఁవోయ్ బావా దీర్ఘాలోచనలో వున్నావ్?

సం — ఇదిగో ఆడబోయే తీర్థం యెదురైంది. కూర్చోండి ఊరక రారు పెద్దలన్నారు.

గో — కాబట్టే మా కతిథిసత్కారాలు సరిగ్గా చెయ్యకపోతే, అలుగుతాం.

సం — సారి. మాయిల్లు రీయిన్ఫోర్స్డు కాంక్రీటే, మీ పనికి సరిపోదు. (నవ్వుతాడు. మాట సందడి విని శ్రీదేవీ రమణమ్మలు ప్రవేశిస్తారు.)

రమ — (మాధవరావుతో)నాయనా యిది బాగులేదు.

మా — (చప్పున లేచి)ఏఁవి. నిన్న బాగుందే, ఇంతలో ఏఁవయింది. (అంటూ శ్రీదేవి చెయ్యి పట్టుకొని నడిపిస్తూ పయాలలోకి వెళ్లిపోతాడు. రమణమ్మ ఆశ్చర్యంతో చూస్తుంటుంది).

సం — మాదూ తెలివైనవాడు.

గో — 'నీవు నేర్పినవిద్యయే నీరజాక్ష' అన్నాట్ట.

రమ — (నవ్వుతూ) అయితే యిప్పు డెవరికి బాగు లేనట్టు.

రవ — (నవ్వుతూ) అయితే యిప్పు డెవ్వరికి బాగు లేనట్టూ?

శ్రీ — ఇద్దఱూ బాగున్నట్టే. (అంతా నవ్వుతుంటారు. ప్రవేశం-జమునా, మీనాక్షీ, శాంత, హేమలతలు).

జము — (గాభరాగా అందర్నీ చూచి రవణమ్మతో) అక్కేది?

రవ — ఏంటమ్మా అంత తొందర?

జము — అక్కెక్కడుంది?

రవ — అదిగో పయట్లో వుంది. కాని వుండుండు.

జము — (వినిపించుకోకుండానే మీనా. శా. హే.లతో) రండర్రా!

(అందఱూ పయట్లోకి వెళ్తారు. శ్రీదేవి మాధవరావ్ దగ్గఱగా నిలబడి మాట్లాడుతూవుంటారు.)

జము — (తక్కినవారితో) మతాబా.

హే — భరవాలే! తెల్లమతాబా.

(శాంతా మీనాక్షీ గట్టిగా నవ్వుతారు. శ్రీదేవీ మాధవరావు వీళ్లను చూచి,)

శ్రీదే — ఓహో జమునా, శాంతా, మీరా రండి. రండి. (హేమలతా మీనాక్షులను చూచి, నవ్వుతూ) ఇదేవిటే, హోస్టలంతా వచ్చిందే?

జము — మీరేంచి చేస్తున్నారో చూద్దాం అని

శ్రీదే — పెనిమిటి మనస్సు భార్య అన్నది బాగా బోధపఱచుకోవాల్సుంటుందని మీ బావగారితో చెప్తున్నాను.

మా — భార్య ఉన్నతోద్దేశాలను అర్థం చేసుకొని, వాటిని భర్త అన్నవాడు గౌరవించవలసి వుంటుందని చెప్తున్నా మీఅక్కతో.

జము — ఈ సంగతే మీతో చెప్దామని మేమంతా వచ్చాం, నిజంగా.

మా — How dramatic — భలే చిత్రం-

హే — How realistic—ఎంతటి సైజం-

మా — All is well that ends well, చివరకు మంచిగా పరిణమించేదంతా మంచిదే అన్నమాట.

జము — కాబట్టే యేపత్రికైనా యీ సంఘటనాన్ని చిన్నకథగా వ్రాసి పంపుదాం.

శాం — ఎందుకూ! చిన్ననాటికలాగు వ్రాసి, మన భారతిలోనే వేయిద్దాం.

అందరు—సంతోషం. రైటో.

క్వినైనుకోసం చీనాపిల్లల ప్రపంచ యాత్ర

మలేరియా బాధితమైన వారి దేశము తరఫున చీనా పిల్లల సమూహ మొకటి ప్రపంచసంచారం చేస్తున్నది అమెరికాలో వారి యాత్ర చాలా జయప్రదంగా వుంది. వాళ్లు అమెరికా పిల్లలకు కర్రముక్కలతో అన్నం తినటం నేర్పారు.

ఈ పిల్లల సంచారానికి ముఖ్యోద్దేశం వారి దేశానికి మలేరియానుండి విముక్తి నిచ్చేందుకై క్వినైను కొనుటకు విరాళాలు వసూలు చెయ్యటమే.

ఈ విషయంలో జాతిసమితి మలేరియా కమిషను వారు వ్యాధిని నిరోధించేందుకు రోజూ 6 గ్రైనుల క్వినైనున్నూ, జ్వరం తగ్గటకు 5 నుండి 7 రోజులవరకు రోజూ 15 నుండి 20 గ్రైనుల క్వినైనున్నూ పుచ్చుకోవలెనని సూచించియున్నారు. వారి 1938-వ సంవత్సరపు నివేదిక 124-వ పేజీలో క్వినైను నిరపాయకరమైనదనియు, వైద్యసహాయం లేకుండానే వాడవచ్చుననియు తెల్పియున్నారు.

పైన తెల్పిన విందులకు వెళ్లే ప్రతి అమెరికా పిల్లవానికి చైనా పిల్లలు చైనా భోజనం పెట్టి న్యూయార్కులోని చైనాటౌనులో వినోదార్థం త్రిప్పి తీసుకొస్తారు.

ఈ సంచారాలు ఫలవంతాలు అవుతున్నట్లే. ఎందుకంటే చైనాకు చాలా అవసరమైన క్వినైను అప్పుడే అక్కడికి చేరుకుంటోంది. చిరకాలంగా బాధపడుతున్న చీనావారికి ఆ క్వినైను నివారణ ఇస్తుందని అమెరికా దేశస్థుల ఆశ.

M. నెం. 290

ఆంధ్రతేజము

శ్రీ ఉదయగిరి సన్యాసిరాజు

3

‘కాకతి’యనంబడెడు దేవికారణమున
ఖ్యాతి గాంచిన క్షత్రియుల్ ‘కాకతీయు’
లందు సద్గుణగణపతి యగు గణపతి
జననమందెను చంద్రుండు వనధిఁబోలె.

పలుకం దొక్కుడఁ బొల్లుమాటలు స్ఫుర
  త్పంకేజపత్రాక్షునిన్
గొలుచున్ బీదల సాదరన్ మనుచుఁ జి
  క్కున్ సత్యపాశంబులన్
వలచున్ గీరితిచెల్వ, జ్ఞాని యగుటన్
  వాంఛింపఁ డాతండు చం
చలలక్ష్మీవిభవంబులన్ నిజసతీ
  సంతాన సంతానమున్.

సకలాంధ్రావని నాక్రమించుటకు ను
  త్సాహంబు రేకెత్త నా
శ్వికులున్ గాల్బలమున్ హితుల్ సరగునన్
  వెన్వెంట రాఁగా నృపా
లకుఁ డల్లల్లన దండయాత్ర కరిగెన్
  లక్షించి సామంతులై
రి కరంబుల్ ముకుళించి ‘కంచివిభుఁడున్’
  రేనాఁటిభూమీశుఁడున్.

గండుమీఱియున్న దండివీరులతోడ
గండికోటసీమఁ గ్రాలువానిఁ
గాకతీయకులజు గణపతిదేవునిఁ
దివిరి చూడవచ్చెఁ దిక్కశర్మ.

“లీలఁ బెదతండ్రి యొకఁడ త్రైలింగరాజ్య
మాక్రమించెను, తండ్రియాహవమునందు
శౌర్యముం బ్రకటించి తా స్వర్గలక్ష్మి
జూరగొనె నల్పుఁడవె నీవు ధారుణీశ!

విన్నమాట లెల్ల విశ్వసింపఁగఁ జాల
కన్నులారఁ గన్నఁగాక యేను
నీ బలాతిశయము నీ శౌర్యసంపద
చూడ వచ్చినాఁడ సుమ్ము ‘రాజ’!”

అని యభినుతించి కవిత
క్కన నిజపతి తెలుఁగు సెప్ప గణపతిదేవుం
డనుకంపతోడఁ బలికెను
“విను కవివర! నాప్రతిజ్ఞ వినిపింతుదగన్”

“దేవసముఁడైన యా ‘మహాదేవు’ వంశ
జననమందుట నిజమై యెసంగునేని
‘గాకతి’యనుగ్రహము నన్నుఁ గాచునేని
మనుమసిద్ధిని గద్దెపై నునుచువాఁడ.

శీఘ్రగామి యనఁగఁ జెన్నొందుదూత నొ
క్కరుని బిలిచి పలికెఁ గాకతీయ
వంశ జలధిపూర్ణవనజారి ‘గణపతి’
పాండ్యరాజుతోడఁ బలుకుఫణితి.

మాటికి మాటికిన్ వెడగు
  మాటలు వల్కఁగ నేటికయ్య ? నా
సాటిమగండు లేఁ డనుట
  జ్ఞానవిహీనతఁ జాటుసూవె, నీ

చేటు నటుండ నిచ్చి నినుఁ
జేరినవారల చేటు నెంచి, యీ
మాటలు చెప్పుచుంటి విను
మా! యనుమానమిఁకేల? కానిచోఁ
గత్తులపాలు కుత్తుకలు
కావర మోటమిపాలు సొత్తు వీ
రోత్తముఁడైన మానృపకు
లోత్తముపా లిఁక వేయు నేల? జా
గ్రత్త వహింపు మూరక ప్ర
గల్భము లాడిన లాభ మున్నదే?
మత్తు దొలంగి యుద్ధమును
మానుము మానుము మానవాధమా!

౪

“కందుకూరిసీమ గాలంబు వుచ్చెద
రణము సేయఁజాల రాజరాజ!”
అని నిరాశపేర్మి నాడిన మన్మభూ
పతికిఁ బలికె సుగుణపతి ‘గణపతి.’

“నమ్ము నామాట విన్నదనమ్ము విడువు
రమ్ము నావెన్క నీదుబీరమ్ముఁ జూవ
శమ్ము వర్జింపు మింక యశమ్ము గొనుము
వమ్ముసేయకు నీదు జీవమ్ము లెమ్ము.”

యుద్ధరంగంబునందు నీ వున్నఁ జాలు
చక్కఁబెట్టఁగఁ జాలుదుఁ దక్కినపని
కందుకూరికిఁ బోయెద నందువేమి?
నేఁడు నెల్లూరువిజయంబు నిక్క మన్న!

అపుడు తిక్కన యి ట్లను “నవసరంపు
పసుపుగణపతిఁ బోలు మా ప్రభువరుండు
నిజము గణపతి యీ విట నిలిచియుండఁ
గార్యకరణమ్మునందు విఘ్నములు గలవె!

....

భావిసమరతలం బొప్పు నీ విధాన
ననుచుఁ దెలుపుచుఁ గెంజాయనెన సెఁదూర్పు
మ్రోసె రణదుందుభులు యుద్ధభూమి నిండె
పాండ్యబలములు మఱి గణపతిబలములు

....

మల్లయుద్ధంబునం గొంద ఱుల్లసిల్లిరి
కత్తిసాములఁ గొందఱు గనిరి ముదము
శాతభల్లప్రయోగకౌశలమునందుఁ
గొంద ఱెంతయు నానంద మంది రపుడు.

వనమయూరము:—

చెంగునఁ దెలంగి పరుఁ జెండుమగవారున్
భంగపడువారిఁ గని వహ్వ! యనువారున్
గ్రుంగియును లేచి నినుఁ గూల్తు ననువారున్
సంగరతలంబున పసందుగ వెలుంగన్.

“మునుపు మనకు నోడిపోయిన సిద్ధియే
కూర్చినాఁడు నేఁడు కొంత సేన
వీరులార! భయము విడిచి పోరుండ”ని
పాండ్యవల్లభుండు పలికినాఁడు.

అపుడు నిజసేన గాంచి గణపతిదేవ
భూవిభుఁడు మేఘగంభీరముగ వచించె
“శూరులార! మగంటిమిఁ జూపుఁడయ్య,
తరుణ మిది, దాటిపోయిన దొరకబోదు.

ఉక్కుమగలనల్ల నుద్భవించినమాట
నిక్కువంబయేనిఁ జక్క నిలచి
యుక్కుసూపుఁ డెదిరి యక్కజంపడునట్లు
పెక్కు లేల? మాట దక్కనిండు.”

వాడిమగఁడైన జటవర్మ పాండ్యరాజు
గణపతినృపాలశేఖరుఁ గాంచి పలికె
“సిద్ధికిం దొల్లి కలిపిన బుద్ధు లెల్ల
చెప్పెదము మీకు నోటమి సిద్ధ మాట”

"పురుషపుంగవ! మము గెల్వఁ బూనినావు
మంచిదే, కాని తొలుత యోజించినావె?
యేరిబల మెక్కుడో! న్యాయమెందుగలదో!
మతి యెటకుఁ బోయెన"ని గణపతినరపతి.

చెట్టతనమున నల్పులం బట్టికొనుట
దిట్టతన మని యెన్నడు మిట్టిపడకు
మిట్టునటు వోవకుండ మాయట్టివారిఁ
బట్టికొనరాదె? నీగుట్టు గుట్టలెక్క.

అటోపంబున మేటిపోటరుల నా
  టాడించి యెంతేని నా
రాటమ్మందఁగ నీకులం బాడిచి ఘో
  రాస్త్రప్రహారంబులన్
తిటన్ మాపి స్వపౌరుషంబుఁ దెలుపున్
  ధీరుం డిటుల్ వట్టి యా
ర్భాటంబుల్ పచరింప లాభ మెది? శూ
  రమ్మన్య! పోరాడుమా!

మాట లేటికి? నీలీల మాపువాఁడ
సాటివారికి నాశక్తిఁ జాటువాఁడ
నాఁటియుద్ధము కా దిది, నమ్ముమనుచు
బాండ్యవిభుఁ డాడె నాంధ్రభూపాలకుండు.

తొలుదొలుత రక్తకాంతి నాఁ దోఁచి పిదప
సామరూపంబు నొందెడుచంద్రుమాడ్కి,
గాక క్రమమునఁ గ్రోధంబు గానిపించు
భానునటు లొప్పె గణపతిప్రభువరుండు.

....

కలన వీరాధివీరుల గెలిచినట్టి
గణపతిం బోర మార్కొనఁ గడగినాఁడు
పాండ్యుఁడు దురాశకుం బట్టువడిన కతన
నుండునె వివేకము దురాశ యున్నచోట!

గణపతిబలమ్ములానాఁటికయ్యమందుఁ
బాండ్యవల్లభుబలముల భంగపరచె
గణపతి యొకండ పాండ్యుని గండడంచె
మనుమభూపతి యానందవనధిఁ దేలె.

బాహుబలము దూలఁ బాండ్యవల్లభుఁడప్డు
పారిపోయె నాత్మబలముతోడ
సిద్ధిరాజుగూడ సిద్ధసంకల్పుఁడై
గద్దెనెక్కె ముదము గనిరి జనులు.

గణపతిం గాంచి మన్మభూకాంతుఁ డనియె
"దేవ మీదయవలనఁ గాదే లభించె
మరల రాజ్యమ్ము: మీకుసామంతుఁడనఁగ
నానతి యొసంగుఁ డేమి సేయంగవలయు"

అని కృతజ్ఞత దెలిపిన మనుమసిద్ధి
నాదరించి మృదూక్తుల ననియెఁ గాక
తీయగణపతిచక్రవర్తి, శుభమూర్తి,
సత్యపథవర్తి, చంద్రికాచారుకీర్తి.

"అనఘ! బాలుఁడనైయున్న యవసరమున
నన్ను నవమానితునిఁ జేసినాఁడు చైత్ర
పాలుఁడను యాదవేంద్రుఁ డిప్పటికిఁ గూడ
నాటియున్నది మనమున నాఁటిచరిత.

వాని నని నవమానింప వాంఛ కలదు
చేయఁదగును సహాయంబుఁ జేయుమయ్య
ఆలసింపకు మిది యద" ననిన నట్ల
కాక! యని పల్కె మన్మభూకాంతుఁడపుడు.

"తిక్కనకవీంద్ర! కవులున్న దిక్కునంద
నిలుచు జయలక్ష్మి యంచుఁ బెద్దలు వచింత్రు
మాకడ వసింపుమ"ని పల్కె మందహాస
విలసితసితాబ్జముఖుఁడయ్యె వెలుగుఱేఁడు.

ఎదజనించిన యానంద మించుకేని
నెఱుగఁబడకుండ 'తిక్కన' యిట్టు లనియె
"గాన మొనరింపఁగలరు సత్కవులు; కాక
తీయగణపతి దేవ! నీదివ్యచరిత!

ఆశ

"జయదేవ"

ఆశతో తెరచిన సంచీవైపు చూచాడు భిక్షుకుడు.

వాని ఒడలు నిండిన దుస్తులు-నోరు నిండిన తాంబూలం-చేత సంచీ, చిన్న సంచీ మిలమిలా మెరసి పడుతూంది. ఆహా! సృష్టికి ముద్దుకొడుకు! నిండినవాని పొట్ట చూచాడు భిక్షుకుడు. అది పుష్టిగా సన్న నిలాల్చీ లోనుండి వ్రేటువగ పైకి పొటమరించి కనబడుతూంది. అద్భుతమైన కళాప్రజ్ఞను చాటెడి చిత్రశిల్పాన్నివలె రెప్పవేయకుండా వానినీ చూచాడు భిక్షుకుడు. మెచ్చుకున్నాడో, నొచ్చుకున్నాడో వివరింపలేని విషాద సూచకమైన నవ్వు నవ్వాడు. ఆకలిగొన్నవాడేమో- ఆధారం లేని భిక్షుకుడు. వాడు కట్టుకున్న మొల తిరుగని పీలిక-వాడిపోయిన శరీరస్థితి-బాధనే చూస్తూన్నట్టున్న ముడుతకొలుకులకనులు - వెలవెల బోయే ముఖంతో తెలిబూడిద పూత పెదవులూ—

ఇవన్నీ వాని నర్థిగా చూపుతున్నాయి. ఆ గొప్ప వానికి గౌరవసూచకంగా, కొంతదూరంలో నిలచే - వాని చూపులలోకి చూచే - నవ్వాడు దీనంగా ఆభిక్షుకుడు - నవ్వేమిటి? వాని పెదవులనుండి కటికరాయి జారినట్టు ఒలికింది పొడిపొడిగా వెలవెలబోతూ. అది నవ్వేకాదు ఏదో బీభత్సం! ఎందుకటు చూడడం? చూచీ చూడనట్టు ఆగొప్పవాడు తల అవ్వలవైపునకు త్రిప్పి, ఎఱ్ఱఎఱ్ఱగా నిర్మలములై నిటారుగా సాగిన వ్రేళ్లమీద వెలుగు నీడలలాగు వెండిరాగినాణెములు లెక్కిస్తున్నాడు-భిక్షుకునిదృక్కులా నాణెములలో తొట్రుపడుతున్నాయి. అంతేసంతగొల్లులో కూడా [illegible]ని తమ కదలికలో చేసే చిరుచడే ఆ భిక్షుకునికి వినబడుతూంది.

ఆచడి కడ్డుతగిలాడు, వానిచేయి పట్టుకొని "అయ్యా! ఆకలి. రొట్టికొనవూ" అని ఎనిమిదేండ్లబాలుడు—భిక్షుకుడు వాని మట్టిమురకల వెన్నుమీద కొట్టాడు. తన అనుభవలేశాని కడ్డు తగిలాడని కాబోలు!— వాని నటు పందరించి తిరుగా ఆగొప్పవాని చేతివైపు చూచాడు - సంచీ, (ఘాతం) వాతపడిందా సంతోష. లేశ ప్రదమయిన ధ్వనికూడా- దానిమూతి కటువుగా, నిర్దాక్షిణ్యంగా బిగిసిపోయింది. దిగాలపడి చూచాడా భిక్షుకుడు గొప్పవాని చేతివైపు, బిగిసి పిడికిట నిమిడిన సంచీమూతికొరకు - ఆశ అలమికొన్న వానిముఖం తేరి చూడనయినా చూడకుండా వెడలిపోతున్నాడా గొప్పవాడు. వానివెంట బడ్డాడు భిక్షుకుడు. ఆభిక్షుబాలకుడు, చాలీచాలనట్టు ముడివైచికొన్న తండ్రి మొల కట్టుపట్టి వెనుకకులాగి- "అటు కాదయ్యా! ఇటుంది రొట్టెల దుకాణం - రా!" అంటూ ఈడిలపడ్డాడు - పుష్టి లేనిపొట్ట నాశ్రయింప నొల్లని ఆ పేదవడ్డ పేలికను రెండుచేతులా కూడకట్టికొంటూ, విసువుదలగా ఆ పిల్లవానిని విదలించుకొని, ఆత్రంగా ఆ భాగ్యవంతుని సమీపించాడు భిక్షుకుడు. ముందు చూపేగాని వెనుక చూపులేని ఆభాగ్యవంతుడు అక్కడనిలచి, ఒకజవాను తెండురోజా బేరమాడుతున్నాడు - గోడ చెవిచే పెడతాడో - కూజాశలనే పెడతాడో దానిని. అలసటగా ఊర్పులుతీస్తూ, దీనంగా "బాబయ్యా!" అన్నాడు - పీక్కుపోయే వాని ప్రేవు లన్నీ వెన్నంటుకున్న పొట్ట మీద కనబడుతున్నాయి. కనికరంగా కదలుతూ- సాంధ్యరాగ రేఖాప్రసారమా? ఇంద్రధనుస్సా— ఎవరుచూచారు. ఎవరుగుర్తించారువానిని— ఆ అనుభవము భిక్షుకునిదే — ఆ పిలుపూ భిక్షుకునినోట నాగి నట్టే అనన్యవిదితమై అడగిపోయింది — గొప్పవాని చూపులు గులాబీమీద—చెవులు, చిత్రకారునిమీదా ఉన్నాయి.—

మరీదీనంగా, ఆత్రతగా, అలసటగా, "బాబయ్యా" అని చేరువగా నిలిచి చేతులుచాచి వినయంగా వంగి పిలచాడు వానిని భిక్షుకుడు—

ఆ గొప్పవాడు, చీదరించుకొని బొమముడి ధూసే సూదిచూపుతో వాని సెగతాలగ, ఈ పడింపుగ చూచి వానిని కటాక్షించినట్టుతిరిగి మాటాడుతున్నాడు. ఎవరితో ఇంతవరకిలాంటిచూపు లెన్నిటికి గురియైనాడో ఆభిక్షుకు డదివరకు — పైకిమాత్రం పిల్లిలాగు ముడుచుకొనిపోయి రెల్లులాగు వడకాడు—తృష్ణావృతమయిన హృదయంలో రసస్రావ ముంటుందా? భ్రమమాత్రం లోకానికి ప్రకటిస్తుంది.

తిరుగా ఆ భిక్షుడు "బాబయ్య" అని ఆ గొప్పవానిపైపు బెదరుగా రెప్పలల్లారుస్తూ జంకుప్రకటిస్తూ వెనుకాడినట్టు చూచాడు.

గొప్పవాడు కోపంగా వెనుదిరిగి చూచి "ఎవడురా నువ్వు—పనీ తోచనీయవు! పాటూతోచనీయవు!—కాళ్లలోపడి కంగారుపెడుతున్నావు. ఎందుకలా అరుస్తున్నావు చెవిగోసిన మేకలాగు?" అన్నాడు గర్జించి కడపెడలనున్న వాళ్లు త్రుళ్లిపడేటట్టు.

భిక్షుకుడు — చిన్నబోయినముఖంతో ఒక్క అడుగు వెనుకకు పెట్టి-నడుము వరింతవంచి సలాముచేసి, తెచి-పొట్ట వానికి చూపి "ధర్మం బాబయ్యా! ఆకలి!" అని ఏమేమో చెప్పుకోబోతున్నాడు.

గొప్పవాడు ఇంజనుగొట్టంలాగు హుంకరించేడు. 'ధర్మం! ధర్మం! కన్నులేనివానికి ధర్మం! కాలులేనివానికి ధర్మం — దుక్కలా నున్నావు కన్నుగుడ్డా? కాలుసొట్టా? ధర్మమేమిరా! నీలాటివానిచేత డబ్బుపెట్టడం దండుగ-ద్రోహం-అధర్మం పో! మెడపట్టి పట్టక." అంతకంటె దైన్యం ప్రకటించ లేకపోయాడా భిక్షుకుడు. ఇలాటి ఉపన్యాసము లెన్నో సారులు విన్నాడాభిక్షుకుడు తన్నే ఉద్దేశించి ఎందరో చెప్పడం వారివాక్కుల కర్థ ముందేమో! శాస్త్రచర్చకు తావులేదు. దానివల్ల కడుపుమంట చల్లారదు. రాగిడబ్బు త్యాగిచేయి. ఇంతప్రపంచం ఎందరో వ్యక్తులు, ఎన్నో హృదయాలు - ఆశే చిగురిస్తూంది; కొనసాగి గొడ్డుపూలు పూస్తూంది. ఏనా డంకురించిందో ఆ ఆసతీవ, డొంకబలిసి వానిహృదయం నిండిపేసింది. ఇంకొకటూహా తూరీగలాగు పైపైని ఎగురవలసిందే గాని ఆశనుమాత్రం తొలగించి వానికి హృదయస్థం కాజాలదు. దీర్ఘమైనదివ ప్రమాణం బాపయినా తరగ లేదు. దీర్ఘతరమయిన ఆయుఃప్రమాణం మూడవ వంతయినా ముగియలే దాభిక్షుకునకు- వానిని పెనవేసుకొని ప్రేరేపిస్తూన్నది ఆశ. దానికి నిత్యవసంతం—హేమంతశిశిరాలు దాని వంటవన్నట్టు పాకుతూంది వానిలో అదే.

ఆ గొప్పవానిముందు యవనిక పడింది. యాతన రంగంలో ఆభిక్షుకుడూ, ఏకుస్తూ, బూడిద ఒసలితో త్రోవ సుర్తలేకుండా జనాన్ని త్రోసికొని వచ్చేకొడుకూ మిగిలారు.

గంపంతకన్ను, జగచ్చక్షువు ఆశానిమగ్నమయిపోతూంది. గాయపడ్డ కొట్టువడ్డదా జగతికన్ను. పశ్చిమాశ రక్తసిక్తమయింది. ఏదో ప్రశాంతి తోచిం, దాబింబ పరిసరాలను. అసన్నాంధకారం స్ఫురించదుగా. అది అవ్వలి అవస్థ! అప్పుడు రాగభగ్నమయిందన్న క్రించుదనంలా నుంటుంది కారుచీకటి. ఇది సహజమయిన సౌభాగ్యమో, దౌర్భాగ్యమో, జరిగి తీరాలి.

మాసిన జల్లచీరలాగు మసకతెర జంకుజంకుగా జారుతూంది. భిక్షుకుకు శారీరకంగా నీరసంగా నీడలాగే కదుల్తున్నాడా రంగభూమిలో- చాచినచేతులు వ్రేలకుండా ఉక్కుతీగలు సాగించిందా వ్రేళ్ళలోకి, ఆశ. గొడ్డుతీవలకు బలం లావుగా! మాటిని తప్పించుకున్న మదపుటేనుగలాగు చీకటిచెట్ల జీబుటడవిని చీల్చి మరీ త్రోవ చూపుతూందా భిక్షుకునికి ఆశ. అది వానికి నూతన్నవస్థకాదు. అవయవములలో పాటు కదలికా వాని నాశ్రయించుకొనే ఉంది. వస్త్రవ్యథ మెరుగని పసికూన చూపులకులాగు వానికి లేటుస్థమయ్యే అవస్థలన్నీ అర్థరహితాలయి అలా చెరిగిపోతున్నాయి. నిరుత్సాహం అపుడెపుడో అంకురించినది మొక్క-వరుసపడి మొరడయి తల్లి కడుపులో తల దాచుకుంది సూదంటురాయివలె తృష్ణ వానిని ముందున కీడుస్తూంది.

తీరంలేని దుకాణదారుడు సామానులెత్తిపెట్టుకొని-రేపటి కడుపులో లాభం దాచుకొని, కొట్టు

తలుపు మూసికొన్నంత సహజంగా, ముగించా డాభిక్షుకుడు నాటి యాతనాప్రదర్శనదినకృత్యం- ఉన్నది— ఉబ్బించే ఇంకొక ఉషస్సు- పెద్ద కన్నులతో చూస్తుంది రేపటి పగలు- రేపు భాగ్యనిధానం—చిగురు పెట్టబోయే చిన్ని- మొలక- రేపు ఫలించే పంటల వలంతి—జాన.

ఇల్లా వాకిలా? ఈత తుప్పల మరుసు; నివాసం— చేరుకున్నాడు చేత కట్టె వాని వంకించుకొని ఆభిక్షుకుడు. వానితో సరిగా నడువలేక ఈడ్డిల పడుతున్నాడా పిల్లవాడు. ఆకలి నిద్రలు కలగలుపుగా వాడు మరింత బరువుగా తోస్తున్నాడు వానిచేతికి- నేల నీడ్చుకొని పోతున్నాడు. గెంటుకొని పోతూన్న పిల్లవాడు 'ఊఁ ఊఁ' అని నీరసంగా మూల్గుతూ ఊర్పులుక్కిరిబిక్కిరిగా వదలిస్తూ వాని వెంట దొరలుతున్నాడు- చీకటిని బెదిరించే చుక్క వెలుగులో విరియబోసికొన్న పిశాచీ కేశబంధంలాగు, జల్లుగా పీడబారుతున్నాయి ఆ ఈతతుప్పలముంటి కొమ్మలు. ఆ నడుమ ప్రదేశం, కట్టిడిహృదయంలాగు కటువు బారి- కంటకావృతమై తావుమాత్రం తండ్రి బిడ్డలకు పెట్టింది. నిర్దాక్షిణ్యంగా ఆపిల్లవాని నేలను విడిచాడు. ఏదీ? దాక్షిణ్యం? తానెక్కడకు వెళ్లినా నిర్దాక్షిణ్యం- నిందారోపణ- నీరసం ఇవే వాని చెవుల కలవాటయిన వాక్యాలుగా, హృదయమున కలవాటయిపోయిన ఊహలుగా, శరీరమున కలవాటయిన సంచలనంగా వానిలో లీనమయి పోయినాయి — వాని కది వాయు ప్రసారమంత సహజ మయిపోయింది. స్వభావంలో భాగ మయిపోయింది. ఆకటిక నేలనే తానూ కూర్చునేందుకు, నేల పదును చేసికొంటున్నాడు. చురుక్కుమన్నది చేతివ్రేలిలో ఈతముల్లు. వాడు నొప్పిగుర్తించ లేదు; నొచ్చుకోనూ లేదు- ముల్లూడ దీసికొంటున్నాడు మునిపంటితో. "అయ్యా రొట్టెకొనవూ ఆకలేస్తూంది" అన్నాడా పిల్లవాడు. వాని ప్రార్థన వినివట్టే లేదా భిక్షుకుడు — ఈప్రశ్నే దినారంభమునుండి అప్పటివరకెన్నిసారులు తన చెవిని బడినదో. వాని శ్రోత్రనాళాలు మొద్దువారినవి. ఆ చెవిలో ఆశబ్దం శబ్దించిందిగాని దాని భావంమాత్రం వానికి హృదయస్థం కాలేదు. వాని హృదయంకూడా గాజువారి శబ్దగ్రహణసామర్థ్యాన్ని కోల్పోయినదేమో. అదే అవస్థ అనుదినమూ, అనుక్షణమూ వానిలో రేగడంవల్ల, దానిసూక్ష్మత, తీక్ష్ణత తగ్గి సముద్ర తరంగాలలో సాఫు లేరిన కరకురాతివలె నది నున్నవడిపోయింది. ఆశాతరంగాలలో అదరచేమూల? "అయ్యా" పలుక లేదు. "అయ్యా" అని తిరుగా తిరుగా పిలిచాడా పిల్లవాడు. నోటితో ముంటి నూడదీసికొనుచుండుటచేతనో ఏమోగాని వాడు పలుక లేదు. బావురని ఏడ్చేడా బాలకుడు. భిక్షుకుని యూర్పునకు గొప్పవాని హృదయంవలె వాని హృదయం కాస్తకదలి చీదరను రేపింది. బాలకు డొక యాచకునిలాగు కనబడ్డా డప్పుడు భిక్షుకునికి — వానిలో వాని శరీరమలమేకిన ఆ ప్రశ్నలు భిక్షుకునిలో ప్రతిధ్వనించాయి "కన్నుగ్రుడ్డా? కాలుసొట్టా?" అన్నవి. అతిగా వినుటవల్ల నవే నినదించాయి వానిలో - జనసామాన్యానికి వలెనే వానికీ, పాత్రలక్ష్యంలేదు. అప్పుడు కూడా గాఢంగా అలమింది ఆశ, వానిని- కటిక నేలను చతికిలబడి కూర్చున్నాడు. పిల్లవాని ఏడ్పు కీచురాల పాలయినది. చీకటి కడుపులో జీర్ణించిపోయింది. వాడు కూర్కుడో సొమ్మసిల్లడో-విశ్వమంతా, వింతగా నిద్రపోతూ ఉంటుంది. సుఖ మనుభవిస్తూ ఉంటుంది. నూడిదలు తింటూ ఉంటుంది. అనంతాకాశం చూస్తున్నాడా భిక్షుకుడు. అది వస్తుమయమై భాగ్యవంతునిలాగు కనబడింది. అలవాటుచొప్పున దీనంగా చూచా డాకాశం నీలిముఖంలోకి. చేతులుకూడా చాచాడేమో ఆచుక్క వానికి చులకగా చూచి-పొమ్మనుడితో "కన్ను గ్రుడ్డా? కాలుసొట్టా?" అని అడిగిన ట్లనిపించింది. చుక్కలవెక్కిరింపులేని పగటి ఆకాశం ఇక రాదా? అని ఆశించాడు- అటు చూచినకొలదీ వానికదే ప్రశ్న వినబడుతూంది. మెల్లగా ఆనేల సాగువారాడు. కూర్కుటకు ప్రయత్నించాడు- కన్నులు మూసికొన్నాడు. కన్నుగ్రుడ్డి ఇలాగే! దీని కంత సత్వం - భాగ్యవంతుని చేతిపైసా నొడిచి తెచ్చే సత్వం ఉంది దీనికి. అందరూ అదేమాట. భిక్షుకుని ఒడల చీమలో ఏవో ప్రాకి కరుస్తున్నాయి. దులిపిన కొలదీ ప్రాకుతున్నాయి అవి- వానికి చికాకు కలిగింది. "నామీదపడి నా

నెత్తురు పీల్చేస్తున్నా యివి — నే నెందుకు వీనికి శరీర మొప్పగించాలి? వీనికి "కన్నుగ్రుడ్డా?" కాలుసొట్టా? అని చీదరించికొని చీమలను దులుపు కొన్నాడు. పగలు తాను యాచించిన గొప్పవారు తన్ను దులపరించినట్టు ఒకడు కాదు—అందరూ పేద వాడు మొదలు లక్షాధికారివరకూ ఆదేప్రశ్న వేసేరు వానిని — రేపు, చుక్క వెక్కిరింపులేనిపగలు— సూర్యుడో — వానికరసహస్రాలు విదలించి నలుపుతూ వానిని దేప్రశ్న అడుగుతాడు.

కూర్చునే కన్నులు గట్టిగా మూసికొన్నాడా భిక్షుకుడు— "కన్ను గ్రుడ్డి," ఇలా నీకన్నులు శాశ్వతంగా మూతలుపడి ఉంటే బాగుండునన్న ఊహావేశం వానిలో తలచూపింది.

జనసమ్మర్దంతో, సౌభాగ్యపుసందడితో క్రిక్కిరిసి కిటకిటలాడే ఆ పట్టణహృదయంలో కనువిప్పి చూడలేని గ్రుడ్డివా డయి తాను తిరుగుతూన్నట్టు— చూచే దాంతరంగికంగా - అందరిమాడుక్కలూ తన చూడ్కలేని కన్నుల పైపే చూస్తూనట్టు; వారిచేతులలో నాణెములు గిలగిల లాడినట్టు; చాచిన తన చేతిలో "వహ్వ నాణెములవర్షము" పిడికిలినిండిన డబ్బులు- పినిచుట్టు నిండిన డబ్బులు- ఈతతుప్పలలో డబ్బులు— విశ్వమంతా తన్నే లక్షించింది - నిజమేనా? నిజమే! లోక మంతా ఏకవాక్యంగా చెబుతూన్నది సత్య దూర మెలా గవుతుంది? తాను గ్రుడ్డివాడు కాకుండుట వల్లనే తన చేతికీ దాతచేతికీ దృక్కులు ఉక్కుగోడలయి నిలచేయి — అన్నిటినీ చూచే చూపే అడ్డుగా నిలచింది!

గాలి రంయిమని వీచింది. ఈతతుప్పలకొమ్మలు గలగల లాడినవి — కీచురాలు, కప్పలు- దూరముగా గ్రుడ్లగూబలు- విడివిడిగా కలగలుపుగా ధ్వనిస్తున్నవి. అది ఊరిపొలిమేర - మాపటివేళ - కన్నులు మూసికొని బాహ్యచైతన్యాన్ని గుర్తిస్తూ కలగంటున్నాడు- ఈ సందడి నాటిపట్టణపుసందడిగానే అన్వయించుకుంటున్నాడు — ఆశ వింతపూలు పూస్తూంది. - వెనుకటి గొడ్డుపూలు కాపనుకున్నాడు — భిక్షుకుడు కన్నులలా మూసికొనే ఉన్నాడు — అంధత్వం ఇంకా నైజంగా అలవరచు కుంటున్నాడు — "అంధుడు, అంతటిపట్టణపురాటు, రాపిడి, తోడుత్రొక్కుడు — శబ్దాధారంగా, తడువుకొంటూ మార్గ మడిగికొంటూ పడుతూ లేస్తూ వెన్నుమీద నేదో వెనుకనుండి పడ్డట్టు, వానికి జంకువేసిందా కలలోనే — అంధత్వం — ఏమో! మిన్ను తిరిగి మీదను పడ్డదేమో—"

భిక్షుకుడు జల్లుమని గడగడవడకాడు — దారిద్ర్యమును - ఆశతో కాళ్ళేతు లాడకుండ కట్టిపెట్టిన దిట్టరి. ఆశలో ఆకలిబాధను, స ధువుగ నోనర్పగలిగిన సాధకుడు — అంధత్వం, చూపులేమి - కనలుట కసమర్థత—

ఆ యీతతుప్పలలో తానంధుడై ఆకలికి చిక్కి శిథిల మయిపోతూన్నట్టు - చీమలూ - నక్కలూ తన శరీరమును చీల్చి తినుచున్నట్టు ఏకో భావిపటం వానికి హృద్గోచర మయింది — భయపడ్డవానివలె కన్నులు దడుక్కున తెరచాడు — విశ్వ మంతా! ఆ మాపటివేళ క్రిమిపక్ష్యాదులు చేసేధ్వనితో "కనుగ్రుడ్డా?"అని అడుగుతూంది - మంచికలనుండి మెలకువ వచ్చింది వానికి- తిరిగా ఆ కలలో ప్రవేశించి ఆనందలేశ మనుభవించ లేకుండా ఉన్నాడు - భయానకం వాని చైతన్యాన్ని మరింత వాడిగా చేసేసింది - రెప్పపాటుకూడా వానికి శాశ్వతాంధత్వాన్ని స్ఫురింపచేస్తూంది. అలా తెరచిన కన్నులతో ఆ చీకటిలోకి చూస్తున్నాడు నిలింపుడై, నిర్విణ్ణుడై, ఆ భిక్షుకుడు—

కాదన్నట్టు తలయూచాడు- చెదరినకొమ్మల ఈతతుప్పలనడుమవానితుప్పతలయూపెవడు గుర్తించాడు. అదికాక, అంధు డయినవాడు సత్వహీను డయి పోతున్నాడు. ఎవరి కా అవలింపులక్ష్యం? తన ఇంద్రియాలే తన కవశమై యెదుర్కొంటున్నా యనుకుంటున్నాడా భిక్షుకుడు. తన అంధత్వం నిజంకాదు. ధైర్యలేశం పొడమింది. ఆ అంధత్వమిచ్చిన ఆనందం మరి తనకు లేదు. దైన్యలేశం పొడమింది—ధైర్యా దైన్యాన్నీ, దైన్యం ధైర్యాన్నీ మ్రింగుతున్నాయి క్రమక్రమంగా వానిలో-ఆసంఘర్షణలో, ఆ అన్యోన్య గ్రహణావేశంలో — సాగి ముడిగి వానిహృదయం సత్వహీన మయిపోతూంది. ఏ అవస్థ వ్యాకయించ

ఏమో దానికి తెలియక కొట్లాడి కొట్లాడినిలిచిపోతూంది క్షణకాలం—వా డొకకాలు అంధత్వంలోనూ, ఒక కాలు ఆపదలోను పెట్టి కూర్చున్నాడు- వానిజీవ మప్పుడాశాసర్పంపడగనీడ నుంది—హృదయం మాగి పోయినా వాడు గుర్తించడు. కాని అది ఆగిపోలేదు. మల్లయుద్ధానంతరరంగంవలె వానిహృదయూన శూన్యత ఆవరించింది. ఊహాలేశంకూడా కదలలేదు. ఆనిగా గర్భంలో కీచురాయి గీపెట్టలేదు. దూరపు జలాశయాలలో కప్ప లార్వలేదు. చీకటిపండుగచేసికొనుట కాగ్రుడ్లగూబలూ ఎటో వాహ్యాళి పోయినవి కాబోలు. గాలి ఎక్కడికిరంగ మక్కడ సొమ్మసిల్లి అడగి పోయింది. ఈతరుప్పలు మాతులు బిగించికొని ఊర్పులు బిగియబట్టి ఏమో వింటున్నాయి. భిక్షుకునిరొండల బ్రాకిన పిపీలికలుసైతం బిలాలలో పొంచినవి. ఊర్పులుసైతం బాహాటంగా తీర జంకుతున్నా డా భిక్షుకుడు - చైతన్యం - జీవలక్షణం - ఏవీ ఎక్కడా తోచదు. నిరాఘాటంగా, నిశ్చేష్టంగా, నీరసాన్ని చీకికొనక నిద్రపోతూన్న భిక్షుకుని బిడ్డడు - మాత్రం చిరుగురక లెడుతున్నాడు. అది సముద్రపు హోరులాగు కదలుతూంటా తుప్పలనడుమ - భిక్షుకుని కాలుచేతులు గదలినవి - అన్యసంచలనంకోసం అటూ యిటూ చూచాడు-అలవాటు వానికి-ఈతరెమ్మ చేయూచింది- చీదరించుకొని - ఉబ్బి వెడలని ఉడుకుబోతుదనంతో- ఆరెమ్మ ఆకులు – కటువుగా కఠినంగా చిదిమేదు – రెండు – మునువ్రేళ్ల వానిని ముంటికొనలు పైకుంచి చూచేదు– వాని వాడి వానికి చీకటిలో కనబడలేదు– (కనబడునా? – ఏమో) వాని సత్యం– అనుభవమువలన వానికి హృద్గోచరమవుతూంది – దిగ్గనలేచేదు – సాహసించినట్లు "ఊఁహుఁ" అన్న తెగింపుమాట్లు, వాని పెదవులసందున కాక, ముకుపుటములనుండి వెడలింది. ఈతరుప్పగడ గడలాడింది. గాలి, రొదతో తరుకోటరాలలో మూల్గింది – ఆకసమున చుక్కలు మబ్బు చాటునకు పోతున్నాయి. ఆ ప్రశాంతిలో అంతా అలజడిలాగే తోచింది. భిక్షుకునికి ముఖమే లేదేమో ఆ చీకటిలో కలసిపోయినది. వాని అడుగులు – దడదడ – అక్కడి కక్కడే వడి, అలజడి పైపాటు:— ఏమిటో ఆభిక్షుకుడే గుర్తించలేదు. ఉస్సు రన్నాడు - హుంకరించాడు – దేనితోటో పెనగినట్లు గింజుకున్నాడు.

* * *

అవ్వలినిశాభాగం ఆర్తనాదంతో తెల్లబోయింది. ఆ తుప్పలో మొఱ్ఱో మొఱ్ఱో మన్న - ఆపన్న కంఠరవం – బాధాసూచకమయిన బావురన్న ఎడతెగని మొఱ్ఱ – ఏడ్పు ప్రేవులుత్రెంచే పిన్నయెలుగు- భిక్షుకుని బిడ్డడు – గడగడలాడిపోయి గుక్కలు మరలింపలేకుండా గోలపెట్టి యేడుస్తున్నాడు – నిశాగర్భం కరగి వరదలై పారేటట్లు.

ఒకక్షణం

శ్రీరంగం నారాయణబాబు

యిసుక ఎడారుల
పసిరగనేలై
కుసుమించిందీ బ్రతుకు !
కర్షకహర్షోదయ
వర్షాగమ వేలావేళల
తూనీగా !
తేలికనై
ఎడద ఎగిరె హాయిగాను !

గ్రీష్మపు టెండల
మండిన భూముల
తొలకరి వేళల
మాతృమృత్తికా
మధుర వాసనలు
సుధాగళమ్మున !

ఉన్మిషితమ్ములు
జీవితాధ్వముల
శరన్మేఘములు
పరుగులెత్తినవి
విద్యున్మాలలు
వెంటతరిమినవి
తల్లి చేతిచల్లందనము
పిల్లలమాటలతీపి
కొల్లగొన్నదె మెయి బ్రదుకు !
మాతృవత్సమున
పాలపోటుతో
తల్లికడుపులో
పిల్లడు కదిలాడు
చల్లనిగీతి
రేకెత్తింది !

ఆ - మరచితి; చాణక్యుం
డా మహిపాలునకు ముఖ్యుడౌ సచివుం డా
ధీమణి కిది హిత వౌనెడ
నామన సీడేరు నిక సునాయాసముగన్.

నాది యగాధమైన ఒకనైజపురాగ స్రవంతి; దానిలో
తేదళపూరుషుండును గ్రహింపగ లే డొకనీవ తక్క; రా
వా ? దయచేసి ; నేటిదరహాసపు వెన్నెల రేయి హాయిమై
నీదుచు స్వైరనౌక విహారింతము తల్లహరిన్ మనోహరా !

పడమటివైపు కన్నియ లపావనశీలురటంచు మీార లీ
పడతుక సంశయింపదగవా ? మఱి అందరు నట్లె ఉందురా ?
ఒడయడ! వీరు వా రనెడి ఉక్తులతో బనియేమి అచ్చపుం
బడుచు హేలీన ని న్వలచి వచ్చిన దింక పరిగ్రహింపుమా.

జనకుడు చూడ భూవలయసర్వము గెల్చిన గ్రీకురాజు; పై
బెనిమిటి చూడగా భరతవీరుడు భారతచక్రవర్తి; మ
జ్జన మొనరింపు మింక మనసా ! ఎదురీది తుషారహర్షభి
ననవధుసీసుధాంబువుల ; నక్కను ద్రొక్కితివే మరేడనో.

మీాహిమశైలపున్ సొగసు మీామధురాంబునదీనదస్థితుల్
మీా హిమహస్తసౌష్ఠవము మీానగరీవనసీమశోభలన్
దోహద మయ్యె జూగ తమతో జతగూడి తురంగలించువై
వాహిక దేశపర్యటన భాగ్యవశమ్మున; ముద్దు దీర్పరే?

ఎందుకు దాచె దింక గ్రహియించితిలే తమ కివ్వ దున్న ఈ
నందియ మెల్ల; నే దమద్వీపజ్ఞ్యాపపుత్రికనైన నాదు; భూ
నందన ! దాని కి ట్లనుకొనన్ దగునే ? తమదాన గానె? ఐ
నం దనకొంప దా జెరచునట్టి వివేకవిహీన ఉండునే ?

అలయని యాప్నితా నలమహాజ్వాలనమ్మున ప్రేమనీరముల్
సలసలలాడుచున్ దమతుషారసుధాకరుకైకదివ్యశీ
తలజల మొందగోరెదటు తార్చి పసందగు గోగు వెచ్చపుం
జలయుగమజ్జనక్రియల స్వైరవిహారము లందచెల్లదే ?

ఎంతటి వెఱ్ఱివాడవో హ్యాదీశ్వర! మీ కెనయైన రాజరా
జింతకు నొక్కడైన గనిపించడు: నాజతబట్టుదేని మా
ప్రాంతముగూడ నీకె యిడి పట్టముగట్టడె తండ్రి;? నాడు భూ
స్వాంతము సర్వమున్ దమవశం బగుగాదె? తలంప వింతయున్.

జనకుడు రేపుమాపుగల చర్చలకున్ తమశత్రువైన జొ
ననుకొను దంతమాత్ర నత డన్యుడు కా డొకవేళ మీరు నా
మన సొనగూర్తు రేని పరమాప్తుడు కా కత డేమగున్? తనూ
జను గనిదైన మామ మనసారగ అల్లునివృద్ధి గోరెడున్.

అలులితమైన లేదమలపాకునుసైతము గోటమీటు ఈ
లలితుని యొంటియుంద మొకరాజ్యమకాదు సమస్తరాజ్యముల్
గలధరణీప్రభుత్వమును గైకొనజా లనిపించు; ఈ బహి
ర్వ్యలసన మాత్మగూడ గనుపించిన ఎంతటి ధన్య నౌదునో.

శాస్త్రదృష్టి

శ్రీ వ. దుర్గాప్రసాదరావు

సైన్సు (Science) అన్న ఆంగ్లేయపదానికి "శాస్త్ర"మని పారిభాషికంగా అర్థం చెప్పుకొంటాం. పాశ్చాత్యులలో సైన్సుఅంటే "తెలియచెప్పేది" అన్నట్టుగా అర్థం వస్తుంది. Science of Botany అంటే వృక్షాలను గురించి తెలియచెప్పే చదువు. Science of Mind మనస్సునుగూర్చి తెలియచెప్పేది - ఇత్యాదులు. మనలో పూర్వ సాంప్రదాయకంగా "శాస్త్రం" అంటే శాసించే దన్నట్టుగాను, తిరుగులేని దన్నట్టుగాను, ఉత్పత్త్యర్థం, సాంప్రదాయకార్థముకూడా స్ఫురిస్తాయి. ఇంకా కొంచెం ఒకమాదిరి, వేదము అన్న దానికి వ్యుత్పత్త్యర్థము చూసుకొంటే, 'విద్' తెలియ చెప్పేది అని స్ఫురిస్తుంది. కాని "వేదం" అన్నమాట సాంప్రదాయకంగా "శాస్త్రం" అన్నమాటకంటే కూడా, శాసించేది అన్న బుద్ధిలో బలీయమైనది. "అదేం శాస్త్రమా?" అనటంకంటే, "అదేం, వేదమా" అనటంలో, తిరుగులేనిది అనేబరువు ఎక్కువ. సాంప్రదాయకమై రుఢ్యమున్న భావలలో ముక్కుకు ముక్కుకు అర్థం చెప్పటం చాలాకష్టం. మనలో పాతవాట్లకున్న పేర్లనుబట్టి చెప్పుకొందా మన్నా కొంచెం త్రోవ దొరకటం కష్టం. "ఆయుర్వేదం" అని వైద్యగ్రంథం కంటాం. "వైద్యశాస్త్రం" అనికూడా అంటాం. పాశ్చాత్యసంపర్కం కలిగినవాటినుంచీ Science అనేమాటకు శాస్త్రం అని అర్థం చెప్పుకోటం పరిపాటయింది. అందుకని అంతకుముందు మనలో విడిగా చెప్పుకోబడనివి, ఆపేర్లనుబట్టి అనువాదించుకోబడ్డవి. Physics భౌతికశాస్త్రము; Chemistry రసాయనశాస్త్రము; zoology జంతుశాస్త్రము; Psychology మానసికశాస్త్రము; Economics అర్థశాస్త్రము. Astronomy – ఖగోళశాస్త్రము – అని పాశ్చాత్య సంపర్కం తరువాత పేర్లిచ్చుకోబడ్డాయి. అంతకుముందు కొంచెం చులాగ్గా వీటి నన్నిటిని "విద్య"లని వాడుకొనటం కద్దు. కాని పాశ్చాత్యులలో పైవన్నీ "సైన్సు" (Science)గా పరిగణింపబడబట్టి, ఆ తరువాత విద్యలో విడివిడిభాగాలుగా పరిగణించబడ్డ ఇవి కూడా Science అన్నమాటకు తర్జుమాగా "శాస్త్రం" అనబడ్డాయి. ఇంగ్లీషులో "Science" అని ఈనాడు సంగ్రహంగా వాడబడేమాటకు వచ్చే విపులార్థమును, మనలో "శాస్త్రం" అన్నమాటకువచ్చే విపులార్థమును చాలా భేదంగా ఉంటాయి. కాని ఇందుకోసం ఇవాళ యింకో కొత్తమాట సృష్టించుకొని చికాకు పడటం కంటే, దాదాపు నూరు సంవత్సరాలుగా Science అన్నమాటకు అర్థంగా వాడుకోబడుతూన్న "శాస్త్రం" అన్నమాట కదే విపులార్థం ఇచ్చుకొని ఈ వ్యాసంలో అన్వయ మొనర్చుకో కోరుతున్నాను.

ఈశాస్త్రం Science—ఈనాటిదాకా నిలిచి ఉండి మానవజిజ్ఞాసలో ప్రథమస్థాన మాక్రమించుకొందంటే వివిధమానవులలో ఉండే వివిధరకాలతృష్ణలకు దప్పితీరుస్తూన్నదని అనుకోవచ్చును.

మనుష్యులలో తరహాలనుబట్టి ఈశాస్త్రదృష్టి వివిధంగా ఉంటుందని చెప్పటం, పునరుక్తి. ఒకేతరహాకు చెందిన బుద్ధినైశిత్యం ఉన్నవాళ్లల్లోకూడా ఈశాస్త్రదృష్టి వివిధంగా ఉంటుంది. ఒకవాడు Arago ఏరాగో అను గొప్ప భూగోళశాస్త్రజ్ఞుడు, భోజనాల దగ్గిర సరదాగా కబుర్లుచెప్పుతూ, తోకచుక్కల పుట్టుక, ప్రకృతిసంచలనం అంతా తేటతెల్లంగా విశదీకరిస్తూన్నాడు. ఆపంక్తిలోనే కూర్చున్న మహాకవి విక్టరుహ్యూగో అంతా అయాక చల్లగా అడిగాడు. "ఏరాగోగారూ! తోకచుక్కకు ఆత్మ ఉంటుందాండి" అని. ఏరాగో తెల్లబోయాడు. ఏరాగోకు తోకచుక్క బరువు, నడక, బాహ్యప్రకృతి, మీద దృష్టి. విక్టరుహ్యూగోమహాకవికి ఏవస్తువుకైనాసరే, ఆత్మఉన్నదా లేదా అనే జిజ్ఞాస. మనదేశంలోకూడా

ప్రజ్ఞావంతులలో దృష్టిపై విధంగా ఉండబట్టే మనలో Science పాశ్చాత్యపద్ధతులమీద అభివృద్ధికాలేదు. పైనిచెప్పిన దృష్టిభేదం నిశితప్రజ్ఞుల విషయంలో. అటు కాకుండా అసలు "శాస్త్రం" విషయంలోనే చూచు కొంటే ఇంకా తరగతులు వేరుగా ఉంటాయి.

సామాన్యజనానికి సైన్సువిషయంలో కలిగే దృష్టి, ప్రయోజనం అంటే సైన్సు ఏదైనా చెప్పితే, దీనివల్ల ప్రపంచానికి, అంతకన్నా నిత్యజీవనానికి ఉప యోగ మేమిటి? అని. సైన్సు ఈ తృష్ణనూ తృప్తి పరుస్తుంది.

ఇంకోతరగతి, ఇల్లాంటి నిత్య ప్రయోజనాని కనిమాత్రం కాకుండా వస్తుప్రకృతి, వస్తువిధానం తెలిసి కొందామనేదృష్టి. మూడోరకం, భావనాబలంతో, ప్రథమసూత్రాలకోసం ఊహించలాలను పరపి ఆఆదిమ సూత్రాలను తెలిసికొందామనే జిజ్ఞాస. ఈ మూడింటి లో తుది ప్రకృతి పైకి ఉపయోగరహితంగా కనబడినా అత్యుత్తమైనదీ, విజ్ఞానానికి మూల మనీ వేరే చెప్ప నక్కరలేదు.

అధికసంఖ్యాకులదృష్టి మొదటి తరగతికి చెందు తుంది. శాస్త్రవిద్యార్థిది రెండవతరగతి. కోటికొక్క ప్రజ్ఞాశాలి మూడవతరగతికి చెందుతాడు. శాస్త్రము Science ఈ ముగ్గురకుకూడా సంతృప్తి నిస్తుంది.

ఒకచిన్న ఉదాహరణం తీసికొందాం.

శాస్త్రవిద్యార్థి, నీరు ఆవిరిగా మారటంలో ౧౭౦౦ రెట్లు పై శాల్యం పొందుతుం దని దానివల్ల కొంత ఉపయోగపడేశక్తి కలుగుతుందని తెలిసి సంతో షిస్తాడు. సామాన్యుడికి విషయం ఈ రూపంలో చెప్పితే, బుఱ్ఱ కెక్కక చికాకుగా ఉంటుంది. కాని ప్రజ్ఞాశాలి ఈ శక్తి నాధారంగా ఆవిరియంత్రము (Steam Engine)నూహించి నిర్మించుతాడు. అప్పుడు సామాన్యునికా ఆవిరియంత్రం నిత్య జీవనంలో అత్యుప యుక్తంగా కనుపడుతుంది.

నీరూ,ఆవిరి, అన్న వివిధ భౌతికావస్థలలో నేటి ప్రకృతి, అణు సంచలనము, దానికి మూలసూత్రమూ, ఆపైదృష్టిపరకే మూడోరకం చాలాకొద్దిగా ఉంటారు Faraday, Newton, Einstein, Raman ల లాగు.

సామాన్యప్రజకు కావలసినది "శాస్త్రం" వల్ల కలిగే నిత్యఉపయోగము. అసలు మొదటిలో నిత్య జీవనంలోని అవసరాలకై శాస్త్రం (Science) పుట్టిం దని చెప్పవచ్చును.

క్రీ. పూ. ౨౦౦౦ కు క్రితంకూడ బేబిలోని యనులలోను,ఐగుప్తీయులలోను కూడ క్షేత్ర కాలాలను (Space and Time)కొలచేక్రమపద్ధతు లుండేవి. చీనీ, హైందవనాగరికత లింతకు పూర్వానివని చారిత్రకు లంటారు. మన పురాణాలనుబట్టీ, వేదాలనుబట్టీ తెలిసి కొందా మంటే చాలా మేధావులకు గాని నిజస్థితులు తెలియవు. ఇప్పుడు మన పూర్వస్థితిలో ఉన్న వని గర్వించుకోవటం, లేవని విచారించుకోవటం రెండూ కూడా ఒకే తరగతికి చెందుతాయి. అంటే, మన పంచాంగాలు,మనజ్యోతిశ్శాస్త్రము, బేబిలోనియను, ఐగుప్తీయనాగరకతలకన్నా పురాతనమైనవన్నది మనకు నిర్వివాదాంశమైనా ఇతరుల కింకా వివాదాంశమే.

నాల్గువేల ఏండ్లకు పూర్వమే ఐగుప్తీయులలో ఒక మాదిరి ప్రప్రథమ స్థితిలో క్షేత్ర గణితము, ఖగోళ శాస్త్రము ఉండేవి.

ప్రప్రథమశాస్త్రాలు ప్రపథమావసరాలనుబట్టి ఉత్పన్నమయాయి. కృషీవలులకు (మొదటి నాగరక స్థితిలో మానవుడుకృషీవలు)డని నేలపంపకాలకు నేర్పా లకుగాను ప్రప్రథమ క్షేత్రగణితము (Geometry)ఉద్భ వించి ఉంటుంది. ఎండవానలనుబట్టి పండించుకొనే పంటలకుగాను ఋతుమానం అవసరమయింది. ప్రకృతి సిద్ధంగా, అహర్నిశలు ప్రథమ కాలమాన మయాయి. చంద్రగతినిబట్టి మాసం ఏర్పడ్డది. సూర్యగతికి చంద్ర గతి సరిపెట్టుకోబడి సంవత్సర మేర్పడింది. ౧౨ చాం ద్రమాసాలు, సూర్యవత్సరానికి సరిపడనపుడు అధిక మాసాలతో సరిపెట్టుకొంటూవచ్చారు. ఈ మాత్రం శాస్త్రజ్ఞానము లోకవ్యవహారానికి తప్పనిసరి అయింది.

నిత్యవ్యవహారాలకోసం శాస్త్రం అవగతం చేసుకోటానికి పైమెట్టుగా, మనచుట్టూజరిగే సంగతు

ఏమిటో తెలిసికొందామను కౌతూహలం, Disinterested Curiosity), శాస్త్రాభివృద్ధికి దోహదమిచ్చింది. బేబిలన్ పూజారులు కొందరు, దైనిక వ్యవహారమునకు పంచాంగం ఏర్పడ్డతర్వాతకూడా, నక్షత్ర, గ్రహ, గతులు జాగ్రత్తగా పరిశీలింపసాగారు. సూర్యాది గ్రహాల ఉదయాస్తమానాలు లిఖితపూర్వకంగా జాగ్రత్తపరచి ౬౦౦ బి. సి. నాటికి సూర్యచంద్రుల భావిగతుల లెక్కించి గ్రహణముల నిరూపించ నేర్చారు.

ఈ మాత్రను శాస్త్రజ్ఞానము వచ్చుటకు చాలా కాలము పట్టినా ఈజ్ఞాన మభివృద్ధి పొందటానికి శాస్త్రకౌతూహలము అభివృద్ధినొంది నిరపేక్షితంగా శాస్త్ర మభ్యసించటానికి త్రోవతీసింది. కాని గుణకార మీమాత్రపు పరిస్థితి నందినవెంటనే శాస్త్రజ్ఞానము మరల నిత్యోపయోగమునకుగా వాడబడినది. అంటే సేద్యావసరాలకు కాదు ఇంకో ప్రక్క త్రోవ తీసింది. ఖగోళశాస్త్రాధారంగా జ్యోతిష మభివృద్ధి పొందింది. మానవజీవితంలోని భావిఫలాలను చెప్పడానికి, చూడటాని కుపయోగపడిందీ శాస్త్రజ్ఞానం. ఖగోళశాస్త్రం, జ్యోతిషాని కంగముగా తయారయింది. జ్యోతిషానికి కాకుంటే ఖగోళశాస్త్ర మనవసర మనిపించింది. ఈ దృష్టి నపహసించవలసిన అవసర మేమీ లేదు. ఎందుకంటే, శాస్త్రజ్ఞానముమీద ఆధారపడి, శాస్త్రదృష్టి జనియించింది కాని శాస్త్రదృష్టిమూలకంగా శాస్త్రజ్ఞానము పుట్టలేదు. ఆనాటికున్న జ్ఞానం కొద్ది. అందుచేత విపులమైనది, విశదమైనది, ఇతర కామ్య మపేక్షించనిది, ఐనశాస్త్రదృష్టి కలుగవలసిన అవసరం కలుగలేదు. తెలిసినశాస్త్ర విషయాలనుబట్టి వాళ్లు కొన్ని కొన్ని శాస్త్ర సూత్రాలను ఏర్పరుచుకొన్నారు. క్రొత్తవిషయాలేవైనా తెలిస్తే ఈసూత్రాలతో అవి సమన్వయించుకో ప్రయత్నించేవారు. అంతే గాని సూత్రాలను విపుల మొనర్చుకో ఎక్కువప్రయత్నించుకోలేదు. నేటిఖగోళశాస్త్రానికి ముఖ్యసూత్రాలను ఉపపాదించిన కెప్లరు, (Kepler) ౧౭-వ శతాబ్దములోకూడా, తన ఖగోళశాస్త్ర పరిశోధనాజీవితం గడపుకొనేందుకు, జ్యోతిషం చెప్పకొని కుత్తు తీర్చుకొనేవాడు. ఖగోళశాస్త్రానికి ముఖ్యోపయోగము ఇల్లా భవిష్యత్తుపై కోతలుకోసి ఉదరపోషణ మొనర్చుకోటం కాదని అతను పూర్తిగా ఎరిగివుండి బాధపడేవాడు.

నిత్యజీవితావసరాల్లో ఖగోళశాస్త్రం పుట్టింది. వైద్యశాస్త్రంకూడా ఇల్లాంటిదే కాని వైద్యశాస్త్రం విషయాల్లో ఒక చిన్న వింత ఉన్నది. ఈ శాస్త్రజ్ఞాన మభివృద్ధి పొందటానికి నైసర్గికస్థితులు చాలా అవసరమయాయి. కొండనేలల్లో భూకంపా ద్యగ్నిపర్వతాలమధ్య, వసించిన మానవజాతులకు, పంచభూతాలు ప్రబలశత్రువులుగాను తదధిపుడైనదైవం, లంచాలతో తృప్తి పరపించవలసిన మహా క్రూరుడుగాను అనుపించాడు. అందుచేత రోగనిదానంకన్నా ఈ దేవతానిదాన మెక్కువ ప్రాముఖ్యత నందింది. జబ్బుకు తిరుసు, మ్రొక్కుబళ్లు బలులూ అయాయి. నైలునదీపోషిత ఐగుప్తీయజాతులకు జీవిత మింతకన్నా చాల సుఖంగా గడిచి, పంచభూతములు మిత్రులుగాను తదధిపుడు ప్రసన్నుడుగాను కనబడ్డారు. అందుచే దృష్టివైశాల్య మేర్పడి, రోగనిదానము, తన్నివారణ కవసరమైన శాస్త్రజ్ఞానము ముఖ్యమై శాస్త్రాభివృద్ధి నొందించాయి. మనకుకూడా చాలామట్టుకు ఈ పీడ కలుగబట్టి వేదచతుష్టయంలో ఆయుర్వేద మొక దానికి ముఖ్యాంగంగా ఏర్పడింది. ఐగుప్తీయులు మృతకళేబరాలను జాగ్రతపరచటంలో శారీరక శాస్త్రం తక్కినవారికన్నా కొంచెం ఎక్కువ నేర్చారు. శుశ్రుతాదులు వీరిని తలదన్నారన వచ్చునుగాని, వీరి జ్ఞానానికి ఐగుప్తీయ శాస్త్రజ్ఞానము మూలకమేమో అన్న సందేహాని కంత త్వరగా జవాబు చెప్పలేము.

ఈ స్థితివరకూ అభివృద్ధి నందిన శాస్త్రమూ, శాస్త్రదృష్టీ, పై చెప్పబడిన మొదటితరగతికి చెందుతాయి. ఆ శాస్త్రజ్ఞానము కూడా మతంతో, మిళిత మొనర్చబడి, శంఖంలో పోసిన తీర్థమయింది.

గ్రీకునాగరికతకు వచ్చేదాకా సరియైన (Scientific spirit) ఏర్పడలేదని చెప్పవచ్చును. క్రీ. పూ. ౫౦౦ లో థేల్స్ అనునతడు ప్రపంచం, ఎల్లా, దేనివల్ల ఏర్పడింది, అన్న పృచ్ఛతో సరియైన శాస్త్రదృష్టికి త్రోవ తీశాడు. (భారతీయు లీమధ్య సోపాన

ముల నన్నిటిని విడిచి "తన్నుతా తెలిసికో వలెనని" దృష్టి వేరుగా మార్చి, శాస్త్రదృష్టిని వేదాంతదృష్టిగా పరివర్తన మొనర్చారు) "దీనివల్ల ఉపయోగమేమిటి" అన్న శాస్త్రదృష్టిని "దీని అసలుసంగతేమిటి" అన్న ప్రశ్నతో, ఇతరాపేక్షితము లేని, **(Knowledge for Knowledge)** దృష్టి ఏర్పరుచుకొన్నారు. సరియైన శాస్త్రాభివృద్ధికి ఈదృష్టి పునాది.

ఐగుప్తీయులవల్ల ఉపయోగింపబడ్డ ప్రథమ గణితం, గ్రీకుల చేతుల్లో చాలచక్కని పరిణామ మందింది. హేతుక్రమము, వాదనాక్రమము దీనివల్ల జ్ఞానసంచయంలో బాగా అలవాటుపడ్డవి. **Euclid** ఉపపాదించిన గణితసూత్రాలు, గణితజ్ఞానము ఈనాటికీ చాలా ఉన్నత మైనదిగానే ఎన్నుకోబడుతోంది. గణితజ్ఞానముకన్న **Euclid** ఏర్పరచిన తర్కవిధానము మనోవికసనానికి చాలా ముఖ్యమయింది. ఈదెబ్బతో సృష్టిసూత్రాల రహస్యమంతా గణితశాస్త్రంలోనే ఉందని గ్రీకులు ఊహపడ్డారు. పైథాగరస్ పంథావారికి సృష్టిరహస్యాలన్నీ మొదటి తొమ్మిది అంకెలలో ఇమిడిఉన్నట్లు తోచింది. ఈ అంకెలకు ఇతరగుణాలు ఆపాదింపబడ్డాయి. (నేటి **Cheiro,** న్యూమరాలజీ!

ఈభావం, (గణితశాస్త్రాధారంగా శాస్త్రజ్ఞానం) చాలా బలీయమైపోయి శాస్త్రాభివృద్ధికి చాలా సాయం చేసింది. గణితరూపకంగా నిరూపింపబడని శాస్త్రజ్ఞానం సరియైనది కాదన్న దృష్టి, **Leonardo de Vinci** లియొనార్డో డి విన్సీ, నుంచి నేటి మహాశాస్త్రజ్ఞులవరకు అవలంబించుకోబడ్డది. న్యూటన్ లో ఈబుద్ధి ఉన్నతస్థితి నందింది. పందొమ్మిదవ శతాబ్దపు శాస్త్రకారులకు, గణితావలంబితమైన ఇంజనీరింగ్ మోడల్ గా చూడబడనివస్తుప్రకృతి శాస్త్రీయము కాదన్న ప్రబలనమ్మకం కలిగింది. క్షేత్రగణిత నిరూపితమైన చిన్న యంత్రంగా ఊహించకోబడని వస్తుప్రకృతి అశాస్త్రీయ మైపోయింది.

నే డీదృష్టి ఇంకో పై మెట్టెక్కినది. ఐయిన్ స్టీన్ చేతుల్లో ఈదృష్టి తారుమారయింది. క్షేత్రకాలమానసృష్టీ తారుమారొనర్చబడింది. ఊహాధిక్యంలో గణితాధారకమైన ప్రకృతిశాస్త్రం, **Tridimensional space** లో ఇముడక, పైకి పాకింది. మనకన్నులముందు కనబడే రూపాలుగా చిత్రించుకోదగ్గ యంత్రరూపక శాస్త్రం, మూలసూత్రాలకోసం వెదకటంలో విచ్ఛిన్నమయింది. ప్రకృతి కేవలం గణితాధారకంగాను, దైవమంటూ ఒక డుంటే అతడు మహాగణితజ్ఞుడుగాను ఊహించుకోటం పరిపాటయింది. ఈశాస్త్రదృష్టి పైచెప్పబడిన ఉత్తమతరగతికి చెందుతుంది.

కాని ఇల్లా గణితబద్ధం ప్రకృతి అనుకోటంలో లోటుపాట్లు కొంత లేకపోలేదు. ఈతర్కం ధారా మాత్రంగా జేన్స్, లాడ్జిమొదలగు నేటిమహాశాస్త్రవేత్తలవాక్యాలు వింటే, కొంతవరకు తెలుస్తుంది. దైవము గణితజ్ఞుడనుకోటంలో ఉన్న సంకుచితత్వం వారు కొంత విశదంగా స్ఫురింపచేస్తారు.

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు

శ్రీ వడ్లమూడి వేంకటరత్నం

శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువు సమగ్రము కా దని వ్రాసిన నా విమర్శనము బరామర్శించుచు పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రిగారు విక్రమసం॥ ఆషాఢ మాస (౧౯౪౦ జులై) భారతియం దొక వ్యాసమును వ్రాసియున్నారు. అందు వారు అగ్ర్యము అనునపుంసక శబ్దము నిఘంటువులో నున్నదే యనియు, అవసథము అనుపదము దుష్టమనియు, గాన వాచస్పత్యాదు లిచ్చినను ప్రమాణనిఘంటువు లీయ నక్కరలే దనియు వ్రాసియున్నారు. అయిన నేమాయె? నిఘంటువు సమగ్ర మగునా?

"విమర్శకులు తమ వ్యాసమునుండి యెత్తి నేను జూపిన దోషములలో గొన్నింటిని దోషములు గావని సమర్థించుకొనుటకై మిక్కిలి యత్నించినారు." అని శాస్త్రిగా రనుచున్నారు.

నా వ్యాసమున వారు చూపినదోషములను దోషములు కావని సమర్థించుకొనుటకు నేను మిక్కిలి ప్రయత్నింపవలసి వచ్చినదో, నిఘంటువు సమగ్రము కాదని నే నారోపించిన పెక్కులోపములలో పెక్కింటి విషయమున మూకీభావము వహించి, నే నుదాహరించిన గ్రాంథికపదము లన్నియు నున్నవే యని(యీ యొక్క విషయము నయినను)సమర్థించుకొనుటకు వారు మిక్కిలి ప్రయత్నింపవలసి వచ్చినదో పాఠకు లెరుగుదురు. దీనినిబట్టి తమమీది చిక్కులను శాస్త్రిగారు నిస్సంకోచముగ — లోకము నమ్మునట్లు — ఇతరుల నెత్తిపై కెట్లు త్రోయగలరో తెలియగలదు. ఇట్టిప్రయత్నములను రెండుమూటిని నా పూర్వవ్యాసములలో చూపియున్నాను.

"అన్ని విషయములను మరల జర్చించుట మొదలిడిన నేనుగూడ నెన్ని భారతుల నిండింపవలసి యుండునో." అని శాస్త్రిగా రనుచున్నారు. భారతులు నిండునేమో యని శాస్త్రిగారు సంకోచింప నక్కరలేదు. అర్థవంతములగు వ్యాసములను భారతి యాహ్వానించును. పాఠకలోకము స్వాగత మిచ్చును.

"వాచస్పత్యము చేసిన పదచ్ఛేదము సరియైనది కాదు; ఆ విషయమును బరిశీలింపక ఆప్తే మున్నగు వారు వాచస్పత్యమునుండి రెండు శబ్దములు స్వీకరించినారు, అది సరికాదు." అని శాస్త్రిగారు అవసథ శబ్ద విషయమున తమనిఘంటువును సమర్థించుకొనుటకై వాచస్పతి, ఆప్తే మున్నగు పండితులను సయితము అల్పజ్ఞులని దూషింపసాగినా రని పాఠకులకు సరలముగనే తోచును.

"మహాకవిప్రయుక్తము లైనచో నేదో యొక ప్రక్రియ నాశ్రయించి సాధింపవలసియుండును." అన్న శాస్త్రిగారి వచనమునుబట్టి సాధింప దలచుకొన్నచో నేదో యొక ప్రక్రియ నాశ్రయింప వచ్చుననియేగదా! మహాకవులు కాకున్నను వాచస్పత్యాదులను అల్పజ్ఞలనుటకంటె వారి గౌరవమును కాపాడుటకైనను ఆ పదమును స్వీకరింపరాదో! 'అంగమొల' మొదలగు వ్యాకరణ దుష్టపదములను వీ రిచ్చియున్నారు. ఏ మహాకవిప్రయుక్తములని వీరు గ్రహించినారు? ఇట్టి దుష్టములను ప్రయోగించినవారిని సాహిత్యపరిషత్తువారు మహాకవులుగా నంగీకరించుట వింతయే. ఇట్టిపదములకు శబ్దరత్నాకరము నుదాహరించియున్నారే! తత్కర్తలు మహాకవులా? శబ్దరత్నాకరమునుండి 'అంగమొల' మున్నగుపదములు గ్రహించుట విద్వాంసుల యాదరణపాత్రమయి ఆప్తే మున్నగువా రుదాహరించిన 'అవసథ' శబ్దమును గ్రహించుట విద్వాంసుల యనాదరణమునకు పాత్ర మగునా? లేక తాము స్వీకరించినవాని నాదరించువారును, తాము వదలినవాని ననాదరించువారునే విద్వాంసులా!

"...నిఘంటువు బండితులను దూషింపవచ్చునా?" అను శాస్త్రిగారు ఇతరులను దూషించుటకు తాము వెనుదీయరు. తమ నిఘంటువును, పరిషత్పండితులను దూషింపరా దని వారితలంపు.

దివంగతులు కళాప్రపూర్ణులు, రావుసాహెబు గిడుగు వేంకటరామమూర్తి పంతులుగారు నిఘంటు దోషములను జూపుచు ప్రతిభపత్రికలో కొన్ని వ్యాసములు వ్రాసియుండిరి. అందు కొన్ని విషయములకు ఈ శాస్త్రిగారే సమాధానము వ్రాసి సాహిత్య పరిషత్పత్రికలో ప్రకటించియున్నారు. దానిని జూచినచో వీరికలము వడిపెనను బాగుగ తెలియగలదు. మచ్చునకు

శ్రీ పంతులుగా రొకతావున

"మీరిది ఎనిమిది పేరాలలో చూపించిన దోషాలకూ లోపాలకూ ఉత్తరవాదు లెవరు?" (ప్రతిభ ౨౦౮ పుట) అని ప్రశ్నించియున్నారు శాస్త్రిగారు దీనికి సమాధానము వ్రాయుచు

"నిజముగా దోషములు, లోపములు నున్నయెడల వానికి నిఘంటుకర్తలే యుత్తరవాదులు. కాని గుణదోష నిర్ణయమునకు బహుగ్రంథ ద్రష్టలు, ద్వేషరహితులు, ఉభయభాషా పండితులు నగు విమర్శకులుమాత్రమే యర్హులు." అని వ్యంగ్యపూర్వకముగా 'గిరాంమూర్తిగారు' బహుగ్రంథ ద్రష్టలు కారనియు, ద్వేషసహితు లనియు, ఉభయభాషా పండితులలో చేరరనియు ప్రకటించియున్నారు. శాస్త్రిగారివంటివారు వాచస్పతి, ఆప్తేవంటివారిని నిందింపవచ్చునుగాని 'గిరాంమూర్తి' వంటివారు సూర్యరాయాంధ్రనిఘంటువును విమర్శింప దగరట! విమర్శకు లెటు లుండవలయునో చెప్పినారు గాని సమగ్ర నిఘంటురచయిత లెటు లుండవలయునో చెప్పలేదేమి శాస్త్రిగారు?

ఈ సందర్భమున శాస్త్రిగారి మాట నొక్కదాని నుదాహరించుట అప్రస్తుతము గాదు.

పైని సూచించిన రామమూర్తి పంతులుగారి విమర్శనకు సమాధానమును ఈశాస్త్రిగారు వ్రాసినారు. (అది రామమూర్తిపంతులుగారు లోకమును వీడినవెనుక సాహిత్యపరిషత్పత్రికలో — ప్రమాథి మార్గశీర్ష పౌష మాసములలో ప్రకటింపబడ్డది.) ఆ పత్రికలోని యీ సమాధానభాగమును, నా కొకప్రతిని పంపియున్నారు. ఆ గ్రంథభాగముపై శాస్త్రిగారు స్వహస్తముతో నిట్లు వ్రాసియున్నారు.

"శ్రీ వడ్లమూడి వెంకటరత్నంగారికి యాశీః
పూర్వకముగా రచయిత పంపినది
పి. విశ్వేశ్వరశాస్త్రి
౨౪-౨-౪౦"

పుస్తకము మాత్రము పుచ్చుకొని యాశీస్సులలో నాకు అక్కరలేని వేమైన నున్న వేమోయను అనుమానముతో వానిని ప్రస్తుతము అనామకులలో నుంచినాను. ఏమనగా సామాన్యాశీర్వాదవిషయములలో కొన్ని నాకీవఱకే యున్నవి. ఆ విషయముల నిక నాశీర్వాదముల పనిలేదు. తమ్ము విమర్శించుచున్నను నాయెడ పగచూపక పోవుటయగాక, అయాచితముగనే, ఆశీస్సులిచ్చిన శాస్త్రిగారియుదారత ప్రశంసార్హమే. కాని "...గారికి యాశీ..." అన్నారే. ద్రుతప్రకృతికము మీద నీయడాగము మెండులకు చేసినారా యని సందియము గలుగుచున్నది. ఇంత చిన్నవిషయము వారికి తెలియ దని నే ననను గాని,

"... గారికి నాశీః-" అని నకార పూర్వకముగా ఆశీః పదముంచుట ప్రయోజనకరము గాదని యయి యుండును. మఱి యడాగము చేయ నేల? ఉచితముగా నిచ్చు ఆశీస్సులుగూడ అంత నిర్దుష్టములుగా నుండవలయు ననియూ రేమి? పోనీ! స్వరమేల వ్రాయరాదు? వారు ప్రాణమును ప్రత్యేకముగా నుంపక వ్యంజనముతో జేర్పదలచి యుందురు. లేక వ్యావహారికఫక్కీయా? వారు వ్రాసిన ధోరణి చూచినచో అట్లనజాలము. అదియే యయినచో 'గిరాంమూర్తి' ని సంస్మరించుచు భ్రమరకీటన్యాయముగా వీ రిట్లుపక్రమించిరేమో!

నిఘంటువునుగూర్చి నే నెన్ని యాక్షేపణలు చెప్పినను అందున్న మహత్త్వమును ప్రశంసింపక తప్పదు. ఆంధ్రమునం దీవఱకున్న నిఘంటువులనుబట్టి చూచినచో నిది సర్వవిధముల నుత్తమమైన దనుటకు వెనుకాడ నక్కరలేదు. శబ్దబాహుళ్యమునగానీ, అర్థ

వివరణమునగానీ, అర్థవిశేషములగాని, లక్ష్యప్రదర్శనమునగాని యిది ఆంధ్రభాషకపూర్వమే. కాని ఆదర్శనిఘంటుస్వరూపముతో బోల్చినపుడు ఇది చాల దిగువ మెండకతప్పదు.

"ఎన్నిలోపము లున్నను సూర్యరాయాంధ్ర నిఘంటువు ఆంధ్రసారస్వతమున కొక యలంకారము కాకపోదు"

ఆంధ్రపత్రిక, ప్రధానవ్యాసము (౨౭-౩-౫౦) అన్న ఆంధ్రపత్రికాభిప్రాయము యథార్థము. ఈ నిఘంటువున గుణములే లేవనిగాని, దోషములే లేవనిగాని సమర్థింపబూనుట బయలీయరాదు. గుణములు చూచి సంతసింప వలెనుగాని లోపములను చూడక యుపేక్షించుట ఆంధ్రసారస్వతాభివృద్ధికి గొడ్డలిపెట్టు. కనుక లెస్సగా పరకి, తర్కించి, ఉన్నలోపములను తొలగించి నిఘంటువును సర్వగుణసంపన్నముగా జేయుటకు ఆంధ్రులు పూనుకొనవలసి యున్నది.

మొన్న నీ నడుమ తిరుపతిలో జరిగిన అఖిల భారత ప్రాచ్యవిజ్ఞాన పరిషత్తు — ఆంధ్రసారస్వత శాఖ-అధ్యక్షులగు శ్రీయుత కోరాడ రామకృష్ణయ్యగారును, ఉపన్యాసకులగు మానవల్లి రామకృష్ణకవిగారును "ఆంధ్రభాషావ్యుత్పత్తిక్రమమును దెలుపు నిఘంటు వొకటి తయారుకావలయును." అని తెలిపి యున్నారు.

నవ్యసాహిత్యపరిషత్తువారు సమగ్రనిఘంటు వొకటి తయారుచేయింప నున్నారనియు, అందులకు కావలసిన సాధనసామగ్రి చాలవఱకు 'గిరాంమూర్తి' గారే సంసిద్ధపఱచియుంచినా రనియు తెలియుచున్నది. కళాప్రపూర్ణుల పరిశ్రమ సమగ్రనిఘంటు రచనముతో సఫలమయ్యెడిది. ఆంధ్రుల యలసతవలన నా యదృష్టము పట్టలేదు.

ఆంధ్రవిశ్వవిద్యాలయమువారికిగూడ సమగ్ర నిఘంటు వొకటి రచియింపవలయు నని యున్నట్లు తెలియుచున్నది. కనుక ఆంధ్రు లీ యవకాశము నాధారముచేసికొని యనతికాలముననే యొక సమగ్ర నిఘంటువును రచియించుకొని, ఆంధ్రిని సాటిభాషలలో తల యెత్తుకొని తిరుగునట్లు చేయుదురుగాక! గవాను డాంధ్రుల ప్రయత్నమును సఫలపఱచుగాక!

గచ్చపొద

శ్రీ సింగరాజు సుబ్బారావు

ఏను ఏడేండ్లవాడనై ఈప్రపంచ
మేమొ ఎఱుఁగనియప్పుడు, ఎడఁద శిశిర
మందు కొబ్బరిమోవుపై చిందులాడు
హిమకణమటు లున్నప్పుడు, మమతగాని
మహిమగాని లేనప్పుడు, మంచి చెడ్డ
లెఱుఁగనప్పుడు, తెల్లని వెల్ల పాలు
కల్లనివి నీ రనుకొనుచు కల్లకపట
మెఱుఁగనప్పుడు, మే మొకయింట నుండి
నాము : ఆయింటి దొడ్డిలోన నొకమూల
గచ్చపొద పెద్ద దొక్కటి గలదు :

మా ము —

కుందు, శ్రీహరి, మోహన, గోపి, ప్రతిది
నమ్ము బడికి స్వస్తి నుడివి క్రమ్ముకొనియు
దాఁగురింతల నాడువిధంబు గలదు —
దొంగ నెప్పుడు కాలేదు దొరకను నేను—
"ఒకటి,", "రెండు", "మూడ"నుటతోనే -

కనుమూఁత

లోనె గచ్చపొదమఱుగులోన నక్కి-
కిక్కురనక గూర్చుండి నిక్కి యును నిక్కి-
చూచుచుండెడివాఁడను చుంచువోలె—
నాఁటిఉత్తమహృదయములోన కాచినట్టి
సకలవార్నిధికూటముల్ వికృతగతి న
దేమొ ? చెలరేఁగుచుండెడి వెందువలనో?
ఆఁకొదిగిన ముండ్లి టొదిగిన నవియె !!

బైట

పడిన యప్పుడ నిప్పులపైన నీరు
చల్లిన ట్లుండెడిది: ఒకక్షణములో య
థాప్రకార ముండెడివాఁడ:

తరలిపోయె

నాదినంబులు; ఈ లోక మంత నేడు
పెద్ద గచ్చపొద యయ్యె! పెనగులాడి
బైటపడుమార్గమును గనంబడుట లేదు !!

— —

బాల్యస్నేహం

(కథ్యం)

వెంకడు కలకత్తాకు వచ్చి చాలా దినా లయినది. చేతిలోని డబ్బులు ఖర్చయి పోతూ రాగా ఎక్కడయినా పని దొరుకు తుందా అని చూశాడు. సరియయినది ఎక్కడా దొరక లేదు. ఇంతకూ వానికి బెంగాలీగాని హిందూస్థానీగాని బాగా రాదు. మరి కలకత్తాలో తెనుగువారు చాలా తక్కువ. చివరకు కబుర్లు చెప్పుకొ నేటందుకు కూడ మనుష్యులు కనబడ లేదు.

ఈస్థితిలో ఉండగా వెంకడికి ఒకనాడు గంజాముజిల్లానుంచి వచ్చిన ఒక ఒరియా మనిషి గుర్తయినాడు. వాడికి కొద్దికొద్దిగా తెలుగు తెలుసు. మహాసముద్రంలో మునుగు తుండేవానికి పడవ చెక్క కనిపించినట్టు అతడు కనబడగానే వెంకడికి ప్రాణాలు లేచివచ్చినవి. జగబంధుపట్టనాయికుడే తనకు పరమబంధు వని ఎంచి, వానితో కలిసి కొన్నిరోజులు ఉల్లాసముతో తిరుగుతుండేవాడు.

జగబంధు ఒక కిల్లీ దుకాన్దారుడు. పగ లల్లా అందులో బేరం చేసుకుంటూ రాత్రి దాని వెనుకనున్న ఒకచిన్న గదిలో నిద్రపోతూ అతడు కాలం గడుపుతుండే వాడు. వెంకడుకూడా జగబంధు లేనప్పుడు ఆదుకాణంలో బేరం జరుపుతూ వాని చిన్న గదిలోనే భోజనపానాదులు చేస్తూ కొన్ని దినములు గడిపాడు.

ఒకనాడు మధ్యాహ్నం, దుకాణానికి హిందూస్థానీయువతి యొకతె వచ్చి కిల్లీ లడి గింది. జగబంధు లేడు. వాని స్థానంలో కూర్చున్న వెంకడు తొందరగా కిల్లీకట్టి చేతి కిచ్చాడు. వెంటనే దానిని తీసుకొని ఆమె చక్కా వెల్లింది. వెంకడు "పైసా పైసా" అని కేక లేస్తుంటే బదులు చెప్పక వెనక్కు చూచి నవ్వుకుంటూ ఆమె తనదారి తాను బట్టింది. వెంకడికి ఏమి చేయాలో తోచ లేదు. దుకాణం విడిచి ఆమెవెంబడి పోలేడు. కిల్లీ డబ్బు నష్టపడడానికి మన స్సొప్పదాయెను. అందువల్ల "పైసా, పైసా" అని బిగ్గరగా కేక వేశాడు! దానితో గుంపు పోగయింది. "ఏమి ఏమి" అని వారందరూ వెంకణ్ణి అడి గితే బదులు చెప్పడానికి భాష రాదు. ఈ విధంగా ఒకపావుఘంట దాటింది. అంతలో పోలీసువాడు వచ్చి గుంపును చేర్చినదానికి దుకాణదారుణ్ణి మందలించాడు. పోలీసు రాకతో గుంపు తరిగిపోయింది.

ఇంతలో జగబంధు వచ్చాడు. తన కష్టాలన్నీ ఒకటేమాటు అతనితో చెప్పు కుందామని ఎదురుచూస్తున్న వెంకడికి జగ బంధుముఖం చూడగానే మాటతోచ లేదు. హటాత్తుగా జగబంధు అన్నాడు- "నా దుకాణం విడిచి వెళ్లు. ఇక్కడ ఒక్కనిమిషం నీవుండకూడదు." వెంకడు నిర్ఘాంతపోయాడు. తాను చేసినదానిలో ఏ తప్పూ అతనికి కన బడలేదు. సమాధానం ఏదో చెప్పబోయాడు కాని జగబంధు నసేమిరా అని వినడాయెను.

దానితో వాని యాత్రలు కలకత్తాలో మరల మొదలయినవి.

పాపం! పల్లెటూరినుంచి మొట్టమొదట మహానగరానికి వచ్చిన వెంకడికి నగరపరిస్థితు లేమిదెలుసు? దుకాణదారునికి స్నేహితురాలయిన ఆ యువతిని డబ్బడగ కూడదని తెలియదు. దుకాణాలదగ్గిర అల్లరిచేసేగుంపు పోగుచేయకూడదని తెలియదు.

తన గ్రామం విడిచివెళ్లినపుడు వెంకడు పాతికరూపాయలుమాత్రం చేతబట్టుకొని వెళ్లాడు. అయితే కొన్ని దినాలలోనే ఆ మొత్తం కలకత్తాలో కృశించింది. తర్వాత అతను చాలా భయపడుతూ వచ్చాడు. తిరిగీ యింటికి పోదామంటే తగినంతడబ్బు లేదు. కలకత్తాలోనే ఉందామంటే అందుకూ చాలదు. ఏం చేయనురా భగవంతుడా అని ఒకనాడు చౌరంగీమైదానంలో యోచిస్తూ కూర్చున్నాడు కడుపు మాడుతూండినా తక్కిన రూపాయలను ఖర్చుచేయకూడదని. అల్లే కూర్చోగా ఆయాసంవల్ల నిద్ర వచ్చింది. వేసవికాలం, చమటలు కాలువలుగా దేహంనుంచి కారుతున్నవి. పైదుస్తులనన్నిటిని విప్పి తలకిందపెట్టుకొని వెంకడు అక్కడనే నిద్రాపరవశు డయినాడు.

వేకువజా మయింది. వాని కింకా మెలకువ రాలేదు. అయితే కొద్దిగా చలిగాలి వీచిన దానివల్ల పై నొకగుడ్డను కప్పుకొని నిద్రిద్దా మనుకొన్నాడు. తన గుడ్డలమూట కోసం వెదికాడు, అది మాయమయినది. దాంతో అతనికి మెలకువపూర్తిగావచ్చింది. ఎక్కడ చూచినా మూట దొరకలేదు. తన రూపాయలుకూడ అందులోనే ఉన్నవని జ్ఞాపకంవచ్చింది. గుండె ఝల్లుమన్నది. కట్టుబట్టతప్ప అతని దగ్గిర ఏమీా లేదు. కాళ్లు చేతులు కదలక నిలుచునేందుకు శక్తిలేక అక్కడనే కూలబడ్డాడు.

కొంతసే పయినది. అతనిబుద్ధి చాలా చురుకుగా పనిచేయ నారంభించింది. ఆ కలకత్తామహానగరంలో తన స్నేహితు డొకడున్నాడని జ్ఞాపకం వచ్చింది. పాపన్న తన బాల్యస్నేహితుడు. ఇద్దరూ చేరి గోలీలాడుకునేవారు. అయితే పదిహేనుసంవత్సరాల క్రిందట పాపన్న కలకత్తాకు వచ్చియుండెను. అతడు గ్రామంయొక్క తనబంధువులతో జాబూ జవా బేమీా పెట్టుకోక పోయినా, చాలా ధనం సంపాదించాడనీ ఒకమోటారు కూడా బెట్టాడనిన్నీ, చాలామాట్లు వెంకన్న వినిఉన్నాడు. ఆ జ్ఞాపకంతో అతనికి ధైర్యమేగాక దేహశక్తికూడ వచ్చింది. "ఈ ఊరిలోనే ఉండే మన పాపన్నను కనుక్కోలేనా? అందులో సాధారణ మనిషికాడు! మోటారుకూడా ఉంచాడు" అంటూ పైకి లేచి వడివడిగా నడవనారంభించాడు.

ఆ రోజల్లా వీథిలోని మోటారుల నన్నిటిని చాలా జాగ్రత్తతో పరీక్షిస్తూవచ్చాడు. అప్పు డప్పుడు పాపన్న తన్ను బాల్యస్నేహితునిగా గుర్తించునా గుర్తింపడా, గుర్తించి నను ఆదరించునా లేదా అనేటి సందేహాలు వచ్చేవి. అయితే వాటిని వెంటనే అణగదొక్కేవాడు. "పాపన్న ఎంతో మంచివాడు. అందులో బాల్యస్నేహిత మంటే విశేషం. ఎప్పటికీ మరవడు. తప్పక గుర్తిస్తాడు. ఆదరిస్తాడు. ఈ సందేహ మేమిటి? నాముఖం" అనుకునేవాడు!

ఆనా డల్లా తిరిగాడు. పాపన్న కనబడలేదు. అయితే, చూడగా చూడగా మోటారుల్లో తేడా లున్నాయని తెలిసింది! "పెద్ద

మోటారా? లేక చిన్న మోటారా? మన పాపన్నది" అని సందేహంవచ్చింది! "పెద్దదే అయియుంటుంది! పదిసంవత్సరాలుగా డబ్బు సంపాదిస్తున్నాడే, వెధవ చిన్న మోటా రెందుకు పెట్టాలి? దర్జాగా పెద్దమోటారే పెట్టుంటాడు" అని సమాధానం తెచ్చుకున్నాడు!

రెండవరోజల్లా గడిచింది. లాభం కనబడలేదు. మూడవనా డొచ్చే టప్పటికి వెంకన్న ఎవరినయినా అడుగుదా మనుకున్నాడు. ఆ ఉద్దేశంతో ఒకకారు వీథిలో నిలబడియుంటే దాని దగ్గిరగా వెళ్లాడు. వెనుకనుంచి బలవంతంగా ఎవరో తన్నులాగి ఆవల పారేశారు. దానితో పోయి దూరంగా నేల కూలబడ్డాడు. ఎవరురా యింత పనిచేసిందని చూస్తే ఒకదర్వాను. ఆకారు ఒకపెద్ద షాపుదగ్గిర నిలుచుంది. దానితలుపు తీయడానికని ఆ దర్వాను వస్తూంటే దానికడ్డుగా వెళ్లాడు వెంకడు. వెంకణ్ణి జూచి ఆ కారులోని దొరసాని దగ్గరికి వచ్చి వాని చేతిలో ఒక అణాడబ్బు పెట్టి ఏదో చెప్పుతూ ఆషాపులోనికి వెళ్లింది. అయితే దర్వానుమాత్రం వాడిని చురచుర చూస్తూనేయుండెను. జంకి అణా డబ్బులు చేతబట్టుకొని వెంకడు త్వరగా అక్కడినుంచి వెడలిపోయాడు.

ఎనిమిదిరోజులు కడచినాయి. పాపన్న ఎక్కడా కనబడలేదు. వెంకడిస్థితి నానాటికి కష్టతర మవుతూవచ్చింది. దొరసానిచ్చిన అణాడబ్బులు ఎప్పుడో సెలవయిపోయినవి. తర్వాత ఆహారమే లేదు. ఏమీ తోచక ఆ మహానగరంలో ఇటూ అటూ తిరుగుతుంటే వాడికి ఒకనాడు హఠాత్తుగా జగబంధు దుకాణం కనబడింది. ఏమయినా సహాయం కోరుదామని నోరెత్తేందుకుముందే జగబంధు ఒకబీడి వాడిముఖాన పడేసి పొమ్మన్నాడు. నిరాశతో అట్లే కాళ్లీడ్చుకొని కొంచెం ముందుకు వెళ్లి అక్కడ ఒకమూల కూర్చున్నాడు. చెవులు ఓరుమనినాదం చేస్తున్నవి. అయినా అతడు వచ్చేపోయే మోటారులను మాత్రం పరీక్షిస్తున్నాడు

చిట్టచివరకు అతని ప్రయత్నము సఫలమయినది. ఒకమోటారు వచ్చి అతనిదగ్గిర ఆగింది, డ్రైవరు దిగి వెంకన్నను లోపలికి వచ్చి కూర్చోమ్మన్నాడు. "మా మాస్టరు గారు మీ రలా పోతుంటే చూచారండి! బాల్యస్నేహితులు వారి నింటికి తీసుకొని వెళ్లు. కావలసిన ఉపచారా లన్నీ జరగనీ అంతలోనే నేను వచ్చి వారిని తెలుసుకుంటాను అని నాకు సెలవిచ్చారండి" అన్నాడు.

తన అదృష్టానికిన్నీ, ఆనందానికిన్నీ కన్నీరు కారుస్తూ వెంకడు గొప్పభవనము చేరాడు. మెట్లెక్కుతుండగానే ఒకయువతి చిరునవ్వుతో ఆహ్వానించి లోపలికి పిలుచుకొనిపోయినది. ఆమెను చూడగా చూడగా అతనికి చిన్నప్పటి సంగతి జ్ఞప్తికి వచ్చింది. ఆమె చిన్నప్పుడు తమతో ఆట్లాడుతూండిన రామక్క.

"మీరు రామక్కగాదా?" అని అడిగాడు.

"అవునండీ! మీరు పోల్చుకోగలరో లేరో అని నే నూరకున్నాను"

"పోల్చుకోలేకేమమ్మా? మీరు ధనికులయినా నన్ను పోల్చి ఆదరించేటప్పుడు మిమ్మును నేను పోల్చుకోలేకపోవడమేమిటి? బాగుంది" అన్నాడు.

"లేచి స్నానంచేయండి. ఏదయినా ఫలాహారం చేతురుగాని; ఇంతలో మామయ్య యింటికొస్తాడు!" అన్నది.

వెంకన్నను నౌకరు వకడు వెంట బిలుచుకొనిపోయి స్నానం చేయించాడు. క్రొత్త ఉస్తులను మరొక డందించాడు. అంతలో ఫలాహారపదార్థాలు తయారు కాగా వెంకన్న చాలా ఆకలిగొన్నవాడు కాబట్టి యించుకయినా సంకోచం లేక వాటిని నిశ్శేషంగా తిన్నాడు. రామక్క ఉపచారవాక్కులు చెపుతూ ఎదురుగా నిలిచి యుండెను. తింటూ తింటూ వెంకన్న తన స్నేహితుని అదృష్టమును, ఔదార్యమును జూచి తనలో తానే మెచ్చుకుంటూ ఉండెను.

తిన్నతర్వాత, అతనికి తమ భవనమంతా రామక్క సగర్వంగా చూపించింది. లక్ష్మీకటాక్షం పూర్తిగా మీపై నున్నదని మాత్రం వెంకన్న తన ఆనందాన్ని కొంచెం అణచుకొని చెప్పగలిగాడు.

అంతలో నతడు ఆవలించడం చూచి రామక్క అన్నది—"మీరు వెళ్లి కొంచెం విశ్రమించండి! వారింటికి రాగానే నేను కబురంపుతాను!"

అనేకరోజులతర్వాత కడుపునిండుగా తిన్న వెంకన్నకు నిజంగా అలసట కలిగి యుండెను. అందువలన ఆమె సలహాకేమీ అడ్డుచెప్పక, తనకు చూపెట్టిన ఒక శయ్యాగృహాన్ని ప్రవేశించాడు.

నలుప్రక్కలా నిలువుటద్దాలూ, చిత్రవిచిత్రములయిన పటాలూ; పరుపుదగ్గిర చల్లని గాలి వీచుతుండే యొక ఎలెక్ట్రిక్ ఫానూ, ఇంక ఆ మంచం, ఆ పరుపూ, ఆ దోమలతెరా వీటినన్నిటిని జూచి వెంకన్న సంతోషంతో ఉప్పొంగిపోయినాడు. పైదుస్తులను దగ్గిర కుర్చీపైని పారవైచి మంచంపై పడుకున్నాడు. తాను కలకత్తాకు వచ్చినప్పటినుంచీ తనకు జరిగిన కష్టాలన్నీ జ్ఞాపకం వచ్చినవి. తుదకు తన యదృష్టాన్ని చూచుకొని తనలో తాను నవ్వుకున్నాడు. అల్లే కళ్లు బరువు కాగా నిద్రాపరవశు డయినాడు.

అయితే, వెంకన్న మేలుకొన్నది పరలోకంలో? వీధిలో గుంపు కూడింది. పోలీసు భటు డొకడు తన కఱ్ఱతో దానిని దూరముంచుతూన్నాడు. మధ్య ఒక ప్రేతం ఊరూ పేరూ ఏమీ లేనట్టున్నది. గుర్తూ పరిచయం కలవారు కూడా ఎవరూ కనబడలేదు. పోలీసు రిపోర్టులో "అనాథప్రేత" మని మాత్రం వ్రాయడమయినది.

కన్యాశుల్కం సమీక్షణ

[౪-వ భాగము]

శ్రీ సోమయాజుల వెంకటరామమూర్తి

నిత్యనైమిత్తిక మైన మానవజీవితం, ఏలాంటి ఒడుదొడుకులూ, ఎట్టి అలజడిగాని, సంచలనముగాని లేక ఒక సమరేఖవలె సాగిపోతుంటుంది. అట్టి సమయంలో జీవితాన్ని బిగువుగా సాగిన వీణతంత్రితో గాని, తరంగాలు లేకుండా ప్రశాంతమై, మందగమనంతో నడుస్తూన్న నదీప్రవాహంతో గాని పోల్చడం సమంజసముగా వుంటుంది. తంత్రిని మీటినట్లయితే, అది కంపిస్తుంది; ఆకంపనంలో మ్రోగుతుంది. దీనికి పరిణతి: స్వరమయ సంగీతము. సంగీతము, సంతోషాన్ని ఆపాదించి, శ్రోతలహృదయాలను ఆనందంలో నింపవచ్చు, లేదా విషాదంలో ముంపవచ్చు. ప్రశాంతంగా ప్రవహించే నదీగర్భములో ఒక గొప్పభూకంపం వంటి అలజడి సంభవించిం దనుకోండి: అపుడు భీషణతరంగా లుద్భవించి, జలం కల్లోలమైపోతుంది. సమమట్టంగా వున్న జలోపరిభాగాన్ని అల లుత్పన్నమౌతవి. వానిలో ఒక్కొక్క తరంగాన్ని పరిశీలిస్తే, అది క్రమంగా ఎక్కి, శిఖరమై, తిరిగి క్రమంగా క్రిందికి దిగినట్లు కనిపిస్తుంది.

ఏవిధంగా తంత్రిలో నుండి నాదము ఉద్భవించడానికి మీటడం ఆవశ్యకమో, ఏతీరున, నీటిపై తరంగాలు రావడానికి ఒక సంచలనము కావలసియున్నదో, ఆదేతీరున మానవజీవితంలో కూడా ఒక కారణభూతమైన అలజడి వుండాలి. ఒక కార్యం నెరవేరడానికి ఒక ఉత్పాదనము కలిగినప్పుడే మన చిత్తవృత్తులు కూడా ఉద్రిక్తలై, అవ్యక్తంగా వుండినవి వ్యక్తంగా పైకి పొంగి గోచరమౌతూంటవి. కొన్ని ఉదాహరణలు పేర్కొంటున్నాను: (౧) రణరంగంలో సేనాని రోషపూరిత వాక్కులలో యోధులను యుద్ధానికి పురిగొల్పుతాడు- తన వీరసైన్యము వైరుల నెదుర్కొని వారిని చెండాడుతుంది. (౨) దిక్కులేని ఒకానొక స్త్రీ ఒకవీర పురుషుని శరణుజొచ్చుతుంది. అతని హృదయం మొదట దయార్ద్రమై క్రమంగా ప్రేమతో నిండిపోతుంది) పై ఉదాహరణలలో కార్యం, కారణం కనిపిస్తూన్నవి. వీనిలో కారణములు బాహ్యములు. ఒకప్పుడు కారణము ఆంతరంగికము కావచ్చును; లేదా, ఆంతరంగిక కారణానికి, బాహ్యకారణములు సాహాయ్యపడవచ్చును. ఉదాహరణగా, (౧) రాజునకు రాజ్య కాంక్ష కలిగినది, ప్రక్క దేశముపై దండెత్తినాడు (కారణము, రాజుగారి ఆకాంక్ష; కార్యము దండెత్తుట; కారణము ఆంతరంగిక మని స్పష్టము) (౨, రాజునకు రాజ్యకాంక్ష లోలోన కలదు; రాణి అందులకు ప్రోత్సహించినది. అపుడు రాజు ఎదుర్కొన్నవారి నందరిని సంహరించి రాజ్యప్రాప్తి పొందినాడు. (ఇందు ఆంతరంగికమునకు బాహ్యము బలపరచిన దని స్పష్టము). ఇట్టి బలవత్తరమైన కారణాలనూ వాని వల్ల కలిగే మానవ చిత్తవృత్తులనూ, పరిణతి కార్యాలనూ నిరూపించడాని కేర్పడినదే నాటకము. అందుచేత నాటకకావ్యంలో రస మెచ్చట నున్నదంటే, దాని **Human interest** లోనే; అనగా, వాస్తవంగా మానవ సంబంధములకు కార్య కలాపాన్ని చిత్రించడంలోనే. కన్యాశుల్కంలోని లుబ్ధావధాన్లను పేర్కొంటే, అవధాన్లయొక్క ధనలోభము, జాతకాల్లో అతనికుండే వెర్రినమ్మకం— వీనివల్ల రామప్పంతులు అతగాణ్ణోక ఆటాడించి, అరవైయేళ్లు దాటినా తిరిగీ పెళ్లికి సిద్ధంచేశాడు. ఇచ్చట లుబ్ధావధాన్లస్వభావంలో ఇమిడియున్న ఆంతరంగిక కారణాలకు రామప్పంతులు అనే ఖలుని దౌష్ట్యము తోడైంది.

గిరీశంవిషయంలోకూడా, బుచ్చమ్మ అనే ఒకచక్కని బాలవితంతువు అతనిదృష్టి పథంలో పడి, వెర్రెత్తించి; "ఈ విడో బ్యూటీ చూస్తే ఏమీ తోచకుండా వుంది" అనిపించి, ఆమెను వివాహంచేసుకునే ఉద్దేశం కలిగించి, ప్రోత్సాహపరిచింది.

ఈ విధంగా, నాటకంలో, ముఖ్యంగా సాంఘిక నాటకములో సాధారణంగా మనం చూస్తున్న మానవులే, మానవప్రకృతులే, ఆ జీవితాలే, ఆమాటలే, ఆచేష్టలే, మనంచూడాలి. వానినిచిత్రించి, ఎత్తి, ప్రత్యక్షంగా, వాస్తవంగా, చూపడమే నాటకకర్త ఉద్దేశమైయుండాలి. ఆ వుద్దేశం ఎంతవరకూ నెరవేరిందో పరిశీలించడమే విమర్శకుని ఉద్దేశమై యుండాలి—; అనగా — పాత్రలసృష్టి, వానివి పోషించడము, అని అర్థము. ఈ విషయంలో కన్యాశుల్కం ఎట్టి ఉన్నత స్థానాన్ని వున్నదో నేనీవరకు వ్రాసిన ౨-వ భాగములో మనవి జేసుకున్నాను:రకరకాలపాత్రలు—ఆరకాలలో ప్రత్యేకతలు మన కీనాటకమందు ఎట్లు ఆనందము గొలుపుతవోకూడ మనకు విశదము. ఇదికాక, కథపట్టు (Plot) గురించి విచారణ చేయవలసియున్నది. కథ, పటుత్వంతో, జిగితో, బిగిగా, మూలమాత్రాలను అనుసరించియే కొనసాగా నడిచిపోవాలి. రకరకాల పువ్వులను చేర్చి, తెచ్చి, వాని నన్నింటినీ, రంగుల ప్రత్యేకతనుబట్టి — సూత్రములో బంధించి, కంటికింపు గూర్పుమాలను నిర్మించినట్లే, నాటకములోకూడ. చక్కని రంగములమధ్య — ఆయా సంఘటనలు,— క్రమముగా చక్కబరచి, మూలకథా సూత్రమునుండి విడిపోవకుండురీతిని బంధించి, ఒక పరిపూర్ణతను తీసుకొని రావాలి. కానిచో, నాటకము ఒక 'అతుకులబొంత'గా మారి, పాడౌతుంది. 'కన్యాశుల్కం'— ఇట్టి అతుకులబొంత ఎంతమాత్రమూ కాదనియు, చక్కని ఐక్యత, పరిపూర్ణత, కలిగియున్నదనికూడ నే నీవరకే నిరూపించియున్నాను.

కన్యాశుల్కంలోనికథలు రెండు. ఈరెండు కథలును రెండు తరంగములు. ఇవి ఒకదాని కొకటి సమానాంతరముగా, నడుస్తూ, తుదకు ౬-వ అంకం, ౪ రంగములో కలుస్తున్నవి — విశాపట్నంలో. ఈ ఒక్కొక్క కథను మనం పరీక్షిస్తే అందు ౫ భాగములు గోచరిస్తవి:— ౧. వివరణ (Exposition), ౨. పెంపు (Development), ౩. ఉన్నతి లేక ఉత్కర్ష (Climax), ౪. అవరోహణ (fall), ౫. నిష్ఠ (Denoument). మొదటి కథయైన గిరీశం–బుచ్చమ్మల ప్రేమమునం ఎత్తుకుంటే, పై జెప్పిన ౫ భాగములు ఈరీతిగానున్నవి—

ప్రథమ తరంగము: (గిరీశం బుచ్చమ్మల కథ పట్టు)

౧. వివరణ (Exposition)	అం. ౧-౨. రం. ౧	గిరీశం బుచ్చమ్మను తొలిసారి చూడడం.
౨. పెంపు (Development)	అం. ౩. రం. ౩	వివాహానికి ఆమెను ఒప్పించి, తనతో లేచి రావడానికి ఆమె సమ్మతించునట్టు చేయడం.
౩. ఉన్నతి (Climax)	అం. ౫	దారిలో బండితప్పించి రామవరం పారిపోవడం.
౪. అవరోహణ (Fall)	అం. ౬. రం. ౪-౫	రామవరంలో తన గురువుగారును, వితంతు శరణాలయాధికారియగు రామయ్య పంతులుగారివద్దనుండి విశాఖపట్నం రావడం; లుబ్ధావధాన్ల ఆస్తికై తంటాలు పడడం.
౫. నిష్ఠ (Denoument)	అం. ౬. రం. ౭.	గిరీశం దొంగయని తెలిసిపోవడం, బుచ్చమ్మ రక్షింపబడడం.

ద్వితీయతరంగము: (లుబ్ధావధాన్ల మళ్లీ పెళ్లి).

౧. వివరణ (Exposition)	అం. ౨. రం. ౧ అం. ౨. రం. ౩.	* ధనలోభంవల్ల పెళ్లి ప్రయత్నం సూచన.

* నాటకానికి పూర్వం, ఎట్టిసంచలనమూ లేకుండా, ఏదోవిధంగా సాగిపోతూండిన లుబ్ధావధాన్ల

౨. పెంపు (Development)	అం. ౩. రం. ౧-౨	గుంటూరు శాస్త్రిరాక : చౌకబేరం.
౩. ఉన్నతి (Climax)	అం. ౪. రం. ౧-౨-౩-౪ అం. ౫. రం. ౧.	పెళ్లి—దయ్యం—మాయనుబ్బి పారిపోవడం.
౪. అవరోహణము (Fall)	అం. ౫. రం. ౩-౪ అం. ౬. రం. ౧.	† కంటెకు గడబిడ—కూనీకేసు సూచన అగ్నిహోత్రావధాన్లతో కసాలా – దెబ్బలు– విశాఖపట్నంలో కేసులు.
౫. నిష్ఠ (Denoument)	అం. ౬. రం. ౪ అం. ౭. రం. ౫-౬.	పశ్చాత్తాపం – మధురవాణి సహాయంవల్ల కూనీకేసు తేలిపోవడం.

యొక్క జీవితంలో ఒకప్పుడు జరిగిన సంగతులు, రామప్పంతులు, మధురవాణి సంభాషణద్వారా మనకు తెలుస్తాయి. అందులో, లోభియగు లుబ్ధావధాన్లు అరవై ఏళ్ల వయస్సులో పెళ్లిప్రయత్నం ఎందుకు చేశాడో కూడా నాటకకర్త మనకు తెలియబరిచాడు: అం. ౩ రం. ౧ లో

మధురవాణి:—యలాచేశారీ మహాచిత్రం? పెళ్లయితే ధనం ఖర్చవుతుందిగాని రావడమెలాగ?


రామప్పంతులు:—లౌక్యమంటే మరేమిటనుకున్నావు? అసాధ్యాలు సాధ్యం, సాధ్యాలు అసాధ్యం చెయ్యడమేకదూ? మనసిద్ధాంతిని దువ్వేటప్పటికి వాడేంచేశాడనుకున్నావు? లుబ్ధావధాన్లజాతకం యిగాదిగా చూసి, శీఘ్రంలో వివాహయోగం వుందన్నాడు. ఆ వివాహంవల్ల ధనయోగం వుందన్నాడు. దాంతో ముసలాడికి డబ్బొస్తుందన్న ఆశ ముందుకీ, డబ్బుఖర్చౌతుందన్నభయం వెనక్కీ లాగడం ఆరంభించింది. ఇంతట్లో పంచాగారిక్కడికొచ్చారు. ఆయన్నికూడా తయారుచేశాను. లుబ్ధావధాన్లు అనుమానం తీర్చుకుందామని ఆయనకు జాతకంచూపించేసరికి పంచాగారు యేమన్నారూ? "వివాహధనయోగాలు జమిలిగావున్నాయి; అయితే మీరు పెద్దవాళ్లు, యిప్పుడు మీకు పిల్ల నెవరిస్తారు. పెళ్లెలాఅవుతుంది? ఇలాంటివి జరగడానికి వీల్లేని మహాయోగాలు జాతకాల్లో పట్టినప్పుడు, గొప్పమేలుకు బదులుగా గొప్పకీడు సంభవిస్తుంది. అనగా మీకు మారకమో, ధననష్టమో సంభవిస్తుంది.........." అని చెప్పేసరికి అవుధాన్లుగుండె రెండు చెక్కలై వివాహప్రయత్నం ఆరంభించాడు. ఇదీ కథ.

మధు:—ఏమికల్పన?

† 'కంటె' గురించి ఉపకథ.

అసలా కంటేమో మధురవాణిది. అది తెచ్చి రామప్పపంతులు పెళ్లికూతురు (మాయనుబ్బి)కి తగిలించాడు. మహేశం పారిపోయి ఆ కంటెతిరిగీ మధురవాణికే యిచ్చేస్తాడు. మాయనుబ్బిగావుండిన మహేశం మధురవాణియింట దాసరివేషంలోనికి మారుతూంటే, రామప్పంతులు వస్తాడు—రాత్రి—మహేశం రామప్పంతులు కంటపడితే గుట్టంతా బట్టబయలౌతుందని మధురవాణి కంటె మిష పెట్టి అది తెస్తేనే కాని యింట్లో అడుగుపెట్టనివ్వనని రామప్పంతులును తలుపవతల వీధులోనుంచే తరుముతుంది. పంతులా నిశీథమందు యీదురోమని లుబ్ధావధాన్ల యింటికెళ్లి కంటెయిమ్మని పీడిస్తాడు. అప్పటికప్పుడే ఎంతోకంగారు పడివున్న లుబ్ధావధాన్లు కంటె, గింటె ప్రసంగించి లాభంలేదని రామప్పంతులను పొమ్మని కసిరేస్తాడు. అప్పుడు రామప్పంతులు హెడ్డుసహాయ్యంకోరి, అవధాన్లను కూనీకేసని బెదిరించమంటాడు. హెడ్డు కొంత ధనలాభంపొంది గుట్‌చప్‌గా వూరుకుంటాడు. అప్పుడు పంతులు తాసీల్దారుకూ, ఇన్‌స్పెక్టరుకూ, ఆకాశరామన్న అర్జీలు కొడతాడు, హెడ్డు కూనీకేసు కామాపుచేశాడని. రంజకం అంటుకుని, కూనీకేసుజ్వాల పైకి లేచి లుబ్ధావధానులను ఆహుతి చెయ్యడానికి చూస్తుంది.

రెండూ కథాతరంగాలు, ఈక్రింద చిత్రించి వ్యక్తపరచాము:—పై పట్టికలోని అయిదు భాగములను సంఖ్యలవలన చూపడమైనది.



పై చిత్తరువులో గమనించవలసిన విషయములు: (౧) వక్రరేఖగా నున్న భాగమే నాటకములోని కథా తరంగము—ఇతరము సమరేఖగా చూపబడినది (౨) ఎగుడు, ఉన్నతి, దిగుడు కలిగిన తరంగములే, ఆరోహణ, ఉన్నతి. అవరోహణ కలిగినట్టి ఆయా కథా భాగములు:—(౩) ఈ రెండు తరంగాలకు అత్యున్నత బిందువులు (చిత్తరువులో నెం ౩ కలిగినవి) ముందు చెప్పిన ఆయా కథలలోని ఉత్కర్షను చూపుచున్నవి. ఇది కథాభాగానికి వెన్నుముకవంటిది—లేదా వెన్నుదుప్పవంటిది. ఇది బలిష్ఠమైన నాటకములో మిక్కిలి బిగికలిగిన భాగము (A period of high tension) ఇదియే చూపరులయెడను కూడ మిక్కుటమైన ఔత్సుక్యమును కలుగజేసే భాగము. (A period of high expectation). నాటకరచనా కౌశలాని కీభాగము యొక్క రచనావిధాన మొక ప్రమాణము. ఇం దెంతేని శిల్పము (Dramatic art) ఇమిడియుండవలెను. ఇంకే మౌతుందో, ఇంకేమౌతుందో అనే ఆత్రుత చదువరులయందును చూపరులయందును కలుగజేస్తూ వారిని చకితులను చేసివేస్తూంటుంది. శిల్పము, పాత్రపోషణము సరిగా మేళవిస్తేనే నాటకం ఉన్నత శ్రేణికి చెందినది కాగలదు. ఈ ప్రమాణాన్ని బట్టి కన్యాశుల్కం ఉచ్చతరగతి నాటకమని స్పష్టము కాక తప్పదు.

నాయకులు :—

ఈ సందర్భంలో కథానాయకులను గూర్చి రెండు మాటలు మనం చెప్పుకోవలసివుంది: కన్యాశుల్కంలోని రెండు ముఖ్యకథలకూ నాయకులు,— గిరీశం, లుబ్ధావధాన్లు. వీరిలో గిరీశం కార్యదక్షుడైన నాయకుడు (Active hero); కాని లుబ్ధావధాన్లు మాత్రం (Passive) అనగా స్తబ్ధుడై, ఇతరులేలాగా డిస్తే ఆలాగు నాడేరకము. ఇలాంటి స్తబ్ధత కలిగిన నాయకునిప్రక్క మరతిప్పుతూండే ఖలుడు ఒకడుండాలి. వీడు నాయకుడికి సాధకబాధకాలు అడుగడుక్కు జ్ఞాపకం చేస్తూండాలి. ఇట్టి ఖలుడే రామప్పంతులు. ఇతడు లుబ్ధావధానులయొక్క లోపాలను గుర్తించి, వాటిని ఊతగా గొని, స్వలాభంకోసం పని చేస్తూంటాడు. చూడండి, రామప్పంతులే లుబ్ధావధాన్లను గురించి ఏమంటున్నాడో :— "వాడికి వ్యవహారజ్ఞానం లేకపోవడంచేత, కోర్టులంటే భయంచేత, నాసలహా లేక బతకలేడు" అని—. (పే ౪౭, ౪౮). అందుచేత రామప్పంతులు లుబ్ధావధాన్లను తన చేతి కీలుబొమ్మగా చేసికొని, రెండోపెళ్లి అని ఒక తడక అల్లినాడు. ఇక గిరీశంమాట : అసలు గిరీశమే ఒక గొప్ప (దుష్టుడు)— అందుచేతనే జీవనప్రవాహంలో నిర్భయంగా ఈదులాడుకు పోతుంటాడు. ఒకప్పుడు తరంగా లెదురైతే చమత్కారంగా తప్పించుకుంటూ, మునుగుతూ తేలుతూ, పోగలడు. ఈవిధంగా — ఇక గమ్యస్థానం చేరుకుంటున్నాడనే సమయానికి, బుచ్చమ్మను పవిత్రంగా విడోమేరేజి చేసికొని కీర్తి,

సుఖం అనే జీవిత పరమావధిని పొందుతూంటే, మబ్బులేని పిడుగు — మధురవాణి — వచ్చి, గిరీశం కథంతా అడ్డంగా తిప్పేస్తుంది. ఈరీతిని, రెండు ముఖ్యకథలలోను ఒక ప్రవాహానికి, మరియొక ప్రవాహం ఎదురౌతూ, నాయకుని యెడల మనకుగల ఉత్సాహాన్ని యినుమడిస్తూంటుంది. ఒకగణము శక్తులను సారెసారెకూ, మరొకగణము శక్తులు ఎదుర్కొంటూంటే, ఆ సంఘర్షణవలన ఆయా ప్రాతలస్వభావము పైకి వస్తూంటుంది. ఒకటి గెలుపొందేసమయానికి దానికొక ప్రతిఘాతము, తద్ద్వారా నాయకునికి పశ్చాత్తాపం, లేదా అధోగతి, లేదా మరియొకరికి ఉన్నతి-ఇవన్నీ చూస్తే ద్రష్టలహృదయాలు కల్లోలితము లగుటయేకాక, వెనువెంటనే ఒకచక్కని నీతినికూడా అలవరచుకొంటూంటాని. ముందొకసారి నేను లుబ్ధావధానులను గూర్చి అతడొక విషాదప్రాధాన్య నాయకుడు అని వ్రాసియుంటిని (రెండవభాగములో). అట్లా వ్రాయుటకు తగినంత కారణము లేకపోలేదు. ఈ విచారము సయితము మనము ఇప్పట్టున చేయవలసియున్నది. ఎట్టివాడు విషాదరస ప్రాధాన్యనాయకుడు? — ఒకానొకడు, తనకు గల యున్నతస్థానమునుండి విధిప్రేరణముచేగాని, ప్రమాదవశమునగాని కాక,— నిజప్రకృతిచే ప్రేరేపింపబడిన స్వయంకృతాపరాధమువలనను, తన నైజంలో నొకభాగమైన కొన్ని లోటుపాట్లవల్లను, పతితుడైతే — అతడే విషాదప్రాధాన్యనాయకుడు. లుబ్ధావధాన్లు ఆస్తాధికారి — జటాంతస్వాధ్యాయి. రామచంద్రపురంలోనూ, ఆచుట్టుప్రక్కలమున్న గ్రామాల్లోనూ, పేరెక్కినవాడు. సంఘంలో ఇంతకంటె ఉన్నతియేముంటుంది? కాని ఇతనిలో కొన్ని లోపాలు కలవు. ముఖ్యంగా, "డబ్బుచ్చుకున్న తరువాత చచ్చిన శవానికైనా కట్టకతీరదు", అనే మూఢత్వంతోకూడుకొన్న గర్వం వున్నది. ఈ గర్వభావమే అవధాన్ల పతనానికి మూలకారణమైంది.

శిల్పము

కన్యాశుల్కములో శిల్పమును గూర్చి ముచ్చటించేటప్పుడు మనము ప్రత్యేకముగా రెండువిషయాలు చెప్పుకొని తీరాలి. అవి: (౧) నాటకకర్త సూక్ష్మవివరాలుకూడా లక్ష్యంగా వుంచుకునే శ్రద్ధ (Careful attention even to minute details) (౨) మానవస్వభావాన్ని పరిశీలించి, దానిని తీర్చి చిత్రించడం. (Careful study of the human mind and nature and its depiction.) మొదటి లక్ష్యానికి తార్కాణాలు కొన్ని ఉదాహరిస్తున్నాను: (౧) Stage directions (రంగసూచనలు) — "అగ్నిహోత్రావధాన్లు జంధ్యాలు వడుకుచుండును" — "బండివాడు సామాను దించును"— "బుచ్చమ్మ పప్పు రుబ్బుచుండును" — "పెరటిలో గిరీశం పనివాళ్లచేత పందిరి వేయించుచుండును" మొదలైనవి. ఈసూచనలతో నాటకకర్త ఆయా సహజమైన వాతావరణములో ఆయా వ్యక్తులను నిలిపి చూపినారు (౨) వెంకమ్మ నూతిలో పడిన విషయము. ఇది రంగస్థలంమీద కాకుండా చూపరుల పరోక్షమందు జరిగినది గనుక ఒకప్పుడు దానిని వారు మరచిపోవచ్చు నని యూహించి నాటకకర్త నాలుగుచోట్ల నాటకంలో ఆ ముఖ్యవిషయాన్ని పేర్కొన్నారు: ౨౧౭ పేజీలో వెంకమ్మ:— "అన్నయ్యా, ఈ సమ్మంధం చేస్తే నేను నుయ్యో గొయ్యో చూసుకుంటాను" అన్నది— ఇవి మామూలు ఆడంగుల పాడిముక్కలు కావు. తన కుమార్తె కష్టం హృదయంలో బాగా నాటించుకున్న ఒక కష్టగృహిణియొక్క శపథం అని తెలిపేటందులకు ఈ విషయము ఇన్నిసారులు వేరువేరు సందర్భాలలో చెప్పవలసివచ్చినది; ౨౯ పేజీలో, వెంకటేశం— "అమ్మ ఆసమ్మంధం చేస్తే నూతిలో పడుతానంటుందే" అంటాడు. ౪౪ పేజీలో కరటక శాస్త్రి మధురవాణితో, "ఈ సమ్మంధం చేస్తే నా చెల్లెలు నూతిలో పడతానని వొట్టేసుకుంది." అంటాడు. ౫౪ పేజీలో, గిరీశం, "వెంకమ్మ, మొగుడుతో దెబ్బలాడి నూతిలోపడ్డప్పుడు నేను సాహసించి వురికి పైకి తీసిందగ్గర్నుంచీ వూరంతా నన్ను సాక్షాత్తూ సత్య హరిశ్చంద్రుణ్ణిగా భావిస్తున్నారు" అంటాడు. (౩) ఇట్టిదే, మాయసుబ్బి నిజంగా ఆడపిల్లకాదు— ఆడవేషంలోనున్న మహేశం, ఒకానొక కుర్రాడు— అనే సంగతికూడా చదువరులకు పదేపదే— 'మాయసుంట' అన్న నాటకవక్రోక్తి (Dramatic Irony) ప్రయోగిస్తూ ఆ

విషయం మనం మరచిపోకుండా చేస్తారు: ౧౩౦ పేజీలో మధురవాణి. "మాయగుంటని ఎక్కడ దాచారు?" అంటుంది. ౧౩౩ పేజీలో లుబ్ధావధాన్లు— "నీ మాయగుంటా, నీకంటే నీ యింట్లోనే వున్నాయి" ౧౯౦ పేజీలో తిరిగి లుబ్ధావధాన్లు "ఆమాయగుంట పారిపోవడం యేమి!" అని వెర్రి పెడుతాడు. ఈలాగున ఈ విషయం అనేక సార్లు చెప్పి— చెప్పాలని చెప్పడం కాదు — అతి సహజంగా మాటల ధోరణిలో, సందర్భానుసారంగానే, చెప్పి—అది మన జ్ఞప్తియందు దృఢంగా నాటుకు న్నట్టు చెయ్యడం— ఇది కూడా రచనా కౌశలాన్నే చాటుతూంది.

(౪) మరొక్క చిన్నవిషయం:—౧౪౬ పేజీలో లుబ్ధావధాన్లు హెడ్డుకు, లంచంగా పేణా ౧౨ రూపాయలిస్తే, అందులో మూడు రూపాయిలు హెడ్డు రామప్పంతులు వంతుగా ఇచ్చినట్టుకదా వున్నది? రామప్పంతులుచేత, తనవంతుకు వచ్చిన మూడు రూపాయలు ఏవిధంగా ఖర్చుపెట్టించారో చూడండి: ఒక రూపాయి అసిరిగాడికి (౧౪౭ పేజీ) మధురవాణి ప్రవర్తన గురించి అనుమానపడి, ఆచోకీ చెప్పమని; రెండవ రూపాయి, తిరిగి అసిరిగాడికే (౧౪౯ పేజీ) చీకట్లో మీనాక్షిని చిటికేసి పిలవడానికి; మూడవ రూపాయి దాసరివేషంలోకి మారిపోయిన మహేశానికి, రాత్రల్లా ఇల్లు చేరకుండా చేసిన మధురవాణి యింటికి రమ్మన్నదనీ, మీనాక్షిని లుబ్ధావధాన్లు ఇంటికి తీసుకుపోయినాడనీ, రెండుశుభవార్తలు తెచ్చినందుకు—అయితే మూడు సందర్భాల్లో రామప్పంతులుచేత ఒక్కొక్క రూపాయి ఖర్చుపెట్టించి, నాటకకర్త, రామప్పంతులు యొక్క స్వభావాన్ని మనకు ఇట్టే అవగతము చేసినారు — మొదటి రూపాయివ్వడంలో, రామప్పంతులు మధురవాణిని సందేహించేవాడనీ, రెండవ రూపాయివ్వడంలో, రామప్ప సాధారణంగా మీనాక్షితో చీకటి తప్పు చేస్తుండేవాడనీ, మూడవ రూపాయివ్వడంలో, నిరయోగ్యకపు దర్జాకోసం ఎంతఖర్చైనా వెనుకదీయడనీ — మనకు అతిసులభంగా స్పష్టీకరించారు. కన్యాశుల్కం ఒక గొప్ప మేధావియొక్క రచన (**A word of genius**) అని ఈ పరిశీలనవల్ల తెలియగలదు. శ్రీ అప్పారావుగారు నాటకసంబంధవిషయాల్లో ఏచిన్న వస్తువునైనా విడచిపెట్టేవారు కారని స్పష్టంకాదా, దీనినిబట్టి?

ఇక రెండవ లక్ష్యమైన మానవసైజ పరిశీలన, అతిసున్నితమైన దాని నిరూపణ విషయమై మచ్చుకు కొన్ని ఉదాహరణలు పేర్కొంటున్నాను: రామప్పంతులునైజంలో,—పిరికితనం, మళ్లీ దాన్ని కప్పుకునేందుకు ప్రయత్నించే బడాయి,— రెండూ కలిసి వున్నాయి. ఈలక్షణాన్ని ఒకచిన్న సంఘటనములో రెండే వాక్యాల్లో ఎంతచక్కగా చిత్రించారో చూడండి:

అం ౧, రం. ౨. లో రామప్పంతులు మంచం క్రింద వుండినా, పూటకూళ్లమ్మచేత చీపురుకట్ట దెబ్బతిని, పైకి వచ్చి పీపు తడుముకుంటూ, "నీసిగాదరగా, ఆడదాని వైపోయినావే, లేకపోతే చంపేసిపోదును" అని లేని పౌరుషం చూపిస్తూ, వెంటనే పూటకూళ్లమ్మను చూచి, మధురవాణితో అతి దీనత్వంగా "అమ్మండ మంచం క్రిందినుంచి రాదేం?— చీపురుకట్ట లాక్కో" అని పిరికితనాన్ని వెల్లడిచేయించేటట్టు అనిపించడం, ఎంత చమత్కారంగా వుంది! కొలది మాటలలో, కొద్ది పరిశ్రమతో, ఎంతో ప్రయోజనం చూపించడం— అద్భుతం!— ఇకను, గిరీశం పట్టున, అతని వాచాలత్వము ఎంతసులువుగాచూపించారో చూడదగ్గది. వెంకటేశం అం. ౨. రం. ౧. లో, 'నల దమయంతు లిద్దరు...' అనేపద్యం చదివాక, పెంకిముండాకొడుకు, కరటకశాస్త్రి, వెంకటేశాన్ని 'మనఃప్రథవానలము' అన్న సమాసానికి అర్థం అడుగుతాడు. వెంకటేశంమాత్రం సహజమైన దద్దమ్మతనంలో ఇంటి పైకప్పుచూచి వూరుకుంటాడు. అప్పుడు గిరీశం జోక్యం కలుగజేసికొని, 'చిన్నకుర్రాళ్లకు అలాంటిమాటలకు అర్థం తెలుస్తుందా అండి?' అంటే, అగ్నిహోత్రావధాన్లు 'పద్యాలకర్థం చెప్పరూ?' అని గర్జిస్తాడు. దానికి అలాంటి యిలాంటి వాళ్లంతా నీళ్లు నములవలసిందే; కాని, గిరీశం

ఓడిపోతావూ? వెంటనే, ఏమన్నాడో చూడండి: "ఇప్పటి మట్టుకి వేదంలాగే భట్టీయం వేయిస్తారు." అని ధీమాగా గద్దించి, అగ్నిహోత్రుని నోరు కట్టేస్తాడు. ఆటుపైని,— అగ్నిహోత్రావధాన్లు పరమకోపిష్ఠి, ప్రథమకోపం ప్రధాన గుణం కలవాడని ఒకచోట ఎంత మాత్రంగా మనకు తెలిసేటట్టు చేశారో చూడవలసియున్నది: ౨-౩ పేజీలో, అగ్నిహోత్రునకు, తన కుమార్తె బుచ్చమ్మను, గిరీశం లేవదీసుకు పోయినట్టు తెలుస్తుంది. మూర్తీభవించిన రౌద్రరసం- అగ్నిహోత్రుడు. అప్పుడు రామప్పంతులు, అతన్ని సమీపించి, గిరీశాన్ని బాగా తిట్టిద్దామనే ఉద్దేశంతో "అయ్యా వారు మహా దొడ్డవారని చెప్పారు. ఏమి ఎత్తుకు పోయినాడేమిటండి?" అంటే దానికి అగ్నిహోత్రావధాన్లు జవాబు "ఏమెత్తుకు పోయాడా? నీ శ్రాద్ధం ఎత్తుకు పోయాడు. — పకీరుముండని లేవదీసుకు పోయాడు" అని తన కోపం అంతా ఎదుటనున్న రామప్పంతులు మీద దులిపేస్తాడు. ప్రథమకోపం అంటే యిది! ఈ కోపాన్ని నిరూపించడం ఎంతైనా సహజికముగా వుందో చూడండి; కోపంగా వున్నట్టివానిపై ఈగ వాలినా, అతనికోపం ద్విగుణమై, అతడా యీగనుకూడా చంపేద్దా మనుకుంటాడు కాదా? ఇకను, వెంకటేశంచేత "నే నేను గక్కాను!" అనిపించి బాలుర సహజం, "తమ్ముడికి పెళ్ళి చెయ్యాలంటే, నాభూమి అమ్మాలండికాని, దాని గొంతుకోసి సుబ్బిని లుబ్ధావధాన్లు కివ్వనా?" ద్దనిపించి బుచ్చమ్మయొక్క సరళస్వభావం ఎంతో చక్కగా నిరూపించినారు.

శైలి

పైప్రసంగం తిన్నగా మనలను భాష, శైలి అనే విచారంలోకి దించుతుంది. కన్యాశుల్క నాటకము శైలి: స్పష్టము (Simple), సరళము (Direct) సార్థకము (Effective). రోజూ, ఆబాలగోపాలమూ వాడుతూ, అందరికీ చక్కగా నోటబట్టినట్టి—ధారాళమై, సజీవమైనట్టి — కమ్మని — వాడుక తెలుగు భాష—**Vernacular Telugu**—ఈ వాడుకభాషే నాటకానికి మొదటి ఆకర్షణశక్తి - (మొదటిది కావచ్చునుగాని, ముఖ్యమైనదిమాత్రం కాదు — ముఖ్యమైనది, రచన — పాత్రలసృష్టి. పాత్రల జీవకళలు— ఎంతోమంది, కన్యాశుల్కంలో హాస్యంమాటలుతప్ప ఇంకేముంది? అనే తప్పు అభిప్రాయంలో పడియున్నారు.) మాటలు మనలను తప్పక ఆకర్షించేవే! కుర్రాళ్లుకూడా చదివి ఆనందిస్తారీభాష. కారణంచేత, రసం అంతగా వారికి గ్రాహ్యం కాకపోయినప్పటికీ. వాడుకభాష గురించి, శ్రీ అప్పారావుగారే, మొదటి కూర్పు ఉపోద్ఘాతములో, ఈ విధంగా వ్రాసినారు:*

"I cannot understand how modern writers fail to see the merits of spoken Telugu, its softness which elicited the admiration of

---

* మార్దవమునకును, విస్తృతికిని అన్యదేశీయులచే మెప్పులందిన వాడుక తెలుగుభాషయొక్క సద్గుణములను నేటిరచకులు గ్రహించలేక పోవడమనేది నాకు బోధపడకుండా వున్నది. ప్రస్తుతము మనభాషలో వన్నెకెక్కిన తెలుగుగద్య వాడుకభాషలోనే వ్రాయబడియున్నది.........ఇప్పటికి నానాటక మొక్కటే వాడుకభాషలో వ్రాయబడిన పెద్దగ్రంథము, కాని అది పాడుకాలేదని ధీమాగా చెప్పవచ్చును. గ్రాంథికభాష అనేది ఒకపూర్వాచారమై ఆంధ్రములో రచనకు కొంత ప్రతిబంధకము కలిగించింది. దేశంకట్ల ఇష్టపడేవాళ్లకు అదిరుచించవచ్చును; కాని నాకుమాత్రం నా వాడుకభాషే—నా మాతృభాష—సజీవమైనభాష—ప్రాగ్దేశాల్లో ఇటాలియనువంటి మాధుర్యముగలిగినది—ఏభాషయందు మన మనోభావాలు, సుఖదుఃఖాలు, వెల్లడిచేసికొనటందుకు లజ్జపడమో, కాని దేనియందు లిఖించడానికి మనలోకొందరు సిగ్గుపడుతున్నారో— అట్టివాడుకభాషే నాకు కావాలి. వాడుకభాషలోని రచన నిరక్షరుడైన కాపువకును, హిందూదేశానికి వలస వచ్చిన ఆంగ్లేయునికి సయితం మనగతమాతుంది. అట్టిభాషయొక్క భావ్యత అపారము. ఆంధ్రలోకానికి క్రొత్త గ్రాంథికము నద్భవింపజేసేది, వాద ప్రతివాదముకాదు. గొప్పరచకుడు అట్టిభాషలో అనేకగ్రంథాలు రచించాలి. అట్టి ప్రయత్నానికి మనం మార్గదర్శకుల మౌదుము.

foreigners and its range of expression. At this moment, the best prose in the Language is in the spoken dialect...I believe my play is the first ambitious work in the spoken dialect, and, certainly, it has not failed..."

"I view the Telugu literary dialect as a great disability imposed by tradition upon the Telugu. Let those who love fetters venerate it. My own Vernacular for me, the living Telugu, the Italian of the East, in which none of us is ashamed to express our joys and sorrows, but which some of us are ashamed to write well. Literature in the Vernacular will knock at the door of the peasant; and it will knock at the door of the Englishman in India. Its possibilities are immense."

"...and I know it is not arguments that will evolve a New Literary dialect for Telugu. A great writer must write and make it. Let us prepare the ground for him."

భాషనుగురించి శైలినిగురించి ఉదాహరణగా పుస్తకం అంతా పేర్కొనాలి. అయినా మన సంద బట్టిక మచ్చుకు రెండు మనవిచేస్తాను.

అం. ౧ రం. ౨ లో—గిరీశం, రామప్పంతులు మంచంక్రిందనుండే మధురవాణినిగురించి మెల్లిగా మాట్లాడుకుంటూంటారు.—

రామ—రెండోందలు కాజేసిందిరా, బాబూ.

గిరీ—నువ్వేలేం జాగ్రత్త చేశావ్?

రామ—అంతేనా?

గిరీ—మరేమిటి?

భాష ఎంత ధారాళంగా, సరళంగా వుందో చూడండి. మాటలు తక్కువైనా అర్థం బోలెడు. 'నువ్వేం జాగ్రత్తచేశావ్' అంటే 'నీరెండోందలకూ తిలోదకాలేశావోయి వెయ్యమూర్ఖా' అని అర్థం. వెంటనే రామప్పంతులు ఏడుపుమొగంతో 'అంతేనా?' అంటే అర్థం ఏమిటీ— 'నా రెండోందలకూ గతిఅంతేనా? మధురవాణి నాయెడల విశ్వాసంగా వుండదూ, అయ్యో!' అని ఈవిధంగా మాటల పొందికకు, అర్థ బాహుళ్యానికీ, ఉదాహరణలు పుస్తకంనిండా వేనవేలు:—"నాకు వల్లు గడ్డిపరక!"—"అన్నా, మోటతనం!"—"నేనిల్చబడ్డచోట రూపాయలు గలగ్లా ల్తాయి"— ఆమాటలపొందిక యెంత!—ఎట్టిపదవరణము! ఒకమాట తీసి మరొకమాట వెయ్యడానికి కెక్కడా అవకాశం దొరకదే!

సాంఘికదోష నిరూపణము :—

కన్యాశుల్కము సంఘానికి నీతిని బోధించుటకు ప్రదర్శించే ఉద్దేశముతో రచింపబడినది మితిమీరిపోయి, అతి భయంకరరూపాన్ని దాల్చిన కన్యాశుల్కంనిమిత్తం అతిబాల్యవివాహాలూ, అందువల్ల సమాజానికి కలిగే అపారమైన నష్టం, దీనిని మానవజాతికి స్పష్టీకరించే వుద్దేశం గల గ్రంథం, కన్యాశుల్కము. ఈ విషయమై నాటకకర్త, తమ మొదటి కూర్పు ఉపోద్ఘాతములో, ఈభావంలో ఆంగ్లములో వ్రాసియున్నారు:—శ్రీ శ్రీ His Highness the Maharajah of Vizianagaram వారి ఆజ్ఞానుసారముగా, విశాఖమండలంలోని, సాధారణ ప్రాంతాల్లో, బ్రాహ్మల్లో కన్యాశుల్కపు పెళ్లిళ్లు. ఎన్ని, ఎటువంటివి, అని లెక్కచేయిస్తే, అట్టివివాహాలమొత్తం ౧౦౩౪ అని తేలింది. అందులో ౯౯,—౫ సంవత్సరాల యీడు బాలికలకు, ౪౪—నాలుగు సంవత్సరాల బాలికలకు, ౩౬—మూడు సంవత్సరాల బాలికలకు, ౬—రెండు సంవత్సరాల బాలికలకు, ౩—ఒక సంవత్సరపు పిసుగులకు,—ఎంత ఘోరము! అందు ఆఖరుకు పేర్కొన్న ఏడాది పిల్లలఖరీదు, తలకు రు ౩౫౦ మొదలు, రు ౪౦౦ వరకు ఉండేవట!—ఇంతేకాక—మిక్కిలి ఆశ్చర్యకరమైన విషయము!—పుట్టబోయే పిల్లలకు కూడా బేరాలేనట!—ఎంత సుందొలుతీసిన పని!—వీరు మిక్కిలి అది శిష్టాచారమని మురిసిపోవడం!—

ఇంతకంటె మూర్ఖత యెక్కడ వుంటుంది?— ఇది బ్రాహ్మణ్యమా?— వేదం చదువుకుంటే నేం, జన్నిదాలు వేసుకుంటే నేం, శిశు హత్యాపాతకం కాని కొడిగట్టుకున్నార!— పెళ్లి పేరిట శిశుబలి!— ఇట్టి కఠోర పరిస్థితులలో, అంతా ఏకంగా గ్రుడ్డిగా సంచరిస్తూన్నప్పుడు: సారస్వతం యొక్క ధర్మం యేమిటి? అట్టి దురాచారాలను యెత్తిచూపి, సభ్య పురుషులమని సంతోషిస్తూన్న పెద్దమనుష్యులంతా తలలు వంచి పొట్టల్లో పెట్టుకుని, తీవ్రంగా ఆలోచించేటట్టు చెయ్యడమే కదా! డబ్బుచ్చుకుని చిన్న పిల్లలను ముసలాళ్లకిచ్చి పెళ్లి చెయ్యడం శాస్త్రవిరుద్ధమని, నైతిక జీవనం కాదని, దానివల్ల ఎంత హానైనా వుందని, చెప్పడానికి వ్రాసిన నాటకమే కన్యాశుల్కం. అందుకే నాటకకర్త ఎన్నిచోట్ల, ఎట్టి వింతవింత వివాహాలు పేర్కొన్నారో చూడండి:—

(౧) ౧౦ పేజీలో, గిరీశ మంటూవున్నా—"పూట కూళ్లమ్మ ముచ్చటగా తప్పటడుగులు వేసే రోజుల్లో ఒక కునిష్టి ముసలాడికి కట్ట నిశ్చయించారు. పుస్తె కట్ట బోతూంటేనో, కట్టిన వుత్తర క్షణంలోనో ఆ ముసలాడు పెళ్లిపీటలమీదే గుటుక్కుమన్నాడు. అప్పుడు పెళ్లి అయినట్టా కానట్టా! అని మీమాంస అయింది. కొందరు పుస్తెకట్టా డన్నారు. కొందరు కట్ట లేదన్నారు. పిల్ల తండ్రి పెళ్లికొడుకు వారసులమీద దావా తెచ్చాడు.

పురోహితుడు వాళ్లదగ్గర లంచం పుచ్చుకుని, పుస్తె కట్టలేదని సాక్ష్యమిచ్చాడు. దాంతో కేసు పోయింది. కాని దాన్నెవరూ పెళ్లాడారు కారు."

౨. ౧౩ వ పేజీలో, కరటకశాస్త్రి, ప్రసంగ వశాత్తూ బావమరదితో "చచ్చాడంటే వాడిదా తప్పు? మంచంమీంచి దిం చెయ్యడానికి సిద్ధంగా వున్నవాణ్ణి కట్టావ్— అంటాడు.

౩. ౭౫-వ పేజీలో లుబ్ధావధాన్లు, "డబ్బుచ్చుకున్న తరువాత చచ్చిన శవానికైనా కట్టక తప్పదు" అని అదొక హక్కులాగున చెప్పి సంఘం యొక్క అధోస్థితిని వెల్లడి చేస్తాడు.

౪. ౧౧౦-వ పేజీలో గిరీశం "నీమొగుడు నిన్ను పెళ్లాడి యెంత సుఖపెట్టాడో, మా అన్న నీ చెల్లెలిని పెళ్లాడి, అంతే సుఖపెడుతాడు......మా అన్న మీ చెల్లెలిని పెళ్లి అనే మిష పెట్టి కొంటున్నాడు. వాడింట యిది జీతంలేని బాపనక్కలాగు పనీపాటు చేస్తుందని వాడి ఆశ.

౫. ౧౭౭-వ పేజీలో నాయుడు ప్లీడరు, అగ్నిహోత్రావధాన్లను గురించి చెబుతూ, "మల్లవరంలో సహస్రమాసజీవైన వక బ్రాహ్మణశ్రేష్ఠుడుంటే, ఆయనకు తన పెద్ద కుమార్తె (బుచ్చమ్మ)ను కన్యాదానం (!) చేసి, రెండు పిల్లికూనలు స్వీకరించేటప్పటికి, పెళ్లిలోనే, ఆ బ్రాహ్మడి పుణ్యం అంతా మూడి, పరంపదం వేంచేశాడు," అని తన బ్రహ్మద్వేషం వెల్లడి చేస్తాడు.

ఇవికాక నాటకం నిండా బాల్యవివాహాలకూ కన్యాశుల్క స్వీకారానికీ, అన్వయాలు అనేకం అడుగడుక్కూ ఈ సంఘదురాచారాన్ని ఎత్తి పెడుతూ నాటకం "కన్యాశుల్క"మనే పేరు సార్థకం చేసుకుంది.

ముగింపు; ఆంధ్ర సారస్వతంలో కన్యాశుల్కానికే స్థానం?

ఈ ప్రశ్నను విచారించడానికి పూర్వం కన్యాశుల్కం గురించి ఆనాటి పత్రికాభిప్రాయములు కొన్ని పేర్కొంటున్నాను. *

పరిపూర్ణమైన విమర్శలనను పత్రికాభిప్రాయములవలనను నాటక మెంత అపూర్వమైన సృష్టి యని

*"1. He has likewise shown unmistakable merit in constructing a singularly original and interesting plot and creating a variety of characters true to life, we are sure, if represented on the stage, will greatly please any Telugu audience,...... the whole piece is very happily put together and artistically constructed, evincing

గోచరము కాకతీరదు. తీవ్రత లుట్టిపడునట్టిపాత్రలు, పామరులను సైతము రంజింపజేసే సులభమైన వెన్న పెట్టినభావ, సుగమంగా సాగిపోతూన్న శైలి, భావ గర్భితమైన పదజాలంతో, కూడుకున్న భాష, చమత్కారమయినకథాకల్పన, నాటకరచనలోని బింకము, కథపట్టులగమనము, వివిధభాగముల ఐక్యతి, సర్వవిధ సంపూర్ణత్వము మున్నగు గుణాలుచూస్తేకన్యాశుల్కం అన్నివిధాలా ఉన్నతశ్రేణికి చెందిన నాటకరాజమని చెప్పకతప్పదు. అట్టి అభిప్రాయమునకు రానివాడు ఆంధ్రదేశంలో వున్నాడంటే నమ్మడానికి వీలు లేకుండా వున్నది. పాత్రలచుట్టూ తదుచితమయిన వాతావరణాన్ని కల్పించి ఆ మధ్యను పాత్రను సృష్టికరించడములోను, ఆయాపాత్రల సైజగుణాలను చిత్రించడములో సైతేనేమి శ్రీ అప్పారావుగారు ఒకగొప్ప 'శిల్పి' (Artist) అని చెప్పితీరాలి. అందరినీ రంజింపజేయడమే సారస్వతంయొక్క ముఖ్యధర్మం అని మనం ఒప్పుకొంటే — కన్యాశుల్కం పండితులను, పామరులను, స్త్రీలను, పురుషులను ఆబాలగోపాలాన్ని ఆనందపరిచింది — ఆనందపరుస్తూన్నది. ఇక ముందు ఆనందపరుస్తుంది. నిస్సందేహంగా ప్రాపంచిక వ్యాపారాలను, మానవచిత్తవృత్తులనూ, చూపరులకు సరియైన దృక్పథంలో నిలిపి నిరూపించడమే సారస్వతానికి ముఖ్య ఆదర్శముకదా! ఈ ప్రమాణాన్ని బట్టి కన్యాశుల్కంతో పోల్చవలసిన నాటకము ఇంకేది కలదు? నాటకమై అద్భుతమగు రచనాకౌశలముతో కూడుకొని ఉచ్చశ్రేణినాటక మనిపించుకున్నది మన కన్యాశుల్కం. సారస్వతమై ప్రకృతికి దర్పణమెత్తి ఆంధ్రసారస్వతలోకంలో ఉన్నతస్థానానికి హక్కు చేర్పరుచుకున్నది, ఆంధ్రుల కన్యాశుల్కం. ఆంధ్రుల నిత్యనైమిత్తికజీవనంలో మనం రోజూ చూచే సంఘటనలూ, మనం ఎల్లప్పుడూ వింటూన్న పదాలు మనవేషాలు, మనముద్దుభాష, మనవ్యాపారాలు, మన ఊహాలు అన్నీ తనయందు ఇమిడ్చుకొని వ్యక్తంచేస్తూ ఆంధ్రవిజ్ఞాన ప్రపంచములో ఆదర్శప్రాయకమై నిలచింది శ్రీ గురజాడ వారి కన్యాశుల్కం.

ఇట్టి ఉద్గ్రంథాన్ని రచించిన కవిశేఖరుడు— ఇట్టి అపూర్వ కావ్యాన్ని సృష్టించిన కవిబ్రహ్మ శ్రీ గురజాడ అప్పారావుగారు— అస్తమించినారు. కాని విచారంలేదు— ఎందుచేతనంటే, శాశ్వతంగా తమ నామాక్షరాలు ప్రతి ఆంధ్రుని హృదయంలోనూ— ఆంధ్రావనియం దన్నమాట— స్థిరస్థాయిగా ఉండేటట్టు కన్యాశుల్కం మూలాన్ని చేసికొన్నారు. అప్రతిమాన ప్రతిభావంతమైన ఆంధ్ర గ్రంథాన్ని— కన్యాశుల్క నాటకాన్ని— ఆంధ్రుల కందిచ్చి దివికేగినారు. వారి యాత్మ నేడు సర్వేశ్వరుని శాంతిధామంలో విహారం చేస్తూంది, ఆనందముగా.

---

no little originality and dramatic skill on the part of the author.

—The Peoples Friend: Jan. 21, 1897.

2.......It holds the mirror up to nature.

—The Weekly Review: March 27, 1897.

3. The piece, besides displaying much incident and humour, possesses the very necessary elements of characterisation, a trait often conspicuous by its absence in our old plays.

—The Telugu Harp.

4. The play has been acted several times, and judging from the large audience which crowded the theatre on each occasion, the author must be congratulated upon the success which the exhibition of his work producrd.

—The East Coast News.

5.......A careful study of the book is sure to bring home to the mind of the reader the need for social reform......May this work which is intelligible to the masses, spread all over the country, and helf the cause to social reform.

—Chintamani.

"తస్మిన్ ప్రీతిః, తస్య ప్రియకార్యసాధనంచ తదుపాసన మేవ."

అతనియందు శ్రద్ధ, అతని కిష్టమైన కార్యములు సాధించుట,— ఈ రెండే అతని సేవయగును. అనగా అతని అడుగులలో అడుగులు వేయుచు, అతని యాదర్శములను జ్ఞప్తియం దుంచుకొని, భాషాసేవ చేయుటయే మన మాతనియెడ జూపవలసిన గౌరవము. అదియే శ్రీ గురజాడవారి యాత్మకు శాశ్వతమయిన శాంతి నాపాదించగలదు.

'ఓం, తత్, సత్'

నీతిపద్యమాల

శ్రీ పురాణం సూర్యనారాయణతీర్థులు

ఎవఁడు బ్రదికియుండె నెందఱో బ్రదుకుదు
రతనియొక్క బ్రతుకె బ్రతుకు గాక
పట్టి పిసినిగొట్టు బ్రదు కేమిబ్రదుకయా?
నమితభీమ విశ్వనాథ రామ!

విద్య ధనము నీదు వినయమ్ము నిచ్చును
ధనము నిచ్చునదియె? తనయదృష్ట
మతురాలు రావు లక్షాధికారికి న.

ఇష్టకార్యమునకు నేఁగెడిమనసును
పల్లమునకు వడిగఁ బాఱునీరు
మరలుచుటకు నేరితర మౌను? ధర నౌను న.

జపతపములఫలము జన్మమ్ములఫలమ్ముఁ
బూర్తి సేయు విష్ణుకీర్తనమునఁ
గలియుగమ్మువంటి కాలమ్ము గలదయా? న.

స్వార్థసిద్ధికోస మన్నృతమ్ము లాడక
తీర దెందు రెంతవారి కైన;
కుంతిపెద్దకొడుకు గురునితో బొంకఁడా? న.

దైవబలము సుంత తప్పినయంత నే
మనుజుఁ డెందులకును పనికిరాఁడు;
గాండివమ్ము నెత్తఁగలిగనే పార్థుండు? న.

పాపభీతి దైవభక్తియు లేని బ్రా
హ్మణునికన్న నున్న మాలవాఁడె
సత్యగామి గాన సర్వోత్తముఁడుసుమా! న.

కాకములకు రాత్రి ఘూకములకుఁ బగల్
కానరావు కనులు; కాముకులకొ?
రాత్రి పగలుఁ గానరా వంద్రు పెద్దలు న.

విద్యఁ గోరువారు వెలఁదులపొత్తును
పరిహరింపకున్నఁ బనికిరారు
వెలఁది సర్వకార్యవిఘ్నకారిణి కదా! న.

అత్తగారు దుష్టురాలైనచోఁ గోడ
లెంత మంచి దైన నేమిఫలము?
దానిపడడిపాట్లు దైవ మెఱుంగురా! న.

కట్టెలందు లేఁడు మట్టియందును లేఁడు
రాత లేఁడు లేఁడు రత్నమందు
శుద్ధహృదయమందుఁ జూపట్టు దేవుఁడు న.

తాను తినక దానధర్మముల్ చేయక
బ్రతికినంతివఱకు భద్రపఱచు
లోభివానిధనము లోకులపాలగు! న.

నీవు నే నటంచు నీది నాది యటంచు
భేద మేల? పట్టివాద మేల?
నేను లేనినీవు నిక్కముగా లేవు న.

పొలఁతి నుంచుకొన్న పురుషుఁడె కాదుసూ
పురుషు నుంచుకొన్న పొలఁతిగూడ
సర్వనాశ మౌను తర్వాత నేర్చును న.

దేవుఁ డిచ్చువాఁడు జీవుఁడు కొనువాఁడు
నంచు నెన్నఁడును తలంచరాదు
కర్మమే ఫలమును కలిగించునఁట! అవు; న.

అర్థకామములు మహానర్థకారులు
ముఖ్యపురుషార్థములుగ వెలుఁగఁ
దరవలంబనులకు ధర్మ మెందులకయా? న.

డబ్బు మబ్బు వచ్చుటయుఁ బోవుటయు నుండి
యేమి చేయునదియు నెవరి కెఱుక?
అంతలోన వచ్చి, అంతలో మాయ మౌ న.

పడుచు వానిచెలిమి పరిపాటి యైనచోఁ
దరుణి ముసలిమగని దారిఁ బెట్టు;
వృద్ధపతికిఁ దరుణి విష మందు రందుకే న.

జనుల బుద్ధిదీపమునకుఁ దెల్లద్దముఁ
పెట్టు లచ్చి వచ్చువేళ; దాని
యక్క రాక కెట్టియద్ద ముంచును విధి న.

సదయహృదయుఁ డగుచు సత్యమే పలుకుచుఁ
బరుల మేలుకోఱకె బ్రదుకు చుండు
నతఁడె కలియుగమునఁ గృతయుగపురుషుండు.

కాశి కేఁగి యచటఁ గాపుర మ్ముండెద
మంచు నిత్యమును తలంచువారు
పోయి యున్నవారి పున్నెమ్ముఁ గందు రా.

విత్తబలము కాదు విద్యాబలము నాత్మ
బలము గాదు బుద్ధిబలమె కాదు
అన్ని బలము లుడిగె హైందవులకు నహో!

బీదవానియిల్లు బిడ్డలతో నిండు
ధనికుఁ డాత్మజులకుఁ దల్లడిల్లు
వారివారి కర్మవైఖరి కా కేమి? న.

సతికి భర్తృసేవ, సంన్యాసి కోంకార
జపము, బ్రాహ్మణునకు సందె మ్రొక్క
స్వర్గ మోక్ష శక్తి సంధాయకములయా! న.

పూర్వపుణ్యనాశమునఁ గల్గుకలిమి యా
పదయుకాఁ దలంచి పాత్రమందు
దాని నీగు మనిరి తచ్ఛాంతికై బుధుల్ న.

లేనివారు తిండి లే దని యేడ్వంగ
నున్నవారు తినుట కోపలేరు!
వారివారి కర్మవైభవ మి ట్లుండు న.

చెఱకుముక్కచుట్టుఁ జీమలవలె విత్త
వంతుచుట్టు జనము వచ్చి చేరు;
ధనము లేనివాని దయ్యముం జూడదు న.

ఆఁడుదానిచేతి యర్థమ్ము మగవాని
చేతి బిడ్డ వృద్ధిఁ జెంద దనుట
యెఱిఁగి పాడుచేసి యేడ్చు టెందులకయా?

కష్టసుఖము లందుఁ గలిమిలేములయందు
హాని వృద్ధులందు మానసమున
మార్పులేనివాఁడె మహియందు ధీరుండు న.

ఎట్టివిద్య లున్న నెంతటివాఁ డైన
స్వల్పవస్తువునకె వ్యాకులపడు;
ద్రోణుఁ డావుపాలు దొరకక యేడ్వఁడా? న.

భర్త యెదుట నుండ బంధువుల్ కనుచుండఁ
బలుకరాని కష్టపాటు పడుట
ద్రౌపదమ్మ తొల్లి తాఁ జేసికొన్నదే! న.

ఉ.కరించువారి కపకార మొనరింపఁ
గడఁగుచుండు నెపుడు ఖలులబుద్ధి;
పాలు పోసి పెంచుపాము కఱవకున్నె? న.

ఇచ్చుటకును తాను పుచ్చుకొనుటకును
చేయవలయుపనులు చేయుటకును
కాలహరణ మైనఁ గాఁజాల వాపనుల్ న.

మనుజుఁ డగుట, మోక్షమును పొందఁగోరుట,
దారిఁ జూపుగురువు తారసిలుట
పూర్వపుణ్యవృక్షమునకు ఫలములయా! న.

గ్రామ పునర్నిర్మాణము

శ్రీ టి. జ్ఞానానందము

ఈ దినములలో గ్రామ పునర్నిర్మాణ మను మాట పలుచోట్ల వినబడుచున్నది. రాజకీయవేత్తలు, సాంఘికపునర్నిర్మాణకర్తలు, విద్యావేత్తలు మున్నగువారు ఈ పదమును వాడుచున్నారు గాని జనసామాన్యమునకు దీని అర్థముగాని, దీని ఆవశ్యకతగాని, నిర్వహింపవలసిన విధానముగాని యింకను తెలియదు. ఈ చిన్న వ్యాసమందు కొంతవరకు పైకొరతను దీర్ప ప్రయత్నింతును. అర్థము: పూర్వము ఉన్నత స్థితిలోనున్న గ్రామములు కాలక్రమేణ పాడైపోగా వాటిని యథాస్థానమునకు తెచ్చు ప్రయత్నమునకు "గ్రామపునర్నిర్మాణ" మందురు. అనగా "గ్రామములను తిరిగి కట్టుట" యని భావము. దీనికే "గ్రామపునరుద్ధరణ" మని మరియొక పేరు. "**Rural-Reconstruction or Village uplift**" అని ఆంగ్లభాషలోకూడ చెప్పుదురు. ఈ పదమును మొదట వాడుకలో పెట్టినవారు, సేలం జిల్లా వాస్తవ్యులు శ్రీ. టి. పాల్ గారు.

ఆవశ్యకత—

మన హిందూదేశములో ౧౦౦ కి ౯౦ మంది గ్రామవాసులే. ౧౦౦ కి పదిమందికైనను చదువురాదు. అన్నివైపుల దారిద్ర్యము చెలరేగి చెండాడుచున్నది. ఒకరు చెప్పినలెక్కలనుబట్టి; మన దేశములో మూడవవంతు ప్రజలు ఆహారము లేక పాడగుచున్నారు. మరొక మూడవవంతు, సరియైన ఆహారము లేక బాధపడుచున్నారు. మిగిలిన మూడవవంతు, ఉన్నది తినుట చేతగాక చెడిపోవుచున్నారు. మనదేశస్థులయొక్క సరాసరి ఆయుఃప్రమాణము పాతిక సంవత్సరములే. మనదేశ మిట్టిదుర్భరస్థితిలో ఉన్నప్పుడు పునర్నిర్మాణముయొక్క ఆవశ్యకత హెచ్చుగా కలదుగదా! ఏమి చేయవలయును?

దేశముయొక్క స్థితిగతులను పరిశీలించినవారు ఐదురీతుల దేశమును బాగుచేయవలయునని సలహా చెప్పుచున్నారు.

౧. ఆధ్యాత్మికముగను, ౨. మానసికముగను, ౩. శారీరకముగను, ౪. ఆర్థికముగను, (౫) సాంఘికముగను– ఈ ఐదురీతుల మనము కార్యక్రమ మేర్పరచుకొని పనిచేయవలయును. ఈ ఐదురీతుల దేశము కొరత పడియున్నది. వీనిలో ప్రతిదియు రెండవదానిమీద నాధారపడియున్నది అన్నివిధముల అభివృద్ధిచేకూర్చిన నాడే సంపూర్ణ పునర్నిర్మాణ మయినదనవలెను.

మన గ్రామములు బాగుపడవలెనన్న సర్కారువారు వచ్చి మనకు సహాయము చేయవలెనను అభిప్రాయము చాలమందికి గలదు. అది పొరపాటు. మనకు మనమే సహాయముచేసుకొన సిద్ధపడవలెను. పిమ్మట మనము చేయలేనివంతును సర్కారువారు చేయునటుల కోరుట మంచిది. అట్టివారికే సర్కారువారు సహాయము చేయుదురు. తమకుతాము సహాయము చేసుకొను విధానమునకు "స్వయం సహాయసూత్ర" (**The Principle of Self-help**) మందురు. స్వయం సహాయసూత్రము లేనిదీ గ్రామపునర్నిర్మాణము జయకరముగా జరుగదు. అందుచేతనే గవర్నమెంటువారు ధనసహాయము చేసి స్థాపించిన గ్రామపునర్నిర్మాణ కేంద్రములకంటే గ్రామస్థులు స్వంతముగా స్థాపించుకొన్నవి ఎక్కువ జయకరముగా జరుగుచున్నవి.

గ్రామ సేవ చేయవలెనని అభిలషించువారు కొందరు ఒకసంఘముగా కూడి దానికి "గ్రామపునర్నిర్మాణసంఘము" అని పేరుపెట్టుకొందురు. గ్రామములోని డాక్టరును, చేరగలిగిన స్త్రీలును అందు మెంబర్లుగ ఉందురు. వీరందరును స్వచ్ఛందసేవకులే. వీరు పైని చెప్పబడిన ౫ విధములైన కార్యక్రమమేర్పాటు

చేసుకొని పని సాగింతురు. మనము ప్రతి గ్రామమందును అట్టి సంఘములు స్థాపించుకొని క్రింద విశదీకరించిన ఐదు విధములుగాను పనిని సాగింపవలెను.

(౧) ఆధ్యాత్మిక విషయము

ఇది గ్రామ పునర్నిర్మాణమునకు పునాదియు, ముఖ్యతమమైనదియునై యున్నది. గ్రామస్థులజీవితము నీతియుక్తమును, పవిత్రమును, సోదరభావముగలదియునై యుండవలెను. ప్రతివాడును తనవలె తనపొరుగువానిని ప్రేమించుకొనునటుల చేయగలుగుటే గ్రామ పునర్నిర్మాణమునకు మొదటిమెట్టు. గ్రామస్థులలోని చిన్నచిన్న కలహములు, వ్యాజ్యములు, అన్యాయవర్తనములు మొదలైనవి కోర్టులవరకు వెళ్లకుండ, గ్రామపునర్నిర్మాణసంఘముచే తీర్చవలెను. మహాత్ముని అహింసాసిద్ధాంతముయొక్క అమూల్యతను గ్రామస్థులు గ్రహించునటుల తగు ప్రచార మొనర్పవలెను. గ్రామదేవతసంభ్రమములలో వేడుకగా జరుగు జీవహింసలను మాన్పించవలెను. ప్రతివారు తమతమ మతమెంతవరకు సత్యములను నేర్పుచున్నదో వానిని అనుభవములోనికి తీసుకొనివచ్చునటుల తగుబోధన జరుగవలెను. కేంద్రసంఘములోని సభ్యులు తమజీవితము నితరులకు ఆదర్శనీయమైనదిగ జూపవలెను.

(౨) మానసిక విషయము

గ్రామస్థులకు జ్ఞానాభివృద్ధికలుగజేయుభారము పునర్నిర్మాణసంఘములమీద నున్నది. గ్రామములోని బాలబాలికలందరును పాఠశాలలకు పోవునటుల తగు కట్టుదిట్టములను గావింపవలయును.

(క) విద్యతోపాటు చిన్నచిన్న ఉపవృత్తులను నేర్చుకొనగలుగునటుల పాఠశాలాధికారులను కోరవలెను. అట్లయినయెడల నిరుద్యోగసమస్య చాలవరకు తీరగలదు. నవారు నేయుట, మ్రడంగము, నూలువడుకుట, నేయుట, తేనెటీగలను పెంచుట, కోళ్లను పెంచుట, లేసుకుట్టుట (బాలికలు), పెరటితోటలు పెంచుట మొదలైన వనేకములు నేర్పుట మంచిది.

(చ) వయోజనవిద్య-ఈదినములలో ఇది చాలచోట్ల వ్యాప్తిగాంచుచున్నది. తెలివితేటలుగలవానికి ౬ మాసములలోనే చదువను వ్రాయను నేర్పుటకు తగినటుల వాచకములు రచితములై ఫలితములు చూపుచున్నవి. పెద్దలకు విద్యచెప్పుటలో కేవలము చదువను వ్రాయనుమాత్రమే కాక, కొంత దేశచరిత్ర, భూగోళము, రాజకీయములు, కథలద్వారా నేర్పుట మంచిది. ఆరోగ్యవిధులు మొదలైనవి మ్యాజిక్ లాంతరుద్వారా చూపించి జ్ఞానవికాసము కలుగజేయవలెను.

(ట) గ్రంథాలయములు:—గ్రామస్థుల జ్ఞానాభివృద్ధికి గ్రంథాలయములు చాల అవసరము. గ్రంథాలయములలో వివిధములైన పుస్తకములు, వీలున్నయెడల వివిధమతగ్రంథములును సంపాదించి చేర్చవలెను. అచ్చటికి అన్నిజాతులవారును రాగలుగునటుల అవకాశము కలుగజేయవలెను. బాలురకును, పెద్దలకును, వివిధవృత్తులలో నున్నవారికిని తగు పుస్తకములు అందుంచుట మంచిది. బాలుర మనస్సులను పాడుచేయు అపవిత్రములగు పుస్తకము లనేకములు వెలువడుచున్నవి. అటువంటివి గ్రంథాలయములలో చేర్చరాదు. వార్తాపత్రికలకును, గ్రంథములకును కావలసిన ధనము చందాలరూపమున పోగుచేసి పిదప సర్కారుసహాయ మపేక్షించవలెను.

(త) సంచార గ్రంథాలయములు — పైవానినే సంచారగ్రంథాలయములుగ వాడవచ్చును. గ్రంథాలయములులేని దగ్గరగ్రామములకు ప్రతినెలలోను కొన్నికొన్ని పుస్తకములు పంపుటద్వారా యితరులకుకూడ మనము సేవ చేయవచ్చును.

(ప) నాటకములు — జ్ఞానాభివృద్ధికిని, సాంఘిక అభివృద్ధికిని నాటకములు అంత్యంతోపయుక్తములు. నాట్యకళ, సంగీతకళలు వశించకుండునట్లు వీనిని అమలులో పెట్టవలెను.

ఇంతేకాక సాధ్యమైనచోట్ల రేడియోప్రసంగములు, పాటలు మొదలయినవి, గ్రామస్థులు వినగల ఏర్పాట్లు చేయించుటకూడా మంచిది.

3. శరీరవిషయము

(క) జనసామాన్యముయొక్క శుచి, శుభ్రత, ఆరోగ్యము, దేహపరిశ్రమ- వీనినిగూర్చికూడ పున

ర్నిర్మాణసంఘములు జాగ్రత్త తీసుకోవలెను. ఇండ్లు, వాకిళ్లు, పరిసరములు, వీథులు శుభ్రముగా నుండునట్లు చూడవలెను. చెత్తచెదారములు వీథులలో విసరివేయక కాల్చివేయవలెను. ప్రజలలో సహకారము న్నచేతప్ప యిటువంటివి జయకరముగా జరుగవు. మన యిల్లు కుడిచి పొరుగువారి పెరటిలోగాని, రహదారీ వీథిలోగాని చెత్త పోయు దురలవాటులు మాన్పించవలెను.

(జ) సరియైన ఆరోగ్యము మనకు కావలెనన్న సరియైన ఆహారము తినవలెను. ఈ దినములలో మిల్లు బియ్యమువలన అనర్థకములు విపరీతముగ నున్నవని పరిశోధకులు చెప్పుచున్నారు. అజీర్తి, తిమ్మిరి వాతము, సంజూవ్యాధి, వీనికిని బాలింతకాయలాలకును చాలవరకు మిల్లుబియ్యమే కారణ మని చెప్పుచున్నారు. అనేకచోట్ల దంపుడుబియ్యముసంఘములు స్థాపించి, దంపుడుబియ్యము సప్లయిచేయుచున్నారు. ఈమధ్యను ఆరోగ్యశాఖవారు కఱ్ఱతిరుగలితో విసరిన బియ్యము మరీమంచి వని వాటిని వాడుకలో పెట్ట ప్రయత్నములు చేయుచున్నారు. తిరుగళ్లు చేయించి అమ్ముచున్నారు. వీనినిగూర్చినవివరములు గ్రామపునర్నిర్మాణసంఘమువారు ఆరోగ్యశాఖవారియొద్దనుండి పొందవచ్చును.

(ట) మరుగుదొడ్లు— గ్రామపారిశుద్ధ్యమునకును, అంటువ్యాధులు వ్యాపింపకుండుటకును మరుగుదొడ్లు అత్యావసరము. గుంటకక్కసులు (China-pits) కన్నపు మరుగుదొడ్లు, (Bore hole latrines) అని రెండువిధములైన మరుగుదొడ్లనుగూర్చి వివరములు ఆరోగ్యశాఖవారియొద్దనుండి మనము పొందవచ్చు.

(ఠ) మద్యపాన నిషేధము — ఈ మహాపిశాచిని పారద్రోలుటకు కాంగ్రెస్ ప్రభుత్వము కంకణము కట్టుకొనెను గాని దురదృష్టవశాత్తు తాత్కాలికముగ అది ఆగిపోయెను. సర్కారువారు మద్యనిషేధ మమలుజరుపువరకును మనము చూడక దానిని పోగొట్టుటకుమార్గములు వెతకవలెను. క్రమమైన ప్రచారముచేయుటద్వారాను, త్రాగుబోతులతో స్నేహము చేసి దాని అనర్థకములను విశదీకరించుటద్వారాను గొప్పమార్పు తేగలము. త్రాగుడు మాన్పింపబడిన జిల్లాలలో సహితము అది మరల మొలకెత్తకుండునటుల, వారి అంతరంగములు మార్పునొందునట్లు చూడవలయును.

(డ) ఆటలు—గ్రామస్థులలో ఉత్సాహమును సహకారమును పెంపొందించుటకును, కొద్ది ప రి శ్రమనిమిత్తమును ఆటలు ప్రవేశపెట్టుట చాల మంచిది. పెద్దలకు వేరుగను, పిల్లలకు వేరుగను ఆటలు ఏర్పాటు చేయవలయును. తిరువాన్కూరుసంస్థానములో గ్రామపునర్నిర్మాణసంఘములు ఏర్పడి ఈ పనులన్నియు చేయుచున్నారు. అచ్చట ప్రతిచోటను సాయంకాలములయందు ఆటలు ఆడుకొందురు. ఎక్కువ పెట్టుబడి, ఖర్చు లేనటువంటి ఆటలు గ్రామపునర్నిర్మాణసంఘములు ఏర్పాటుచేయవలెను.

౪. ఆర్థికవిషయము

గ్రామస్థుల ఆర్థికస్థితి బాగుపడినగాని మనము గ్రామాదులను బాగుచేయలేమని తలపవలెను. కొన్ని గ్రామములలో సంవత్సరమునకు ఆరుమాసములు ఏమియు పనులుండవు. పనులున్నకాలములందును, లేని కాలములందును కూడ చేసుకొనగల ఉపవృత్తులు చాల గలవు. ఆయా ప్రదేశముల స్థితిగతులను, అవకాశములను బట్టి మనము ప్రవేశపెట్టగల ఉపవృత్తులను, గృహపరిశ్రమలను కొన్నింటి నిక్కడ పేర్కొనుచున్నాను.

(క) తేనెటీగలను పెంచుట — తేనెటీగ లనిన చాలమంది భయపడుదురుగాని ఇది బహులాభకరమైన పరిశ్రమ. కఱ్ఱతో ఈగ లుండుటకు వీలుగా ఉండులాగున పెట్టెలను చేసి వానిలో ఈగలను ప్రవేశపెట్టుదురు. ఒక పెట్టె ఖరీదు. ౨ రూ. లేక ౨.౮ ఉండును ఒక పెట్టెవలన సంవత్సరమునకు సుమారు ౧౫ రూ. ల ఖరీదు గల తేనె లభించును. మరేమియు పెట్టుబడి లేదు. దీని వివరములు యిప్పుడు ప్రతితాలూకాలోను గవర్నమెంటు వ్యవసాయడిపార్టుమెంటువారు తెలియజేస్తున్నారు. ఈ పరిశ్రమ ప్రారంభించువారికి తగు సహాయము వారు చేయగలరు.

(ఖ) నూలువడుకుట - నేయుట - ఇది ఈకాలమందు ప్రతిచోటను ఉండవలసిన పరిశ్రమలలో ముఖ్య

ము యినది. చర్కా సంఘములవలన ఇది బహుప్రోత్సాహ కరముగా జరుగుచున్నది. దేశీయపద్ధతుల నవలంబింపగోరువా రెవరును దీనిని ప్రారంభింపకుండ నుండ లేరు. ఇది సర్వసామాన్యమయిన విషయమగుటచే నే నెక్కువ చెప్పనవసరము లేదు.

(౭) నవారు నేయుట—ఇదికూడ తేలికరైనదియు, లాభదాయకమయినదియు నైన పరిశ్రమయై యున్నది.

(౮) కోళ్లపెంపకము—ఇదికూడ చాలచోట్ల గృహపరిశ్రమగా అభివృద్ధి జెందుచున్నది. విదేశీకోళ్లు, అనగా తెల్లజాతికోళ్లు, ఆర్పింగ్‌టన్‌లు, మినోర్కాలు, టర్కీలు మొదలైనవానిని పెంచుటద్వారా ఎక్కువ లాభము తీయుచున్నారు. లెగ్‌హారన్ కోళ్లు సంవత్సరమునకు ౩౦౦ వరకు గ్రుడ్లను పెట్టును. వీనినిగూర్చిన వివరములు కూడ ఆయాచోట్లగల వ్యవసాయడిపార్టు మెంటువారిద్వారా తెలుసుకోవచ్చును.

(౯) పెరటితోటలు—మన యిండ్ల వెనుక పెరడులు చాలమట్టుకు వ్యర్థముగా విడుచుచున్నాము. ఎంతచిన్నస్థలమందైనను అనేకరకములైన కూరగాయలను పండించి హెచ్చులాభము పొందుటకు నూతన పద్ధతు లున్నవి.

రకరకములైన పూలతోటలను పెంచిన యెడల గృహములయొద్ద శృంగారముగా నుండుటమాత్రమే గాక తేనెటీగలను పెంచువారికి చాలఅనుకూలముగా నుండును.

ఇంకను సబ్బుచేయుట, రంగురంగుల బుట్టల ల్లుట, పుస్తకములు బైండుచేయుట మొదలైన వెన్నియో గలవు. ఒక స్థలమునందు పనికివచ్చు పరిశ్రమలు మరొక స్థలమునకు పనికిరాకపోవచ్చును. కనుక ఏయే స్థలములకు ఏవేవి పనికివచ్చునో చూచి, వాటినే ప్రవేశ పెట్టవలెను.

౫. సాంఘికవిషయము

గ్రామపునర్నిర్మాణ కార్యక్రమములో ముఖ్యమైనదియు, అన్నింటికిని ఆధారమైనదియు నైనది సాంఘిక విషయము. పైవాటిని నెరవేర్చు ప్రయత్నమందే యిదికూడ కలిసివచ్చినను దీనినిగూర్చి కొంత ప్రత్యేకముగా చెప్పవలసిన ఆవశ్యకత కలదు. అన్ని విషయములందు సహకారము ప్రజలలో నెలకొల్పుటే సాంఘిక పునర్నిర్మాణముయొక్క ఉద్దేశము. ఒకడు అందరికొరకును, అందఱును ఒకనికొరకును బ్రతుకుచున్నారని నమ్మవలెను.

సహకారమునకు కొన్ని సూచనలు.

(౧) అస్పృశ్యతానివారణ— స్వరాజ్యసంపాదనకు మహాత్ముని కార్యక్రమములో యిది మొదటి మెట్టు. గ్రామపునర్నిర్మాణకార్యక్రమములోకూడ యిది మొదటిమెట్టని మనము భావింపవలెను.

(౨) సహకార సంఘములు — సాహుకార్ల యొద్ద హెచ్చువడ్డీలకు బదులు తీసుకొను గ్రామస్థుల సహాయార్థమై సహకార పరపతి సంఘములు స్థాపించవలెను. ఈ సంఘములు ప్రజలలో సహకారమును, పరపతిని హెచ్చుచేయునట్లు చూడవలెను; లేనియెడల సంఘములు దివాలాతీసి ప్రజలను ఎక్కువ అప్పుల పాలు చేయును.

(౩) సమష్టివ్యాపార, సమష్టి కొనుగోలు సంఘములు—

గ్రామస్థులు తమకు కావలసినవి సమష్టిగా కొను క్కొన్నయెడల చౌకగా వస్తువులు లభించును, మరియు సహకారముకూడ ఎక్కువగును. అలాగే గ్రామస్థులు తాము పండించునవిగాని, తయారుచేయు సరకుగాని సమష్టి వ్యాపార సంఘములద్వారా అమ్మినయెడల శ్రేయస్కరముగా నుండును. తిరువాన్కూరులో చాల చోట్ల నేతబట్టలు, తేనె, కోడిగ్రుడ్లు, జీడిపప్పు సమష్టి వ్యాపారసంఘములద్వారానే అమ్మెదురు.

కొన్ని స్థలములలో ఆబోతులను సమష్టి సంఘములే తెప్పించి, చుట్టుపట్లవా రందరికిని వాని నుపయోగింతురు. మామూలు ఆవులు, ఈ ఆబోతులచే దాటించబడినపుడు రెట్టింపుపాలు యిచ్చును. యివి ఒక్కొక్కరు కొనలేరు గనుక సహకార సంఘములు లేక గ్రామపునర్నిర్మాణసంఘములు తెప్పించి పని చేయవచ్చును. పైని చెప్పబడిన విధురీతుల అనగా, ఆధ్యాత్మిక, మానసిక, శారీరక, ఆర్థిక, సాంఘిక రీతులుగా మన గ్రామాదులను పైకి తీసుకొనివచ్చు భారము ప్రతి ఆంధ్రునిమీదను, భారతీయునిమీదను ఉన్నది. ఇందు ఒక్కటి లోపించినను గ్రామపునర్నిర్మాణ సౌధము కూలిపోవును.

కర్మజ్ఞానసముచ్చయవాద విమర్శలేశము

శ్రీ పంచాంగం వెంకటాచార్యులు

విక్రమసంవత్సర శ్రావణమాసభారతిలో శ్రీ ఓగేటి సుబ్బయ్యశాస్త్రిగారు కర్మ జ్ఞానసముచ్చయవాదమును విమర్శించుచు కడపట – "భగవద్గీత యం దంతటను జ్ఞానమునకు కర్మయోగమును, భక్తిని సాధనముగా చెప్పుచుండ శ్రీ రామానుజుడు భక్తి చేతనే ముక్తి కలుగు నని చెప్పియున్నాడు. ఆయన వ్రాసిన విపరీతవాక్యముల నిచ్చట నుదాహరించుట అసమంజసము కాదు. అష్టాదశాధ్యాయమున "భక్త్యా మా మభిజానాతి" అను శ్లోకమునకు వ్యాఖ్యానము కావించుచు– విశుద్ధబుద్ధియోగాదిభిః బ్రహ్మప్రాప్తిః ఆత్మసాక్షాత్కారో భవతి. తతో భగవతి పుండరీక నయనే స్వస్వామి న్యశేషార్థప్రియాసంభవరూపా భక్తిర్జాయతే భక్త్యా తతో భగవంతం జానాతి. తతో భక్తిత ఏవ భగవంతం విశతే॥ ఈ వాక్యములు వేదాంతాభిప్రాయమున కెంత విరుద్ధములో వేరుగా చెప్పనవసరములేదు. ఆత్మజ్ఞానము కల్గినతరువాత నేత్రాద్యవయవవిశిష్టుడగు సాకారమూర్తివిశేషమును చూచుట పొసగునా? భగవంతుడు నిర్గుణుడుగదా. "అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం" అని రామానుజునిపట్ల విపరీతవాక్యములు వ్రాసినారు. ఇందలి సత్యాంశము తెలియుటకు ముందు శ్రీ శంకర రామానుజుల ముఖ్య సిద్ధాంతముల తెలిసికొనుట అత్యావశ్యకము. కావున వాని నిట చూపెదను.

శంకరుడు అద్వైతవాది, ప్రపంచకము మిథ్య యనును.

రామానుజుడు విశిష్టాద్వైతవాది, ప్రపంచకము సత్య మనును.

శంకరుని పరమాత్మ–నిర్గుణుడు నిరాకారుడు.

రామానుజుని పరమాత్మ–అనంత కల్యాణగుణ పరిపూర్ణుడు. అప్రాకృత (ప్రకృతిభిన్న) దివ్యమంగళ విగ్రహుడు.

శంకరుని పరబ్రహ్మకు వ్యవహారదేహము వేరు, పరమార్థ దేహము వేరు.

రామానుజుని పరబ్రహ్మకు ఒకటే దేహము.

శంకరునియభిప్రాయములో జీవాత్మపరమాత్మలకు భేదము లేదు.

రామానుజుని యభిప్రాయములో జీవాత్మ వేరు, పరమాత్మ వేరు. మఱియు జీవాత్మ 'స్వ'ము(సొమ్ము) పరమాత్మ=స్వామి (సొమ్ముకలవాడు) జీవాత్మ సేవకుడు– పరమాత్మ సేవ్యుడు.

ఉభయమతములును శ్రుతిప్రమితములు సమాన కోటికములు. ఒకదానితో నొకటి త్రోసివేయరానివి.

ఇటులుండ నిందులో నొకరి మత సిద్ధాంతముతో నింకొకరి మతమును విమర్శించుట అనుచితము. తమ వేదాంతాభిప్రాయమునకు విరుద్ధమైనదానిని ప్రపంచమునకే విపరీత మని వ్రాయుట ధార్ష్ట్య మనిపించుకొనును. పైని చూపిన సిద్ధాంత విషయములను మనసున పెట్టుకొని శ్రీ శాస్త్రిలుగారు చూపిన శ్రీరామానుజుని వాక్యములు సమన్వయించుకొనిన విపరీతవాక్యములో సుపరీతవాక్యములో పాఠకులకువిశదము కాగలవు. ఆత్మజ్ఞానము కల్గినతరువాత నేత్రాద్యవయవ విశిష్టుడగు సాకారమూర్తివిశేషమును చూచుట పొసగునా? యని శాస్త్రిలుగారి ప్రశ్న; నిర్గుణదర్శికి పొసగదు. సగుణదర్శికి పొసగునని సమాధానము.

"అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం" ఈ వాక్యము పరమాత్మ ప్రకృతివిలక్షణు డని చెప్పు చున్నందున రామానుజాని భగవంతుడు అప్రాకృత (ప్రకృతివిలక్షణ) దివ్యమంగళవిగ్రహుడు కనుక ఆయన చెప్పిన "భగవతి పుండరీకనయనే" అనువాక్యమునకు సాధకమే కాని బాధకము కాదు.

ఛాందోగ్యోప నిషత్తు భగవానుడు పుండరీక నేత్రు డని యుపదేశించు చున్నది కూడ.

అది యటుంచి రామానుజానియభిప్రాయప్రకారము భగవద్గీతయందు "భక్త్యా త్వనన్యయా శక్యః" "భక్త్యా మామభిజానాతి యావాన్ యశ్చాస్మితత్వతః, తతో మాం తత్వతో జ్ఞాత్వా విశతే తదనంతరం(తతః= భక్తివలన) ఈ వరుస భగవానుడు. కంఠోక్తిగా భక్తి చేతనే ముక్తి కలుగునని చెప్పుచుండ కర్మ భక్తి జ్ఞాన సాధనములు అని చెప్పుట విరుద్ధముకాదా? అని మరల శాస్త్రులుగారిని ప్రశ్నించిన నేమందురు? మరల వాదమే గదా!

కావున నిట్టి యనవసర వాదములకు చోటివ్వక తిరస్కార భావము మాని పాఠకులకు బుద్ధిభ్రమణము కలిగింపక యేవిషయము నైన రెట్లు చెప్పిరో ఉన్నదున్నట్లు విశదీకరించుట సముచితము.

ఒకమాట—శ్రీ రామానుజాని "భక్త్యా మామభిజానాతి" యను శ్లోక భాష్య పంక్తులలో శ్రీశాస్త్రులుగారు శ్రీ రామానుజాని వాక్యము లని చూపినవి ఆనందాశ్రమమువారి గీతాభాష్యములో కనుపించుట లేదు. కూర్చినవి కానోవు. ఇతి శమ్.

గీత

శ్రీమతి స్థానాపతి - రుక్మిణమ్మ

నీలి మముసేని ఈ శరత్కాల రాత్రి
విధివశమ్మునఁ బిదిలిన హృదయవీణ
కోరుచున్నది జీవాలతారతంత్రి
గగన మంటెడి జయపతాకములఁగాంచి-
పారతంత్ర్య నిర్మూలన పథముఁద్రొక్కి-
విశ్వమంతయు మనముగా విరిసిపోయి
తారుమారైన యావదాంధ్ర ప్రశస్తి,
మరల రేకెత్తుదాక కర్మ ప్రకర్ష,
పాడుకొందాము జగతి విప్లవము రేగ
మానగారాదు - గీతోక్తగాన రవళి.

నీ పుట్టుపూర్వోత్తరాలు *

శ్రీ వి. ఆర్. శాస్త్రి

ఒకటవ అధ్యాయము

౧

నీవు నీతల్లిగర్భంలో చిన్నపాపాయిగా ఏర్పడటానికిముందు చాలాకాలముక్రిందట మిక్కిలి చిన్న అణువుగా ఉన్నావు. ఆ అణువు మెత్తగా తాకితే సొట్టబడుతూ, తాటిముంజలాగ ఉండేది. నీకపుడు చేతులు, కాళ్లు, అరచేతులు, పాదాలు, తల యివేవీ లేవు.

చిన్నగుండుసూదితలకన్న యింకా చిన్నదిగా, మెత్తగా నీవున్నావు. నీకు ప్రత్యేకంగా ఏవిధమైన రూపంగానీ లేదు. నోరుగాని, కండ్లుగాని నీకపుడు లేవు.

పటం 1



ఏకకణము-మొదట నీవున్న తీరు

ఒక వస్తువంటే యిష్టమూ, ఇంకొకటంటే అయిష్టమూ నీకూ తెలియదు. దీన్ని చూస్తే సంతోషమనిగాని, దాన్ని చూస్తే భయమనిగాని నీకు తెలియదు.

ఎప్పుడూ పెరుగాలి, ఇంకా పెద్దగా పెరుగాలి అనే నీకుండేది. ఎట్లాగైనాసరే నీవు పెరగటం చాలా ముఖ్యంగా నీకు తోచేది.

ఎవరన్నా నిద్రపోతూంటే నిద్రలోనే వాళ్ల ముఖంమీద ముక్కుకడ్డంగా దుప్పటీగాని, కంబళీగాని పడవచ్చు. ఊపిరి సరీగా సలుపదు కనుక, నిద్రలోనే ఆదుప్పటిని తొలిగించేస్తారు. ఆమనిషి నిద్రలేవడు.

నీవు పెరుగవలెననే ఆశకూడా అటువంటిదే. నిద్రించే ఆమనిషి తప్పకుండా గాలి యెట్లా పీల్చవలసియుండో, అదేవిధంగా నీవుకూడా తప్పకుండా పెరుగవలసియుంది. ఈ పెరుగవలెననే ఉద్దేశం చాలా బలమైంది. అందుకనే మొక్కలు నేలలోనుంచి అడ్డం వచ్చిన రాళ్లను, మట్టిని ప్రక్కకుత్రోసి పెరుగుతాయి.

చాలాకాలంవరకు మెత్తని అణుమాత్రంగా ఉన్నటువంటి నీవు మేల్కొనకుండానే పెరిగావు. నిద్రపోయేవాడు నిద్రలోనే ఊపిరిపీల్చేవిధంగా నీవు పెరిగేవాడివి.

౨

పూర్వము, ఒకానొకపుడు, యీ లోకంలో సరియైన జంతువులు లేవు. చేపలు, పురుగులు ఏవిధమైన జంతువులూకానీ ఉండేవికావు. గుండుసూదితలకన్న చిన్నవిగాఉండే అణువులే, అప్పుడుండేజీవులు. సూదితల అంతపొంకంగా, సుందరంగాగూడా ఆఅణువులుండేవికావు. తల్లి గర్భంలో మొట్టమొదటగా నీవు ఏర్పడినపుడు యీచిన్న అణువులలాగానే యున్నావు.

ఆ అణువులను ఆంగ్లంలో "ప్రొటోజోవా" [Protozoa] అంటారు. అంటే, ప్రథమ జంతువులని చెప్పుకోవచ్చు. అవి నీళ్లలో తేలుతూఉండేవి. వీటికి, పాపం, కాళ్లు, చేతులు, కళ్లు, రెక్కలు ఏవీ ఉండేవికావు. నీళ్లలో యీదటానికి వాటికి తెలియదు. ఒకేచోట స్థిరంగా ఉండటానికి వీలయేదికాదు. నీటిప్రవాహాలు,

---

* ఎ. విలియం ఎల్లిస్ పుస్తకం "**How you Began**" ను అనుసరించి యీ విషయాలు వ్రాశాను. ఇది అనువాదం కాదు. బొమ్మలకు **Ellis**, **Wells**, **Haeckel** వాళ్ల గ్రంథా లుపయోగించాను. అందరికీ కృతజ్ఞత.

—వ్యా.క.

గాలి, అలలు వాటిని యిష్టంవచ్చినట్లు, ఇటూ అటూ తీసుకుపోయేవి. కదలకుండా నీళ్లున్నప్పుడు, దొర్లుతూ, సాగుతూ, ఏదో అవస్థలుపడి కొంచెం జరిగేవి ; కాని కదిలే నీళ్లల్లో వేలకొలది యివి కొట్టుకుపోయేవి. ఆగడానికి వాటికి శక్తిలేదు. అవి మంచినీళ్లు, ఉప్పునీళ్లల్లో కూడా నివసించేవి. నీళ్లల్లో తేలేపాచి, సముద్రపుదుబ్బు' లేకుంటే చిన్నపాచివంటి ఇతర మొక్కలను యివి తినేవి. వీటికి యీదటం రాదు, చూడటానికి కళ్లులేవు; అందుకని వాటిదగ్గరగా ఏదన్నా ఆహారం కొట్టుకు వస్తేనేగాని, వీటికి, పాపం, తిండి దొరికేదికాదు. అటువంటి ఆహారంకనుక దగ్గరగా వస్తే, ఈ చిన్న అణువులు తమశరీరంలో ఏదో ఒకచోట తెరుచుకొని, దాన్ని మ్రింగేవి!!


ఈ అణువులకు నోరనిగాని, కడుపనిగానీ ఉండేవి కావు. మెత్తని మైనంలాగు ఉండేవి. మైనంతో గోలీగుండునుగాని, గచ్చకాయనుగాని అదిమి మూసినట్లుగా యివి తమ ఆహారాన్ని మ్రింగేవి. పోళీలు, లేక, ఒబ్బట్లు చేసేటప్పుడు ఇల్లాగే చేస్తారు. పూర్ణం ముద్దకు ఒకప్రక్కగా మైదాపిండిని పట్టుకొని, నెమ్మదిగా ఆపూర్ణమంతా మైదాపిండిలో పరచి మూసేస్తారు. మైదాపిండి, పూర్ణాన్ని మ్రింగేసిందనవచ్చు. మన అణువులుకూడా అట్లాగే తమఆహారాన్ని గ్రహించేవి. కాని అవి అణువులు, చాలా చిన్నవనేమాట మరచిపోవద్దు

ఈ "ప్రొటోజోవా"కు తరుచుగా ఆహారం దొరికేదికాదు. నీటిపోటుకు ఏదైనా గట్టుమీద ఇవి పోయిపడితే, నీళ్లు తీసిన తరువాత అక్కడే నిలిచి పోయేవి. కొంతకాలం, వాటిదగ్గర ఏదన్నా ఆహారముంటే తినేవి, తరువాత, వేరేగతి లేక, చనిపోయేవి.

తరుచుగా నీళ్లలో, నేలపైనికూడ ఆహారమేదన్నా వీటికి దగ్గరగానే ఉంటుండేది. ఈ "ప్రోటోజోవా" ఏవిధంగానన్నా ప్రాకినా, ఈదినా, దొర్లగలిగినా, చూడటంగాని, వాసనపట్టడంగాని చేర్చుకొన్నట్లైతే, వాటికి ఆహారం దొరికేదే. కాని, వాటికి పనులేవీరావు. అందుకని చనిపోయేవి.

"ప్రొటోజోవా" ఆహారమును మ్రింగేతీరు.

పటం 2



i జీవి ఆహారం

ii చేతులులాగు ఆహారందగ్గరకు సాగుతూంది.

iii చేతులు ఆహారాన్ని చుట్టేస్తున్నాయి.

iv జీవి తనలోపలికి ఆహారం లాగుకొనగా అది జీర్ణం మవుతుంది.

ఒక్క అంగుళందూరమైనా యివి పోలేనందున, చూడలేక పోవటంచేత, ఈ "ప్రొటోజోవా" కుప్పలు, కుప్పలుగా నశించేవి. ఎన్ని "ప్రొటోజోవా" లిట్లా నష్టమైనాయో చెప్పలేము. ఇటువంటినష్టం, మరణం ఒకటికాదు, రెండుకాదు, వేలకొలది సంవత్సరాల పాటు జరిగింది; ఇంకా జరుగుతోంది. ఇప్పటికీ ఎన్నో "ప్రొటోజోవా" లున్నాయి.

3

ఈ మెత్తని అణుమాత్రంగా ఉండే ప్రాణి, ఇతరప్రాణు లన్నింటిలాగానే, బ్రతకాలని, పెరగాలని యత్నించింది; పెరగాలని అనుకొన్నది. అంటే నీ కేదో పుస్తకంగాని, బొమ్మగాని కావాలన్నట్లో, లేకపోతే, నీవు బయటకు షికారువెళ్లాలనుకొన్నట్లో, ఆజీవి పెరగాలి అని అనుకోలేదు. నీవు ఊపిరి పీల్చటం ఎట్లా అవసరమో—నిద్రపోతున్నా కూడా యెట్లా ఊపిరిపీల్చవలసి ఉందో—అదేమాదిరి ఆ అణువుకు పెరగటం అవసరంగా ఉండేది. తల్లి గర్భంలో ఈ అణువుమాదిరి నీ వున్నప్పుడెట్లా పెరగాలనుకొన్నావో, అట్లాగే, యీ అణువులు కూడా అనుకొన్నాయి.

కాని, నీకున్నూ, యీ పురాతన అణుప్రాణుల కున్నూ, ఒకముఖ్యభేద ముంది.

ఈ పురాతన "ప్రొటొజోవా" లక్షలు, లక్షలుగా యత్నంచేసి లక్షలయేండ్లు తరబడి క్రమపడి చూడడానికి కండ్లు, వాసనచూసేందుకు ముక్కు, ఈదడానికి కాళ్లో, లేక, రెక్కలో పెంచుకోగలిగాయి. వాటిలో కొన్ని యిటువంటి అవయవాలను పెంచుకోలేకపోయాయి; అందుకనే ఇప్పటికీ చాలా "ప్రొటొజోవా" లోకంలో సముద్రాల్లో, చెరువుల్లోనూ ఉన్నాయి. ఇవి చాలాచిన్నవి; వీటిని చూడటం దుర్లభం. బలమైన "మైక్రోస్కోప్" (చిన్నవస్తువులను పెద్దదిగా చూపించే దుర్భిణి యంత్రం) ఉపయోగిస్తేకాని వీటిని చూడలేవు. అట్లా ఉపయోగించడానికి నీవింకా పెద్దవాడివి కావాలి.

లోతు తక్కువ నీళ్లల్లో, ముఖ్యంగా చెరువులలో, ఇవి చాలా ఉన్నాయి. వాటికి ఏవిధమైన రంగూ లేదు. కప్పగుడ్ల చుట్టూ ఉండే రంగులేని, మెత్తని జిగురులాగు వుంటాయి.

ఈఅణువులు పెరగడానికి లక్షలకొలదీ యేండ్లు పట్టినా, నీవు మాత్రం నీతల్లిగర్భంలో, ఆ అణువులాగు చాలాకాలం ఉండలేదు. ఒక్కవారం రోజాలు మాత్రం అట్లా ఉన్నావు. త్వరగానే నీలో మార్పులు ప్రారంభమైనాయి. అదే ముఖ్యమైన భేదం.

రెండవ అధ్యాయము


౧

నీవు పెరిగావు—పెరుగుతునే ఉన్నావు. రబ్బరును సాగదీసినా, లేక, రబ్బరు బెలూనులోగాలి ఊదినా అవి పెద్దవౌతాయి. అవి పెరిగాయని చెప్పవచ్చుకదా? కాని, నీ పెరుగుదల అటువంటిది కాదు. ఈ జీవాణువులు ఏదో ఒక పరిమాణంకన్నా, ఎక్కువ పెద్దవిగా పెరుగలేక పోయేవి. ఆపరిమాణానికి పెరిగిన తరువాత, ఇంకా పెద్దవికావాలంటే, అవి రెండుగా తెగేవి. ఒక్కొక్క క్రొత్తముక్క, మొదటిదానంతగా తిరిగీ పెరిగేది. ఇది తిరిగీ ముక్కలై రెండు చిన్న అణువులుగా మారేది. ఇట్లా ఒకటి, రెండుగా, రెండు, నాలుగ్గా; నాలుగు, ఎనిమిదిగా, ఎనిమిదినుండి పదహారు, పదహారునుంచి ముప్పైరెండు, ఇట్లా ఎక్కువగా పెరిగిపోయేవి.

ఇట్లా పెరిగినాకూడ నీ వింకా చాలా చిన్నవాడివే; నీ కింకా ఏ ప్రత్యేకరూపం యేర్పడ లేదు.

పెరిగినకొద్దీ, నీలోమార్పులు కనబడ్డాయి. ఈ చిన్న మెత్తని జీవాణువులన్నీ ఒక దానిమాదిరి, ఇంకొకటిలేవు. అవన్నీ; ఇంకా యేదో ఒకపెద్దదైవి, వస్తువుయొక్క భాగాలుగా ఉన్నాయి. ఆ వస్తువుయొక్క పైభాగములాగు, మధ్య, లోపలిభాగాలు లాగు యీ దిట్టాలు ఏర్పడుతున్నట్లున్నాయి.

అన్నీ కలిసి ఏరూపంలేని గుండ్రని బంతిలాగు ఉండటం పోయి నీవు పొడుగ్గా మారావు. నీపొడుగునా, లోతుగా కాలువ లాగు ఒక పొట్ట యేర్పడ్డది. ఆ పొట్టకు రెండు ప్రక్కలా అరలు అంచులలాగు లేచి, ముడతబడి కలుసుకొన్నాయి. పటం 3




ఏకకణజీవి విభక్తమయి
బహుకణ జీవిగా ఏర్పడుతుంది

ఆ రెండు ప్రక్కలూ ముడతబడి కలుసుకోటంచేత, నీ వొక మెత్తని పొడుగు గొట్టంలాగా మారావు ఈ గొట్టంలోపలంతా బోలుగా ఉంది. ఇది చాలా గొప్ప మార్పు. నీ వింకా బహుసూక్ష్మంగానే ఉన్నావు. కాళ్లు, చేతులు, తల

యేమీ నీ కింకా యేర్పడలేదు. గోడను ఇటుకలతో కట్టినట్లు, ఈ పొడుగు గొట్టంలాగు ఉన్న నీవు పూర్తిగా చిన్న చిన్న జీవకణాలతో, జీవబిట్టులతో, నిర్మింపబడ్డావు.

నీలోని ప్రతిభాగం పెరుగుతూనే ఉంది. ఒక భాగానికి యింకొదానికి అట్టే యేదీ మార్పు కనపించటం లేదు.

పటం 4



జీవకణాలబంతి మధ్యభాగాన పొట్టపడుతుంది. అంచులు రెండు కలుసుకొంటవి. బంతిలాగున్నది గొట్టంలాగు మారుతుంది.

కొన్ని పురుగులు ఇప్పటికీ, నీవు అప్పు డున్నట్లే ఉన్నాయి. చూడడానికి ఏదో కొంచెం గాంభీర్యంగా కనపడ్డప్పటికీ, నీకూ వీటికీ భేదం లేదు. ఈ పురుగులు రెండుగా తెగిపోతే, ఆ రెండుముక్కలూ, రెండు విడిపురుగులుగా పెరుగుతాయి. [వానపాము.] వాటికి కొంత బాధ కలుగవచ్చు. ఐనప్పటికీ, పిల్లి,

పటం 5



అంచులు మడతపడి గొట్టంమాదిరిగా మారినకణాలు. నిలువునా కోసివిప్పగా కనబడేది.

కుందేలులవంటి జంతువులలాగు అంతగా బాగ ఉండదు. రెండుగా తెగితే, పిల్లి చచ్చిపోతుంది. ఈ పురుగులలో, ఇది పురుగనీ, ఇది దాని అవయవమనీ చెప్పలేము; అంతా పురుగే. మనుష్యులకు ఇవి కాళ్లనీ, కుక్కకు ఇది దానితోక అని చెప్పగలం. కాళ్లు తెగినా మనిషి బ్రతుకుతాడు, తోక కోసేసినా కుక్క చావదు. కాని, మనిషి లేనిదే కాళ్లుగాని, కుక్క లేనిదే తోకగాని బ్రతుకలేవు.

కుక్కమీదగాని, పిల్లిమీదగాని ఏదన్నా బండిపోతే ఏంజరుగుతుంది? దాని శరీరంలో ఏవైనా భాగాలు తెగిపోవచ్చు. ఈ తెగిన భాగాలకు తెలివి లేదు, తమంతట తామే ఏమీ చేయలేవు. ఎందుకూ పనికి రావు. కాళ్లతో పిల్లి చెట్లెక్కగలదు, గీర గలదు. మనం చేతులతో వస్తువులను పట్టుకోవచ్చు. కాని ఈ అవయవాలను పిల్లి అనిగాని, మనుష్యుడనిగాని చెప్పలేము. ఆ జంతువుల మెదడు ఫలానా పని చేయమని చెప్పందే, ఈ కాళ్లూ చేతులూ యేమీ చేయలేవు.

చాలా పురుగులు వాటిశరీరమంతటా ఒకే మాదిరిగా ఉంటాయి ఇవి తెలివైన వనడానికి వీలు లేదు. బాగా వినటము, ఆలోచించటము, పరుగెత్తటం మొదలైనవి వీటికి తెలియవు. మొత్తంగా పురుగు ప్రాకుతూ పోగలదు; సగానికి తెగినాకూడ పోగలదు.

౨

రెండువారాలు గడిచాయి. మెత్తగా పొట్టిదైన పురుగులాగు నీవు తయారైనావు. సుమారు ఒక బఠానీగింజంతగా నీ వున్నావు.

ప్రతిమృగమూ, చిన్నప్పుడిలాగే పెరుగుతుంది. కొన్నిజంతువులలో యీవిధంగా పెరుగటం కొంతవరకు చూడవచ్చు.

కప్పగ్రుడ్లను చెరువుగట్టల అంచులలో నీవు చూసేఉంటావు. గ్రుడ్డుపెరిగి చిరుకప్పగా మారే ముందు ఈ మార్పులను చూడవచ్చు. చిట్టరలను విడి విడిగా చూడలేము. కాని ఆ మెత్తనిపదార్థం పేర్వేరు

రూపాలున్న అవయవాలుగా మారటం కనిపెట్ట వచ్చు. కొన్ని కప్పగ్రుడ్లను తెచ్చి గ్లాసుపీసాలో నీళ్లు పోసి పెట్టు. అవి పగిలి పిల్లలవటం చూస్తే యిది అర్థ మవుతుంది. పెరిగినతరువాత వాటికి పాచి తెచ్చి వేయాలి. అది వాటిఆహారం.

మెత్తని పొట్టిపురుగులాగు మారి, అంతటితో నీవు ఊరుకో లేదు. పురుగులాగే ఉండిపోవటం నీ కంతగా యిష్టం లేదు. ఇంకా ఏదో పెద్దరకం జీవి లాగు మారాలని నీకు తెలిసినట్లుంది. అందుకనే కాబోలు, ఇంకా క్రొత్తరకం మార్పులు నీలో కను పించటం మొదలుపెట్టాయి.

౩

నీ శరీరానికిముందు ఒక మొగ్గలాగు పెరిగింది. వెనుకగా చెంపలరెండు, ముందుగా రెండున్నూ మొగ్గ లేర్పడ్డాయి. ఇవెట్లా మారుతాయో? నీ కింకా యేదీ తెలిసినట్లు లేదు.

ఒకవారంరోజుల్లో ముందుభాగం తలగా మారింది.

ఇది దేనితలగా మారుతుందో? కంబళిపురుగుతల మాదిరిగానో, చేపతలమాదిరిగానో యిది పెరుగుతుం దేమో!!

ఏదీ చెప్పడానికి వీలులేకుండా ఉంది. మొత్తం మీద ఆతల నీ శరీరపరిమాణానికి చాలా పెద్దదిగా ఉంది. రెండుకళ్లులాగు దానికి ఏర్పడటం మొదలుపెడు తున్నాయి. నీతల కొంచెంముందుకు, క్రిందుగా వంగి ఉంది.

నీ ఇతర అవయవాలేమైనా మారాయా? వాటినిచూస్తే నీ వేవిధంగా పెరుగబోతావో గ్రహించ డానికి ఏదైనా వీలున్నదా?

చూద్దాం.

౪

నీ శరీరంమధ్యగా కాలువలాగు ఏర్పడి మడత పడిందని ముందే చెప్పాను; జ్ఞాపక మున్నదా? లోప లంతా బోలుగాఉన్నది. లోపలి ఖాళీభాగం ఏదో జంతువుయొక్క కడుపు, ఆహారతిత్తిగా మారుతోంది. మడతపడినచోటు శరీరభాగం గట్టిపడి, అక్కడ మెత్తని యెముక ఏర్పడుతోంది. యెముక నీశరీరం పొడుగునా తయారవుతోంది.

ఈ మెత్తని పుడకవంటి యెముక యేర్పడటం చేత, మనకు కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుస్తు న్నాయి. నీకు ప్రత్యేకంగా, విడిగా, తలయొకటి యుండటంబట్టి, నీవు ఏదో పురుగులాగు పెరుగవని తెలుసుకోవచ్చు. నీపొడుగునా వెన్నెముక పెరుగటం చేత పీతలు, సముద్రపు ఆలుచిప్పలు, నత్తలు, మాదిరిగాని, సాలెపురుగు పీతల మాదిరిగాగాని నీ వుండ బోవనికూడా తెలుస్తోంది. వీటికి యెముకలు లేవు.

పైనచెప్పిన యే జంతువులకు వెన్నెముక లేదు. వాటి శరీరానికి గట్టితనం యిచ్చేభాగము శరీరంపైగా ఉంది. (మనకు, కుందేళ్లు, పిల్లులవంటివానికి, ఈక లుండేపక్షుల జాతులకున్నూ, ఎముకలు గట్టితనాన్ని యిస్తాయి. ఇవి శరీరంలోప లుంటాయి.) అసలు యెముకలే లేని జంతువులు చాలా చిన్నవిగా ఉండాలి; పెద్దవిగా ఉండటం అంత సౌకర్యంకాదు. లోపల ఎముకలుగాని, పీతశరీరంపైన ఉన్నట్లు గట్టిచిప్పగాని ఉండటం చాలా ప్రయోజనకరమైన విషయం

నీకాళ్లుచేతులలోను, వెన్నులోను యెముకలు లేకపోతే చాలాకష్టం. కాళ్లు ఏవో చాంతాళ్లలాగా వ్రేలాడుతాయి—చేతులూ అంతే. నడవడానికి వీలుం డదు. వెన్నెముక లేకపోతే మూటకట్టినట్టుగా, మెత్తని తలగడ దిండులాగా కూలబడి ఉండాలి ఏదో ఒక మూల.

౫

నీకు వెన్నెముక పెరిగినప్పటికీ, అప్పటి నీ రూపం చూస్తే ఎన్నో రకాలజంతువులుగా నీవు పెరుగడానికి వీలున్నట్లుంది.

నాలుగు వారా లయ్యేటప్పటికి నీ కొకతోక మొలిచింది!

పిల్లి లేక గొఱ్ఱెపిల్లమాదిరిగా పెఱుగబోతున్నావా? ఏమో! నీ కప్పుడే మొలుస్తున్న కాళ్లచివరలకు వాడిగోళ్లు, గిట్టలు పెఱుగుతాయి కాబోలు! ఏదీ తెలియటంలేదు. ఏదెట్లా ఉన్నా, ఆతోకనుబట్టి నీవు మనిషిగా పెఱుగబోతావని యేమీ తోచటంలేదు.

ఒకవేళ నీవు చేపలాగు మారవచ్చు. చిన్న కాళ్లలాగు ముందుప్రక్కా, వెనుకప్రక్కా పెఱిగినవి, రెక్కలులాగా మారితే, చేపకావచ్చు గదా?

ముఖ్యంగా ఒక్కవిషయాన్ని బట్టి నీవు చేపగానే పెఱుగబోతున్నావని మనకు అనిపిస్తుంది.


నేలమీద తిరిగే జంతువులకు నీళ్లల్లోని చేపకు ముఖ్యమైన భేదమేమిటి? అది ఊపిరిపీల్చే విధం. నీళ్లల్లో తిరిగే పాములైనాసరే, వాటిని కొంతసేపు నీళ్ల అడుగున అదిమిపెడితే, అవి ఊపిరి సలుపక మునిగి చచ్చిపోతాయి. వాటికి మనలాగానే ముక్కు, ఊపిరితిత్తులూ ఉన్నాయి. కాని నీటిలో ఉండే జీవులకు, చేపవంటివాటికి పువ్వారా లుంటాయి.

నీమెడకు రెండు ప్రక్కలా చీలినట్లు వంకు లేర్పడ్డాయి. ఇప్పటినుంచీ, సుమారు పదనైదురోజులవరకూ ఆచీలికలు వృద్ధియైనాయి. చక్కని, చేపకుండే పువ్వారముల మాదిరి పెఱిగాయి. ఇంకా నీహృదయం చూస్తే చేపహృదయంలాగానే ఉంది.

ఇప్పుడైతే, నీకు, ఇతర పెద్ద జంతువులకు— అంటే గుఱ్ఱం, గొఱ్ఱె ఆవు మొదలైనవి— లాగు నీ హృదయం పెద్దదిగా ఉంది. అన్నిచోట్లకూ రక్తాన్ని హృదయంకొట్టి పంపిస్తుంది. అదినీ రెండు పిడికిళ్లంత ఉంది. ఈహృదయానికి చెడ్డరక్తాన్ని తెచ్చే "సిర"లనే గొట్టాలున్నాయి. హృదయంనుంచి మంచి నెత్తురును తీసుకుపోయే "ధమను" లనే గొట్టాలున్నాయి. ఇంతేకాకుండా నీ హృదయం నాలుగు గదులుగా ఉంది. వాటిల్లో మధ్య తలుపులున్నాయి. అంతా చూస్తే మొత్తంమీద చాలా అట్టహాసంగా ఉంటుంది.

సెకండు కొకసారి నీ హృదయం-మొదలు ఒక భాగమూ, తరువాత యింకో భాగమూ - ముడుచుకొంటుంది. ఒకసారి ముడుచుకొన్నప్పుడు నీశరీరాని

చేప పిల్ల పటం 6 మనుష్య శిశువు



కంతా తలనుండి కాలి వ్రేళ్ల దాకా, రక్తం ప్రవహిస్తుంది. ఇంకోసారి ముడుచుకోటంచేత, చెడిపోయిన నెత్తురును ఊపిరితిత్తుల్లోకి శుద్ధం కావడానికి పంపిస్తుంది. అంతా చాలా నేర్పరితనంగా ఏర్పడి ఉంది. ప్రతి భాగమూ తనతన పనిని చేస్తూ ఉంటుంది.

చేపసంగతి యిట్లా కాదు. దాని రక్తమంతా ఏదో రెండుమూడు పొడుగు గొట్టాల గుండా ప్రవహిస్తుంది. ఈరక్తపుగొట్టాలలో ఒకచోట, కొంత భాగం కొద్దిగా ఉబ్బుకొని ఉంటుంది. ఆ చేప తనకు తెలియకుండానే, యీ ఉబ్బిన భాగాన్ని, అదుముతూ ఉంటుంది. రక్తం ముందుకు జరుగుతూ ప్రవహిస్తుంది.

ఆరోజుల్లో నీ హృదయం కూడా అట్లాగే ఉన్నది. కొద్దిగా ఉబ్బుకొన్న ఒకరక్తపు గొట్టమే నీ హృదయం!! నెత్తురు పూర్తిగా తప్పు మార్గంగా పోకుండా ఆపడానికి తలుపులవంటివి—కవాటాలు—ఉండేవి.

ఇటువంటి గుండె, నీళ్లల్లోని గాలి పీల్చేందుకు సరిపోయే పుప్ఫొరములు, తోకా:యివన్నీ చూస్తే నీవే విధంగా ఆలోచించినా మనిషిమాదిరిగా పెరుగుతావని తోచటం లేదు.

వచ్చే ప్రకరణంలో పూర్వపు మెత్తని ప్రాణులు ఏ విధంగా చేపలు పెరుగడానికి యత్నించాయో, ఎంతకాలం పట్టిందో, ఎన్నెన్ని మార్పులు చెందాయో అన్నీ విచారిద్దాం.

మూడవ అధ్యాయం

౧

రూపమేదీ లేని మెత్తని జీవినుండి, చేప మోస్తరుగా ఉండేటటువంటి స్థితికి రావడానికి నీకు మూడువారాలు మాత్రం పట్టింది. నీవు నిజంగా ఏజంతువుగా పెరుగుతావో తెలియక ఇప్పుడొకరూపంగా, ఇంకోసారి వేరే విధంగా ఉండటమంతా ఒక వింతైన ఆటలా గుంది. కాని దీన్నిగురించి తరువాత విశదంగా చెప్తాను.

ఈఆటంతా నిద్రపోతూనే నీవు ఆడావు. అప్పటికి నీ వింకా పుట్టలా. నెమ్మదిగా ఒళ్లు విరచుకొని ఆవులించటం, మెలకువ తెచ్చుకొని భూమిమీద పుట్టటం ఇవన్నీ తరువాత జరిగాయి. పుట్టిన తరువాత కూడా నీవు తిరిగీ బాగా ఆవులించి, ఒళ్లు చాచుకొని మేలుకొన్నావు. ఆతరువాతే నీకు వినటం, చూడటం, సంతోషించటం, దుఃఖించటం అనేవన్నీ అలవాటయాయి.

మనభూమి చాలాకాలం క్రిందట యిప్పటిలాగు ఉండేది కాదు. అప్పుడు ఎన్నో మెత్తని ప్రాణు లుండేవి. చాల చిన్నవని చెప్పానుకదా ? ఆప్రాణు లన్నీ ఏవిధంగా మారాయో, ఎట్లా పెరిగాయో, ఆవిధమైన మార్పులన్నీ నీలో జరుగుతున్నాయి. పూర్వపు ఆ జంతువులు యిట్లా మారడానికి ఎన్నోలక్షల యేండ్లు పట్టింది. చాలా ప్రయాసంమీదగానీ వీలు కాకపోయింది.

అప్పుడు ఆపురాతనపు రోజుల్లో సముద్రాలు, ఖండాలు యిప్పటిలాగు ఉండేవి కావు. సూర్యచంద్రులు మాత్రం, యీమాదిరే ఉండేవాళ్లు. నక్షత్రాలుకూడా వేరేవేరే రాసులుగా, ప్రక్క విక్రం గుంపులుగా ఉండేవి. ఆరోజుల్లో అంతటా రాళ్లు, నీళ్లూ సాధారణంగా ఉండేవి. ప్రాణంగలవి అంటే చాలా విచిత్రంగా ఉండేవి ఆదినాలలో.



ఏకకణజీవి—ప్రోటోజోవా జాతి—రెండుగా చీలి బ్రతుకుట.

పూర్వపు తేలే చిన్న ప్రొటోజోవా అణువు; చిట్టలు, దాదాపుగా యీ మాదిరిగా ఉండేది.

మొట్టమొదట నీవుకూడా యీ మాదిరిగానే ఉన్నావని జ్ఞప్తివున్నదా? నెమ్మదిగా నీవుచేసినట్లే ఇది తెగటం, తెగిన రెండుముక్కలూ పెరుగటం, అవి తెగి, తిరిగీ పెరుగటం యిట్లా జరిగింది. మొదట్లో ఒకచిట్టర తెగగానే ఒక్కొక్క ముక్కా దూరంగా కొట్టుకుపోయేది: రెండూ, రెండు విడిజీవు లయ్యేవి. ఒక్కొక్కసారి ఈచిట్టరలు విభజన చెందినా, విడివిడిగా ఊడిపోయేవి కావు; అన్నీ చేరి ద్రాక్షగుత్తిలాగు పెరిగేవి. ఈవిధంగానే ఏరూపమూ లేని మెత్తని మొదటిప్రాణులు క్రొత్తరకం జీవులుగా మారటం ప్రారంభమైంది.

మొదటిమార్పు ఏమిటంటే: ఈ క్రొత్తగా ఏర్పడ్డ చిట్టిఅల్లో కొన్ని వేర్వేరుపనులు చేయటం మొదలుపెట్టాయి.

అన్నిచిట్టిఅలకూ పైపొరలో ఉన్న చిట్టిఅలు కొంచెం గట్టిపడ్డాయి. అందువలన లోపలికి నీళ్లు, మరికివస్తువులు పోకుండా ఆపగలిగాయి. ఈ చిన్న ప్రాణులు దేనికన్నా తగిలినప్పటికీ తునిగిపోలేదు, చెడిపోలేదు; పైపొర వాటిని కాపాడింది.

పైపొరలోని చిట్టిఅలు ఇట్లా మారుతుంటే, లోపలి జీవకణాలు కొన్ని ఆహారాన్ని కరిగించటం, జీర్ణంచేయటం అనేపనులలో తరిబీదు పొందాయి. క్రమంగా ముందు హరించుకోలేని గట్టిముక్కలను కూడా యీజీవి తినగలిగేది, జీర్ణం చేసుకో గలిగేది.

ఇట్లాగే చాలా జీవకణాలతో యేర్పడి, పైని చర్మం లోపల కడుపుభాగం కలిగిన ప్రాణు లేర్పడ్డాయి.

౨

పైని చర్మమూ, లోపల కడుపు అనే వేర్వేరు భాగాలుగా యేర్పడ్డ జీవులు, ఇతరజీవులకన్న బాగా నివసించగలిగాయి. అన్ని జీవకణాలు ఒకేమాదిరిగా ఉండి, చర్మమనీ, కడుపనీ భేదంలేని ప్రాణులు గట్టిగా దేనికన్నా తగులుకొన్నా, ఆహారం దొరక్కపోయినా త్వరలో నశించేవి.

ఇట్లా ఉంటుండగా ఒకనాడు యీ చర్మం పెరిగిన జీవుల్లో ఒకమార్పు కలిగింది. ఒకటి, రెండు జీవకణాలు కొంచెం ఎత్తుగా తక్కిన చర్మంకు పైగా పెరిగాయి. ఒకవేళ ఆకణాలకు దెబ్బతగిలి ఉండవచ్చు. లేదా, తమంతటతామే ఏకారణంలేకుండానే అట్లా పెరిగి యుండవచ్చు. పారతో కొన్నిదినాలు త్రవ్వితే చేతులు కాయలు కాస్తాయి. పారరాపిడికి అక్కడవుండే కణాలు ఎక్కువగా పెరిగి గట్టిబడుతాయి.

ఎందుచేత నైతే నేమి, కొన్నితరాలు గడిచిపోయాయి. పైని చెప్పిన ప్రాణులకు మనుమలు, మునిమనుమలు పుట్టేటప్పటికి వాటికి క్రొత్త అవయవాలు పెరిగాయి. కొన్నింటికి ఈదేందుకు తిమింగిలంలాగు కాళ్లు, కొన్నింటికి జలగ కుండేట్టుగా పట్టుకునే మెత్తని పెదవులు, మరికొన్నింటికి ఇసుకరేణువులను చేర్చి శరీరంపైనిచిప్పలుగా కట్టుకొనే శక్తి యేర్పడ్డాయి.

3

కొన్నిలక్షలయేండ్లు గడిచాయి. మెత్తనిశరీరంగల ప్రాణు లెక్కొరకాలు యేర్పడ్డాయి. కొన్ని, ఎప్పటిలాగు ఒకే జీవకణంతో ఉండేవి. కొన్ని చాలా జీవకణాలతో ఏర్పడ్డా, అన్నికణాలు ఒకేమాదిరిగా పనిచేసేవి. వీటికి యీదటం చేతకాదు. ఏదన్నా వీటికి గట్టిగా తగులుతే, చర్మం ఏర్పడలేదు కాబట్టి, ఇవి చనిపోయేవి.

కొన్నింటికి పైని చర్మం, లోపల కడుపు, ఉండేవి. పైచర్మంలో చిన్నరంధ్రం ఉండేది. ఈ రంధ్రం కడుపుతోచేరిఉండేది. అదే ఆప్రాణియొక్క నోరు.

వేరేజంతువులకు చర్మం కొన్ని కొన్నిచోట్ల ఎక్కువగా పైకి పెరిగింది. వీటిలో కొన్నిటికి, యీ పెరిగినచర్మం ఈదడానికి తగినట్లుగా తెడ్లమాదిరిగా పెరిగింది.

కొన్నిప్రాణులచర్మం ఇసుకను చేర్చి, దానితో చిప్పలు తయారుచేసేది. కొన్నిజంతువులకు ఈ చర్మంలో కొంతభాగం వాసనచూచేశక్తి సంపాదించి, పెరిగింది. ఈముక్కుతో, దగ్గరగా ఉండే ఆహారపదార్థాలను పసిపట్టి తెలుసుకొనేవి. వాసనచూచేశక్తి, ముక్కు, యిదే జంతువులలో మొదటగా వృద్ధియైన ముఖ్యవిషయం.

మొట్టమొదట యీప్రాణులకు కండ్లు బహువిచిత్రంగా పెరిగియుండవచ్చు. ఈ మెత్తటిజీవులలో కొన్నింటిమీద వెలుతురు పడినప్పుడు, వాటి వీపుమీద ఉన్న చర్మపు అరలకు చీదరగా ఉండేది. కొన్నితరాలు గడిచేటప్పటికి, వెలుతురు ఏమాత్రంపడ్డా సహించలేక, చీకాకుపడేటటువంటి జీవకణాలు చర్మంలో తయారయ్యాయి. ఇంకా కొన్నితరాలు

గడిచేటప్పటికి ఆ ప్రాణుల సంతతికి, పిల్లలకు, ఆహారం ఎంత అవసరమో, అదేమాదిరి, వెలుతురుకూడా అంతే అగత్యంగా తోచింది. ఈ వెలుతురువల్ల పడేచీకాకును భరించలేక, వెలుతురును చూడగలిగే కండ్లుగా వాటి శరీరంలో కొన్ని అరలు మారాయి.

ఇదంతా ఇట్లాగే జరిగిందని నిశ్చయంగా మనం చెప్పలేము. కాని, మొత్తంమీద యిటువంటి కారణం వల్లనే కండ్లు వృద్ధియైనా యనడానికి సందేహం లేదు.

బలమైన జంతువులే, ఎప్పుడూ క్రొత్తమార్గంగా పెరిగేవని అనుకోరాదు. ఒకప్పుడు బలహీనమైనవి కూడా మార్పులు చెందేవి. వాటి శరీరంలో ఏదైనా లోపమున్నట్లయితే, ఆలోపం తొలిగేవరకూ వాటికి బహుచీదరగా ఉండేది. అందుకని యేదో ఒకవిధం కని పెట్టవలసి ఉండేది. ఇందువల్లనే అన్నివిధాలా మామూలుగా, సజావుగా పుట్టినవాటికన్న, ఈ బలంలేనివే, ఒక్కొక్కసారి, క్రొత్తఫక్కీగా పెరిగేవి. లోకంలో ఒక్కొక్కపనిని చేయడానికి, ఒక్కొకరకం జంతువులు, ఒక్కొకమార్గం అవలంబిస్తున్నాయి. అంటే నడక, ఆహారం సంపాదించుకోటం, మొదలైన వాటిల్లో ఎన్నోరకాలున్నాయి. ఇన్నిరకాలూ అభివృద్ధి కావడానికి, బలంగలవేకాక, బలహీనమైనవికూడా తోడ్పడ్డాయి అనడానికి అనుమానం లేదు.

రెండు మెత్తని జీవులున్నాయనుకో. ఎప్పుడూ గాలికి, నీటికీ ఇటూఅటూ కొట్టుకొంటున్నాయనుకో. వీటిలో ఒకటి క్రమేణా, అంటే కొన్నితరాలు గడిచేటప్పటికి, చక్కగా యీదేరెక్కలు, ప్రక్కగా తిరగడానికి పడవచుక్కానిలాంటి తోక పెంచుకొన్నది. చక్కనిచేపగా వృద్ధియైంది. రెండోజీవి బలంలేనిదనుకో. అది ఎప్పుడూ ఏదో ఒకబండనుపట్టుకొని, నీళ్లల్లో కొట్టుకుపోకుండా చూచుకొనేది. దానిసంతతి జీవులకు కొన్నితరాలు గడిచేటప్పటికి వాటిశరీరంమీద చిప్పఒకటి పెరిగింది. అవి బండలను పట్టుకొని బ్రతికే ఆలువ చిప్పపురుగులుగా మారిపోయాయి.

ఏదెట్లా ఉన్నప్పటికీ మనకు ముఖ్యంగా రెండువిషయాలు తెలుసు. ఒకటి: ఏకకణంజీవిగా ఉండేస్థితినుంచి, ఎముకలు, పొలుసులు, రక్తనాడులు కలిగి, ఆహారం జీర్ణం కావడానికి పొట్ట, నీళ్లల్లో గాలి పీల్చేందుకు పువ్వారాలు, పొలుసులమీద మంచి మంచిరంగులు కలిగిన చేపలు వృద్ధికావడానికి చాలా యేండ్లు పట్టింది. బహుశః ఐదుకోట్లసంవత్సరాలు పట్టిందనుకోవచ్చు.

ఇక, రెండవవిషయ మేమిటంటే: నేలపై తిరిగే జంతువులకు పూర్వము చేపలేర్పడ్డాయి నీతల్లిగర్భంలో నీవు మొదట చేపలాగు మారటం, కాబట్టి, పూర్వం జీవులు వృద్ధియైనమార్గాన్ని అనుసరించి జరిగిందన్న మాట. లోకంలో ఇట్లా వృద్ధి అవుతున్నపుడు ఎన్నో ప్రాణులు చనిపోయాయి. కొన్ని బహుత్వరగా మారటంచేత, మరికొన్ని ఎంతో నెమ్మదిగా మార్పుచెందటంచేత చనిపోయి యుండవచ్చు. కోటానుకోట్లజీవులు యిట్లా మారకుండానే నిలిచిపోయాయి. ఎన్నోకోట్లు వృద్ధిపొంది ముందుకు సాగేబదులు వెనక్కి నడిచాయి. అంటే వాటికి శరీరంపై చిప్పలు, ఈదే రెక్కలు మొదలైనవి పెంచుకొనే శక్తి లేకపోయింది.

కాబట్టి ఈ కోట్లకొలది సంవత్సరాలలో పుట్టి పెరిగి, నశించిన కోటానుకోట్ల జీవులలో కొన్ని మాత్రమే మారటం, ముందుకు సాగటం, అభివృద్ధి చెందటంలోనే పనులు చేయగలిగాయి. వాటి సంతతి జీవులకు తమ తల్లి దండ్రులలో కలిగిన మార్పులు, క్రొత్త ఏర్పాటులు పుట్టుకతోటే అలవాటైపోయాయి. ఇట్లా క్రమేణా మారి, వృద్ధిచెంది ఇతర జంతువులు, చివరకు నీవూ, నేనూ, మనుష్యులందరం తయారైనాము.

సృష్టి యీ జంతువులన్నీ అభివృద్ధిచెందిన తీరునంతా నీవు నీ తల్లిగర్భంలో చకచకా ఒక నాటకం ఆడినట్లు నడిపావు. సృష్టిలో ఐతే ఎన్నో తప్పుడు మార్గాలపట్టి ఎన్నో జంతువులు నశించిపోయాయి. కాని నీ నాటకంలో తప్పులు లేవు. అంతే సరిగ్గా మనిషి లాగు అభివృద్ధి కావడానికే సాగుతోంది.

చిన్నపిల్లల చిత్తప్రవృత్తులు-శిశు శిక్షణము

శ్రీ గిడుగు వేంకటసీతాపతి

ఒక సంవత్సరం ఈడుగలవారు కాగానే పిల్లల చిత్తప్రవృత్తులు స్ఫుటంగా ఏర్పడుటకు ప్రారంభిస్తవి. ఏయే స్థలములందు ప్రాకితే, కూర్చుంటే, పండుకొంటే, కష్టముగా ఉంటుందో, ఏయే స్థలము లందు ఈ పనులు చేసినప్పుడు సుఖముగా ఉంటుందో అనుభవమునుబట్టి నేర్చుకొంటారు. నేలను ప్రాకుతూ ఉన్న పిల్ల సుమారు సంవత్సరం ఈడు గలది తన మార్గంలో బురదగాఉన్న స్థలం చూచి ఒకక్షణం ఆగి బురదలోనికి ప్రాకుతూపోయినది. అప్పుడు సులువుగా ప్రాకుటకు వీలు కలుగలేదు; బురద అంటుకోవడం వల్ల అసహ్యంగా సైతము ఉండెను. ఏమి చేయడానికీ తోచక ఏడ్చినది. అప్పుడు ఆ పిల్ల తల్లి వచ్చి "అయ్యోఅమ్మాయీ! బురదలోనికిపోయినావా? బురద అంటుకొందా? కడుగుతాను లే." అంటూ పిల్ల ఒడలు శుభ్రంగా కడిగి గుడ్డతో తుడిచింది. ఈఅనుభవం వట్టిగా పోలేదు. తల్లిమాటలు పూర్తిగా అర్థం కాకపోయినా ఆ సమయంలో ఆఅనుభవమునకు సంబంధించినంత మట్టుకు ఆ మాటలలోని భావం బోధపడినది. అందుకు తార్కాణంగా ఆ మరునాడు ఆ పిల్ల ఎప్పటివలెనే ప్రాకుతూ పోయి, బురదనేల చేరగానే అందులోనికి మరి వెడలక ఆప్రక్కనున్న పొడి నేలపై ప్రాకుతూ పోయినది.

ఈ విధంగానే ఇది కష్టమైనపని, ఇది సులువైన పని; ఇది మంచి త్రోవ, ఇది చెడ్డ త్రోవ; ఇది సుఖమును కలుగజేస్తుంది, ఇది దుఃఖమును కలుగజేస్తుంది అనే వివేకము పిల్లలకు తమ చిన్నచిన్న అనుభవములను బట్టే ఏర్పడుతుంది. ఈఅనుభవములు కొందరికి వేగంగా కలుగుతూ ఉంటవి, కొందరికి ఆలస్యంగా కలుగుతూ ఉంటవి.

పిల్లలు ఆకుదం (ఉగ్గు) పట్టే గిన్నె చూడగానే ఏడవడం, పాలగిన్నె చూడగానే ఆనందించడం సర్వసామాన్యంగా చూస్తూ ఉంటాము. దీనినిబట్టి మనం తెలుసుకోగల విషయ మేమంటే, అనుభవించిన విషయం జ్ఞప్తికి రావడం, గిన్నె చూచి అది తమ కోసమే అనిన్ని, అందులోనిది తమకు పట్టినప్పుడనే కష్టమో సుఖమో కలుగుతుందనిన్ని అనుమేయించిగాని ఊహించిగాని తెలుసుకొనే పరిజ్ఞానము పిల్లలకు కలుగుతూ ఉందని మనకు బోధపడుతుంది.

పిల్లలకు తెలియకుండా వెనుక తట్టున నిలబడి మనము చేతులు జాచి వారి కండ్లు మూసినా, వారి కండ్ల ఎదుట పెట్టినా ఎవరో తమ వెనుకను నిలబడి ఇట్లు చేస్తున్నారని ౯, ౧౦ నెలల పిల్లలు అనుమేయించ గలుగుతారు. ఇటువంటి 'అనుమానములు' అనుభవములను బట్టే ఏర్పడుతూ ఉంటవి. ఆ అనుభవములు ఎంతవేగముగా కలుగుతూ ఉంటే ఆ 'అనుమానములు' సైతమూ అంతే వేగముగానే కలుగుతూ ఉంటవి.

ఒకసారి పదిమాసముల బిడ్డను ఎత్తుకొని ఒక తల్లి రైలుబండిలో కూర్చుండి ప్రయాణము చేస్తున్నది. బిడ్డతండ్రి ఆ ప్రక్కనే కూర్చున్నాడు. స్టేషన్ రాగానే రైలుబండి ఆగడం, ఆగినవెంటనే తండ్రిబండి దిగి ప్లాట్‌ఫారముమీద పచారుచేసి రైలు కదులుతుందనగానే మరల బండి ఎక్కి కూర్చోవడం చూచింది. పదిస్టేషన్లలో ఇట్లు జరిగింది. పదకొండో స్టేషన్ వచ్చి

నప్పుడు తండ్రి రైలుబండి దిగక కూర్చుండినచోటనే ఉండిపోవడం చూచి ఆ బిడ్డ తండ్రి వైపు, ప్లాట్ ఫారము వైపు పదేపదే చూస్తూ "ఎందుకు దిగలేదు నాన్నా?" అనే భావం ఇంకా మాటలాడలేదు గనుక చూపులతోనే వ్యక్తపరచినది.

తినరానివస్తువు పిల్లలు చేతబట్టుకొని తినబోతూ ఉన్నప్పుడు తల్లులు ఆవస్తువు లాక్కొని హస్తలాఘవంచేసి "హాత్ కాకి!" అంటారు; "కాకి ఎత్తుకొని పోయిందమ్మా" అంటారు. ఏదైన ఒకవస్తువు కాకి ఎత్తుకుపోవడం ఒకసారైనా చూచిన పిల్లలకు తల్లి మాటలు అర్థమవుతవి; సమాధానం కుదురుతుంది. ఆ అనుభవం లేనిపిల్లలకు తల్లిమాటలలో నమ్మకం ఉండదు, ఆవస్తువు ఇచ్చినదాకా ఏడుస్తారు.

ఎటువంటి అనుభవాలవల్ల ఎటువంటి భావములు 'అనుమానములు' మొదలయిన చిత్తప్రవృత్తులు ఉదయించి, అభివృద్ధి పొందడానికి సాధ్యమవుతుందో పిల్లలను పోషించేవారు తెలుసుకొని, ఆటువంటి అనుభవాలకు అవకాశము కలుగజేస్తూ ఉండవలెను. దీనికి ఒక ప్రయత్నం, కనిపెట్టడం, శిక్షణ కావలెనా ఇదంతా దానంతట అదే వస్తుందంటారేమో. నిజమే, దానంతట అది రాకపోదు. గాని, ప్రకృతిధర్మానికి విడిచిపెట్టితే ఈఅనుభవాలన్నీ పిల్లలందరికీ ఒకేరీతిగా రావు. అందుచేతనే కొందరు పిల్లలు వేగంగా చురుకుతనం గ్రహణశక్తి, అనుమేయించగల నేర్పు ఎక్కువగా చూపిస్తారు. మరికొందరికి ఈశక్తి సామర్థ్యాలు వేగంగా పట్టుపడవు.

"బాలానాం రోదనం బలం" అంటే కొందరు విపరీతార్థం చెప్తారు. అదే చాలామందికి తెలుసును. పిల్లలు ఎంతఏడుస్తే అంతమంచిది; ఏడుపువల్లనే బలము వస్తుంది అని వారి అభిప్రాయము. గాని,దానిఅర్థంఅది కాదు. పిల్లలకు మరేమీ బలము లేదు;తమకుకావలసినది దొరకకపోతే ఏడ్చి సాధిస్తారు; ఏడ్పేవారికి బలం అని తాత్పర్యము. ఏడ్పువల్ల సాధించగలమనే అభిప్రాయం పిల్లలకు కలిగించరాదు. పిల్లలు ఏడ్చినప్పుడల్లా తల్లులు పాలిచ్చి, వారిని ఓదార్చుతూ ఉంటారు. అది చాలా తప్పు. పిల్లలకు ఏది మంచిదో ఏది చెడ్డదో ముందుగానే తల్లులు జాగ్రత్తగా ఆలోచించి మంచిదైనది పిల్లలను ఏడ్పించకుండానే వారికి ఇస్తూఉండవలెను; చెడ్డదైనది వారు ఎంత ఏడ్చినా ఇవ్వరాదు. ఏడ్చిసాధించగలమనే అభిప్రాయం స్థిరపడినపిల్లలకు మంకుపట్టు పట్టే దురభ్యాసం ఎక్కువగుతుంది. ఒకసారి తల్లి ఒంటరిగా ఒకచోటికి పోవలసియుండెను. ఆమెకొడుకు ఆయిదేండ్లవాడు ఆమెవెంటపడ్డాడు. "నీవు రావద్దు; ఉండిపో; నేనిప్పుడే వస్తాను" అని ముందుకు నాలుగడుగులు వేసినది "నేనూ వత్తానమ్మా"అంటూ ఆ పిల్లవాడు ఏడుస్తూ వెంటపడ్డాడు తనవద్దకు వచ్చిన పిల్లవాణ్ణి ఆమె ఇంటిలోనికి దిగబెట్టి తిరిగీ ఒంటరిగా వెళ్లసాగినది. పిల్లవాడు మరింత బిగ్గరగా ఏడ్పుమొదలు పెట్టాడు. అప్పుడాతల్లి పిల్లవాణ్ణి రెండుదెబ్బలు కొట్టి తనతో తీసుకొనిపోయినది. చివరకు ఆ పిల్లవాడు తన కోరిక ఏడ్చిసాధించుకొన్నాడు. ఈపని అప్పటికప్పుడు కొత్తగా జరిగినదికాదు. నెలలబిడ్డడుగా ఉన్నప్పటనుండిన్నీ ఆపిల్లవాడు తనకోరిక ఏడ్చి సాధించుకోవడం అలవాటు చేసుకొన్నాడు. అతనితల్లి అందుకు అనుకూలంగానే ప్రవర్తిస్తూ వచ్చినది. ఈ పిల్లవాడికి ఈ దుర్గుణం చాలాకాలం నిల్చి ఉంటుంది. దీనికి తగిన ప్రతిక్రియ అనుభవంలోకి వచ్చినదాకా ఏదో ఒక విధంగా కనుబడుతూనే ఉంటుంది.

అహంభావము పిల్లలకు పుట్టుకతోనే ఏర్పడి ఉంటుంది. తమకు కావలసినవస్తువు తామే కాని మరియొకరు తీసుకొని అనుభవించరాదన్న భావము పసితనమునుండిన్నీ పిల్లలు చూపిస్తారు. పదినెలల బిడ్డకు తల్లి చన్నుకుడుపుతూ ఉండగా మరియొకస్త్రీ తన నాలుగునెలలబిడ్డను తీసుకొనివచ్చినది. అప్పుడు తన బిడ్డకు పాలిస్తూ ఉన్నతల్లి వేడుకగా ఆ వచ్చినబిడ్డకు సైతము చన్ను కుడుపజూచినది. ఆ వెంటనే ఆమె బిడ్డ ఈచిన్నబిడ్డవైపు చూచి నాసొత్తు నీ వేల దొంగలిస్తావన్నట్లు ధుమధుమలాడుతూ పాలుతాగక, ఆ చిన్నబిడ్డను అక్కడనుండి తీసుకొని పోయినదాకా చేతులతో విసరికొట్టుతూ, ఏడుస్తూ తన అసహనము చూపించినది. తల్లి తనవద్దనే ఉండవలెను; తననేఎత్తుకోవలెను; ఏవస్తువయినా తనకే కాని తక్కినవారి కివ్వ

కూడదు—ఇటువంటి ఒంటెత్తుగుణమును తెలియజేసే పనులు సర్వసాధారణంగా పిల్లలలో కనబడుతూ ఉంటవి. ఇవి అన్నీ అహంభావలక్షణాలే. అహంభావము సహజముగా పుట్టినదే అయినా ఇది దుర్గుణమే కనుక దీనిని అణచివేయవలెను. అట్లు చేయుటకు అనేకమార్గములు కలవు.

తల్లి తనబిడ్డను తోడిబిడ్డలపొత్తు కలుగనీయక పెంచడంవల్ల ఈ అహంభావమును ఎక్కువ చేసినదే అవుతుంది. తోడిబిడ్డలతో కలసిమెలసి ఆడుకొంటూ ఉన్నబిడ్డకే క్రమక్రమంగా తనవంటివారే తక్కిన వారనిన్నీ, తనకు కావలసినదే తక్కినవారికి సైతము కావలసి ఉంటుందనిన్నీ, ఏవస్తువయినా నలుగురితో పాటు తానున్నూ తనవంతుమాత్రమే అనుభవించవలసి ఉంటుందనిన్నీ, తక్కిన పిల్లల కేమీ లేకుండా ఉన్నదంతా తానే అనుభవించవలెనన్న కోరిక తప్పుఅనిన్నీ, అట్లు కోరినా సాగదనిన్నీ బిడ్డ నేర్చుకొంటుంది.

ఒక్కొక్కజాతివస్తువులు ఒక్కొక్కబిడ్డచేతి కిచ్చి నలుగురికీ పంచిపెట్టి తానున్నూ తక్కినవారితో సమముగా పుచ్చుకొనేటట్లు పిల్లలను ఆడించేవారు తర్ఫీతుచేయవలెను. ఎవరిబిడ్డను వారు ఇతరులబిడ్డలతో సంపర్కం లేకుండా పెంచుటకంటె, బిడ్డలను నలుగురిని జతచేసి ఆడించడం, పాడించడంవల్ల ఈ అహంభావం తగ్గడమేకాక పరోపకారబుద్ధి, సంఘసేవ మొదలయిన సద్గుణములకు అభ్యాసం ఏర్పడుతుంది. ఈ మేలు కలుగవలెనన్న ఉద్దేశంతోడనే చిన్నచిన్న పిల్లలకోసం బహులు వసతిగృహములు స్థాపిస్తున్నారు. ఇందులో అయిదేండ్ల ఈడుగలవారయేవరకూ చదవడం వ్రాయడం చెప్పరు. ఆటలతోను, పాటలతోను పిల్లలకు కావలసిన శిక్షణ మంతా చిన్నపిల్లల చిత్తప్రవృత్తిలక్షణము ననుసరించి చేస్తూఉంటారు. ఈ శిశు విద్యాలయములనుగురించి మరియొకవ్యాసములో ముఖ్యమయిన విషయములు తెలియజేస్తాను.

మొదటి మూడేండ్లవరకున్న బిడ్డల సంరక్షణ తల్లులే ఎక్కువగా చేసుకోవడం మంచిదిగనుక ఈపసితనంలో బిడ్డలనుగురించి తల్లులు నేర్చుకోవలసిన విషయములు ఇంకా మరికొన్ని తెలియజేస్తున్నాను.

పిల్లలకు సహజంగా ఉండే దుర్గుణాలు కొన్ని తల్లులు ఎట్లు పోగొట్టవలెనో తెలుసుకోవలెను. ఏది కనబడితే అది చింపివేయడమో, విరిచివేయడమో, బద్దలుకొట్టడమో, ముక్కలు చేయడమో పిల్లలకు చాలాఇష్టము. ఇటువంటి పనులు చేయడానికి వారికి అవకాశమే లేకుండా చేయవలెను. అవకాశ మిచ్చి, వారిని దండించడంవల్ల ప్రయోజనంఉన్నా వారిని అనవసరంగా కష్టపెట్టినవార మవుతాము. ఏటువంటి వస్తువులు భద్రంగా పెట్టుకొంటామో, ఏవి జాగ్రత్తగావాడుకొంటామో అవి పిల్లలకు తెలియజేయవలెను. ఇటువంటి విషయములు తెలియజేయడమంటే నోటితో చెప్పడంకాదు; చేసి చూపిస్తూ ఉండవలెను. గదిలో అలంకరణ వస్తువులన్నీ అవి ఎక్కడెక్కడ ఉండవలెనో అక్కడక్కడ వాటిని పెట్టుతూ ఉన్నప్పుడు పసిపిల్లలకు ఆసర్దుబాటు అంతా కనబడుతూ ఉన్నట్లు చేయడం మంచిది "ఈ వస్తువు ఇక్కడ ఉంటే బాగుంటుంది. అది అక్కడ అందంగా ఉంటుంది. దీనికి ధూళి పట్టినది, ఇది దులిపి శుభ్రము చేయవలెను. దీనికి మసి పట్టినది. దీనిని తుడువవలెను. అని ఈవిధంగా పిల్లలకు వినబడేటట్లే చెప్పుతూ ఈ పనులు వారు చూస్తూ ఉండగా చేస్తూ ఉంటే, పిల్లలకు పొదుపు, జాగ్రత్త, శుభ్రత మొదలయిన విషయములు వాటంతట అవే బోధపడతవి.

నా మిత్రు డొకడు వార్తాపత్రికలు, మాసపత్రికలు మొదలయినవి చదివినతర్వాత జాగ్రత్తగా వాటి నుండి తనకు కావలసిన వ్యాసములు, చిత్రములు గల ఖండములను జాగ్రత్తగా కత్తిరించి, పెద్ద కాగితముల పుస్తకములో అంటించుతూ ఉండే వాడు. అతని కుమారుడు మూడేండ్ల వాడు తండ్రిదగ్గర కూర్చుండి చూస్తూ ఉండేవాడు. "అబ్బాయ్! నీకు కూడా వట్టికాగితాల పుస్తకమొకటి ఇస్తాను. అందులో నీకు కావలసిన చిత్రములు అంటిస్తాను" అని చెప్పి పిల్లలబొమ్మలు, పిల్లలు చూచి ఆనందించే జంతువుల బొమ్మలు, పువ్వుల బొమ్మలు మొదలయినవి అంటిస్తూ ఉండేవాడు. ఈ అభ్యాసం వల్ల ఆపిల్లవాడికి కలిగిన మేలు ఇంతింత కాదు. ఆపిల్ల

వాటికి అన్ని విషయములలోను పొదుపు, పొందిక; అన్నివస్తువులను అందంగా ఉంచుకోడంలో నేర్పు, శ్రద్ధ; తన దేహము, తన దుస్తులు, తనపెట్టె, తన బీరువా, తనగది - అంతా శుభ్రంగా ఉంచుకొందా మనే బుద్ధి కుదిరినవి.

ఈ విధంగానే తక్కిన విషయాలలో సైతము పిల్లలకు మంచి అభ్యాసములు అలవడేటట్లు తలి దండ్రులు తాము ప్రవర్తించవల"నట్లు ప్రవర్తిస్తూ పిల్లలకు మార్గదర్శకులుగా ఉండవలెను. అంతేకాని తాము దురభ్యాసములకు లోనయి పిల్లలుమాత్రము మంచి అభ్యాసములకు అలవాటుపడవలె నని కోరడం అసంగతము, నిష్ప్రయోజనము. పిల్లలకు పెద్దలు చేసే పనులు అనుకరించుట సహజంకూడాను.

కష్టము, ఆపద కలిగించే పనులు పిల్లలు చేయబోవునప్పుడు, అవి చేయరా దని చెప్పినంతమాత్రాన ప్రయోజన ముండదు. కొద్దిగా ఆ కష్టము, ఆ ఆపద అనుభవములోనికి రావడమే మంచిది; అప్పుడుగాని అవి చేయగూడని పనులని పిల్లలకు స్పష్టంగా బోధపడను. దీపం పసిపిల్లలకు వింతగా కనబడుతుంది. అది పట్టుకొందామన్న అభిలాష వారికి సహజంగా పుడుతుంది. అది వారు పట్టుకోబోవునప్పుడు తలిదండ్రులు వద్దంటారు; పిల్లలచేయి వెనుకకు లాగివేస్తారు; గాని, పిల్లలు ఊరుకోరు, వద్దన్నపని మరింత పట్టుదలతో చేయడానికి చూస్తారు. అప్పుడు తలిదండ్రులు తమ చేయి దీపంవద్దకు చాపి "అమ్మో!" అని కాలినట్లు అభినయించి, వెనుకకు చట్టున తమచేయి లాగుకొని దీపంలో చేయిపెట్టుటవల్ల కలిగే అపాయము పిల్లలకు నచ్చజెప్పవలె ననుకొంటారు. గాని, ఇందువల్ల ప్రయోజన ముండదు. ఇది ఒక ఆటగా పరిణమిస్తుంది. పిల్లలు తాము కూడా దీపంవైపు చేయి చాచి అమ్మో అంటూ చేయివెనుకకు లాగుకొంటూ ఆడడానికి చూస్తారు. అప్పు డొకసారి ఆ పిల్లలచేతివేలు కొద్దిగా దీప పుసకు తగులునట్లు చేయడమే మంచిది. ఒకసారి చుర్రుమని చురుకుతే, వారికి అనుభవమువల్ల బోధపడుతుంది, మరి దీపంజోలికి వారు పోరు.

భయమన్నది పిల్లలకు సహజంగా ఉండదు. గాని ఇది సుగుణము కాదు. భయమంటే ఏమిటో తెలియని పసితనంలో పిల్లలకు భయం లేకపోవడము సహజమే; కాని, ఇది సుగుణమని ఎంచి భయంకలిగించే సన్నివేశములు లేకుండా చేయవలెనన్న ప్రయత్నము నిష్ప్రయోజనము. భయపడవలసినవిషయము లేవో భయపడరానివిషయము లేవో పిల్లలకు చిన్నప్పటనుండీ తెలియచేస్తూ ఉండవలెను. ఇందులో మొదటితరగతి విషయములకు పైనిచెప్పిన దీపంపట్టుకొనే విషయమే నిదర్శనము. దీపం, అగ్నివల్ల ఎటువంటి అపాయము కలుగవచ్చునో పిల్లలకు తెలియవలెను. వాటియెడల ఉండవలసిన భయము ఉండవలెను.

పిచ్చిభయము పిల్లలకు కలుగనీయరాదు. "అమ్మో! బూచి!" అని చాలామంది తల్లులు తమ పిల్లలను భయపెడుతూ ఉంటారు. ఇది చాలా తెలివితక్కువపని. వాస్తవంగా కష్టంగాని, అపాయంగాని లేనిచోట్ల పిల్లలు భయపడకుండా చేయవలెను. అట్టి చోట్ల కలిగే భయము పిరికితనముగా పరిణమిస్తుంది.

పిల్లలకు భయం లేకపోవడము ఎట్లు సహజమో సత్యం చెప్పడంసైతము అట్లే సహజముగా ఉంటుంది. కాని, ఇది ఇంతమాత్రాన సద్గుణ మనలేము. అబద్ధం పలుకడమువల్ల కొద్దిగానైనా ఆకాలానికైనా మేలు కనబడేవరకున్న పిల్లలు సహజంగా సత్యమే పలుకుతూ ఉంటారు. అబద్ధమాడవలసిన అవసరం ఎవరికైనా ఏదో తప్పుపనిచేసి దానిని కప్పిపుచ్చవలసి వప్పుడే కలుగుతుంది. చేసిన తప్పుపనికి దండన ఎంత ఎక్కువగా ఉంటుందని పిల్లలు భయపడతారో అంత ఎక్కువగా అబద్ధమాడి తమకు కలుగబోతుందనుకునే దండన తప్పించుకోడానికి ప్రయత్నిస్తారు. అందుచేత, తప్పుపనులు చేయడానికి పిల్లలకు అవకాశమే కలుగనీయరాదు. ఒకవేళ వారు తప్పుపనులు చేసినా, దండన కఠినంగా ఉండరాదు. సత్యం చెప్పడంవల్ల చేసిన తప్పుపనికి కాస్త మందలింపేకాని దండన కఠినంగా ఉండదన్న నమ్మకము; అబద్ధమాడడంవల్ల అది బయలుపడ్డవెంటనే చేసిన తప్పుపనికి అబద్ధమాడడమనే పెద్దతప్పుపనిసైతము తోడైనందువల్ల దండన ఎక్కువ కఠినంగా ఉంటుం దన్నభయము పిల్లల కుండేటట్లు వారిని పెద్దలు తర్ఫీదుచేయవలెను. భయం దండన

యందున్నూ అవమానమందున్నూ ఉండవలెను; సత్యం పలుకుటయందుండరాదు.

నమ్మకము పిల్లలకు సహజమైన సద్గుణం. తనను సాకుతూ, తనను ముద్దుపెట్టుకొని ప్రేమిస్తూ, తనతో ఆడుకొంటూ తనకు కావలసినవన్నీ ఇస్తూఉన్న తల్లి యెడల బిడ్డకు పూర్తిగా నమ్మకము నిలిచి ఉంటుంది. ప్రేమతో నిండిన నమ్మకమే నమ్మకము. ఎత్తైన బల్లపై తనమూడేండ్లపాపాయిని నిలబెట్టి ఒక తల్లి నేలపై దిగువగా నిలచుండి, చేతులు చాపి రమ్మని పిలువగానే ఆబిడ్డ అమాంతముగా ముందుకు వంగి వాలినది; తల్లిచేతులలో పడినది. తల్లి తనకు దెబ్బ తగలకుండా పట్టుకొంటుం దన్న నిండునమ్మకముతో ఆబిడ్డ అట్లు చేసినది. అటువంటి నిండునమ్మకము తమయెడల బిడ్డలకు పుట్టునట్లు చేసుకొన్న తలిదండ్రులే తమ బిడ్డలకు మంచి శిక్షణము చేయగలరు.

పిల్లలు కొన్నిపనులు ఇతరుల సాహాయ్యం లేకుండా చేయడానికి ప్రయత్నిస్తారు. అది సుగుణమే. ఆ ప్రయత్నము హెచ్చరించవలసినదే. ఒకవేళ సాహాయ్యం అగత్యమయినా తలిదండ్రులు తమ పిల్లలు చేసేపనులలో తోడుపడుతూఉన్నట్లు కనబడకుండా సాహాయ్యం చేయవలెను. కృతకృత్యులమయినా మన్న సంతోషం పిల్లలకు కలుగనీయవలెను. జయము పొందినా మన్న అనుభవం ఉత్తరోత్తరా ఎంతో ఆనందకరంగాను, ఉత్సాహకరంగాను ఉండి, పిల్లలు పెద్దవారయిన తర్వాత, వారికి పెద్దపెద్దపనులు చేయడానికి కావలసిన బలము, సాహసము, ధైర్యము, ఉత్సాహము కలుగచేస్తుంది.

సహకారమందలి ఆసక్తి పిల్లలకు మొదటనుండిన్నీ పెద్దలు అలవాటు చేయవలెను. ఇంటిలో ఉన్నవారందరూ ఎవరెవరు ఏయే నిర్దిష్టమైనపనులు చేస్తూ కుటుంబజీవనమునకున్నూ, కుటుంబసౌఖ్యమునకున్నూ తోడుపడి పనిచేస్తున్నారో పిల్లలకు బోధపడునట్లు చేయవలెను. ఇది ఒకపాఠంలో చెప్పినట్లు నోటిమాటలతో చెప్పిన ప్రయోజనం లేదు. పిల్లలు ఈవిషయం వారు స్వయంగా చూచి నేర్చుకొనేటట్లు చేయవలెను. కుటుంబ జీవితమునకు సంబంధించిన పనులలో పిల్లలుసైతము సాధ్యమైనంతవరకు సరదాగా తోడుపడునట్లు చూడవలెను. అట్లు తోడుపడడం పిల్లలకు విధిగా గాని, నిర్బంధముతో చేయవలసినపనిగా గాని తోచకూడదు. అది సరదాగా చేయవలసిన పనిగాను, ఆపనిచేయడంలో తమకు సైతము హక్కు, గౌరవము ఉన్న విషయము గాను పిల్లలకు తోచవలెను. పూలచెట్లకు నీరుపోయుటలోను, ఎండబెట్టిన చిన్న వస్తువులు బుట్టలోనికి ఎత్తుటలోను చిన్నపిల్లలు తమ తల్లులకు తోడుపడవలెనన్న అభిలాష చూపిస్తూ ఉంటారు. అది హెచ్చరించవలసినదే కాని మందలించ వలసిన విషయం కాదు.

చూచిన వస్తువల్లా కావలెనని కోరడం పిల్లలకు సహజం. అది మంచిది కాదన్న విషయం తలిదండ్రులు పిల్లలకు నేర్పవలెను. ఏ వస్తు వయినా ఒకరు ఇస్తేనే కాని పిల్లలు తాము అడిగి పుచ్చుకోరాదన్న విషయం నచ్చచెప్పవలెను. అంటే నోటిమాటలతో చెప్పడం కాదు. ఆ అలవాటు కలగడానికి అవకాశము కలుగజేస్తూ ఉండవలెను. నలుగురు పిల్లలు ఇంట్లో ఉన్నప్పుడు ఆ పిల్లల యెదుటను ఆ పిల్లలకిచ్చే ఉద్దేశంతోనే తినుబడివస్తువులు పెట్టి ఏదో ఒక పనిమీద ఉన్నట్లు నటిస్తూ కొంచెము ఆలస్యము చేయగానే తొందరపాటుగల పిల్లవాడు "అమ్మా! ఇయ్యవూ?" అంటాడు. అట్లా అడిగినవానికి ఆలస్యం చేసి, బుద్ధిగా కనిపెట్టుకొని ఉన్నపిల్లలకు ముందుగా ఇస్తే చాలును, ఆ పిల్లవాడికి బుద్ధి వస్తుంది. పొరుగింటికి వెళ్లినప్పుడు అక్కడ నేదైనా వస్తువు కనబడగానే అది తనకిమ్మని ఏడ్చేపిల్లలను వారి తలిదండ్రులు మందలించవలెను.

ఈ విధముగా మొదట మూడు సంవత్సరములలోను పిల్లలకు అలవడ చేయవలసిన విషయము లెన్నో ఉన్నవి. వాటియందు బిడ్డలను పెంచేవారు అశ్రద్ధ వహించినయెడల బిడ్డలపట్ల గొప్ప అపచారము చేసినవారే అగుదురు.

రాబోవు వ్యాసములో శిశువిద్యావిధానమునకు సంబంధించిన శిక్షణ మెట్లుండ వలెనో తెలియజేస్తున్నాము.

సశేషము.

నిజం

శ్రీ కప్పగంతుల సత్యనారాయణ

౧

ఆమె,

కొత్తగా కాపురానికి వచ్చింది. కథలలోను, నవలలలోను చదివి, కాపురం అంటే మధురాతిమధురంగా వుంటుం దనుకుంది.

అత్తగారు ఆదరిస్తా రనుకున్నది. ఆడుబిడ్డలు పరిహాసాలాడుతూ, నవ్వుతూ సుఖపెడతా రనుకున్నది. భర్త తనకు అరచేతిలో స్వర్గాన్ని చూపెడుతా డని సుఖస్వప్నాలు కన్నది.

* * *

అతడు,

కష్టపడి చదివాడు. గొప్పమెప్పుతో పరీక్ష ప్యాసయినాడు. మంచి ఉద్యోగం దొరుకుతుం దనుకున్నాడు. మెళ్లో పుస్తెలుకూడా అమ్మి తన చదువుకు డబ్బు పంపించిన తల్లినీ, తనకు చిరుగుపంచెలే గతి అయినా కొడుకుదగ్గాకు లోటు రాకూడదని తాను తెగలిగిన ప్రతిరాగిదమ్మిడీని పంపించిన తండ్రినీ ఎంతో సుఖపెడదా మనుకున్నాడు. చక్కని చుక్కను పెండ్లి చేసుకొని, 'రాజంటే మరెవడోయ్' అనేపద్ధతిలో బ్రతుకుదా మనుకున్నాడు. తనచదువుకు ఫలితం కలుగుతుందికదా అని ఆశపడ్డాడు.

* * *

ఆమె,

అత్తింటికి వచ్చిననాడే, తన ఆశలన్నీ వొట్టి వనుకున్నది.

'ఇంతసోకులు భోగంవాళ్లకే' అని ఆడుబిడ్డ అన్నమాటకు, అంతరంగంలో పరితపించింది.

'పనీ పాటూ చేతకాని మొద్దు దొరికింది' అని అత్తగారు, తను నేతిగిన్నెను సకాలంలో అందివ్వ లేదని తిట్టినతిట్టుకు, తనతల్లిని తలచుకుని మనసులోనే కుమిలింది. రాత్రి పదిన్నరకు గదిలోకి వచ్చి, "మీ నాన్న ఇస్తానన్న సైకిలు, ఆయన చచ్చిపోతే మాత్రం, మీ అమ్మ కొనిపెట్టకూడదూ?" అని ఈసడించిన భర్తమూర్ఖత్వానికి, గుండె గుభేలుమని వెక్కి వెక్కి ఏడ్చింది.

* * *

అతడు,

ఎప్పటికేనా ఉద్యోగం దొరకదా అని ఎన్నో రోజులు కనిపెట్టుకున్నాడు. పత్రికలలో పడిన ప్రతి ఎడ్వర్టయిజుమెంటుకూ జవాబు వ్రాశాడు.

ఉద్యోగం ఖాళీవుందన్న ప్రతిఆఫీసుకూ వెళ్లి ఆఖాళీ నింపడానికి తన ఉపయోగం వుంటుందేమో నని విచారించాడు.

ఉద్యోగాలు ఇచ్చే అధికారం గల ప్రతి ఆఫీసరుదగ్గరకూ వెళ్లి అర్థించాడు. చదువుకొనే టప్పుడు, ప్రపంచంలో ఎన్నిరకాల ఉద్యోగా లున్నాయో అతనికి తెలియలేదు కాని ఇప్పు డతనికి బాగా తెలిసింది. అయితే అతనికి ఉద్యోగంమాత్రం దొరకలేదు.

* * *

రోజులు గడచినకొద్దీ ఆమెకు అత్తిల్లు ఒక నరకమైంది.

మంచిగా, స్నేహభావంతో మాట్లాడేవారు ఒక్కరూ ఆయింట్లో ఆమెకు కనపడలేదు.

పైగా, ప్రతివారూ ఏదో సాకుతో, ఏదో ఆరోపణతో ఆమెను ఏదో ఒకవిధంగా బాధించేవారే అయినారు.

ఆమె కూర్చోడం తప్పు; నిలుచోడం తప్పు; పడుకోడంతప్పు; భోజనానికి రావడం తప్పు; రాకపోవడమూ తప్పే. అంతేకాదు; కారణం లేనప్పుడు, ఆమె పనిచెయ్యడంకూడా ఒక అపరాధంగా భా

వింది 'నీకు అక్కరలేనిపని లేదే?' అని అత్తగారు కసరేది.

* * *

కొన్నిచోట్ల అతని బి. ఏ. డిగ్రీ చాలలేదు.

మరికొన్నిచోట్ల అది కేవలం అనవసరమే అయి అపరాధమైందికూడాను.

ఉద్యోగం లేకుండా ఎన్నోరోజులు తన తల్లిదండ్రుల దగ్గరనే వుండి గడిపాడు.

తన నిరర్థకత్వం, ఊరివారికే కాక, తల్లిదండ్రులకు కూడా మనఃఖేదం కలిగిస్తున్న దని గ్రహించుకున్నాడు.

'పాడయి పట్నం పొమ్మ'న్న సామెత జ్ఞాపకం వచ్చింది.

గాని, ఉద్యోగం వెతకడానికి పట్నం వెడుతున్నానంటే ఎవరూ ఒక్కదమ్మిడీ ఇవ్వరు.

* * *

ఆమెకు ఒకహృదయమూ, ఆత్మ ఉందని ఆమె భర్త ఎన్నడూ అనుకోలేదు. తన నిత్యావసరవస్తువులలో ఆమెకూడా ఒకటి అనుకున్నాడు. అతనికి ఆమె ఉపయోగం అంతే.

అత్త, ఆడుబిడ్డలు– ఆమెను కొనుక్కోకుండా వచ్చిన ఒక బానిస అనుకున్నారు. ఆమె అత్తగారు, తన అత్తగారివల్ల ఇలాటి సుఖాన్నే అనుభవించింది. ఆడుబిడ్డ, తన అత్తగారి ధాటికి తట్టుకోలేకనే, అత్తింటినుంచి పారిపోయివచ్చి పుట్టింటిలో మఠం వేసుకున్నది. వీరిద్దరికీ, కోడలిని సుఖపెట్టడంగాని—అధమం సుఖపడనివ్వడంగాని అంగీకృత మౌతుందా?

* * *

అతనికి అబద్ధ మాడవలసిన అవసరం వచ్చింది.

"ఉద్యోగం వచ్చింది. చేరడానికి వెడుతున్నాను" అని చెప్పి నూరురూపాయలు అప్పుచేసి, పట్నం బయలుదేరాడు.

పట్నంలో ఎన్నోవృత్తులు వుంటాయి. ఎన్నో ఉద్యోగాలు వుంటాయి. ఎంతోమంది బ్రతుకుతున్నారు. తన కొక్కడికి స్థానం లేకపోతుందా? తను బ్రతక లేకపోతాడా!

ఆశమీద జీవించడం మనిషికి, శ్రమలేనిపని. ప్రయాణం చేస్తున్నంతసేపూ తాను చెయ్యబోయేపని ఏమై వుంటుందా అన్న ఆలోచనే అతనికి.

* * *

ఆమెభర్తకు బ్యాంకిలో పని. చెన్నపట్టణంలో బ్యాంకులు, డబ్బుఇవ్వడం, మూడుగంటలతోనే కట్టివేస్తాయి. కాని, అధికారంలేని గుమస్తాలు ఇంటికి వెళ్ళేటప్పటికి, నగరంలోని తక్కిన ప్రజలంతా భోజనాలు పూర్తిచేసుకొని నిద్రపోతూవుంటారు.

ఆఫీసే జీవితం — ఉద్యోగం చెయ్యడమే పరమార్థంగా గలవాడికి భార్య కష్టసుఖాలుగాని, ఇంట్లో వున్న తక్కిన వారికష్టసుఖాలుగాని ఏమిటో తెలుస్తాయా? ఇలాటి ఉద్యోగుల జీవితం ఒక మెషీను.

నిద్రలేవడం — ఆఫీసుకు తయారవడం — ఆఫీసుకు వెళ్లడం — ఆఫీసు — ఇంటికి రావడం — పడుకోడం.

* * *

అతడు మదరాసుకు చేరుకున్నాడు. హోటలులో బసపెట్టాడు.

అంతటి మహానగరంలో ఉద్యోగానికి ఎవరి దగ్గరకు వెళ్లాలో అతడికి గ్రాహ్యం కాలేదు.

చేతిలో వున్న డబ్బు జాగ్రత్తగా వాడుకుంటే నాలుగునెలలు వస్తుంది.

నాలుగునెలలలో వుద్యోగం దొరకకపోతుందా?

ఈలోపల ఎంతోమంది పరిచయ మౌతారు. ఎన్నో భోగట్టాలు తెలుస్తాయి.

ఎన్నోఉద్యోగాలు ఖాళీవుంటాయి. అన్నిటికీ తాను అనర్హుడేనా ఏమిటి? ఏదో దొరుకుతుంది.

* * *

ఆమెజీవితం అలానే చాలారోజులు గడిచింది.

చెన్నపట్టణంలో మొగుడికి ఉద్యోగం అని, ఆమె ఒకప్పుడు పొంగిపోయింది. ఇప్పు డసలీ వుద్యోగం లేకపోతే, భర్తలో కొంతమనుష్యప్రకృతి వుండే

దేమో అనుకున్నది. తనను పంపమని తొందరపెట్టిన అత్తగారికి, తనపైని ఎంత అపేక్ష వున్నదో అనుకున్నదిగాని, అత్తగారి ప్రకృతి ఇలా సేలచెట్టి కాలరాచే స్వభావమని ఆమె కలలోకూడా అనుకోలేదు. ఎన్నో రోజులు గడిచినా, రోజురోజూకూ తన జీవితం మరీ అసహ్యమైపోయిందని ఆమె గ్రహించుకున్నది.

* * *

అతని ఉద్యోగప్రయత్నాలు, అతనికే కాదు, చెన్నపట్టణంలో వున్న ఆఫీసులన్నిటికీ కూడా విసుగు పుట్టించాయి.

ఖాళీలు లేకకాదు. అత డవసరం లేదు. ఏ ఆఫీసులో ఖాళీవచ్చినా, ఆఖాళీని నింపడానికి తగినమనిషి ఎక్కడో ముందుగానే వుండివుంటాడు. కొన్ని సందర్భాలలో ఇలాటి మనిషినిపట్టి, ఖాళీలు వీర్పడు తాయేమో కూడాను. అతడు చెన్నపట్టణం వచ్చి ఆరు నెల్లయింది. రెండు నెలల అద్దె, రెండు నెలలహోటలు బాకీ—అతనికి మదరాసులో లభించిన భాగ్యం.

బాగానే పట్నం వచ్చి పాడయినవారిలో ఇత డొకడు.

* * *

ఇవ్వాళ సుఖంలేకపోయినా, రేపయినా సుఖపడవచ్చునసే ఆశవుంటే ఏ వ్యక్తికయినా జీవితం మీాద మోజా వుంటుంది.

నిన్న సుఖపడలేదు. ఇవ్వాళ సుఖంలేదు. రేపు సుఖం వుండదు. అలాటప్పుడు జీవితం అసహ్యమే.

ఆమె కిటికీవద్ద కూచున్నప్పుడల్లా ఇదేఆలోచన.

పనిచేసుకొనే టప్పుడు ఆలోచించడానికి వీలు లేదు.

ఎప్పుడేనా కిటికీదగ్గర కూచుంటేనే, ఆలోచన.

ఎదురుగా వున్న బ్రహ్మాండమైన కోనేరును చూస్తూవుంటేనే ఆలోచన. ఆ ఆలోచనకు, ఈకోనేరు పెద్ద ఆధారం.

* * *

అతనికి, చెన్నపట్టణంలో తనకు ఉద్యోగం దొరకదనేమాట రూఢిగా తెలిసిపోయింది.

హోటలువాడు అన్నం పెట్టవన్నాడు. ఇంటి యజమాని, అతని రెండుమూడుజతల దుస్తులను తన స్వాధీనం చేసుకుని, అద్దె యిచ్చి పట్టుకొని వెళ్లమన్నాడు.

ఇది అతనికి గొడ్డలిపెట్టు. మింగ మెతుకులేదు. నిలువ నీడలేదు. ఎవరు అన్నంపెడతారు. ఎవరు ఆదరిస్తారు.

సాయంత్రం ఎనిమిది గంటలకు, ఇంటియజమానీ, హోటలువాడూ వెళ్లగొట్టగా అతడు, తనకాళ్లీడ్చుకుపోయిన దారినబడి నడుస్తూ కోనేరు వద్దకు వచ్చాడు.

* * *

ఆమె, ఆ కోనేరువైపు చూస్తూ ఆ కిటికీవద్ద కూచోడంకూడా కొన్నాళ్లకు అత్తగారికీ, ఆడుబిడ్డకూ చాలా పెద్దనేరంగా కనపడింది.

"ఎవరికోసం అలా చూస్తావ్ ?" అని ఆడుబిడ్డ అడిగింది.

" నీవెధవ మొహం చూడటానికి అక్కడికి ఎవరూ రారులే" అని అత్తగారు ఈసడించింది.

ఆమెకు జీవితంలో, ఆనందమూ శాంతీమృగ్యమయాయి.

'ఛీ! వెధవబ్రతుకు' అని నిరాశతో నిట్టూర్పు విడిచింది. కాని, ఈ బ్రతుకునుంచి విడిపడడానికి మార్గం తోచలేదు.

* * *

అతడు ఆ కోనేటిగట్టున కూచుని చాలాసేపు ఆలోచించాడు.

అంతా నిశ్శబ్దంగావుంది. తనకు వెళ్లడానికి ఒక చోటుగాని, వుండడానికి ఒక ఆధారంగాని కనుపడలేదు.

ఆకోనేరు ఒక్కటే అతనికి ఆధారంగా కనపడింది ఆనిమిషానికి. ఆత్మహత్య చేసుకోడాన్ని గురించి దినాలూ, వారాలూ గడచిపొయ్యేటట్టు ఆలోచించేవారు ఆత్మహత్య చేసుకోలేరు. హఠాత్తుగా ఆత్మహత్యనే తమబాధలకు విముక్తిగాభావించేవారు

ముందువెనుకలు చూడరు. రాత్రిపదిన్నర అయింది. కొద్దిపాటి గల గల చప్పుడుతో అతడు కోనేటిలో కలిసిపోయాడు.

*   *   *

ఆనాటిరాత్రి ఆమెభర్త ఇంటికి చాలా రాత్రి పోయివచ్చాడు.

ఈలోపల అత్తగారు, ఆమెను ఎన్నో కారణాలకు ఎన్నో తిట్లు తిట్టింది.

"ఇలాటి, ఎందుకూ పనికిరాని బతుకు బతక్క పోతే ఆకోనేటిలోపడి చావరాదూ? గంటలకొద్దీ ఆ కోనేటివైపు చూస్తావే" అని ఆమెకు అత్తగారు సలహా ఇచ్చింది. ఆమెకు ఈ సలహా, గాఢాంధకారంలో ఒక పెద్ద మెరుపు మెరిసినట్లయింది.

భర్తపడుకున్నాక, చప్పుడుకాకుండా, ముందు వెనుకలుచూడకుండా అర్ధరాత్రివేళ, తనబాధలన్నిటినీ కోనేటిగట్టున వదలి ఆమె కోనేటిలో పడింది.

తెల్లవారేటప్పటికి రెండు శవాలూ, ఒకదాని పక్కన వొకటి కోనేటిలో తేలినవి.

జనం గుంపులు కూడారు. పోలీసులు వచ్చారు. శవాలను తీశారు. విచారణ జరిగింది.

రెండు శవాలు.

స్త్రీ - పురుషుడు.

ఒకరి కొకరికి సంబంధంలేని స్త్రీ పురుషుల శవాలు, ఒక కోనేటిలో, ఒక్కవాడు, ఒకదాని ప్రక్కన ఒకటి తేలడానికి కారణం ఏమిటో!

ఆ ఇద్దరికీ ఏదో సంబంధం వుండి తీరాలన్నారు పంచాయతీదార్లు.

లోకం వెంటనే నమ్మింది.

*   *   *

అసలు నిజంమాత్రం, ఆకోనేటి గర్భంలో దాగి పోయింది.



పాపాయి



"అమ్మా! అమ్మా! అక్కయితో
నేనూ వెడతా బళ్లోకి.
పరికిణి-చొక్కా తొడుగమ్మా
పలకాబలపం ఇయ్యమ్మా
నేనూ వెళ్తా బడిలోకి"

"అమ్మా! అమ్మా! అది వొద్దే
బళ్లో అల్లరి చేస్తుందే
బడివిడిచినదాకా ఉండక,
ఇంటికి పోతా నంటుందే;
ఇంటికి రమ్మని ఏడిస్తే
పంతులమ్మ నను తిడుతుందే;
పిల్లలు చూసీ నవుతారే
నేనూ ఇంటికి వచ్చేస్తే
పాఠా లన్నీ పోతాయే
అది నాతో రావద్దమ్మా!"

"బళ్లో కెందుకె పాపాయీ!
తాయిల మెడతా ఉండమ్మా!
అప్పచ్చిదిగో చూశావా?
బాజా లవిగో! వస్తాయీ
గుళ్లోకెడదాం! వస్తావా?
దేవుడిపల్లకి చూద్దామా?
బువ్వాలాటా బుడబుడనంచీ
కాళ్లా గజ్జా కంకాణమ్మా
ఆడుదుగానీ ఉండమ్మా!"

"ఊఁ! ఊఁ!. అమ్మా, వెడతానే
దొరసానమ్మా బళ్లోనూ
బొమ్మలు తెచ్చి యిస్తుందే
అక్కయతోటీ అక్కడనే
చెమ్మాచెక్కా ఆడ్తానే
కోలాటాలూ వేస్తానే
గొబ్బిపాటలూ పాడ్తానే
సరిగమపధనీ అంటానే
అక్కయతోనే వెళ్తానే"

— పామర్తి వేంకటరమణరావు.

పుస్తక సమీక్ష

ఆంధ్రజ్యోతి

[రచయిత : శ్రీ గుళ్లపల్లి నారాయణమూర్తి గారు L. M. S. వెల రూ 0-10-0. ప్రతులకు చిరునామా : రత్నా డ్రగ్ హౌస్, అనకాపల్లి, విశాఖపట్టణం జిల్లా.]

ఈ నాటకము గుంటూరు ౨౧-వ ఆంధ్రమహాసభాస్థలమందు ఆడినప్పుడు చూచినాను; అచ్చుపడిన తర్వాత ఇప్పుడు సాంతముగా చదివినాను. ఇప్పుడూ అప్పుడూ నాకమితమైన ఆనందము కలిగినది. చూచుటకు సొంపుగాను వినుటకు కింపుగాను ఉన్నది.

శ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు దీనికి తొలిపలుకు రచించినారు. అందులో ఇది సాంఘిక నాటకమా రాజకీయనాటకమా అన్న విషయం ఎత్తుకొని, ఈనాటకములో సంఘసంస్కరణ విషయములు (వివాహము, హరిజనోద్ధరణము, వేశ్యాదురాచారము, మిత్రద్రోహము, స్వామిద్రోహము) ఉన్నా ఇది నాటకప్రధాన కథావస్తువుకు పోషకములుగా మాత్రమే ఉన్నవిగాని ముఖ్యము కావనిన్ని, రాజకీయ విషయములే మొదటనుండి తుదివరకున్ను ప్రధాన విషయములుగా ఉన్నవనిన్ని, అందుచేత, దీనిని సాంఘిక నాటకమనుటకంటె రాజకీయనాటకమనుటే సమంజసమనిన్ని శాస్త్రిగారు తమ అభిప్రాయము స్పష్టముగా ఉదాహరణములతో విశదీకరించినారు. ఈ నాటకము కేవలము రాజకీయనాటకమే కాక గ్రామ పునర్నిర్మాణముతోపాటు ఆంధ్రులందరున్ను కోరదగిన ఆంధ్రరాష్ట్ర సంపాదన విషయమై ఆంధ్రులకు ప్రబోధము కలిగించే నాటకమని గ్రంథకర్తగారే తమ నాటకమునకు ఆంధ్రజ్యోతి అనే పేరు మాత్రమేగాక, దాని దిగువను ఆంధ్రరాష్ట్ర ప్రబోధ నాటకమనే వ్యాఖ్యాభిధానము సైతము చేర్చినారు. అసలు ఉపక్రమణిక రంగంలోనే కర్మవీరుడు ఆంధ్రరత్న గోపాలకృష్ణయ్య వేషంతో ప్రవేశించి శ్రీరాయప్రోలు సుబ్బారావుగారు రచించిన "అమరావతీ పట్టణమున" అనే సుప్రసిద్ధ పద్యమును చదివి అక్షతలు పుష్పాలు చల్లుతాడు. ఈపద్యం చదివినతోడనే ఆంధ్రులకు ఒడలు ఉడుకెత్తి ఆంధ్రరాష్ట్ర సంపాదనకై దీక్షపూనవలెనన్న ఉత్సాహం ఉదయిస్తుంది. తుదకు ౨౨-వ రంగంలో తన ప్రబోధము ఫలించే శుభసూచనలు కనబడగానే కథానాయకుడైన వాసుదేవరావును అభినందించి, కర్మవీరుడు భరతవాక్యంలో "తెలుగునేలలో నీదాస్యతిమిర మింక, విలువజాల దాంధ్రజ్యోతి వెలుగుచుండ; అన్ని పల్లెల నీస్వతంత్రాంధ్రమాత, కాలయంబులు వెలయుగాక! ఆంధ్రరాష్ట్ర,మచిరకాలంబునన్ ప్రాప్త మగునుగాక!" అని ఆశీర్వదిస్తాడు.

కళా విశిష్టత ప్రధానంగాగల రచనలలో— కథలలోగానీ, నాటకములలోగానీ – కథాకల్పన, రచనాచమత్కృతి ప్రధానవిషయములు. ఇందులో నీతి, ఆశయము, ప్రబోధము, ప్రచారము మొదలయిన విషయములు వ్యంగ్యముగా కథావస్తువుకు పోషకములు మాత్రమే అయి ఉండవచ్చునుగాని; ఇవే ప్రధానములయి, వీటిని పోషించేదిగా కథావస్తువు నడచినయెడల కళావిశిష్టత తగ్గిపోతుంది. మతబోధకుని ప్రచారమువలెను, బడిలో ఉపాధ్యాయుని ఉపన్యాసములవలెను "ఆరోగ్యవారపు" ప్రదర్శనములవలెను సంభాషణలు, దృశ్యములుగల నాటకము కళావిశిష్టతగల నాటకము కాదు. ఇట్టిదృష్టితో చూచినప్పుడు ఈ ఆంధ్రజ్యోతి నాటకము ఈ ఉత్తమశ్రేణిరచనలలో చేరవలసినది కాదని చెప్పకతప్పదు. కన్యాశుల్క నాటకము కేవలము సాంఘికనాటకము; అందులో సంఘ దురాచారములు సంఘసంస్కారము ప్రస్తుతవిషయములే; అయినా, వ్యంగ్యములుగా ఉన్నవి. కథాకల్పనకు రచనాచమత్కృతికి లొంగిఉన్నవి గనుక కళావిశిష్టతకు లోపము రాలేదు. గనుక, ఆంధ్రజ్యోతి కన్యాశుల్కమువంటి నాటక మని చెప్పుటకు వీలులేదు.

అయితే, పైని చేసినవిమర్శ ఈ నాటకమే జాతికి చెందినదో నిర్ణయించుటకు మాత్రమే ఉద్దిష్టమైనదిగాని నిరసించుటకు కాదు.

ఆంధ్రసారస్వతములో దీనికి తగినస్థానము లేకపోలేదు. అదిగాక, ఇప్పటిపరిస్థితులకు అనుకూలంగా ఆంధ్రులకు కావలసిన ప్రబోధము కలిగించే విషయంలో గ్రంథకర్త కృతకృత్యులు కాగల రని నా నమ్మకము. బోధించవలసినవిషయములు విన్నవారికి నచ్చేటట్లు చిత్రితము లయి ఉన్నవి.

యథోచితమయిన ప్రబోధమును కలిగించే కర్తవీరునీ, ప్రతిగ్రామానికీ ఒక్కొక్కవాడు ఉదయిస్తే ఆంధ్రరాష్ట్రమే కాదు భారతదేశానికి స్వరాజ్యం కూడా అచిరకాలంలో ప్రాప్తిస్తుంది అని ఆకర్తవీరుని పొగడ్తపొందిన వాసువంటి నాయకునీ, నిర్దుష్ట అయినా క్రూరసంఘసంప్రదాయపిశాచమునకు బలియైన జానకినీ, పాశ్చాత్యనాగరక వ్యామోహమునకు లొంగినన్నీ వివేకబలముతో జాతీయప్రబోధప్రాభవానికి పరివర్తనం పొంది ప్రస్తుతోద్యమమందు కథానాయకునికి తోడయిన నాయికవసంతనూ సృష్టించి పాత్రపోషణము గావించుటలోను, సుగ్రం కదంత్రొక్కినట్లు కథ నడపించుటలోను, సంభాషణలు సహజమైన పాత్రోచితభావములో రసవంతంగా రచించుటలోను గ్రంథకర్తగారు తమ రచనాకౌశలమును చక్కగా ప్రదర్శించినారు.

ఇది కేవలము రాజకీయనాటకముగా రచించి అందులో గ్రామపారిశ్రామికాభివృద్ధికి సైతము ప్రబోధము కలిగించినవారు గనుక గ్రంథకర్త ఈనాటకమును శ్రీవరహాగిరి వెంకటగిరిగారికి అంకితముచేయడం అన్నివిధములా తగియున్నది.

ఈ నాటకము రచించిన శ్రీసుళ్లపల్లి నారాయణమూర్తిగారు ధన్యులు; ఆంధ్రుల కృతజ్ఞతకుపాత్రులు.

సీతాపతి.

గ్రంథస్వీకారం

గురుదేవుడు:—గ్రంథకర్త్రి - శ్రీమతి పోణకా కనకమ్మగారు. శ్రీరామాశ్రమము, అన్నారెడ్డిపాళెం, బుచ్చిరెడ్డిపాళెంపోస్టు, నెల్లూరుజిల్లా. వెల రు ౦-౪-౦.

విద్యుచ్ఛక్తి - నిస్తంత్రీయోగము
గ్రంథకర్త: శ్రీసుళ్లపల్లి నారాయణమూర్తిగారు మదరాసు విశ్వవిద్యాలయంవారిచే బహుమతి నందినవ్యాసముల గ్రంథము. విశాఖపట్నంజిల్లా అనకాపల్లి శారదాప్రెస్సులో ముద్రితము. వెల రు ౧-౮-౦.

శరణాగత రామకవచము:—కృతికర్త: శ్రీపండిత గాది జగన్నాథస్వామిగారు జి. యల్. రావు, విజయభవనం, బెజవాడ అని వ్రాసిన గ్రంథములుదొరకును. వెల రు ౦-౪-౦.

స్వతంత్రం.-రచయిత: శ్రీ విద్వాన్ విశ్వం గారు. అనంతపురం నవ్యసాహిత్యమాల వారిచే ప్రకటితము. నవయుగ కార్యాలయం విజయనగరం అని వ్రాసిన పుస్తకములు లభించును. వెల రు ౦-౮-౦.

మహాభారత రహస్యవిమర్శనము — ప్రథమ, ద్వితీయ భాగములు గ్రంథకర్త: శ్రీశ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు. రాజమహేంద్రవరము. వెల మొదటిభాగము రు ౦-౬-౦. రెండవ భాగం రు ౦-౪-౦.

౧. రాధామాధవసంవాదము: రచయిత: శ్రీపెలిదిండ్ల వేంకటమహాకవి.

౨. విస్మృతకళింగాంధ్రకవులు: రచయిత: శ్రీఅడిదము రామారావుగారు.

౩. వాల్మీకిచరిత్రము. గ్రంథకర్త: శ్రీ రఘునాథభూపాలుడు.

౪. ధర్మజ్ఞచరిత్ర - రచయితలు: శ్రీ వేపకొమ్మసరు వేంకటసుబ్బయ్య, ఆది లక్ష్మమ్మ దంపతులు.

ఈ పైనాలుగు గ్రంథములను ఆంధ్రవిజ్ఞానసమితివారిచే ప్రకటితములు. మేనేజరు, ఆంధ్రవిజ్ఞానసమితి, విజయనగరమని వ్రాసిన గ్రంథములు లభించును. ప్రత్యేకగ్రంథము. వెల రు ౧-౦-౦.

శ్రీరామయోగి:—గ్రంథకర్త్రి — శ్రీమతి పోణకా కనకమ్మగారు. అనువాదకుడు డాక్టర్ సి. వి. సుబ్బారావుగారు. శ్రీ రామాశ్రమము వారిచే ప్రకాశితము-మూలము తెలుగు నుండి ఇంగ్లీషులోనికి అనువదింపబడినది. వెల రు. ౦-౬-౦.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press,
No. 7, Thambu Chetty St., Madras. Editor:— S. Sambhu Prasad.